23-04-2024
మంగళవారం
ఖమ్మం

సంపుటి 07, సంచిక: 142
పేజీలు: 8+8
వెల రూ. 5.00

Published from:
Khammam, Hyderabad,
Karimnagar, Mahabubnagar

www.prajapaksham.in

ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★





మళ్లీ అదే పాట

మారని ప్రధాని మోదీ

మహిళల బంగారంపై ప్రతిపక్షాలు కన్నుపడిందని అసంబద్ధ వ్యాఖ్యలు

ముస్లింల పేరెత్తకుండా 'అలీగఢ్'లో రెచ్చగొట్టే మాటలు

అలీగఢ్ (ఉత్తర్‌ప్రదేశ్) : హిందువుల ఆస్తులను, మహిళల మంగళ సూత్రాలను ముస్లింలకు పునఃపంపిణీ చేస్తారని రాజస్తాన్‌లో చేసిన వివాదాస్పద వ్యాఖ్యలు దేశవ్యాప్తంగా దుమారం రేపుతున్నప్పటికీ ప్రధాని మోదీ ధోరణి ఏ మాత్రం మారలేదు. మరుసటి రోజు సైతం అవే వ్యాఖ్యలను ఉత్తర్ ప్రదేశ్‌లోని అలీగఢ్‌లో చేశారు. అయితే, ఈసారి ముస్లింల పేరెత్తకుండా పరోక్షంగా వారి గురించి మాట్లాడారు. ఇండియా కూటమి నేతల కళ్ళు ఆడవారి మెడలో బంగారంపై పడిందని, వాటిని కొట్టేస్తారని అసంబద్ధ వ్యాఖ్యలు చేశారు. ముస్లింలు అధిక సంఖ్యలో ఉంటే పశ్చిమ ఉత్తర్‌ప్రదేశ్‌లోని అలీగఢ్ నియోజకవర్గంలో సోమవారం జరిగిన తరువాయి 2లో

అర్థం లేని ఆరోపణలు
విద్వేష ప్రసంగాలు

ప్రధాని నరేంద్ర మోదీపై ప్రతిపక్ష పార్టీల ఆగ్రహం

ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసిన కాంగ్రెస్

న్యూఢిల్లీ/ కర్నాటక: ప్రధాని నరేంద్ర మోదీ అర్థం లేని ఆరోపణలు, విద్వేష ప్రసంగాలు చేస్తున్నారని ప్రతిపక్ష పార్టీలు మండిపడ్డాయి. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే, దేశ సంపద మొత్తం ముస్లిం వర్గాలకే వెళుతుందంటూ ఆయన వ్యాఖ్యానించడాన్ని వివిధ పార్టీలు తప్పపట్టాయి. రాజస్థాన్‌లో జరిగిన ఎన్నికల ప్రచార సభల్లో పాల్గొన్నప్పుడు, మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారని, అబద్ధాలు చెప్పారని ధ్వజమెత్తాయి. మత విద్వేషాలు రెచ్చగొట్టే రీతిలో ప్రసంగాలను మానుకోవాలని ప్రధానికి హితవు పలికాయి. కాగా, దేశ సంపదలో మొదటి హక్కుదారులు ముస్లింలేనని మన్మోహన్ చెప్పినట్టు మోదీ చేసిన ఆరోపణలను ఖండించిన కాంగ్రెస్, ఈ విషయంపై భారత ఎన్నికల సంఘం (ఇసిఐ)కి ఫిర్యాదు చేసింది. అసత్యాలను ప్రచారం చేస్తున్న మోదీపై చర్య తీసుకోవాలని కోరింది.

ప్రధాని అజ్ఞానంతో మాట్లాడొద్దు: ఖర్గే

కాంగ్రెస్ మ్యానిఫెస్టోపై ఎక్కడంటే అక్కడ మోదీతో బహిరంగ చర్చకు తాను సిద్ధమని కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే అన్నారు. కాంగ్రెస్ మ్యానిఫెస్టోను ముస్లిం లీగ్ మ్యానిఫెస్టో అని, దేశ వ్యతిరేక మ్యానిఫెస్టో అని మోదీ అనడాన్ని తప్పుబట్టారు. తమ మ్యానిఫెస్టోలో ఒక్కొక్క అంశాన్ని చెబుతానని, అందులో ముస్లిం లీగ్‌తో ఏమి సంబంధం ఉన్నదో, ఎలా దేశ వ్యతిరేక మ్యానిఫెస్టో అవుతుందో చెప్పాలని మోదీకి సవాలు విసిరారు. ప్రధానమంత్రిగా ఉన్న మోదీ జ్ఞానంతో మాట్లాడాలే తప్ప అజ్ఞానంతో మాట్లాడవద్దన్నారు. కర్నాటలోని చన్నపట్టణ నియోజకవర్గంలో సోమవారం జరిగిన కాంగ్రెస్ ప్రచార సభలో ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా రాజస్తాన్‌లో మోదీ ద్వేషప్రసంగంపై ఆయన స్పందించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత జనాభా లెక్కల ద్వారా ప్రజల ఆస్తుల వివరాలు సేకరించి, వాటిని ముస్లింలకు ఇస్తారని అంటున్నారని పేర్కొన్నారు. ప్రధాని జ్ఞానంతో మాట్లాడాలే తప్ప అజ్ఞానంతో కాదన్నారు. దేశాన్ని ఎవరైనా విభజిస్తున్నారంటే అది మోదీ మాత్రమేనని, హిందువులు, ముస్లింలు, దళితులు, ఇతర కులాల మధ్య ప్రధానమంత్రి విద్వేషాన్ని వ్యాప్తి చేస్తున్నారని ఖర్గే మండిపడ్డారు. ఇష్టమొచ్చినట్లు ఆరోపణలు చేసి, వెళ్ళిపోవడం మోదీకి అలవాటేనని, అలా కాకుండా అంశాలపై చర్చించేందుకు తరువాయి 2లో

ప్రధాని ఇంత దిగజారాలా?

ఆర్ఎస్ఎస్-బిజెపి రాజ్ నుంచి దేశ విముక్తికి సిపిఐ పిలుపు

04

ఓటమి భయంతోనే మోదీ వ్యాఖ్యలు



ప్రజాపక్షం/హైదరాబాద్

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రజలను మతం పేరుతో రెచ్చగొట్టే ప్రసంగాలు చేస్తున్నారని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు విమర్శించారు. ప్రజలందరినీ సమానంగా చూడాల్సిన ప్రధాని, ఒక వర్గానికి వ్యతిరేకంగా ప్రజలను రెచ్చగొట్టడం ద్వారా వైఫల్యాలను రాజేస్తున్నారని, ఇది స్పష్టంగా ఎన్నికల ప్రవర్తనా నియమావళికి వ్యతిరేకమని, తక్షణమే ఎన్నికల కమిషన్ ప్రధాని వ్యాఖ్యలపై స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు కూనంనేని సాంబశివరావు తరువాయి 2లో

సుప్రీం సూమోటోగా తీసుకోవాలి

రాజస్థాన్ ప్రచార సభలో ప్రధాని నరేంద్ర మోదీ చేసిన వ్యాఖ్యలపై ఎన్నికల కమిషన్ మౌనం వహించడం ఘోరమని సిపిఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారామ్ ఏచూరి విమర్శించారు. మోదీ విద్వేష ప్రసంగం ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పూర్తిగా ఉల్లంఘించడమేనని, ద్వేష ప్రసంగాలపై సుప్రీం కోర్టు తీర్పుకు విరుద్ధమైనదని తన ఎక్స్ ఖాతాలో ఆయన వ్యాఖ్యానించారు. కఠినమైన చర్యలకు, కోర్టు ధిక్కరణ కింద చర్యలకు ప్రధాని వ్యాఖ్యలు అనుగుణంగా ఉన్నాయని పేర్కొన్నారు. ఈ తరువాయి 2లో

30 వారాల గర్భం విచ్ఛితికి
'సుప్రీం' అనుమతి

బాధిత మైనర్ శ్రేయస్సే కీలకమని స్పష్టీకరణ

న్యూఢిల్లీ: అత్యాచారానికి గురైన ఓ మైనర్ బాలిక 30 వారాల గర్భం అబార్షన్‌కు సుప్రీంకోర్టు అనుమతించింది. కేసు పూర్వాపరాలు, ప్రస్తుత పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని, రాజ్యాంగంలోని 142 అధికరణ ద్వారా సంక్రమించిన హక్కును ఉపయోగిస్తూ ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డివై చంద్రచూడ్, జస్టిస్ జెబి పార్దీవాలాతో కూడిన సుప్రీం కోర్టు ధర్మాసనం స్పష్టం చేసింది. కొన్ని అసాధారణ పరిస్థితుల్లో, ఈ గర్భ విచ్ఛిత్తికి అనుమతిస్తున్నామని, ఇందులో తప్పులేదని వ్యాఖ్యానించింది. కేసు వివరాల్లోకి వెళితే, ముంబయిలోని సియాన్ (శివ్) ప్రాంతానికి చెందిన 14 ఏళ్ల బాలికపై అత్యాచారం జరిగింది. పోలీసులు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నారు. కాగా, తాను గర్భం దాల్చిన విషయం ఆ బాలికకు ఆలస్యంగా తెలిసింది. దీనితో ఆమె తల్లిదండ్రులు గర్భ విచ్ఛిత్తికి అనుమతించాలని కోరుతూ బాంబే హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అయితే, బాలిక వయసు, అబార్షన్ కారణంగా తలెత్తే సమస్యలను దృష్టిలో ఉంచుకొని, ఈ పిటిషన్‌ను కొట్టివేస్తున్నట్టు ఈనెల 4వ తేదీన హైకోర్టు తీర్పునిచ్చింది. ఈ తీర్పును పిటిషనర్లు సుప్రీం కోర్టులో సవాలు చేశారు. సియాన్‌లోని లోకమాన్య తిలక్ మున్సిపల్ మెడికల్ కాలేజీ, జనరల్ ఆసుపత్రి (ఎల్‌టిఎంజిహెచ్) నివేదికను కూడా సమర్పించారు. బాలిక ఇష్టానికి వ్యతిరేకంగా గర్భాన్ని కొనసాగిస్తే, ఆమె తీవ్ర శారీరక, మానసిక ఒత్తిళ్లకు లోనయ్యే ప్రమాదం ఉందని ఎల్‌టిఎంజిహెచ్ తన నివేదికలో పేర్కొంది. ఈ విషయాన్ని సుప్రీం కోర్టు ప్రస్తావిస్తూ, కాన్పు సమయంలో తలెత్తే ప్రమాదాలతో పోలిస్తే, ఇప్పుడు అబార్షన్ చేస్తే ఎదురయ్యే సమస్యలు చిన్నవని వ్యాఖ్యానించింది. ప్రత్యేక వైద్య బృందానికి ఈ బాధ్యతను అప్పగించాలని ఎల్‌టిఎంజిహెచ్ అధికారులను ఆదేశించింది. మెడికల్ తరువాయి 2లో

కాంగ్రెస్‌పై ప్రధాని అసత్య ప్రచారం

'తుమ్మిడిహెట్టి'కట్టి తీరుతాం

చక్కెర పరిశ్రమలను పునరుద్ధరిస్తాం

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటన

ఆదిలాబాద్, నిజామాబాద్, మల్కాజిగిరి లోక్‌సభ నియోజకవర్గాల పరిధిలో కాంగ్రెస్‌పార్టీ ప్రచారసభలు

మల్కాజిగిరి జనజాతర సభకు చాడ వెంకట్‌రెడ్డి

ప్రజాపక్షం/ ఆదిలాబాద్/ ఇచ్చోడ/ మల్కాజిగిరి

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం చిల్లర రాజకీయాలు చేస్తోందని, కాంగ్రెస్ మేనిఫెస్టోపై ప్రధాని అసత్య ప్రచారం చేస్తున్నారని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విమర్శించారు. బిజెపి, బిఆర్ఎస్ పార్టీల మాదిరిగా దొంగ వాగ్దానాలు తాము చేయబోమని, ఆగస్టు 15 లోపు రైతులకు రూ.2 లక్షల రుణం మాఫీ చేస్తామని తెలిపారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో భాగంగా ఆరు గ్యారంటీ పథకాల్లో అయిదు పథకాలను పకడ్బందిగా అమలు చేసామని, మిగితా పథకాలను త్వరంలోనే అమలు చేస్తామని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. కేంద్రంలో కాంగ్రెస్ కూటమి తప్పక ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కెసిఆర్, కెటిఆర్ అవినీతి, కుంభకోణాలపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా కానీ ప్రధాని మోదీ కానీ నోరెత్తరని అన్నారు. ఆదిలాబాద్, నిజామాబాద్, మల్కాజిగిరి లోక్‌సభ నియోజకవర్గాల పరిధిలో సోమవారం జరిగిన కాంగ్రెస్ పార్టీ 'జన జాతర' ఎన్నికల ప్రచార బహిరంగసభలలో ముఖ్యమంత్రి ప్రసంగించారు. దేవుడు గుడిలో ఉండాలి, భక్తి గుండెల్లో ఉండాలి కానీ, మోదీ దేవుడిని, భక్తిని ఓట్లుగా మార్చుకుంటున్నారని రేవంత్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రధానిగా ఉన్న మోదీ మత విద్వేశాలు రెచ్చగొట్టేలా కాంగ్రెస్ అధికారంలోకి వస్తే హిందువుల సంపదను ముస్లింలకు పంచి పెడతారని మాట్లాడటం ద్వారా మోదీకి ఓటమి భయం పట్టుకున్నట్లు అర్థమైందన్నారు. విపత్కర పరిస్థితుల్లో ఉన్న దేశాన్ని కాపాడాలంటే మళ్లీ కాంగ్రెస్ గెలవాలని రేవంత్‌రెడ్డి అన్నారు. రాష్ట్రంలో ప్రజా పాలన మొదలయిందన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేస్తున్న తమ ప్రభుత్వాన్ని కూలగొట్టేం దుకు ఢిల్లీలో ప్రధాని మోదీ, గల్లీలో కెసిఆర్ కలిసి కుట్రలు చేస్తున్నా రని సిఎం మరోసారి తరువాయి 8లో

25,753 మంది
ఉద్యోగాలు రద్దు

తీసుకున్న జీతం వడ్డీతో కట్టాలి

కోల్‌కతా హైకోర్టు సంచలన తీర్పు

కోల్‌కతా : పశ్చిమ బెంగాల్‌లోని కోల్‌కతా హైకోర్టు డివిజన్ బెంచ్ సంచలన తీర్పు ఇచ్చింది. 2016లో జరిగిన 25,753 ప్రభుత్వ, ఎయిడెడ్ స్కూళ్ల ఉపాధ్యాయ పోస్టుల భర్తీ ప్రక్రియను రద్దు చేస్తూ కీలక ఆదేశాలు జారీ చేసింది. అప్పట్లో రాష్ట్రస్థాయి ఎంపిక పరీక్ష రాసిన 23 లక్షల మంది అభ్యర్థుల ఒఎంఆర్ షీట్లను మళ్లీ మూల్యాంకనం చేయించాలని నిర్దేశించింది. అప్పట్లో అక్రమంగా ఉపాధ్యాయ ఉద్యోగాలు పొందిన 25,753 మంది కూడా ఇప్పటివరకు తీసుకున్న వేతనాలను 12 శాతం వడ్డీతో కలిపి తిరిగి ఇచ్చేయాలని తీర్పులో కోర్టు సూచించింది. 9, 10, 11, 12వ తరగతి విద్యార్థులకు వివిధ సబ్జెక్టులను బోధించేందుకు 2016 సంవత్సరంలో తరువాయి 2లో



సూరత్‌లో బిజెపి అభ్యర్థి ఏకగ్రీవం

సూరత్: గుజరాత్‌లోని సూరత్ లోక్‌సభ నియోజకవర్గంలో బరిలో ఉన్న ఇతర అభ్యర్థులు నామినేషన్లను ఉపసంహరించుకోవడంతో బిజెపి అభ్యర్థి ముఖేష్ దలాల్ సోమవారం ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు అన్నికలు అధికారులు చెప్పారు. దలాల్‌కు ఎన్నికల సర్టిఫికెట్‌ను అందించినట్లు జిల్లా కలెక్టర్, ఎన్నికల రిటర్నింగ్ అధికారి సౌరభ్ పర్ధీ మీడియాకు వెల్లడించారు. మే 7వ తేదీన గుజరాత్‌లోని మొత్తం 26 తరువాయి 2లో

కెటిఆర్‌కు 'గ్రేటర్' సవాల్

ఆ 'మూడు' నియోజకవర్గాలపై బిఆర్ఎస్ ఆశలు

గులాబీ నేతల్లో ఉత్కంఠ..

ప్రజాపక్షం/హైదరాబాద్

మాల్కాజిగిరి, సికింద్రాబాద్ లోక్‌సభ ఎన్నికలు బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి రామారావుకు పెద్ద సవాలుగా మారనుంది. గ్రేటర్ హైదరాబాద్‌లో జరిగే ప్రతి ఎన్నికల ఫలితాలు కెటిఆర్ ఖాతాలోనే పడ్డాయి. స్థానిక సంస్థల నుండి శాసనసభ ఎన్నికల వరకు ప్రతి ఎన్నికను ఒక సవాలుగా తీసుకున్న కెటిఆర్‌కు, ప్రస్తుతం జరుగుతున్న లోక్‌సభ ఎన్నికలు పెద్ద 'అగ్ని పరీక్ష'గా మారాయి. రాష్ట్ర వ్యాప్తంగా లోక్‌సభ ఎన్నికల్లో ''కారు'' జోరు ఎలా ఉన్నప్పటికీ గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని ఎంపి స్థానాల్లో కారు జోరు ఎలా ఉంటుందనేది బిఆర్ఎస్ వర్గాల్లో ఉత్కంఠ నెలకొన్నది. చేవేళ్ల, మల్కాజిగిరి, సికింద్రాబాద్ లోక్‌సభ స్థానాల్లో బిఆర్ఎస్ విజయావకాశాలు ఎలా ఉంటాయి?, ఈ నియోజకవర్గాల్లో కెటిఆర్ పాత్ర పై సర్వత్రా ఆసక్తి మారింది. రాష్ట్ర వ్యాప్తంగా 17 లోక్‌సభ స్థానాల్లో బిఆర్ఎస్ ఎన్ని స్థానాలను కైవసం చేసుకుంటుందనే అంశంలో ఆ పార్టీ స్పష్టత ఇవ్వకపోయినా గ్రేటర్ హైదరాబాద్‌పైన గంపెడాశలు పెట్టుకున్నది. ఇక్కడ తమకు గెలిచిన ఎంఎల్ఎలు, స్థానిక కార్పొరేటర్లు, నాయకులు సక్రమంగా, తరువాయి 2లో

కవిత బెయిల్‌పై తీర్పు మే 2కు వాయిదా

న్యూఢిల్లీ : మద్యం అవినీతి కేసులో తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు కుమార్తె కె.కవితకు బెయిలు మంజూరు చేయడంపై కేసు విచారణ ముగిసింది. ఇరుపక్షాల వాదనలు విన్న తర్వాత సిబిఐ–ఇడి దర్యాప్తు సంస్థల ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి సోమవారం ఈ అంశంపై తీర్పును వెల్లడించకుండా మే 2వ తేదీకి వాయిదా వేసింది. తీర్పును తనవద్దనే ఉంచుకుంది. మద్యం వ్యాపారులకు మేలు చేయాలని కోరుతూ భారత రాష్ట్రసమితి తరువాయి 2లో

66వేల మంది భారతీయులకు
అమెరికా సిటిజన్‌షిప్

జాబితాలో రెండో దేశంగా ఇండియా

వాషింగ్టన్: అమెరికాలో స్థిరపడిన భారతీయులు అత్యధిక సంఖ్యలో అక్కడి పౌరసత్వం పొందారు. 2022లో సహజీకృత పౌరసత్వం కింద సుమారు 66,000 మంది అగ్రరాజ్య పౌరులయ్యారు. ఈ పద్ధతిలో అమెరికా పౌరులుగా మారిన జాబితాలో 1,28,878మంది పౌరులతో మెక్సికో మొదటి స్థానంలో నిలించింది. ఆ తర్వాత 65,960 మంది భారతీయులు అమెరికా సహజీకృత సిటిజన్‌షిప్ లభించింది. అగ్రరాజ్యంలో 2022 నాటికి 4.6 కోట్ల మంది విదేశీయులు నివసిస్తున్నారు. 33.3 కోట్ల యుఎస్ జనాభాలో ఇది 14 శాతానికి సమానం. వీరిలో 2.45 కోట్ల మంది తమని తాము సహజీకృత పౌరులుగా పేర్కొన్నారు. మొత్తంగా 2022లో 9,69,380 మంది ఈ పద్ధతి ద్వారా అమెరికా పౌరులుగా మారారని ఇండిపెండెంట్ 'కాంగ్రెషనల్ రీసెర్చ్ సర్వీస్ (సిఆర్ఎస్)' నివేదిక తెలిపింది. అదే ఏడాదిలో 1,28,878 మంది మెక్సికన్లు అమెరికన్ పౌరులుగా తరువాయి 8లో

ఇక గెలిచే అవకాశం మాకే

జెలెన్స్కీ కేరింత

కీవ్ : రష్యాతో జరుగుతున్న యుద్ధంలో ఇక గెలుపు అవకాశం తమదేనని ఉక్రేన్ దేశాధ్యక్షుడు జెలెన్స్కీ కేరింతలు కొడుతున్నారు. పనిలో పనిగా అమెరికా దిగువసభకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఎగువసభ సెనేట్ వీలైనంత తొందరగా తమకు 60 బిలియన్ డాలర్ల సహాయాన్ని క్లియర్ చేసే పని పూర్తి చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఉక్రేన్‌కు సరఫరా చేయవలసిన అత్యంత శక్తిమంతమైన గగనతల రక్షణ వ్యవస్థను కూడా సత్వరం తమకు సమకూర్చాలని ఆయన కోరారు. తమకు లాంగ్ రేంజ్ వెపన్స్ సమకూర్చాలని కోరారు. అమెరికా ప్రతినిధుల సభ నిర్ణయాలకు, ఆచరణకూ మధ్య జాప్యం లేకుండా సత్వరం అన్నీ తమకు సమకూరిస్తే గెలుపు అవకాశాలు తమకే ఉంటాయన్నారు. కాగా కీవ్‌లో ఆర్టిలరీ సోల్జర్లు ఈ సందర్భంగా సంబరాలు చేశారు. ''మా బలం పెరుగుతుంది, రక్షణ పెరుగుతుంది, డ్రోన్లుతో సహా కావాల్సినన్ని ఆయుధాలు తమకు అందుబాటులోకి వస్తాయి'' అని ఆర్టిలరీ సోల్జర్ వరకూ సంతోషం వ్యక్తం చేశారు. కాగా జర్మల్ ఛానల్సలర్ ఓలాఫ్ షుల్జ్ మాట్లాడుతూ, భవిష్యత్ కోసం అమెరికా ఎంతో గొప్ప ఆలోచన చేసిందని వ్యాఖ్యానించారు. సెనేట్ కూడా త్వరగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఇదిలా ఉండగా తూర్పు ఉక్రేన్‌లో నోవో మిఖైలివ్‌కా గ్రామాన్ని తమ సైన్యం స్వాధీనం చేసుకుందని రష్యా రక్షణశాఖ సోమవారం ప్రటించింది. ఉగ్లెడార్‌కు 20 కి.మీ దూరలో ఈ గ్రామం ఉంది. పూర్తిగా ఈ గ్రామాన్ని తమ స్వాధీనంలోకి తెచ్చుకున్నట్లు పేర్కొంది. సరిహద్దుల్లో పరిస్థితులు అంతకంతకూ క్షీణిస్తున్నాయనీ, తక్షణం అమెరికా సహాయం కావాలనీ ఉక్రేన్ వారం క్రితమే ప్రకటించిన పూర్వరంగంలో రష్యా రక్షణశాఖ ఈ విషయం వెల్లడించింది.

ఇజ్రాయిల్ ప్రధాని–రక్షణమంత్రి మధ్య విభేదాలు

ఇంటెలిజన్స్ చీఫ్ హలివా రాజీనామా

టెల్ అవీవ్ : యుద్ధ సమాచారం, జాతీయ భద్రతాంశాలపై ఇజ్రాయిల్ మంత్రివర్గంలో విభేదాలు వచ్చాయి. మంత్రివర్గంలో చర్చించుకున్న సమాచారం బయటకు పొక్కుతోందన్న విషయంపై ప్రధానమంత్రి బెంజిమన్ నేతన్యాహూ, రక్షణమంత్రి యోవ్ గాల్లంట్ మధ్య విభేదాలు తలెత్తాయి. అదేవిధంగా రక్షణమంత్రి గాల్లంట్ మంత్రివర్గంలో సీనియర్, మాజీ రక్షణ అధికారి బెన్నీ గాంట్స్ మధ్య కూడా మాటలయుద్ధం నడుస్తున్నది. గాల్లంట్ ఎప్పుడు మంత్రివర్గ సమావేశానికి వచ్చినా ఆ సమాచారం బయటకు పొక్కుతోందని నేతన్యాహు మండిపడుతున్నారు. బెన్నీ కూడా గాల్లంట్‌పై మండిపడుతున్నారు. మరో వైపు ఇజ్రాయిల్ పోలీస్, సైన్యం పైన కూడా ఆంక్షలు పెట్టాలన్న అమెరికా ఆలోచనలపై కూడా మంత్రివర్గం మల్లల్లాలు పడుతున్నది. జాతీయ భద్రతకు నువ్వు నష్టం చేస్తున్నావంటే, నువ్వే నష్టం చేస్తున్నావంటూ మంత్రివర్గంలో ఒకరనొకరు దూషించుకునే పరిస్థితులు తలెత్తాయి. అదేవిధంగా ఇజ్రాయిల్ ఆర్మీ ఇంటెలిజన్స్ విభాగం ప్రధానాధిపతి అహరోన్ హలీవా తన పదవికి రాజీనామా చేశారు. ఆర్మీ ఇంటిలిజెన్స్‌కు కొత్త చీఫ్‌ను ఎంపిక చేశాక ఆయన పూర్తిగా బాధ్యతల నుండి వైదొలగుతారని చెప్పారు. గత ఏడాది అక్టోబరు 7వ తేదీన హమాస్ ఉగ్రవాదులు ఇజ్రాయిల్‌పై దాడి చేసి 1,139మందిని హతమార్చారు. వివిధ దేశాలకు చెందిన మరో 240 మందిని బందీలుగా తీసుకుపోయారు. హమాస్ ఉగ్రవాదులు దాడులు చేస్తారన్న విషయం ముంగానే పసిగట్టడంలో జరిగిన వైఫల్యాన్ని బాధ్యత వహిస్తూ అహసన్ సోమవారం రాజీనామా చేశారు. హమాస్ మెరుపు దాడిని గ్రహించడంలో ఆయన విఫలమయ్యారని విమర్శలు వచ్చాయి. ఈ ఘటన జరిగిన ఆరునెలల తర్వాత ఇజ్రాయిల్ మంత్రివర్గంలో ఒకవైపు విభేదాలు తలెత్తడం, మరోవైపు అహసన్ రాజీనామా పరిణామాలు పశ్చిమాసియాలో ప్రభావం చూపించే అవకాశాలు ఉంటాయి.

ఖాన్‌యూనిస్ లోని నసీర్ ఆసుపత్రి నుండి ఇజ్రాయిల్ సైన్యం ఉపసంహరించుకున్న తర్వాత సామూహికంగా ఖననం చేసిన సమాధుల నుండి 283 మృతదేహాలు బయటపడ్డాయని పౌర రక్షణ దళాలు తాజా సమాచారం తెలియజేశాయి. ఎవరికీ తెలియకుండా ఈ మృతదేహాలను ఖననం చేశారు. కాగా ఇప్పటివరకూ ఇజ్రాయిల్ దాడుల్లో 34,097 మంది పాలస్తీనియన్లు మరణించగా, 76,980 మంది గాయపడ్డారు. తాజాగా సోమవారం కూడా ఇజ్రాయిల్ దాడులు కొనసాగాయి.

ప్ర పం చం

అక్రమ వలసలపై బ్రిటన్‌లో రాజకీయ ప్రతిష్టంభన

లండన్ : రువాండా నుండి బ్రిటన్‌కు అక్రమ వలసలు అరిట్టేందుకు, వచ్చిన వారిని సగౌరవంగా తిరిగి ఆదేశంలో వదిలలేసేందుకు సంబంధించిన బిల్లుపై ప్రధానమంత్రి రిషి సునాక్ తీవ్ర ఒత్తిడికి గురి అవుతున్నారు. ఈ బిల్లు విషయంలో బ్రిటన్‌లో రాజకీయ ప్రతిష్టంభన కొనసాగుతున్నది. నాలుగు నెలలుగా ఈ బిల్లుపై ఎగతెగని వివాదం జరుగుతున్నది. నెల 18వ తేదీన బిల్లు ఆమోదం పొందకుండా హౌస్ ఆఫ్ లార్డ్స్ అడ్డుకున్నది. అదేవిధంగా ఆఫ్ఘనిస్థాన్ నుండి వచ్చిన ఆశ్రితులకు మినహాయింపులు ఉండాలని కూడా వారు కోరుతున్నారు. బ్రిటన్‌కు 6,500 కి.మీ దూరంలో ఉన్న సెంట్రల్ ఆఫ్రికా దేశం రువాండా నుండి బాధితులు ప్రాణాలు కూడా లెక్కచేయకుండా చిన్న చిన్న బోట్లలో ఇంగ్లీష్ ఛానల్ దాటి వచ్చి బ్రిటన్‌ను ఆశ్రయిస్తున్నారు. ఈ విషయంలో 2022 జనవరి 1వ తేదీ తర్వాత దేశంలోకి వచ్చిన వలస ప్రజలను వెనక్కు విమానాల్లో పంపిచే బిల్లు అత్యవసరమైనదని రిషి సునాక్ వాదిస్తుండగా ఈ బిల్లులో సవరణలు చేయాలని హౌస్ ఆఫ్ లార్డ్స్ సభ్యులు వాదిస్తున్నారు. ఈ బిల్లును ఆమోదించడం అత్యవసరమని సునాక్ మొత్తుకుంటున్నారు. చిన్న చిన్న బోట్లలలో అక్రమంగా వేలాదిమంది దేశంలోకి వస్తున్నారని, వీరిని అడ్డుకోవాలని ఆయన అన్నారు. దీనిపై నాలుగు నెలలుగా రగడ జరుగుతున్నది. ఈ బిల్లు మానవ హక్కులను ఉల్లంఘిస్తున్నదని అత్యున్నత న్యాయస్థానం విమర్శించింది. ఇప్పటివరకూ ఆశ్రయం కోరి వచ్చిన వారిని తిరిగి రువాండాకు పంపలేదని ప్రభుత్వం వివరణ ఇచ్చింది. రువాండా నుండి న్యాయబద్ధంగా వచ్చేసినవారిని తిరిగి బలవంతంగా ఆ దేశానికి పంపేస్తే వారు తీవ్ర సమస్యల్లో పడతారని, వారు హింస, అణచివేతలకు గురి కావచ్చునీ అత్యున్నత న్యాయస్థానం చెబుతున్నది. 2022 జూన్‌లోనే మొదటి విమానం రువాండా వలస ప్రజలను తిరిగి ఆ దేశంలో దిగబెట్టేందుకు బయలుదేరాల్సి ఉండగా, న్యాయపరమైన చిక్కులు, సవాళ్ళు ఎదురుకావడంతో ఇప్పటివరకూ ఒక్క విమానం కూడా ఆ దేశానికి బయలుదేరలేదు. ఈ విధంగా ఇప్పటివరకూ 50,000 వేలమంది బ్రిటన్‌కు వచ్చారు. 2024లో మరో నాలుగువేల మంది వచ్చారు.

వివాదాస్పద ఎంపి మెంజియస్ రాజీనామా

బ్రిటన్‌లో కన్జర్వేటివ్ పార్టీ ఫ్లయిడ్ నియోజకవర్గ ఎంపి మార్క్ మెంజియస్ రాజీనామా చేశారు. నిధుల దుర్వినియోగం ఆరోపణలపై కన్జర్వేటివ్ పార్టీ గతవారం ఆయనను సస్పెండ్ చేసింది. నిధుల దుర్వినియోగంపై దర్యాప్తు జరపాలని ప్రతిపక్ష లేబర్ పార్టీ కూడా డిమాండ్ చేస్తున్నది. పార్లమెంటు సభ్యుడి స్థాయిని దిగజార్చేవిధంగా ప్రవర్తించారని ఆరోపిస్తూ మార్క్ మెంజియస్‌ను పార్టీ సస్పెండ్ చేసింది. కాగా ఇంటా బయటా తనపై ఒత్తిడి పెరిగిందనీ, తన పెద్ద చేస్తున్న ఒత్తిడి కారణంగా కుటుంబ వ్యక్తిగత జీవితానికి విలువ ఇచ్చి రాజీనామా చేస్తున్నాననీ, తదుపరి తాను ఎన్నికల్లో పోటీ చేసే ప్రసక్తే లేదని మెయింజిస్ ఒక ప్రకటనలో చెప్పారు. పార్టీ నిధులను ఆయన అనర్హులకు ఇచ్చారని కూడా మార్క్ మెంజియస్ ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. ఆరోపణలు వచ్చిన తర్వాత పార్టీ కార్యకర్త ఒకరికి తెల్లవారుజామునే ఫోన్ చేసి ఐదువేల పౌండ్లు అడిగారని కూడా ఆరోపణలు వచ్చాయి. 14 వేల పౌండ్లు పార్టీ నిధులను మెడికల్ బిల్లుల కింద ఖర్చు చేశారని ఆయనపై ఆరోపణలు వచ్చాయి. కుటుంబ జీవితానికి గౌరవం ఇచ్చి తాను వైదొలగుతున్నానని మెంజియస్ అన్నారు.

చైనా రెండు రాష్ట్రాలలో వరద బీభత్సం

11 మంది గల్లంతు

బీజింగ్ : చైనాలో ఈనెలారంభం నుండి వరద బీభత్సం కొనసాగుతున్నది. ఈ వరదలు చరిత్ర సృష్టిస్తున్నాయి. తాజాగా గాంగ్ డాంగ్, గుయిఝూవు రాష్ట్రాలు వరదల కారణంగా నీట మునిగాయి. 11 మంది గల్లంతయ్యారు. ఈనెల 8 వ తేదీన ప్రారంభమైన భారీ వర్షాలు వరదలు 16వ తేదీన నాటికి ఉద్ధృత రూపం దాల్చాయి. దేశవ్యాప్తంగా 44 నదులు పొంగిపొర్లుతున్నాయి. షిజియావో హైడ్రొలాజికల్ స్టేషన్ వద్ద బీజింగ్ వరదనీరు సగటున సెకనుకు 12,000 క్యుబిక్ మీటర్ల వంతున నీటి పరిమాణం పెరిగింది. శతాబ్దంలో మొదటిసారి బీజింగ్ నది తన ఉగ్రరూపం ప్రదర్శించిందని అధికారులు చెప్పారు. కరకట్టలు తెగుతూ ఉండటంతో చైనా పారిశ్రామిక ప్రాంతం గాంగ్‌డాంగ్ వరదబారిన పడింది. రాష్ట్రంలో వేలాది గ్రామాలకు ప్రధా ప్రాంతాలలో రహదారి సంబంధాలు తెగిపోయాయి. 10 లక్షలమంది ప్రజలు విద్యుత్ లేకుండా గడుపుతున్నారు. దీంతో ప్రభుత్వం వరదల నుండి దేశవ్యాప్తంగా 12.70 కోట్ల మంది ప్రజలకు సురక్షిత జీవనం కలిగించేందుకు ఒక సుదీర్ఘ ప్రణాళికా రచన చేసింది. తాత్కాలికంగా డ్యామ్‌లు మూసివేశారు. 1998 నుండి చైనాలో నదులు రికార్డుస్థాయిలో ఉప్పొంగుతున్నాయి.

ఎర్త్ డే చైతన్యం రావాలి

ప్రపంచవ్యాప్తంగా మారుతున్న వాతావరణ పరిస్థితులు భయపెడుతున్న తరుణంలో ఏప్రిల్ 22న జరిగిన ఎర్త్ డే కు అత్యంత ప్రాధాన్యం ఏర్పడింది. ప్రపంచవ్యాప్తంగా మారిపోయిన వాతావరణ పరిస్థితులకు ప్రత్యామ్నాయంగా ప్రతి మనిషీ భూమిని రక్షించుకునే ప్రయత్నం చేయాలనేదే ఎర్త్ డే లక్ష్యం. అమెరికా సెనేటర్, పర్యావరణవేత్త గేలార్డ్ నెల్సన్, హార్వర్డ్ యూనివర్సిటీ గ్రాడ్యుయేట్ విద్యార్థి డేనిస్ హాయేస్ ఇద్దరూ కలిసి 1970లో ఎర్త్ డేకు శ్రీకారం చుట్టారు. అప్పటినుండీ ప్రతి ఏడాదీ ఈ ఎర్త్ డే పాటిస్తున్నారు. మొదటిసార ఎర్త్ డే జరిగినప్పుడు చైతన్యం వెల్లి విరిసింది. అమెరికా వ్యాప్తంగా రెండు కోట్లమంది ప్రజలు అనేక రాష్ట్రాలలో వీధుల్లోకి వచ్చి ప్రతిజ్ఞ చేశారు. ఆ తర్వాత 1990లో ఇది ప్రపంచవ్యాప్తంగా 200 దేశాలలో పాటించేవిధంగా ప్రపంచ కార్యక్రమంగా రూపుదిద్దుకుంది. సముద్రంలో ప్రతి ఏటా 92 మిలియన్ టన్నుల టెక్స్‌టైల్స్ వ్యర్థాలు, మరో 10 లక్షల ప్లాస్టిక్ వ్యర్థాలూ కలిసిపోతున్నాయని పర్యావరణ, వాతావరణవేత్తలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

భారత్ వ్యతిరేకతకే మాల్దీవుల ఓటు

మాలె : మాల్దీవుల ప్రజలు భారత్ వ్యతిరేకతకే ఓటు వేశారు. మాల్దీవులలో జరిగిన సార్వత్రిక ఎన్నికలలో చైనా అనుకూల మహ్మద్ మొయిజ్జు భారత్ వ్యతిరేకతే ప్రధాన నినాదంగా ప్రచారం చేశారు. అందుకు అనుగుణంగానే మాల్దావుల నేషనల్ కాంగ్రెస్‌పార్టీకి పార్లమెంటులో సూపర్ మెజారిటీ వచ్చింది. పార్లమెంటు మజ్లిస్‌లో ఉన్న 93 సీట్లకు గాను మొయిజ్జుకు చెందిన నేషలిస్ట్ పార్టీకి 60 సీట్లు లభించాయి. అదేవిధంగా ఆయన పార్టీ మద్దతుతో ఇండిపెండెంట్లు కూడా మరో ఆరుగురు గెలిచారు. ప్రతిపక్ష మాల్దీవియన్ డెమోక్రటిక్ పార్టీ కూడా ఎన్నికల్లో మొయిజ్జుకు వ్యతికంగా ఎంతో కష్టపడి భారీ ప్రచారం చేసినప్పటికీ ఆయనవైపే ప్రజలు మొగ్గుచూపారు. మాల్దీవుల సార్వభౌమాధికారాన్ని భారత్ నుండి రక్షించాలని మొయిజ్జు ప్రజల్లో విస్తారంగా ప్రచారం చేశారు. భారత సైన్యాన్ని మాల్దావుల నుండి వెళ్ళగొట్టాలని ఆయన ప్రతి సభలోనూ ప్రజలకు చెబుతూ వచ్చారు.

నీటి సరఫరాలో అంతరాయం కలగొద్దు : సిఎస్

ప్రజాపక్షం/హైదరాబాద్: నీటి సరఫరాలో అంతరాయాలు రాకుండా జాగ్రత్త వహించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అధికారులను ఆదేశించారు. ఉద్దేశపూర్వకంగా తాగు నీటి కృత్రిమ కొరతను సృష్టించే వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని, అటువంటి వారి పై కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. వచ్చే నెల రోజుల పాటు రాష్ట్రంలో తాగునీటి సరఫరా పరిస్థితిని నిశితంగా పర్యవేక్షించాలన్నారు. మున్సిపల్, నీటిపారుదల, పంచాయితీ రాజ్ శాఖల అధికారులతో హైదరాబాద్‌లోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో శాంతికుమారి సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో తాగునీటి సరఫరా పరిస్థితిని సమీక్షించారు. సరఫరాలో అంతరాయం ఉన్న ప్రాంతాలను గుర్తించి,ప్రజలు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకోవాలన్నారు. నగరంలో నీటి పరిస్థితిని ప్రస్తావిస్తూ సంబంధిత సిజిఎం ముందస్తు అనుమతితో మాత్రమే నిర్వహణ పనులు చేపట్టాలని, ఆయా ప్రాంతాల్లో ట్యాంకర్ల ద్వారా ప్రత్యామ్నాయ తాగునీటి సరఫరా చేయాలని ఆదేశించారు. సిజిఎంలు ప్రతిరోజూ తమ పరిధిలోని మేనేజర్లతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించి, నీటి సరఫరాను పర్యవేక్షించాలన్నారు. మిషన్ భగీరథ, పబ్లిక్ హెల్త్ అధికారులు కూడా నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. నాగార్జునసాగర్ నుంచి నీటి పంపింగ్ ఇప్పటికే ప్రారంభమైందని, మే నెలాఖరు వరకు రాష్ట్రంలో తాగునీటి సరఫరాకు ఎటువంటి లోటు ఉండదని అధికారులు తెలిపారు. సిడిఎంఎ దివ్య మాట్లాడుతూ మంచినీటి సరఫరా పరిస్థితిని ప్రతిరోజూ పర్యవేక్షిస్తున్నామని, లీకేజీలు ఏవైనా ఉంటే వెంటనే సరిచేస్తున్నామని వివరించారు. ప్రతి మున్సిపాలిటీలో హెల్ప్ లైన్ ను ఏర్పాటు చేశామని, నీటి సరఫరాలో చిన్న అంతరాయం ఏర్పడినా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. ఈ సమీక్షలో మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి దానకిషోర్, పంచాయత్ రాజ్ శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, ఇరిగేషన్ శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జా, ఎండి హెచ్ఎండబ్ల్యుఎస్బీ సుదర్శన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఓటమి భయంతోనే మోదీ వ్యాఖ్యలు
(మొదటి పేజీ తరువాయి)

సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. లోక్‌సభ ఎన్నికల్లో ప్రతిపక్షాలు గెలుపొందితే, హిందువుల ఆస్తులను, ఆడవారి మెడలో మంగళసూత్రాలను లాగేసుకుని, ముస్లింలకు, చొరబాటుదారులకు పంచుతారని ఎన్నికల ప్రచారంలో మోదీ చేసిన వ్యాఖ్యలను కూనంనేని తీవ్రంగా ఖండించారు. కాంగ్రెస్, వామపక్షాల కబంధ హస్తాలలో చిక్కుకున్నదని, ఆ పార్టీ మ్యానిఫెస్టో ఆందోళనకరంగా ఉన్నదని మోదీ అనడాన్ని తప్పుబట్టారు. ప్రధాని వ్యాఖ్యలు రాజకీయ దివాళాకోరుతనానికి నిదర్శమన్నారు. పదేళ్ళ మోదీ పాలనలో ప్రజల కోసం చేసిందేమీ లేదని, నిత్యావసర ధరలు, నిరుద్యోగం, పెట్రోలు, డీజిల్ రికార్డు స్థాయిలో పెరిగిపోయాయని, ప్రజల సమస్యలను పక్కదారి పట్టించేందుకే మతం పేరుతో మభ్యపెట్టడం బిజెపికి, మోదీకి అలవాటుగా మారిందని దుయ్యబట్టారు. ఇవన్నీ గమనించిన ప్రజలు లోక్‌సభ తొలి విడత ఎన్నికల్లో బిజెపికి వ్యతిరేకంగా ఓటు వేశారనే సంకేతాలు రావడంతో ప్రధాని మోదీకి భయం పట్టుకున్నదని పేర్కొన్నారు. మోదీ ప్రధాని స్థాయిని దిగజార్చే వ్యాఖ్యలు చేస్తున్నారని కూనంనేని సాంబశివ రావు మండిపడ్డారు. ప్రజలందరినీ సమానంగా చూడాల్సిన ప్రధాని ఒక వర్గానికి వ్యతిరేకంగా ప్రజలను రెచ్చగొడడం ద్వారా వైషమ్యాలను రాజేస్తున్నారని, ఇది స్పష్టంగా ఎన్నికల ప్రవర్తనా నియమావళికి వ్యతిరేకమన్నారు. తక్షణమే ఎన్నికల సంఘం ప్రధాని వ్యాఖ్యలపై చర్యలు తీసుకోవాలని కూనంనేని డిమాండ్ చేశారు.

మే 2కు వాయిదా (మొదటి పేజీ తరువాయి)

నాయకురాలు, తెలంగాణలో శాసనమండలి సభ్యురాలు కవిత ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్‌పార్టీకి సౌత్ గ్రూప్ తరఫున రూ.100 కోట్లు ముడుపులు ఇచ్చారన్న ఆరోపణలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అరెస్టు చేసింది. తర్వాత సిబిఐ కూడా ఆమెను అరెస్టు చేసింది. ఆప్ ప్రభుత్వం రూపొందించిన ఎక్సైజు విధానం మద్య వ్యాపారుకు మేలు చేసేదిగా ఉందన్న విషయంపై సిబిఐ దర్యాప్తు చేస్తున్నది. ఆర్థిక అక్రమాలు చేయడంకోసమే ఈ విధానం రూపొందించారని ఇడి, సిబిఐలు ఆరోపిస్తున్నాయి. ఇదే విషయంపై కవిత దాఖలు చేసిన పిటిషన్‌పై వాదోపవాదాలను కోర్టు కొనసాగించింది.

బిజెపి అభ్యర్థి ఏకగ్రీవం
(మొదటి పేజీ తరువాయి)

నియోజకవర్గాల్లో పోలింగ్ జరగనుంది. అయితే అంతకు ముందే సూరత్‌లో ఫలితం వెలువడడం గమనార్హం. ఇక మిగతా 25 స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. సూరత్ నుంచి నలుగురు స్వతంత్రులు, ముగ్గురు చిన్న పార్టీల అభ్యర్థులు, బిఎస్‌పి నుంచి ఒక అభ్యర్థి మొత్తం 8 మంది తమ నామినేషన్లు ఉపసంహరించుకున్నారు. కాగా, కాంగ్రెస్ అభ్యర్థి నిలేశ్ కంభాని నామినేషన్‌ను శనివారం జిల్లా రిటర్నింగ్ అధికారి తిరస్కరించారు. నామపత్రాల్లో ప్రతిపాదితుల సంతకాలు లేవనే నెపంతో ఆయన నామినేషన్‌ను తిరస్కరించారు. అయితే కాంగ్రెస్ ప్రత్యామ్నాయ అభ్యర్థి సురేష్ పడ్సాలా నామినేషన్ చెల్లకుండా పోయింది. ఈ నేపథ్యంలో బిజెపి కనుసన్నల్లోనే కుంభాని నామినేషన్‌ను తిరస్కరించారని కాంగ్రెస్ ఆరోపించింది. దీనిపై హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది.

'సుప్రీం' అనుమతి
(మొదటి పేజీ తరువాయి)

టెర్మినేషన్ ఆఫ్ ప్రెగ్నెన్సీ (ఎంటిపి) 1971చట్టాన్ని అనుసరించి, వైద్యుడి సలహా మేరకు 12 వారాల గర్భ విచ్ఛిత్తికి అనుమతి ఉంది. ఇద్దరు వైద్యులు సూచిస్తే, 20 వారాల గర్భాన్ని కూడా తీసివేయవచ్చు. అయితే, ఈ కేసులో బాధిత బాలిక 30 వారాల గర్భవతి కావడంతో, అబార్షన్ సాధ్యమా? ఆమె ప్రాణానికి ప్రమాదమా? అనే అనుమానాలు తలెత్తాయి. ఫలితంగా ఈ కేసుపై విస్తృత పరిధిలో చర్చనీయాంశమైంది. అబార్షన్‌కు సుప్రీం కోర్టు అనుమతించడంతో ఉత్కంఠకు తెరపడింది.

మళ్లీ అదే పాట (మొదటి పేజీ తరువాయి)

ఎన్నికల ప్రచారంలో మోదీ పాల్గొన్నారు. ప్రతిపక్ష కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీలు సంతుష్టీకరణ విధానాలను అవలంభిస్తున్నారని, అయినప్పటికీ ఆ వర్గం సామాజిక ఆర్థిక స్థితిగతులను మెరుగుపరిచేందుకు ఏమీ చేయలేదని ఆయన అన్నారు. అందుకు భిన్నంగా తమ ప్రభుత్వం ట్రిపుల్ తలాఖ్ వ్యతిరేకంగా చట్టాన్ని తీసుకువచ్చిందన్నారు. కాంగ్రెస్ పార్టీ, ప్రతిపక్ష ఇండియాకూటమి ఉద్దేశ్యాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రధాని అన్నారు. తాము అధికారంలోకి వస్తే ఎవరెంత సంపాదిస్తున్నారు, వారికి ఎన్ని ఆస్తులు ఉన్నాయనే అంశంపై విచారణ చేయిస్తామని కాంగ్రె స్ యువరాజు అంటున్నారని, అంతే కాకుండా ఆస్తులను స్వాధీనం చేసుకొని ప్రభుత్వం పునఃపంపిణీ చేస్తుందంటున్నాడని, ఇదే వారి మ్యానిఫెస్టోలో ఉన్నదన్నారు. మన తల్లులు, ఆడపిల్లల దగ్గర బంగారం ఉంటుందని, ఆ బంగారాన్ని కొట్టేసేందుకు వారి కన్ను పడిందని ప్రతిపక్షాలను ఉద్దేశించి వ్యాఖ్యలు చేశారు. వేతనజీవుల ఆస్తుల గురించి సర్వే చేసేందుకు ప్రతిపక్షాలు ప్రణాళిక వేశాయని, మీకు రెండు ఇళ్ళులు ఉంటే ఒకటి గుంజుకుంటారని, కాంగ్రెస్ ఆ స్థాయికి కూడా వెళ్తుందని అన్నారు. ఇది మావోయిస్టుల ఆలోచన అని, ఇది కమ్యూనిస్టుల ఆలోచన అని , అలా చేయడం ద్వారా ఇప్పటికే అనేక దేశాలు దెబ్బతిన్నాయన్నారు. కాంగ్రెస్, ఇండియా కూటమి ఇదే విధానాన్ని అమలు చేయాలని చూస్తున్నట్లు తెలిపారు. అయితే రాజస్థాన్‌లో ప్రసంగం మాదిరిగా కాకుండా అలీగఢ్‌లో ఒక అడుగు వెనక్కి వేసి ముస్లింలు అనే పదాన్ని ప్రధాని మోదీ తన ప్రసంగంలో వాడలేదు.

ఉద్యోగాలు రద్దు
(మొదటి పేజీ తరువాయి)

గ్రూప్ సి, గ్రూప్ డి కేటగిరీల పోస్టులను బంగాల్ స్కూల్ సర్వీస్ కమిషన్ భర్తీ చేసింది. మళ్లీ కొత్తగా ఆయా పోస్టులను భర్తీ చేసే ప్రక్రియను మొదలుపెట్టాలని, 15 రోజుల్లోగా నియామక ప్రణాళికను సిద్ధం చేయాలని బెంగాల్ స్కూల్ సర్వీస్ కమిషన్‌ను ఆదేశించింది. దీనిపై సిబిఐ దర్యాప్తు కొనసాగించవచ్చని, ఈ కేసులో ఎవరినైనా కస్టడీలోకి తీసుకోవచ్చని హైకోర్టు పేర్కొంది. దీంతో ఎన్నికల వేళ మమతా బెనర్జీ ప్రభుత్వానికి పెద్ద షాక్ తగిలినట్లయింది.

ఉద్యోగాల రద్దు చట్టవిరుద్ధం : దీదీ

బంగాల్‌లోని రాయ్‌గంజ్‌లో ఎన్నికల ప్రచారం చేస్తున్న సిఎం మమతా బెనర్జీ, కోల్‌కతా హైకోర్టు తీర్పుపై ఘాటుగా స్పందించారు. ఏకంగా 25,753 మంది ఉద్యోగాలను రద్దు చేయడం చట్టవిరుద్ధమన్నారు. ఈ తీర్పును ఎగువ న్యాయస్థానంలో సవాల్ చేస్తామని వెల్లడించారు. న్యాయవ్యవస్థను, తీర్పులను బిజెపి నాయకులు ప్రభావితం చేస్తున్నారని దీదీ ఆరోపించారు. 2016లో ఉద్యోగాల్లో భర్తీ అయిన వారంతా గత 8 ఏళ్ల వేతనాన్ని 4 వారాల్లో చెల్లించడం ఎలా సాధ్యమవుతుందని మమతా బెనర్జీ ప్రశ్నించారు. ఉద్యోగాలు కోల్పోయిన వారికి అండగా ఉంటామని ఆమె హామీ ఇచ్చారు. వారందరికీ న్యాయం జరిగేలా చూస్తామన్నారు.

కెటిఆర్‌కు 'గ్రేటర్' సవాల్
(మొదటి పేజీ తరువాయి)

సమన్వయంతో పనిచేస్తే ఒక్క స్థానాన్ని కైవసం చేసుకోవడంతో పాటు మరో స్థానంలో బలమైన పోటీ ఇచ్చే అవకాశాలు ఉంటాయని ఆ పార్టీ నేతలు అంచనా వేస్తున్నారు. గత సికింద్రాబాద్ లోక్‌సభ ఎన్నికల్లో బిజెపికి 42.05 శాతం, బిఆర్‌ఎస్‌కు 35.26 శాతం, కాంగ్రెస్‌కు 18.93 శాతం ఓట్లు పోలయ్యాయి. ఆ తర్వాత జరిగిన శాసనసభ ఎన్నికల్లో బిఆర్‌ఎస్ భారీ మెజార్టీతో గెలుపొందింది. అయితే ప్రస్తుతం సిట్టింగ్ ఎంపి జి. కిషన్‌రెడ్డి, బిఆర్ఎస్ నుండి ఖైరతాబాద్ ఎంఎల్‌ఎగా గెలుపొందిన దానంనాగేందర్ కాంగ్రెస్ తరఫున పోటీలో ఉన్నారు. బిఆర్‌ఎస్ తరఫున సికింద్రాబాద్ ఎంఎల్‌ఎ పద్మారావు గౌడ్ పోటీలో ఉన్నారు. అలాగే మేడ్చల్ కాంగ్రెస్ ఎంపిగా ప్రస్తుత ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డికి 38.63 శాతం ఓట్లు పోలవ్వగా, ద్వితీయ స్థానంలో బిఆర్‌ఎస్ అభ్యర్థి మర్రి రాజశేఖర్ రెడ్డికి 37.93 శాతం ఓట్లు పోలయ్యాయి. ప్రస్తుతం మర్రి రాజశేఖర్‌రెడ్డి మల్కాజిగిరి ఎంఎల్‌ఎగా ఉండగా, బిఆర్‌ఎస్ ఎంపిగా రాగిడి లక్ష్మారెడ్డి పోటీలో ఉన్నారు. చేవేళ్లలో బిఆర్‌ఎస్‌కు 40.62 శాతం, ద్వితీయ స్థానంలో నాడు కాంగ్రెస్ తరఫున పోటీ చేసిన కొండా విశ్వేశ్వర్‌రెడ్డికి 39.5 శాతం ఓట్లు వచ్చాయి. అయితే ఈసారి జరిగే ఎన్నికల్లో సిట్టింగ్ ఎంపి రంజిత్‌రెడ్డి కాంగ్రెస్ తరఫున, గతంలో కాంగ్రెస్ తరఫున పోటీ చేసిన కొండా విశ్వేశ్వర్ రెడ్డి బిజెపి తరఫున పోటీ చేయగా, బిఆర్ఎస్ తరఫున కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ పోటీలో ఉన్నారు.

ఎంపి అభ్యర్థులకు 'గ్రేటర్ నేతలు' సహకరించేనా..?

బిఆర్‌ఎస్ లోక్‌సభ అభ్యర్థులకు స్థానిక గులాబీ నేతలు, ప్రజాప్రతినిధుల నుండి ఎంత వరకు సహకారం లభిస్తుందనేది ప్రశ్నార్థకంగా మారింది. ఇప్పటికే గ్రేటర్ మేయర్, డిప్యూటీ మేయర్‌తో పాటు పలువురు బిఆర్‌ఎస్‌కు రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరిన విషయం తెలిసిందే. కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధమైన రాజేంద్రనగర్ ఎంఎల్‌ఎ ప్రకాష్‌గౌడ్ కూడా చివరి నిమిషంలో తన నిర్ణయాన్ని మార్చుకున్నారు. ప్రకాష్‌గౌడ్ బిఆర్‌ఎస్‌ను వీడుతున్నారనే సమాచారం అందగానే కెటిఆర్ తక్షణమే రంగంలోనికి దిగి ఆయనను బుజ్జగించినట్టు తెలిసింది. ఇప్పటికే దానం పార్టీని వీడగా, మరో ఎంఎల్‌ఎ ప్రకాష్‌గౌడ్ కూడా వెళ్తే ఆ ప్రభావం లోక్‌సభ ఎన్నికల్లో తీవ్రంగా ఉంటుందని బిఆర్‌ఎస్ నేతలు అంచనా వేశారు. మొత్తానికి ప్రకాష్‌గౌడ్‌ను పార్టీ వీడకుండా ఆపగలిగారు. మరి కొందరు ముఖ్యనేతలు, ఒకరిద్దరు ఎంఎల్‌ఎలు కూడా బిఆర్‌ఎస్‌ను వీడుతారని సోషల్ మీడియాలో విస్తృత ప్రచారం జరుగుతోంది. దీనిని ఆ పార్టీ నేతలు కొట్టిపారేస్తున్నప్పటికీ కొన్ని నియోజకవర్గాల్లో మాత్రం కొందరు ముఖ్యనేతలు అసంతృప్తిగానే ఉన్నట్టు తెలుస్తోంది. తాజా రాజకీయ పరిణామాలను నిశితంగా పరిశీలిస్తున్న మరి కొందరు నాయకులు వేచిచూసే ధోరణిలో కనిపిస్తున్నారు. అప్పటి రాజకీయ పరిస్థితులకు అనుగుణంగా నిర్ణయం తీసుకోవాలని వారు భావిస్తున్నట్టు తెలుస్తోంది. ఇటువంటి గడ్డు పరిస్థితుల్లో 'గ్రేటర్ రాజకీయం'పై కెటిఆర్ మార్క్ ఎలా ఉంటుందనేది ఆ పార్టీ వర్గాల్లో సర్వత్రా ఉత్కంఠ నెలకొన్నది. ఇది వరకు జరిగిన అన్ని ఎన్నికల్లో అన్నీ తానై నడిపించి, వరుస విజయాలను తన ఖాతాలో వేసుకున్న కెటిఆర్, ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లో ఎంతవరకు సఫలీకృతమవుతారనేది జూన్ 4న తేలనుంది.

విద్వేష ప్రసంగాలు
(మొదటి పేజీ తరువాయి)

కట్టుబడి ఉండాలని ఖర్గే అన్నారు. రాజ్యాంగాన్ని మార్చేందుకు మూడింట రెండొంతుల మెజారిటీ అవసరమని, అదే లక్ష్యంతో లోక్‌సభలో బిజెపి 400 సీట్లు గెలవాలని మోదీ పిలుపునిచ్చారని తెలిపారు.

ఎన్నికల కమిషన్‌కు కాంగ్రెస్ ఫిర్యాదు

రాజస్థాన్‌లో జరిగిన ప్రచార సభలో ఒక మతాన్ని లక్ష్యంగా చేస్తూ విభజన పూరిత, ద్వేషపూరిత ప్రసంగం చేసిన ప్రధాని నరేంద్ర మోదీపై చర్య తీసుకోవాలని కేంద్ర ఎన్నికల కమిషన్‌కు కాంగ్రెస్ పార్టీ ఫిర్యాదు చేసింది. ఢిల్లీలో కేంద్ర ఎన్నికల కమిషన్‌ను సోమవారం నాడు కాంగ్రెస్ నాయకుల అభిషేక్ మనుసింఘ్వి, గురుదీప్ సప్పల్, సుప్రియా శ్రీనాతేలతో కూడిన ప్రతినిధి బృందం కలిసి ప్రధానిపై ఫిర్యాదు చేసింది . అలాగే బిజెపికి వ్యతిరకంగా 16 ఫిర్యాదులతో కూడిన వినతిపత్రాలను ఎన్నికల కమిషన్‌కు కాంగ్రెస్ ప్రతినిధి బృందం సమర్పించింది. ప్రధాని ఎన్నికల ప్రవర్తనా నియమావళిని, ఎన్నికల సంఘం మార్గదర్శకాలను ఉల్లంఘించారని ఇసికి తెలియజేసింది. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని బాహాటంగా ఉల్లంఘించినందుకు ప్రధానిని జవాబుదారీ చేయాలని, అలాగే ఎన్నికల్లో ఆయన , ఆయన పార్టీ చేస్తున్న తప్పులను పరిశీలించాలని కోరింది. ఈ అంశంలో ఎన్నికల సంఘం నిష్క్రియాపరత్వం , దాని ప్రతిష్ఠను కోల్పోయేలా చేస్తుందని, తక్షణమే అధికార పార్టీపై చర్య తీసుకోవాలని కోరింది. ప్రతిపక్షాలపై తప్పుడు, పరువునష్టం కలిగించేలా మోదీ ఆరోపణలు చేస్తున్నారని, ఓట్ల కోసం మతాన్ని వాడుతున్నారని ఆరోపించింది. భారత స్వాతంత్ర సంగ్రామానికి నేతృత్వం వహించిన ప్రస్తుత ప్రధాన ప్రతిపక్షంమైన కాంగ్రెస్ పార్టీ ఉగ్రవాదులు, ఉగ్రవాదానికి మద్దతు ఇస్తున్నట్లుగా తప్పుడు ఆరోపణలు చేస్తూ ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొంది. ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైన తరువాత యుజిసి నియామకాలు చేపట్టడంపై కూడా చర్యలు తీసుకోవాలని ఇసిని కాంగ్రెస్ కోరింది.

మోదీకి మ్యానిఫెస్టోను ఖర్గే బోధిస్తారు: కె.సి.వేణుగోపాల్

కాంగ్రెస్ ఎన్నికల హామీ పత్రం గురించి బోధించేందుకు ప్రధాని మోదీ అపాయింట్‌మెంట్‌ను ఎఐసిసి అధ్యక్షులు మల్లిఖార్జున ఖర్గే కోరారని ఎఐసిసి ప్రధాన కార్యదర్శి కె.సి.వేణుగోపాల్ వెల్లడించారు. అలాగే కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టో కాపీలను ప్రధాని మోదీకి దేశవ్యాప్తంగా కార్యకర్తలు, లోక్‌సభ అభ్యర్థులు పంపనున్నట్లు తెలిపారు. కొచ్చిలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ప్రజల సంపదను ముస్లింలకు పునఃపంపిణీ చేస్తుందని వ్యాఖ్యలపై మోదీకి వ్యతిరేకంగా ఎన్నికల కమిషన్‌కు లక్ష మంది సంతకాలతో ఫిర్యాదు చేస్తామని తెలిపారు. మోదీ వ్యాఖ్యలు ప్రధాని హోదాకు తగినవి కావని, ప్రధాని ప్రతి అంశంపై అబద్ధాలు చెబుతారని, బూటకపు వార్తలను ఎలా వ్యాప్తి చేస్తారని ప్రశ్నించారు. తమ మ్యానిఫెస్టోలో లేని అంశం గురించి ప్రధాని ప్రస్తావించి, ఎన్నికలలో లబ్ది పొందేందుకు మతపరమైన విభజన సృష్టించే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు.

సుప్రీం సూమోటోగా తీసుకోవాలి
(మొదటి పేజీ తరువాయి)

ఘటనను సుప్రీంకోర్టు సూమోటోగా స్వీకరించి, విద్వేష ప్రసంగాలపై మోదీకి కోర్టు ధిక్కరణ నోటీసు ఇస్తుందని, కఠిన చర్యలు తీసుకుంటుందని ఏచూరి ఆశాభావం వ్యక్తం చేశారు.

ఇసికి ప్రజలు లేఖలు రాయాలి

మోదీ వ్యాఖ్యలపై ఎన్నికల కమిషన్‌కు ప్రజలు లేఖలు రాయాలని తృణమూల్ కాంగ్రెస్ నేత, రాజ్యసభ సభ్యులు సాకేత్ గోఖలే విజ్ఞప్తి చేశారు. తన 'ఎక్స్ ' ఖాతాలో ప్రధాన ఎన్నికల కమిషనర్ ఈ మెయిల్ ఐడిని పోస్ట్ చేశారు. ప్రతిపక్షాల మాటను ఎన్నికల కమిషన్ ఖాతరు చేయడం లేదని, ఏమైనా చేసేందుకు మోదీకి,బిజెపికి ఫ్రీ పాస్ ఇచ్చిందని ఎద్దేవా చేశారు. ఎన్నికల సమయంలో రాజకీయ పార్టీలకు ఎన్నికల కమిషన్ జవాబుదారీ కాదని, కానీ,భారత ప్రజలకు జవాబుదారీ అని పేర్కొన్నారు. కాబట్టి మోదీ వ్యాఖ్యలపై చర్యలు తీసుకోవాల్సిందిగా ప్రజలే ఎన్నికల కమిషన్‌కు తక్కువ పదాలతో ఈ మెయిల్ చేయాలని కోరారు.

పోలింగ్	ఏప్రిల్ 19	ఏప్రిల్ 26	మే 7	మే 13	మే 20	మే 25	జూన్ 1	ఓట్ల లెక్కింపు
సీట్లు	102	89	94	96	49	57	57	జూన్ 4

మహారాష్ట్రలో మారిన సమీకరణలు

గత లోక్‌సభ ఎన్నికలతో పోలిస్తే, ఈసారి మహారాష్ట్ర రాజకీయ ముఖచిత్రం మారింది. సమీకరణాలు కూడా మారాయి. రాష్ట్రంలోని రెండు ప్రధాన పార్టీలు, నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ(ఎన్‌సిపి), శివసేన రెండుగా చీలిపోయాయి. ఫలితంగా పార్టీల మధ్యనేగాక, ఒకే పార్టీకి చెందిన వర్గాల మధ్య కూడా ఆధిపత్య పోరు తప్పడం లేదు. గతంలో మత ప్రధాన పార్టీలు, లౌకిక పార్టీలు ఢీకొనేవి. కానీ, ఈసారి చిత్రమైన మార్పులు చోటు చేసుకున్నాయి. ఎవరూ ఊహించని రీతిలో కాంగ్రెస్, ఉద్ధవ్ థాక్రే నేతృత్వంలోని శివసేన (యుబిటి), శరద్ పవార్ నేతృత్వంలోని ఎన్‌సిపి (ఎస్‌పి) ఒక కూటమిగా ఏర్పడ్డాయి. రాష్ట్రంలో బిజెపి, శివసేన ఏక్‌నాథ్ షిండే వర్గం కూటమి అధికారంలో ఉండగా, లోక్‌సభ ఎన్నికల్లో ఎవరిది పై చేయి అవుతుందనేది ఆసక్తి రేపుతున్నది.

నిజానికి లౌకిక వాదానికి కట్టుబడడమేగాక, బిజెపి మత వాదాన్ని తీవ్రంగా విమర్శించే కాంగ్రెస్‌కు శివసేన (యుబిటి)తో పొత్తును ఎవరూ జీర్ణించుకోలేక పోతున్నారు.

బిజెపిని నిలువరించాలన్న ఏకైక లక్ష్యం తప్ప, ఇతర త్రా అంశాలేవీ ఈ పొత్తును సమర్థించవు. షిండే వర్గంలోకి తన వర్గం ఎంఎల్‌ఎలు వలస వెళ్లడంతో దిగాలు పడిన ఉద్ధవ్ ఇప్పుడు పాత శత్రువు (కాంగ్రెస్)తో చేతులు కలిపి, శత్రువుగా మారిన పాత మిత్రుడు (బిజెపి)తో యుద్ధానికి సిద్ధమయ్యారు. ఇది అసంభవమైన కూటమి. ఏ రకంగా చూసినా, సరిపడని పొత్తులు. కానీ, బిజెపి భయం ఈ పార్టీలను ఒకే తాటిపైకి తీసుకొచ్చింది. ఈ కలయిక కాంగ్రెస్, శివసేన (యుబిటి)కి ఎంతవరకు మేలు చేస్తుందో చూడాలి.

ఓటు వేసే విధానం..

ఓటరు పోలింగ్ బూత్‌కు వెళ్లి, తన వంతు వచ్చే వరకూ వేచిచూడాలి. అనంతరం, మొదటి పోలింగ్ అధికారి ఓటరు జాబితాలో మీ పేరును తనిఖీ చేసి, మీ ఐడి రుజువును తనిఖీ చేస్తారు. రెండవ పోలింగ్ అధికారి మీ వేలికి సిరా వేసి, స్లిప్ ఇచ్చి, రిజిస్టర్ (ఫారం 17 ఎ)లో మీ సంతకాన్ని తీసుకుంటారు. మీరు మూడవ పోలింగ్ అధికారి వద్ద స్లిప్పు డిపాజిట్ చేసి, మీ సిరా వేసిన వేలిని చూపించి, ఆపై పోలింగ్ ఓటు వేసే స్థానానికి వెళ్లాలి. అక్కడ ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషిన్ (ఇవిఎం)లో మీకు నచ్చిన అభ్యర్థి గుర్తుకు ఎదురుగా ఉన్న బ్యాలెట్ బటన్‌ను నొక్కడం ద్వారా మీ ఓటును రికార్డ్ చేయచ్చు. బీప్ శబ్దం వినిపిస్తే, మీ ఓటు నమోదైనట్టే.

అనంతరం వివిప్యాట్‌లో, పారదర్శక విండోలో కనిపించే స్లిప్‌ను తనిఖీ చేయండి. సీల్ చేసిన వివిప్యాట్ బాక్స్‌లో పడే ముందు అభ్యర్థి క్రమ సంఖ్య, పేరు, గుర్తుతో కూడిన స్లిప్ 7 సెకన్ల పాటు కనిపిస్తుంది. ఆలోగా మీ ఓటు అనుకున్న వారికే పడిందో లేదో సరి చూసుకోవచ్చు. ఒకవేళ పోటీలో ఉన్న ఏ ఒక్క అభ్యర్థినీ మీరు ఇష్టపడకపోతే, నోటా (నన్ ఆఫ్ ది ఎబౌ/పైవేవీ కావు) మీటను నొక్కవచ్చు. తొలిసారి ఓటు వేస్తున్న యువతీయువకులకు మరింత సమాచారం ఓటర్ గైడ్‌లో లభిస్తుంది.

నిబంధనలు ప్రధానికి వర్తించవా?

ఎన్నికల నిబంధనలు ప్రధాని నరేంద్ర మోదీకి వర్తించవా? భారత ఎన్నికల కమిషన్ (ఇసిఐ)కి స్వతంత్ర ప్రతిపత్తి ఉందా? లేక కేంద్ర ప్రభుత్వం కనుసన్నల్లోనే నిర్ణయాలు తీసుకుంటుందా? తాజా పరిస్థితులను గమనిస్తే ఈ అనుమానాలు కలగక మానదు. 'జై భవానీ', 'హిందూ' వంటి పదాలను వాడవద్దని ఇసిఐ ఇటీవలే శివసేన (యుబిటి) నాయకుడు ఉద్ధవ్ థాక్రేకు నోటీసు పంపింది. ఆయన ఆ సూచనను తిరస్కరించారు. మహారాష్ట్రలో, శివసేన నుంచి విడిపోయిన ఏక్‌నాథ్ షిండే వర్గం, బిజెపితో కలిసి అధికారాన్ని పంచుకుంటున్న విషయం తెలిసిందే. ఉద్ధవ్‌కు ఆగమేఘాలపైన ఇసిఐ ఎందుకు నోటీసులు పంపిందో ఊహించడం కష్టం కాదు. కాగా, రాజస్థాన్‌లో ఆదివారం జరిగిన ఎన్నికల ర్యాలీలో పాల్గొన్న మోదీ ముస్లింలను లక్ష్యంగా చేసుకొని వివాదాస్ప వ్యాఖ్యలు చేశారు. అయినప్పటికీ, ఇసిఐ ఆయనకు నోటీసులు పంపలేదు. ఉద్ధవ్ మాట్లాటల్లో విద్వేషాన్ని రెచ్చగొట్టే పదాలు ఉన్నాయని గుర్తించిన ఇసిఐకి, ప్రధాని ప్రసంగంలో ఎలాంటి తప్పులు కనిపించ లేదా? గుజరాత్ ముఖ్యమంత్రిగా వ్యవహరించినప్పుడు, కరడుగట్టిన హిందుత్వవాది ముద్ర వేయించుకున్న మోదీ ఇప్పుడు మరోసారి అదే అవతారాన్ని ఎత్తుతున్నట్టు ఆయన భాష స్పష్టం చేస్తున్నది. దేశ సంపదను ముస్లింలకు కట్టబెట్టడానికి కాంగ్రెస్ ప్రయత్నిస్తున్నదని ఆరోపిస్తూ, మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ పేరును వివాదంలోకి లాగారు. భారతదేశ వనరులపై మొదటి హక్కు ఎస్‌సిలు, ఎస్‌టిలు, మైనారిటీలు వంటి అట్టడుగు వర్గాలకు చెందుతుందని మన్మోహన్ సింగ్ ఒక ప్రసంగంలవో చేసిన వ్యాఖ్యల్లోని కొంత భాగాన్ని మాత్రమే మోదీ ఉదహరించారు. దేశ వనరులు ముస్లింలకు మాత్రమే చెందుతాయని మన్మోహన్ సింగ్ చెప్పినట్టు మోదీ పేర్కొన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ముస్లింలకు సంపదను ధారాదత్తం చేస్తారని అంటూ, పరోక్షంగా హిందువులను భయభ్రాంతులకు గురి చేశారు. ప్రతిపక్షాలకు వేసే ప్రతి ఓటు, హిందువులు సంపాదించిన సంపదను ఎక్కువ మంది పిల్లలున్న ముస్లింలకు, చొరబాటుదారులకు పంచడానికి ఉపయోగపడుతుందని అన్నారు. అంతటితో ఆగకుండా, హిందూ మహిళల మంగళసూత్రాలు సైతం ముస్లింలకు పంపిణీ చేస్తుందని కాంగ్రెస్‌పై విరుచుకుపడ్డారు. ఈ వ్యాఖ్యలు విద్వేషాన్ని రెచ్చగొట్టేవిగానూ, హిందువుల్లో అనవసరమైన భయాన్ని రెచ్చగొట్టి, మత విద్వేషాలు నింపేవిగాను ఉన్నాయి. 'ఎక్కువ మంది పిల్లలు ఉన్న' వర్గంగా ముస్లింలను అభివర్ణించడం ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించడమే. కానీ, ఇసిఐ మాత్రం మోదీ వ్యాఖ్యలపై ఇంత వరకూ స్పందించలేదు. ఈ అంశాన్ని లేవనెత్తినప్పుడు, ఇసిఐకి చెందిన ఒక ఉన్నతాధికారి స్పందిస్తూ, ఆ పదాలను తిరస్కరిస్తున్నట్టు చెప్పారు. కానీ, మోదీకి నోటీసులు జారీ చేయడంపై వివరణ ఇచ్చేందుకు నిరాకరించారు. రాజ్యాంగం ద్వారా స్వతంత్ర హోదాను పొందిన ఇసిఐ లాంటి సంస్థలను సైతం మోదీ ప్రభుత్వం నియంత్రిస్తూ, తనకు అనుకూలంగా వ్యవహరించేలా వాటిపై ఒత్తిడి తెస్తుందన దానికి ఇదో నిదర్శనం. సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో, ఇప్పటికైనా ప్రధానికి నోటీసులు పంపడం ద్వారా ఇసిఐ తన చిత్తశుద్ధిని చాటుకోవాలి. లేకపోతే, సార్వత్రిక ఎన్నికలు పారదర్శకంగా జరుగుతాయనిగానీ, ఇసిఐ వాటిని సజావుగా నిర్వహిస్తుందనిగానీ ప్రజలు నమ్మే అవకాశం ఉండదు.



ఫిర్యాదుల వెల్లువ

ఈసారి లోక్‌సభ ఎన్నికల్లో ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. కేరళలో ఎన్నికల ఉల్లంఘనపై ఎన్నికల కమిషన్‌కు దాదాపు లక్ష ఫిర్యాదులు అందాయి. రోజురోజుకూ ఈ సంఖ్య పెరుగుతున్నది. కేరళలో ఎన్నికల నిబంధనావళి ఉల్లంఘనకు సంబంధించి మొత్తం 2,09,661 ఫిర్యాదులు అందాయని, వాటిలో 2,06,152 ఫిర్యాదులపై చర్యలు తీసుకుంటున్నామని కేరళ ఎన్నికల అధికారి రెండు రోజుల క్రితం ప్రకటించారు. ఇప్పటికి ఫిర్యాదుల సంఖ్య మూడు లక్షలను చేరుకున్నా ఆశ్చర్యం లేదు. ఇక దేశం మొత్తంలో చూసుకుంటే, ఫిర్యాదులు ఎన్ని ఉంటాయో ఊహించుకోవచ్చు. ఇన్ని లక్షల ఫిర్యాదులపై ఎన్నికల సంఘం చర్యలు తీసుకునే మాట ఎలావున్నా... వాటిని పరిశీలించడమైనా సాధ్యమా అనే అనుమానం కలగక మానదు. వీటిలో ఎన్ని నిజమైనవో, ఎన్ని ఉద్దేశపూర్వకంగా చేసినవో గుర్తించడం కూడా కష్టమే.

ఈనెల 19న మొదటి విడత పోలింగ్ పూర్తికాగా, మరో ఆరు అధ్యాయాలు మిగిలే ఉన్నాయి. 2వ దశ ఎన్నికలు ఈనెల 26న, 12 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో జరుగుతాయి. మూడో విడత ఎన్నికలు మే 7న, 12 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఉంటాయి. మే 13న నాలుగో దశలో, పది రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో పోలింగ్ జరుగుతుంది. అదే విధంగా ఎనిమిది రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో మే 20న ఐదో విడత పోలింగ్ ఉంటుంది. ఆరో దశ మే 25న, ఏడు రాష్ట్రా లు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో, చివరిదైన ఏడో దశ ఎన్నికలు జూన్ ఒకటిన, ఎనిమిది రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఉంటాయి. అలాగే, సిక్కిం, అరుణాచల్ ప్రదేశ్ అసెంబ్లీలకు ఈనెల 19న పోలింగ్ పూర్తయిన విషయం తెలిసిందే. ఆంధ్రప్రదేశ్‌లో మే 13న, ఒడిశాలో మే 13న అసెంబ్లీ ఎన్నికలు జరగాల్సి ఉంది. కండబలం, ధన ప్రభావం, తప్పుడు సమాచారం వ్యాప్తి చేయడం, నిష్పక్షపాతంగా జరిగే ఎన్నికలను ప్రభావితం చేసే మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ ఉల్లంఘన వంటి అంశాలపై ఫిర్యాదులు వస్తున్నట్టు ఎన్నికల సంఘం వర్గాలు అంటున్నా యి. ఈ ఎన్నికల్లో దాదాపు 97 కోట్ల మంది ప్రజలు ఓటు వేయడానికి అర్హులు. 85 ఏళ్లు పైబడిన ఓటర్లు తమ ఇళ్ల నుంచే ఓటు వేసేందుకు అనుమతిస్తారు. అన్ని పోలింగ్ బూత్‌లలో తాగునీరు, మరుగుదొడ్లు వంటి మౌలిక వసతులు కల్పిస్తారు. ప్రస్తుత లోక్‌సభ పదవీకాలం జూన్16తో ముగుస్తుంది, దానికి ముందు కొత్త సభను ఏర్పాటు చేయాలి. నాలుగు రాష్ట్రాల అసెంబ్లీల గడువు కూడా జూన్‌తో ముగుస్తుంది. ఏదిఏమైనా గతంలో ఎన్నడూ లేనంత, సుదీర్ఘమైన ఈ ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యేలోగా వచ్చిపడే ఫిర్యాదులు ఎన్ని లక్షలకు చేరుకుంటాయో!

కరీంనగర్ కాంగ్రెస్‌లో అయోమయం!

ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి: కరీంనగర్ లోక్‌సభ అభ్యర్థిగా కాంగ్రెస్ టికెట్ ఆశిస్తున్న వెలిచాల రాజేందర్ రావు సోమవారం అట్టహాసంగా నామినేషన్ దాఖలు చేశారు. కాంగ్రెస్ అధిష్ఠానం ఇప్పటివరకు అధికారికంగా కరీంనగర్ ఎంపి అభ్యర్థిని ప్రకటించకపోయినప్పటికీ వెలిచాల రాజేందర్ రావు పార్లమెంటు పరిధిలోని ఏడు నియోజకవర్గాల నుంచి భారీగా తరలివచ్చిన నాయకులు, కార్యకర్తలతో హంగు ఆర్భాటాలతో నామినేషన్ వేశారు. కాగా మరో వైపు టికెట్ ఆశిస్తున్న హుస్నాబాద్ మాజీ ఎంఎల్‌ఎ అల్గిరెడ్డి ప్రవీణ్ రెడ్డి సైతం ఈ నెల 25న కరీంనగర్ లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థిగా నామినేషన్ వేసేందుకు సిద్ధమవుతున్నారని విశ్వసనీయ సమాచారం. కాంగ్రెస్ హుజురాబాద్ నియోజకవర్గ ఇంచార్జి ఒడితెల ప్రణవ్, సిరిసిల్ల నియోజకవర్గ ఇంచార్జి కెకె మహేందర్ రెడ్డి, కరీంనగర్ నియోజకవర్గ ఇంచార్జి పురుమల్ల శ్రీనివాస్‌లు పాల్గొన్నారు. లోక్‌సభ ఎన్నికలను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న సిఎం రేవంత్‌రెడ్డి పార్టీ అభ్యర్థుల నామినేషన్ల కార్యక్రమాలకు సైతం స్వయంగా హాజరవుతున్న విషయం తెలిసిందే. ప్రస్తుతం అసెంబ్లీ ఊపులో గెలిచే అవకాశాలునప్పటికీ అభ్యర్థి ప్రకటనపై మీనమేషాలు అధిష్టానం వేస్తుండడంపై గందరగోళం నెలకొంది. ఉత్తర తెలంగాణలో కరీంనగర్ లోక్‌సభ స్థానం ఎంతో ప్రత్యేకమైనది. రాష్ట్ర రాజకీయాలను ప్రభావితం చేయగలిగిన ఈ స్థానం నుంచి పార్టీ అభ్యర్థినే ఇప్పటి వరకు ఎంపిక చేయకపోవడం ఆసక్తికరమైన పరిణామం కాగా అభ్యర్థి నామినేషన్ ప్రక్రియలో ముఖ్యమంత్రి పాల్గొనకపోవడం పలు సందేహాలను రేకెత్తిస్తోంది. హుస్నాబాద్ మాజీ ఎంఎల్‌ఎ అల్గిరెడ్డి ప్రవీణ్ రెడ్డి గత అసెంబ్లీ ఎన్నికల్లో తన సీటును త్యాగం చేసినందుకుగాను ఆయనకు అధిష్టానం ఉన్నత స్థానం ఇస్తామని సిఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చా రు. అనూహ్యంగా వెలిచాల రాజేందర్‌రావుకు మంత్రి పొన్నంతో సహా ముగ్గురు ఎంఎల్‌ఎలు, నియోజకవర్గ ఇన్‌ఛార్జిలు మద్దతు తెలపడంతో అభ్యర్థి ఎంపికపై జాప్యం చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికీ అభ్యర్థి ఖరారు కానీ పరిస్థితుల్లో పొన్నం ఎన్నికల దిశగా పార్టీ శ్రేణులను సమాయత్తం చేసేందుకు ఏడు నియోజకవర్గాల పరిధిలో సమావేశాల నిర్వహణ పూర్తి చేశారు. ఆ సమావేశాలకు తన వెంట వెలిచాల రాజేందర్ రావును వెంట తీసుకువెళ్లారు. కాగా సోమవారం నాటి నామినేషన్ కార్యక్రమానికి ఆయనే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ మొత్తం వ్యవహారంలో ఎక్కడా అలిగిరెడ్డి ప్రవీణ్ రెడ్డి కనిపించలేదు. కాంగ్రెస్‌లో అయోమయానికి అధిష్టానం తెరదించాల్సిన అవసరముందని కార్యకర్తలు అభిప్రాయపడుతున్నారు.

సోమవారం 13 నామినేషన్లు

ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి: కరీంనగర్ లోక్‌సభ స్థానానికి పోటీ చేసేందుకు 13 మంది సోమవారం నామినేషన్లను దాఖలు చేశారు. జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ పమేలా సత్పతికి తన ఛాంబర్‌లో నామినేషన్ పత్రాలను అందజేశారు. కాంగ్రెస్ ఎంపి సీటు ఆశిస్తున్న వెలిచాల రాజేందర్‌రావు నామినేషన్ దాఖలు చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్, వేములవాడ ఎంఎల్‌ఎ ఆది శ్రీనివాస్, మానకొండూర్, చొప్పదండి ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం పాల్గొన్నారు. మొత్తం నాలుగు సెట్ల నామినేషన్ పత్రాలను వెలిచాల రాజేందర్ రావు నాయకులతో కలిసి వేర్వేరు గా అందజేశారు. నామినేషన్లు దాఖలు చేసిన వారిలో చింత అనిల్ కుమార్ (పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండి యా), దేవునూరి శ్రీనివాస్ (ఇండిపెండెంట్), బంక రాజు(ఇండిపెండెంట్), అబ్బిడి బుచ్చిరెడ్డి (ఇండిపెండెంట్), తాళ్లపల్లి అరుణ (ఆధార్ పార్టీ), గట్టు రాణా ప్రతా ప్ (సోషలిస్టు పార్టీ ఆఫ్ ఇండియా), చిలువేరు శ్రీకాంత్ (ధర్మసమాజ్ పార్టీ), గవ్వల లక్ష్మి (ఇండిపెండెంట్), జింక శ్రీనివాస్ (ఇండిపెండెంట్), బరిగె గట్టయ్య యాదవ్ (ఇండిపెండెంట్), లింగంపల్లి శ్రీనివాస్ రెడ్డి (ఎంసిపిఐ), ఎండి జిషాన్ (ఇండిపెండెంట్)లు నామినేషన్లు దాఖలు చేశారు. మొత్తంగా ఇప్పటి వరకు 19 మంది నామినేషన్లు దాఖలు చేశారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను కెసిఆర్ ప్రభుత్వం అమలు చేయలేదు

కేంద్ర పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయెల్

ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి: కేంద్రం ప్రవేశపెట్టిన అనేక సంక్షేమ పథకాలను నాడు అధికారంలో ఉన్న కెసిఆర్ నేతృత్వంలోని బిఆర్‌ఎస్ ప్రభుత్వం అమలు చేయలేదని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయెల్ ఆరోపించారు. సోమవారం రంగారెడ్డి జిల్లా చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గం బిజెపి అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డి రాజేంద్రనగర్‌లోని తహసిల్దార్ కార్యాలయంలో నామినేషన్ వేసే కార్యక్రమానికి రాజ్యసభ సభ్యులు, బిజెపి ఒబిసి మోర్చా జాతీయ అధ్యక్షుడు కె.లక్ష్మణ్, కేంద్రమంత్రి పీయూష్ గోయెల్‌తో కలిసి కొండా విశ్వేశ్వర్ రెడ్డి నామినేషన్‌ను దాఖలు చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న కేంద్రమంత్రి పీయూష్ గోయెల్ మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం ప్రధాని నరేంద్ర మోదీ అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. ఇట్టి పథకాలను రాష్ట్రంలో అమలు చేయడంలో అప్పుడు తెలంగాణ రాష్ట్రంలో అధికారంలో ఉన్న కెసిఆర్ ప్రభుత్వం అమలు చేయలేదని గుర్తు చేశారు. 2030 నాటికి భారత్ ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించబోతోందని కేంద్రమంత్రి గోయెల్ ఆశాభావం వ్యక్తం చేశారు. నేడు జరగనున్న లోక్‌సభ ఎన్నికలు దేశ భవిష్యత్తును మార్చేఎన్నికలన్నారు. నరేంద్ర మోదీ మూడోసారి ప్రధాని మంత్రి కావడం ఖాయమని కేంద్రమంత్రి పీయూష్ గోయెల్ ధీమా వ్యక్తం చేశారు. ఈ సార్వత్రిక ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీకి ఎదురులేదన్నారు. ప్రతిపక్షాలు తమతమ సిద్ధాంతాలను పక్కనపెట్టి ఇండియా కూటమి పేరుతో ఏకమయ్యాయన్నారు. అయితే ఆ కూటమిలోని పార్టీలకు ఒకరంటే మరొకరికి పడదని పియూష్ గోయెల్ ఎద్దేవా చేశారు. రాహుల్ గాంధీ కేరళకు వెళ్లి విజయన్ ను, బెంగాల్ కు వెళ్లి మమతా బెనర్జీని విమర్శించడం ఇందుకు నిదర్శనమని కేంద్రమంత్రి పీయూష్ గోయెల్ చెప్పారు. ఇక దేశంలోని నిరుపేదలు, మహిళలు, వృద్ధులు, యువత సహా అన్ని వర్గాల ప్రజల కోసం నరేంద్ర మోదీ ప్రభుత్వం పని చేస్తోందని పియూష్ గోయెల్ తెలిపారు. మోదీ అనుసరించిన సమర్థవంతమైన విధానాలతో భారత దేశంలో పేదరికం తగ్గిందని ఆయన చెప్పారు. 2030నాటికి భారత్ ప్రపంచంలో మూడో అతి పెద్ద ఆర్థికవ్యవస్థగా అవతరించబోతోందని గోయెల్ ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం చేవెళ్ల పార్లమెంట్ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ ఎంతో అభిమానంతో తరలివచ్చిన కార్యకర్తలు, నాయకులు, ప్రజలను చూస్తుంటే తానే ఎంపిగా భారీ మెజార్టీతో గెలువబోతున్నాన ని ధీమా వ్యక్తం చేశారు. నియోజకవర్గంలోని అన్ని వర్గాల ప్రజలు తన గెలుపులో భాగం కాబోతున్నారని చెప్పారు. దేశంకోసం అహర్నిశలు పని చేస్తున్న నరేంద్ర మోదీని మరోసారి ప్రధానిని చేయడానికి చేవెళ్ల ప్రజలు సిద్ధంగా ఉన్నారని కొండా విశ్వేశ్వర్ రెడ్డి చెప్పారు. తాను ఎంపిగా విజయం సాధించిన వెంటనే కేంద్రప్రభుత్వం ద్వారా ప్రత్యేక నిధులను తీసుకొచ్చి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని కొండా విశ్వేశ్వర్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి అధికార ప్రతినిధి రాణి రుద్రమ దేవి, చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కెఎస్. రత్నం, కంటెస్టెడ్ ఎంఎల్‌ఎలు అందెల శ్రీరాములు, తూళ్ల వీరేందర్ గౌడ్, అందెల శ్రీరాములు యాదవ్, కొండా విశ్వేశ్వర్ రెడ్డి సతీమణి సంగీతా రెడ్డితో పాటు..నియోజక వర్గ వ్యాపితంగా ఉన్న బిజెపి నాయకులు, కార్యకర్తలు, కొండా విశ్వేశ్వర్ రెడ్డి అనుచరులు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పంటలకు మద్దతు ధర తీసుకొస్తాం

ఎన్నికల ప్రచారంలో బిఆర్‌ఎస్ అభ్యర్థి నామా



ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరి వల్ల తెలంగాణ రైతాంగం తీవ్రంగా నష్టపోతుందని ఖమ్మం పార్లమెంటు బిఆర్‌ఎస్ అభ్యర్థి నామ నాగేశ్వరరావు తెలిపారు. రైతన్నలకు అండగా నిలిచింది బిఆర్‌ఎస్ ప్రభుత్వం కేసిఆరేనని ఆయన తెలిపారు. సోమవారం ఖమ్మం నగరంలోని ఖమ్మం వ్యవసాయ మార్కెట్ యార్డును బిఆర్‌ఎస్ అభ్యర్థి నామ నాగేశ్వరరావు సందర్శించారు. అక్కడ ఉన్న రైతులు, హమాలీలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటేసి బిఆర్‌ఎస్‌ను గెలిపించాలని కోరారు.ఈ సందర్భంగా నామ నాగేశ్వరరావు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకు వచ్చిన కరువుతో సాగు, తాగు నీరు లేక రైతులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. రాష్ట్రంలో సాగు నీరు అందక పోవడంతో వరి పంట ఎండిపోయి రైతాంగం దిక్కుతోచని స్థితి ఎదురైందన్నారు. వెంటనే ప్రభుత్వం రైతులకు నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. పార్లమెంటులో మినిమం సపోర్ట్ ప్రైజ్ (ఎంఎస్‌పి) అమలు చేయాలని దానికి ప్రత్యేక చట్టం అమలు చేయాలని కేంద్రాని కోరిన స్పందించ లేదన్నారు. స్వామినాథన్ ఇచ్చిన సూచనలు కూడా అమలు చేయాలని కోరిన ఎటువంటి స్పందన లేదన్నారు. కాంగ్రెస్ ఓట్ల కోసమే వాగ్దానాలు చేస్తుందని నామ ఆరోపించారు. ఆరు గ్యారెంటీల పేరుతో ప్రజలను కాంగ్రెస్ పార్టీ మోసం చేసిందని ప్రజలు ఈ విషయాన్ని తెలుసుకోవాలన్నారు. తెలంగాణ ప్రయోజనాల కోసం పార్లమెంటులో గొంతెత్తి మాట్లాడేది ఒక్క బిఆర్‌ఎస్ ఎంపిలేనని తెలిపారు. రైతులు పండించిన ప్రతి పంటకు మద్దతు ధర కల్పించేలా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ దొరేపల్లి శ్వేత, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు చిన్ని కృష్ణారావు, మాటేటి నాగేశ్వర రావు, సతీష్, నరేష్, మెంతుల శ్రీశైలం, నవీన్, గునుగుంట్ల వాసు, తాళ్లూరి శ్రీనివాస్, చీకటి రాంబాబు, కృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మం నుండి పోటీకి రెడీ

ఎంపి రేణుకా చౌదరి

ప్రజాపక్షం / హైదరాబాద్ : తనను ఖమ్మం లోక్ సభ నియోజకవర్గం నుండి పోటీ చేయమని ఆదేశిస్తే సిద్ధంగా ఉన్నానని కాంగ్రెస్ రాజ్యసభ సభ్యురాలు రేణుకా చౌదరి అన్నారు. రాజ్యసభ నుండి ఎంపిగా ఉన్నప్పటికీ లోక్ సభకు పోటీ చేయమంటే చేస్తానని చెప్పారు. గాంధీభవన్‌లో సోమవారం నాడు మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఖమ్మంను పాలించడం వస్తే దేశాన్ని పాలించే అనుభవం వస్తుందన్నారు. మోదీ గ్యారంటీలకు వారెంటీ అయిపోయిందని,మోదీకి ఓటమి భయం పట్టుకున్నదన్నారు. మోదీ వ్యాఖ్యలపై ఎలాంటి శిక్ష వేస్తారో ఎన్నికల కమిషన్ చెప్పాలని అన్నారు. దేశ మహిళలను మోదీ అవమాన పరిచారని చెప్పారు.

వరంగల్‌లో కాంగ్రెస్, బిఆర్‌ఎస్ అభ్యర్థుల నామినేషన్లు



ప్రజాపక్షం/హన్మకొండ ప్రతినిధి : వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గానికి సోమవారం ప్రధా న పార్టీల అభ్యర్థులు తమ నామినేషన్లను దాఖలు చేశారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గా కడియం కావ్య జిల్లాకు చెందిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, నాయకుల తో కలిసి తొలి నామినేషన్ దాఖలు చేయగా బిఆర్‌ఎస్ అభ్యర్థి డాక్టర్ మారపెల్లి సుధీర్ కుమార్ ఆ పార్టీ నాయకులతో కలిసి ఒక సెట్ నామినేషన్‌ను దాఖలు చేశారు. వారు తమ నామినషన్ పత్రాలను వరంగల్ పార్లమెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్యకు అందజేశారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కడియం కావ్య తొలుత వరంగల్‌లోని భద్రకాళీ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసిన అనంతరం వరంగల్ జిల్లా కలెక్టర్ కార్యాలయానికి విచ్చేసి నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కడియం కావ్య వెంట ఎంఎల్‌ఎలు కడియం శ్రీహరి, నాయిని రాజేందర్ రెడ్డి, కెఆర్. నాగరాజు, గండ్ర సత్యనారాయణరావు, సీనియర్ నాయకులు దొమ్మాటి సాంబయ్య ఉన్నారు. అలాగే బిఆర్‌ఎస్ అభ్యర్థి డాక్టర్ మారపెల్లి సుధీర్ కుమార్ తొలుత హన్మకొండలోని ఏకశిలా పార్కు నుండి ర్యాలీగా విచ్చేసి నామినేషన్ దఖలు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రవు, ఎంఎల్‌సిలు డాక్టర్ బండా ప్రకాష్, బస్వరాజు సారయ్య, మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణా రెడ్డి పాల్గొన్నారు. వీరితో పాటు స్వతంత్ర్య అభ్యర్థులుగా మంద నరేష్, బొచ్చు రాజు, ఇసంపెల్లి వేణు,పొంగుల అశోక్,ధర్మసమాజ్ పార్టీ నుండి మేకల సుమన్ రెండో సెట్ నామినేషన్‌లు వేశారు.

ఎంపిగా గెలిపిస్తే అభివృద్ధి చేస్తా : కాంగ్రెస్ అభ్యర్థి కడియం

ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కడియం మాట్లాడుతూ తనను వరంగల్ ఎంపిగా గెలిపిస్తే నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధిచేసి చూపిస్తానని అన్నారు.

విద్య, ఉద్యోగ, ఉపాధి రంగాలలో అభివృద్ధికి కృషి చేస్తానని, ప్రజల ఆశలు, ఆకాంక్షలు నెరవేర్చుతానని చెప్పారు. రాష్ట్రానికి, జిల్లాకు మొండిచేయి చూపిన కేంద్రంలోని బిజెపికి, మోదీకి గుణపాఠం చెప్పాలంటే ఆ పార్టీని ఓడించాలని కోరారు.

ప్రజాపక్షం
మంగళవారం, ఏప్రిల్ 23

ప్రధాని ఇంత దిగజారాలా?

రాజకీయ ప్రత్యర్థులుగా ఉన్న పార్టీలు ఎన్నికల్లో పరస్పర ఆరోపణలు, నిందలు, దూషణలకు పాల్పడటం సహజం. కిందిస్థాయి నాయకుల వీధిభాషను పక్కనబెట్టినా ఉన్నత స్థాయి నాయకులనుంచి సంస్కారవంతమైన భాషను ఆశించుతాం. అయితే ప్రతిపక్షాలపై నిరంతరం నిందల నిప్పులు కురిపించే ప్రధాని నరేంద్రమోదీ మరీ సంయమనం కోల్పోయి ప్రదర్శిస్తున్న దిగజారుడుతనం, అబద్ధాల పరంపర అసహ్యంగా, జుగుప్సాకరంగా ఉంది. ఎన్నికల ఫలితాలపట్ల ఆయనలో ఏదో సందేహం పీడిస్తున్నట్లు భావించాల్సివస్తోంది. అందుకే ఎన్నికల నమూనా ప్రవర్తనా నియమావళిని కూడా అతిక్రమించి రాజస్థాన్లో మొన్నొక ఎన్నికల సభలో కాంగ్రెస్ పార్టీపై పచ్చి అబద్ధాలు, వక్రీకరణలతో కూడిన నిందారోపణలు చేశారు. సార్వత్రిక ఎన్నికల పోలింగ్ తొలిదశ (ఏప్రిల్ 19)పై మోదీ పెట్టుకున్న అత్యాశలకు ఎదురుదెబ్బ తగిలిందన్న అంచనాల నేపథ్యంలో ఆయన రెచ్చిపోయినట్లున్నారు. ఓట్లవర్షం కురిపిస్తాడనుకున్న అయోధ్య బాలరాముడు భక్తజనులను విరివిగా ఆకర్షిస్తున్నప్పటికీ, ఆ భక్తిరసం అతిగా ఓట్లలోకి మారలేదన్న అంచనాలు బిజెపికి ఆందోళన కలిగిస్తున్నాయి. పోలింగ్ తక్కువశాతం నమోదుకాగా బిజెపికి బలమైన ప్రాంతాల్లో మరీ తక్కువగా పోలుకావటం, తమ విభజనవాద రాజకీయ ప్రచారం ప్రజలను ఉత్సాహపరచలేదన్న అనుమానం కలిగినట్లుంది. అందుకే అదనపు అబద్ధాల పదును జోడించారు ప్రధాని మోదీ.

28 ప్రతిపక్ష పార్టీలు బిజెపి ప్రభుత్వాన్ని ఇంటికి పంపి రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని రక్షించుకుని, నియంతృత్వంనుండి దేశాన్ని కాపాడుకుందామని ప్రతిన బూనిన నాటినుండే బిజెపిలో కలవరపాటు ఆరంభమైంది. ఆ ప్రభావం ప్రజలకు చేరకుండా నిరోధించేందుకై 'ఇండియా' కూటమిని ఓ ప్రగతి నిరోధక, అవినీతికర, దేశ విచ్ఛిన్న కూటమిగా ప్రధాని ప్రభృతి నిందలు వేయసాగారు. ప్రజలెదుర్కొంటున్న నిత్యజీవిత సమస్యలు, నిరుద్యోగం, అధిక ధరలు వగైరాలను ఎన్నికల ఎజండాగా చర్చకు రానీయకుండా ఇతరేతర అంశాలవైపు దృష్టిమళ్లిస్తూ, తమకు అలవాటైన మత భావోద్రేకాల్లోకి ఓటర్లను నెట్టి పబ్బం గడుపుకునే ఎత్తుగడలు అనుసరిస్తున్నారు. నరేంద్రమోదీ తప్ప ఈ దేశానికి మరో మహా నాయకుడు లేనంతగా వ్యక్తిపూజ చేస్తూ, అన్నిచోట్ల ఆయనే అభ్యర్థిగా ఓట్లు అర్థిస్తున్నారు.

ఐదు న్యాయాల పేరుతో కాంగ్రెస్ పార్టీ కొత్తతరహా ఎన్నికల ప్రణాళిక ప్రకటించిన రోజే దానిపై ప్రధాని నరేంద్రమోదీ వ్యాఖ్య ఆయనలోని అసహనాన్ని బయటపెట్టింది. కాంగ్రెస్ ప్రణాళికలోని ''ప్రతి పేజీ భారతదేశాన్ని ముక్కలు చేయగోరుతున్నది. అది స్వాతంత్ర్య పోరాటకాలంలో ముస్లింలీగ్‌లో ఉన్న ఆలోచనను ప్రతిబింబిస్తున్నది. మిగిలిన భాగం వామపక్షాలు, 'అర్బన్ నక్సలైట్ల' భావాలతో నిండి ఉంది''. జాతీయోద్యమకాలంలో ముస్లింలీగ్ ఆర్‌ఎస్‌ఎస్‌కు మంచి మిత్రుడన్న వాస్తవాన్ని కాంగ్రెస్ గుర్తుచేస్తూ, తమ ఎన్నికల ప్రణాళికపై ముస్లింలీగ్ ఆలోచన ముద్రవేస్తూ మోదీ చేసిన వ్యాఖ్యపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసింది. ఆదివారంనాడు రాజస్థాన్‌లో గిరిజన మెజారిటీ ప్రాంతమైన భన్స్వారాలో ప్రధాని మోదీ ఎన్నికల ప్రసంగంలో హిందూ ఓట్లకై విద్వేషపూరితమైన ముస్లిం వ్యతిరేక ప్రసంగం చేశారు. దీనిపై కూడా ఇంకనూ ఎన్నికల కమిషన్ స్పందించలేదు. ప్రభుత్వంచే నియమించబడిన కమిషనర్లు తమ రాజ్యాంగ సంస్థ స్వతంత్రతను చాటిచెబుతారో, లేదో వేచిచూదాం.

ప్రధాని మోదీ గుజరాత్‌ను విడిచి భారతదేశ అధికార కేంద్ర స్థానంలోకి వచ్చి పదేళ్ల గడుస్తున్నా ఆయనలోని పచ్చి హిందూత్వవాది చెక్కుచెదరకుండా ఉన్నాడని ఆయన మొన్న రాజస్థాన్‌లో, సోమవారం అలీఘడ్‌లో చేసిన ప్రసంగాలు రుజువు చేస్తున్నాయి.

'కాంగ్రెస్ అధికారంలోకి వస్తే భారత ముస్లింలకు పంపిణీ చేయటానికి గిరిజనుల ఆస్తులు లాక్కొంటుంది' అన్నారు. ముస్లింలను 'చొరబాటుదారులు'గా, 'అధిక సంతానపరులు'గా ప్రస్తావించారు. తన వాదనకు బలం చేకూర్చేదిగా — ఎప్పుడో 2006లో నాటి ప్రధాని డాక్టర్ మన్మోహన్‌సింగ్ జాతీయాభివృద్ధి మండలిలో చేసిన ప్రసంగభాగాన్ని వక్రీకరించారు. కాంగ్రెస్ ప్రణాళికకు చేసిన వక్రభాష్యం ఇలా వుంది : 'మేము అధికారంలోకి వస్తే ప్రతి ఒక్క వ్యక్తి ఆస్తిని సర్వే చేస్తాం. మన సోదరీమణుల వద్ద ఉన్న బంగారం ఎంతో, ప్రభుత్వోద్యోగుల వద్ద ఉన్న ఆస్తులెంతో తనిఖీ చేస్తాం. మన సోదరీమణుల స్వర్ణాభరణాలను సమానంగా పంపిణీ చేస్తాం' అని చెప్పారంటూ 'మన ఆస్తిని తీసుకునే హక్కు ప్రభుత్వానికుందా?' అని మోదీ ప్రశ్నించారు. కాంగ్రెస్ హిందూ మహిళల 'మంగళసూత్రాలను' కూడా ముస్లింలకు పంపిణీ చేయవచ్చని మోదీ ఆరోపించారు.

తమ ప్రణాళికలో హిందూ–ముస్లింల ప్రస్తావన ఎక్కడుందో నిరూపించాలని కాంగ్రెస్ పార్టీ మోదీని సవాలు చేసింది. మన్మోహన్‌సింగ్ ప్రసంగానికి సంబంధించి, వనరుల పంపిణీలో ప్రభుత్వ ప్రాధాన్యతలను ఆయన ఇలా వివరించారు: వ్యవసాయం, ఇరిగేషన్, జల వనరులు, ఆరోగ్యం, విద్య, గ్రామీణ మౌలిక వసతులపై ఇతోధిక పెట్టుబడి, సాధారణ మౌలిక వసతులపై ప్రభుత్వ పెట్టుబడుల అవసరం మన ఉమ్మడి ప్రాధాన్యతలని భావిస్తాను. వాటితోపాటు ఎస్‌సిలు/ఎస్‌టిలు, ఇతర వెనుకబడిన తరగతులు, మైనారిటీలు, మహిళలు, బాలల ఉద్ధరణ కార్యక్రమాలు ప్రాధాన్యం వహిస్తాయి. ఎస్‌సి, ఎస్‌టిల ఉపప్రణాళికలను పునరుత్తేజపరచాలి. అభివృద్ధి ఫలాల్లో మైనారిటీలకు, ముఖ్యంగా ముస్లింలకు సమాన వాటా లభించే సరికొత్త ప్రణాళికలు మనం రూపొందించాలి. వనరులపై తొలి క్లెయింవారిదే.'' ఈ చివరి మాట పైన ప్రస్తావించిన అన్ని తరగతులకు ఉద్దేశించింది కాగా, ప్రధాని మోదీ దాన్ని ముస్లింలకు మాత్రమే వర్తింపజేసి తన వక్రబుద్ధి బయటపెట్టారు. మోదీ ఈ తప్పుడు ఆరోపణను 2006లో చేసినప్పుడు ప్రధానమంత్రి కార్యాలయం దాన్ని''ఉద్దేశపూర్వకమైన, దుర్బుద్ధితో కూడిన తప్పుడు భాష్యంగా'' ఖండించింది.

ఇద్దరు ప్రధానమంత్రుల మధ్య ఎంత తేడానో గమనించండి. ప్రతిపక్ష నాయకులకు తరచూ నోటీసులు పంపి సంజాయిషీ కోరే ఎన్నికల కమిషన్ మోదీ దుర్భాషలపై స్పందిస్తుందా? చర్య తీసుకుంటుందా?

ఆర్‌ఎస్‌ఎస్–బిజెపి రాజ్ నుంచి

దేశవిముక్తికి సిపిఐ పిలుపు

డి.రాజా
సిపిఐ ప్రధాన కార్యదర్శి

మన దేశానికి అత్యంత కీలకమైన సందర్భంలో 18వ లోక్‌సభకు ఎన్నికలు జరుగుతున్నాయి. మన రాజ్యాంగం, పార్లమెంటరీ ప్రజాస్వామ్యం మనుగడను మన దేశం ఏ విధంగా నిర్ణయిస్తుందన్న దానిపై ఎంతో ఆధారపడి ఉంది. పాలక భారతీయ జనతాపార్టీ సాధ్యమైన అన్ని మార్గాలు ఉపయోగించి దేశ ప్రజలపై వాగాడంబర, బోలు వాగ్దానాలు కుమ్మరిస్తున్నది. డబ్బు చేస్తున్న ఈ గోలలో అత్యంత ముఖ్యమైన అంశాలు కొన్ని మునిగిపోయే అవకాశముంది. గడచిన 10 సంవత్సరాలు ఏదైనా సూచన అయినట్లయితే, అధికారంలో బిజెపి కొనసాగటం మన రాజ్యాంగంలో పొందుపరిచిన ఉమ్మడి సంక్షేమం, సమానత, లౌకికతత్వం వంటి విలువలకు మరణశాసనం అవుతుంది. ఆర్థిక వ్యవస్థ నిర్వహణలో మోదీ ప్రభుత్వానిది ఘోరవైఫల్యం. ఆర్‌ఎస్‌ఎస్ ప్రోత్సహించిన ద్వేషం వల్ల మన సమాజానికి జరిగిన చేటు కూడా కనీవినీ ఎరుగనిది. మన ప్రజాస్వామ్యానికి, ఏ విలువలపై అయితే అది నిర్మాణం చేయబడిందో దానికి జరిగిన నష్టం కూడా అపారం. అయితే మోదీ దైవదూత పూర్వక నాయకత్వంలో భారతదేశం సూపర్ పవర్ అయిందని ప్రచారం చేయటానికి దూదూబసవన్న ప్రెస్, రాజీపడిన సంస్థలు ప్రయత్నిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఈ ఎన్నికలను మనం ప్రజల దృష్టినుండి, ముఖ్యంగా అణగారిన తరగతుల దృష్టినుండి, బిజెపి పాలనలో ఆకలి, నిరుద్యోగం వంటి అతితీవ్రమైన సమస్యల దృష్టినుండి చూడాలి.

ప్రస్తుత రాజకీయ వాతావరణం 'మోదీగారి గ్యారెంటీలు' అనే

మోదీ 2014 ఎన్నికలకు ముందు ఇచ్చిన వాగ్దానాలు కొన్నింటిని — ఉద్యోగాల కల్పన, రైతుల ఆదాయం రెట్టింపు, మహిళలకు భద్రత, ప్రతి బ్యాంక్ ఖాతాలోకి రూ.15లక్షలు జమ వంటి సమస్యల గూర్చి బిజెపి నాయకులు ఇప్పుడు చర్చించటం కూడా లేదు. జవాబుదారీతనం లేని నాయకుడు ఇష్టానుసారం ప్రకటించిన డీమానిటైజేషన్ వంటి 'మాస్టర్ స్ట్రోక్' అనేది దృష్టి మళ్లింపు ఎత్తుగడలు, తలాడించే మీడియా సహాయంతో మరిచిపోవటం జరిగింది.

పదబంధంతో పూర్తిగా నిండిఉంది. గతంలో ఇచ్చిన వాగ్దానాలు ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించటానికి సార్వత్రిక ఎన్నికలు ఒక సందర్భం. మోదీ గ్యారంటీలు ఓటు బ్యాంక్ రాజకీయాలు — పచ్చి అబద్ధాల మధ్య కొట్టుమిట్టాడుతున్నట్లు ప్రజలు చూస్తున్నారు. మోదీ 2014 ఎన్నికలకు ముందు ఇచ్చిన వాగ్దానాలు కొన్నింటిని — ఉద్యోగాల కల్పన, రైతుల ఆదాయం రెట్టింపు, మహిళలకు భద్రత, ప్రతి బ్యాంక్ ఖాతాలోకి రూ.15లక్షలు జమ వంటి సమస్యల గూర్చి బిజెపి నాయకులు ఇప్పుడు చర్చించటం కూడా లేదు. జవాబుదారీతనం లేని నాయకుని ఇష్టానుసారం ప్రకటించిన డీమానిటైజేషన్ వంటి 'మాస్టర్ స్ట్రోక్' అనేది దృష్టి మళ్లింపు ఎత్తుగడలు, తలాడించే మీడియా సహాయంతో మరిచిపోవటం జరిగింది. ఈనాడు దేశం ఎదుర్కొంటున్న తీవ్రమైన సమస్యలనుండి దృష్టి మరల్చటానికి ఆర్‌ఎస్‌ఎస్–బిజెపి ప్రచార వ్యవస్థ చేస్తున్న ప్రయత్నం సంభ్రమం గొలుపుతోంది. బిజెపి ప్రజలకు సేవచేసే బదులు వారిని దోచుకోవటంలో మునిగి ఉంది. మోదీ దుష్పరిపాలననుండి ప్రజలు బాధలు పడుతుండగా, ఆయన అందరికీ సౌభాగ్యం అనే తన వాగ్దానాలను తిరిగి విక్రయించే పనిలో ఉన్నారు. ఇదంతా 'వికసిత్ భారత్' అనే మంచు తెర వెనుక దాచబడుతున్నది. భారత్‌లో వాస్తవిక భాగస్వాములైన కార్మికులు, రైతులు, యువత, విద్యార్థులు ఒక పరిపూర్ణ దశాబ్దం పాటు అవకాశాలు కోల్పోయినందుకు విచారిస్తున్నారు.

ప్రధానమంత్రి మోదీ, ఆయన వందిమాగధులు ఐదు ట్రిలియన్ డాలర్ ఆర్థిక వ్యవస్థ అనే బోలు వాగ్దానాన్ని ఖాళీ డబ్బాలో గులకరాయిలా గలగలలాడిస్తున్నారు. ఆ ఆర్థిక వ్యవస్థ రూపం, స్వభావం గూర్చి వారెన్నడూ చర్చించరు. ఆ ఐదు ట్రిలియన్ డాలర్లలో సామాన్య ప్రజల వాటా ఎంత? లేక అదంతా కార్పొరేట్లకే చెందుతుందా, వారెన్నడూ చర్చించరు. వాస్తవానికి ఏ ఆర్థిక వ్యవస్థ బలమైనా దాని పౌరులు ఎలా లబ్ధిపొందుతారు, ప్రభుత్వం వారికి ఎటువంటి అవకాశాలు కలుగజేస్తుంది అనే దానిపై ఆధారపడి ఉంటుంది. వామపక్షం బలపరిచిన యుపిఎ మొదటి ప్రభుత్వంలో సామాజిక భద్రత పథకాలు పెద్ద ఎత్తున విస్తరించటాన్ని భారతదేశం చూసింది. అవి జనాభాలోని అన్ని తరగతులకు లబ్ధిచేకూర్చాయి; రాజ్యాంగం కింద లభ్యమయ్యే హక్కుల పరిధిని ఇతోధికంగా విస్తృతపరిచాయి. ఈ హక్కులు అనేకం. మహాత్మాగాంధి జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, 2005, కింద పనిహక్కు; సమాచార హక్కు చట్టం, 2005, కింద ప్రభుత్వ చర్యలను తెలుసుకునే హక్కు, షెడ్యూల్డు తెగలు, ఇతర సాంప్రదాయక అటవీ నివాసితుల చట్టం (అటవీ హక్కుల గుర్తింపు) 2006, చట్టం కింద అడవులపై గిరిజనులకు హక్కు కల్పించటం, విద్యాహక్కు చట్టం, 2009, కింద ఉచిత, నిర్బంధ విద్యకు హక్కు కల్పించి రాజ్యాంగంలోని ఆర్టికల్ 21–ఎని అమలు చేయటం వాటిలో ఉన్నాయి. ఈ పథకాలు ప్రతి గృహాన్ని చేరాయి . బలంగా పెరుగుతున్న సామాజిక రంగం ప్రాతిపదికపై భారతదేశం తన జనాభా పొందిక నుండి లబ్ధిపొందటానికి సిద్ధంగా

ప్రధానమంత్రి మోదీ, ఆయన వందిమాగధులు ఐదు ట్రిలియన్ డాలర్ ఆర్థిక వ్యవస్థ అనే బోలు వాగ్దానాన్ని ఖాళీ డబ్బాలో గులకరాయిలా గలగలలాడిస్తున్నారు. ఆ ఆర్థిక వ్యవస్థ రూపం, స్వభావం గూర్చి వారెన్నడూ చర్చించరు. ఆ ఐదు ట్రిలియన్ డాలర్లలో సామాన్య ప్రజల వాటా ఎంత? లేక అదంతా కార్పొరేట్లకే చెందుతుందా.

ఉంది. ప్రజలకోసం వారిపై పెట్టుబడి పెట్టటం, విద్య, పని, భద్రత, సమాచారం ద్వారా మరిన్ని అవకాశాలు కల్పించటం, వాటిని ఉపయోగించుకునేందుకు వీలు కల్పించటంపై దృష్టి కేంద్రీకరించబడింది. క్రియాశీలమైన ప్రజాస్వామ్యానికి ఈ ఉపపద్దులన్నీ కీలకమైనవి.

అధిక స్థాయి వాగాడంబరం ప్రదర్శిస్తున్న మోదీ ప్రభుత్వం ఈ కీలకమైన హక్కుల పరిధిని విస్తరించవచ్చు. కాని తద్విరుద్ధంగా వ్యవహరిస్తున్నది. మోదీ ప్రభుత్వం ఎంజినోరెగా కింద వేతనాలను గణనీయంగా పెంచలేదు. పనిదినాల పెంపుదల, వేతనాల పెంపు డిమాండ్‌లు చెవిటి చెవులకెక్కలేదు. సమాచార హక్కు చట్ట పెద్ద ఎదురుదెబ్బలకు గురైంది. ప్రభుత్వ జవాబుదారీతనానికి సంబంధించిన ఇబ్బందికరమైన సమాచారం వెల్లడించకుండా ముఖ్య సమాచార అధికారి హోదాను కుదించారు. గిరిజనుల వనరుల్లోకి పెద్దగా చొరబాట్లు జరిగాయి. వారికి సర్వసాధారణఃగా దక్కాల్సిన వాటిని కార్పొరేట్ దోపిడీకి అప్పగించారు. కార్పొరేట్ లాబీయింగ్ కారణంగా దట్టమైన అడవుల్లో మైనింగ్ అనుమతించారు. గిరిజనుల సంక్షేమానికి సంబంధించిన అన్ని రూల్సు రెగ్యులేషన్స్‌ను తుంగలోతొక్కారు. విద్యహక్కు పరిధి స్థిరంగా ఉండగా, దాని పరిధి కింద 14–18 వయో గ్రూపును పెంచాలని డిమాండ్ కొనసాగుతున్నది. భారీగా పెరుగుతున్న విద్య ప్రైవేటీకరణ, ప్రభుత్వ విద్యపట్ల

మోదీ ఎన్నికల విజయాలకు ప్రాతిపదిక మతం, కుల మార్గాల్లో ప్రజలను విభజించటం, బిజెపి యేతర రాజకీయ పార్టీల మధ్య కృత్రిమమైన విభేదాలు సృష్టించటం, మీడియాను నియంత్రించటం, స్వేచ్ఛగా సమాచార ప్రసారాన్ని నిలుపుచేయటం, ఎన్నికల బాండ్‌లనుంచి డబ్బు పోగుచేసుకోవటం, విమర్శించే గొంతుకలను నిరంకుశ చట్టాలతో, ఇ.డి. సిబిఐ వంటి కేంద్ర దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేయటం ద్వారా బెదిరింపులకు గురిచేయటం.

నిర్లక్ష్యం, పాఠ్య ప్రణాళికలో హేతురహితమైన మార్పులు వాటిన్నింటినీ కలిపిచూచినపుడు మన భావితరాలు వినాశకర పర్యవసానాలకు గురికానున్నాయి. 14–18 వయో గ్రూపులోని గ్రామీణ బాలల్లో అత్యధికులు 3వ తరగతి లెక్కలు చేయలేకపోతున్నారని, 25 శాతం మందికి పైగా చదవలేకపోతున్నారని విద్య ప్రతిపత్తిపై వార్షిక నివేదిక తెలుపుతున్నది. మోదీ ప్రభుత్వం మన దేశ భవిష్యత్‌ను బలిపెడుతూ కార్పొరేట్లకు ప్రాధాన్యత ఇస్తున్నది. అది మన ఆర్థిక వ్యవస్థ, మన ప్రజల పునాదులపై దెబ్బ తర్వాత దెబ్బ కొడుతున్నది.

మోదీకింద కార్పొరేట్లవైపు వినాశకరమైన మలుపువల్ల, నిరుద్యోగం గత 45 సంవత్సరాల్లో ఎన్నడూలేనంత స్థాయికి చేరింది. బిజెపిగాని లేదా ప్రధానమంత్రిగానీ దీనిగూర్చి నోరుమెదపరు. 'అచ్ఛేదిన్' లో ఏటా 2 కోట్ల ఉద్యోగాలకు గ్యారంటీ ఏమైంది? నిరుద్యోగుల్లో 83 శాతం యువత అని భారతదేశంపై నివేదికలో ఇంటర్నేషనల్ లేబర్ ఆర్గనైజేషన్ (ఐఎల్‌ఒ) నివేదిక తెలిపింది. బిజెపి తమ దుష్పరిపాలనవల్ల ఒక తరం ఆకాంక్షలను కాలికింద నలిపివేసింది; మతాన్ని ఉపయోగించి యువతను తప్పుదారి పట్టించటం కొనసాగిస్తున్నది.

బిజెపి పరిపాలనలో వంటగ్యాస్ ధర రెట్టింపునకు పైగా పెరిగింది. ఆహార ద్రవ్యోల్బణం (ధరల పెరుగుదల) సామాన్య ప్రజల జీవితాలను కఠినతరం చేస్తున్నది. మన శ్రమజీవుల్లో అత్యధికుల నిజవేతనాలు నిశ్చలంగా ఉన్నాయి. కాగా బిజెపి రామమందిరం, సిఎఎ వంటి అంశాలపై విభజన తేవటంపై కేంద్రీకరించే ప్రయత్నం చేస్తున్నది. బిజెపి అంతటి అవినీతి పార్టీ మరొకదాన్ని స్వతంత్ర భారతదేశం చూడలేదని రాజ్యాంగవిరుద్ధమైన ఎన్నికల బాండ్ల పథకం రుజువు చేసింది. రాజకీయ అవినీతిని చట్టబద్ధం చేసిన, వ్యవస్థీకృతం చేసిన ప్రధానమంత్రిగా మోదీ చరిత్రలో మిగిలిపోతారు. కార్పొరేట్లతో మోదీ అవినీతి వ్యవహారాలు, క్విడ్ ప్రోకో చర్యలు దేశంలో ఎటువంటి పరిస్థితిని సృష్టించాయంటే, దేశ యావత్ సంపదలో మన జనాభాలో అగ్రస్థానంలో ఉన్న 1 శాతం భారతీయుల వాటా బ్రిటీష్ పాలన కాలంలో కన్నా హెచ్చుగా ఉంది. ఈ నూతన గ్యారంటీలు మోదీ కొత్తగా సమానత్వ బోలుతనంతో కూర్చిన పదబంధం 'అమృత్ కాల్' అనే చెత్తబుట్ట చేరటం ఖాయం.

మోదీ ఎన్నికల విజయాలకు ప్రాతిపదిక మతం, కుల మార్గాల్లో ప్రజలను విభజించటం, బిజెపి యేతర రాజకీయ పార్టీల మధ్య కృత్రిమమైన విభేదాలు సృష్టించటం, మీడియాను నియంత్రించటం, స్వేచ్ఛగా సమాచార ప్రసారాన్ని నిలుపుచేయటం, ఎన్నికల బాండ్‌లనుంచి డబ్బు పోగుచేసుకోవటం, విమర్శించే గొంతుకలను నిరంకుశ చట్టాలతో, ఇ.డి. సిబిఐ వంటి కేంద్ర దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేయటం ద్వారా బెదిరింపులకు గురిచేయటం. రాజకీయాల్లో వంశపారంపర్యతకు, అవినీతి రాజకీయాలకు వ్యతిరేక ఛాంపియన్ కావటానికి మోదీ ప్రయత్నింస్తుండగా, బిజెపియే వంశపారంపర్యతకు నిలయం, అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎవరికైనా చక్కని ఆశ్రయం అవుతున్నది. బిజెపి మోదీలు తమ 'గ్యారంటీలు' అన్నింటి విషయంలో పూర్తిగా రాజీ పడుతున్నారు. మోదీ పాలనలో తమ పరిస్థితులు అంతకు మునుపటికన్నా దిగజారాయని ప్రజలు గుర్తిస్తున్నారు. నిరుద్యోగం, అసమానత, ఆరోగ్యం, విద్య, వేతనాలు, ఆహార భద్రత, గృహవసతి వగైరా తక్షణ సమస్యలపై ఈ ప్రజలను సమీకరించటం మనముందున్న కర్తవ్యం. ఈ సమస్యలపై ఐక్యంగా పోరాటం చేస్తున్న ప్రజలు — డబ్బు, కేంద్ర ఏజన్సీలు, ప్రాంతీయ విభజనలను ఉపయోగించిన

లౌకిక ప్రజాస్వామిక రిపబ్లిక్ పునాదులను మనం కాపాడుకోవాలంటే, ఆర్‌ఎస్‌ఎస్ — బిజెపిలను, వాటి ఏహ్యాకరమైన హిందూత్వ భావజాలాన్ని తప్పక ఓడించాలి. డాక్టర్ అంబేద్కర్ గారి జోస్యం లాంటి సలహా దేశంలో ప్రజాస్వామ్యయుత మనస్కులైన వారందరి చెవుల్లో గణగణ హెచ్చరిక గంటలు మోగించాలి.

తదుపరి కూడా మీకు విజయం సిద్ధించబోదని బిజెపికి పాఠం చెబుతారు

మన రాజ్యాంగానికి, అందులో పొందుపరిచిన ఆదర్శాలకు ఆర్‌ఎస్‌ఎస్ వారి హిందూత్వ భావన నుండి ఎదురవుతున్న ప్రత్యక్ష ప్రమాదం భవిష్యత్ ఈ ఎన్నికల్లో ఫలితాలపై ఆధారపడి ఉంటుది. హిందూత్వ అనేది ప్రజలను వారి మతం, కులం, లింగం ప్రాతిపదికపై వేరుపరిచే రాజకీయ భావజాలం. సమానత్వాన్ని మన రిపబ్లిక్‌కు పునాదిరాయిగా నెలకొల్పేందుకు స్వాతంత్ర్యోద్యమం పాటుపడగా, మతాలు, కులాలు, లింగాల నిమ్నోన్నతాలను సమాజాన్ని ఆదేశించే వ్యవస్థగా ఆర్‌ఎస్‌ఎస్ చూస్తున్నది. మన రాజ్యాంగంపట్ల వారి ద్వేషంలో దాపరికం లేదు.

బాబాసాహెబ్ అంబేద్కర్ రాజ్యాంగం పీఠికలో పొందుపరిచిన సమానత్వం, స్వేచ్ఛ, సౌభ్రాత్రం కోసం మనదేశం చేస్తున్న కృషికి గత దశాబ్దంలో ప్రధానమైన ఎదురుదెబ్బలు సంభవించాయి. హిందూత్వ ఏహ్యాకరమైన ప్రయాణం తన వాగాడంబరంతో మన దేశాన్ని మతాధిపత్య, రాచరిక పాలన కాలాల్లోకి — వెనక్కు నెట్టటానికి ప్రయత్నిస్తున్నది. మనం ఒక దేశం— ఒక పన్ను నుంచి ఒక మతం, ఒక భాష, ఒక పార్టీ, ఒక నాయకుడు దిశగా ప్రయాణిస్తున్నాం. ఈ వ్యక్తి పూజ పర్యవసానాలను భావితరాలు అనుభవిస్తాయి.

లౌకిక ప్రజాస్వామిక రిపబ్లిక్ పునాదులను మనం కాపాడుకోవాలంటే, ఆర్‌ఎస్‌ఎస్ — బిజెపిలను, వాటి ఏహ్యాకరమైన హిందూత్వ భావజాలాన్ని తప్పక ఓడించాలి. డాక్టర్ అంబేద్కర్‌గారి జోస్యం లాంటి సలహా దేశంలో ప్రజాస్వామ్యయుత మనస్కులైన వారందరి చెవుల్లో గణగణ హెచ్చరిక గంటలు మోగించాలి. రాజ్యాంగ నిర్ణాయక సభలో ఆయన ఇలా చెప్పారు : ''హిందూ రాజ్యం వాస్తవికమైనట్లయితే, అది నిస్సందేహంగా ఈ దేశానికి అతి పెద్ద దురదృష్టమవుతుంది.... అది ప్రజాస్వామ్యంతో పొసగదు. ఏ మూల్యమైనా చెల్లించుకుని హిందూరాజ్య స్థాపనను నిరోధించాలి''. మన దేశంలోని లౌకిక ప్రజాతంత్ర శక్తులందరి ముందున్న ప్రశ్న — ఎంతటి శ్రమదమాదులకోర్చి అయినా మన స్వాతంత్ర్యోద్యమ వారసత్వాన్ని కాపాడుకోవటానికి మనం సిద్ధంగా ఉన్నామా? బ్రిటిష్ రాజ్ నుండి మన దేశాన్ని విముక్తంగావించటానికి మన దేశ పురుషులు, స్త్రీలు, మత, కుల , భాష, ప్రాంతం విభజనను అధిగమించి ఐక్యంగా పోరాడారు. మన దేశాన్ని, దాని భవిష్యత్‌ను కాపాడుకునే నిమిత్తం ఆర్‌ఎస్‌ఎస్–బిజెపి రాజ్‌ను ఐక్యంగా ఓడించాల్సిన సమయం ఇప్పుడు అరుదెంచింది.

మేధకు పునాది పుస్తకం

పుస్తక పఠనాన్ని అలవాటు చేద్దాం

ఏప్రిల్ 23 ప్రపంచ పుస్తక దినోత్సవం

అద్భుతమైన మేధాశక్తిని పెంపొందించడానికి ఉన్న మార్గాల్లో అత్యంత విస్తారమైనది, కీలకమైనది పుస్తకం. శిలాఫలకాలు లేదా తాళపత్రాలు.. చర్మం దొంతరలు లేదా కాగితాలు.. పఠన మార్గాలు, వివిధ దశల్లో రూపాంతరం చెందుతూ చాలాకాలం పుస్తకాల రూపంలో స్థిరపడ్డాయి. డిజిటల్ యుగం ప్రారంభమైన తర్వాత, పలు రకాలు సామాజిక మాధ్యమాలు కూడా పాఠకులను అలరిస్తున్నాయి. అయితే, పుస్తకానికి ఉన్న విలువ పుస్తకానిదే. ఆ స్థానాన్ని భర్తీ చేయడం అసాధ్యం. ఏప్రిల్ 23వ తేదీన ప్రపంచ పుస్తక దినోత్సవం జరుపుకొంటున్న నేపథ్యంలో, వీటి ప్రయోజనాలను ఒకసారి సింహావలోకనం చేసుకోవడం అవసరం. పుస్తకం ఏకాగ్రతను పెంచుతుంది. ఒక విషయాన్ని అర్థం చేసుకోవడానికి తగినంత ఏకాగ్రత అవసరం. పుస్తకాల్లో ఉన్న విషయాలను ఆకళింపు చేసుకునేందుకు ఏకాగ్రత చాలా ముఖ్యం. డిజిటల్ ఏజ్‌లో ఒక ఇన్స్టారీల్‌ను లేదా యూట్యూబ్ షార్ట్స్‌ను కూడా పూర్తిగా చూడలేనంత అసహనం ప్రతి ఒక్కరిలో నెలకొంది. ముఖ్యంగా యువతలో ఈ పరిస్థితి మరింత స్పష్టంగా కనిపిస్తున్నది. ఒకదాని వెంట మరొకటిగా వెంటవెంటనే స్క్రోలింగ్ చేస్తూ, తదుపరి రీల్ కోసం వేటాడడం అందరికీ అనుభవమే. అయితే, పుస్తకం అలా కాదు. ప్రతి పేజీని అర్థం చేసుకోవాల్సి వస్తుంది. ఇది మన సహనం, ఏకాగ్రతలకు పని, మెదడుకు పదును పెడుతుంది. ఆయా అంశాల్లో మన సామర్థ్యాన్ని పెంచుతుంది.

భాష పై పట్టు కోల్పోవడం ఈ రోజుల్లో తరచుగా గమనిస్తున్న సమస్య. మాతృభాష తెలుగు పదాలు కూడా తెలియవని చెప్పడం ఫ్యాషన్ అయింది. తెలుగు, హిందీ, ఉర్దూ, ఇంగ్లీష్ ఇత్యాది భాషలను కలిపేసిన 'పైశాచిక భాష' ఇప్పుడు గొప్పగా చలామణి అవుతున్నది. ఇతర భాషలను నేర్చుకోవడంలో తప్పులేదు. ప్రస్తుత కాలంలో అనేకానేక అంశాల గురించి తెలుసుకోవడానికి అవసరం కూడా. కానీ, మాతృ భాషను మరచిపోవడం మాత్రం క్షంతవ్యం కాదు. ఎవరి మాతృ భాషపై వారు పట్టును పెంచుకోవడంతోపాటు, ఇతర భాషలపైనా అవగాహన కోసం పుస్తకాలు తోడ్పడతాయి. పుస్తక పఠనం వల్ల కొత్తకొత్త పదాలకు అర్థం తెలుస్తుంది. పద సంపద (vocabulary) పెరుగుతుంది. సంభాషణ నైపుణ్యం పదును తేలుతుంది. రాసే విధానం మారుతుంది. విభిన్న రచనా శైలి అలవడుతుంది. పుస్తక పఠనంతో ప్రాపంచిక విషయాలు తెలుస్తాయి. రచయిత తన జీవితకాలంలో నేర్చుకున్న పాఠాలు, సంపాదించుకున్న అనుభవాలు పుస్తకాల రూపంలో పాఠకులకు కొన్ని గంటలు లేదా రోజుల్లోనే తెలుస్తాయి. అంటే, ఒకరి జీవితం, పాఠకుడికి కొన్ని గంటల సమయం మాత్రమే. అంతేగాక, ఆయా పుస్తకాల ద్వారా సమకాలీన పరిస్థితులు మన ముందు ఆవిష్కృతమవుతాయి. నాటి సామాజిక, ఆర్థిక పరిస్థితులు, దేశాలు, ప్రాంతాల మధ్య ఘర్షణలు, నాగరికత, ప్రజలు ఎదుర్కొన్న సమస్యలు వంటి ఎన్నో విషయాలను సులభంగా తెలుసుకునే గొప్ప మార్గం పుస్తక పఠనం. అనేక అంశాలపై పట్టు పెరగడం వల్ల మేధస్సు పెరుగుతుం ది. ఆలోచనా శక్తి మెరుగవుతుంది. గొప్ప గొప్ప పుస్తకాలు ఎంతో మంది జీవితాలను మార్చేస్తుంటాయి.

జీవితంలో అనేక సవాళ్లను ఎదుర్కొన్న వారి గాథలు మనకు స్ఫూర్తినిస్తాయి. నిత్యజీవితంలో మనం చేసే పోరాటానికి ప్రాణవాయువుగా నిలుస్తాయి. సానుకూల ఆలోచనలతో ప్రేరణ ఇస్తాయి. బుక్ రీడింగ్ అనేది మనిషిలో ఒత్తిడిని మటుమాయం చేస్తుంది. జీవితంలో అనేక సవాళ్లను ఎదుర్కొనే క్రమంలో ఒత్తిడి ఏర్పడడం సహజం. అనేక వైఫల్యాలను చవిచూడాల్సి వస్తుంది. అలాంటి సమయంలో పుస్తక పఠనం అనే వ్యాపకం బాగా మేలు చేస్తుంది. ఒత్తిడి తగ్గిస్తుంది. ఫలితంగా గుండె కొట్టుకునే వేగం, రక్తపోటు కూడా తగ్గుతాయి. ఈకాలంలో అనేక విజయవంతమైన సినిమాలు, వెబ్‌సిరీస్లు ఒకప్పటి గొప్ప నవలలే. మనం స్క్రీన్ ముందు ఎక్కువ గడపడం వల్ల, పిల్లలు కూడా అదే పనిచేస్తారు. అదే విధంగా పుస్తకాలను చదవడం వ్యాపకంగా ఎంచుకుంటే, పిల్లలకు రోల్‌మోడల్‌గా నిలుస్తాం. వారికి కూడా పుస్తకాలను చదవడం అలవాటవుతుంది. ఒక మంచి పుస్తకం వారు పూర్తి చేయగలిగితే, ఈ అలవాటు పెరుగుతుందే తప్ప తరగదు. మన జీవితం వెలుపల జరిగే సంగతులు ఎన్నో మనకు పుస్తకాలు నేర్పుతాయి. రచయిత కోణంలో నుంచి వారి అనుభవాలను మనం పంచుకుంటాం. అంటే వారి అనుభవాన్ని మనం అనుభూతి చెందుతాం. ఇతరుల భావాలాను అర్థం చేసుకోగలగడం, వాటిని పంచుకోగలగడం ఎంపథీ. బుక్ రీడింగ్ వల్ల ఇది సాధ్యమవుతుంది. మన దృక్కోణం వెలుపలి ఆలోచనలను మనం గమనిస్తాం. ఇక, చాలా మంది నిద్రలేమితో బాధపడుతుంటారు. స్క్రీన్ ముందు అలా కూర్చుండిపోతారు. టివి, మొబైల్ నిద్రలేమి సమస్యలను మరింత పెంచుతాయి. కానీ పుస్తకాలు చదవడం వల్ల అలాంటి సమస్యలు ఉండవు. పైగా, మీ శరీరానికి ఒక సిగ్నల్ పంపినట్టు అనిపిస్తుం ది. ఫోన్ పక్కన పడేసి పుస్తకం తెరిస్తే నాలుగు మంచి విషయాలు తెలియడమే కాకుండా ఇది నిదురించే సమయం అని మీ మెదడుకు చెప్పకనే చెప్పినట్టు అవుతుంది. పైగా స్ట్రెస్ తగ్గించే అంశమైనందున మీరు నిద్రపోవడానికి ఉపయోగపడుతుంది. బుక్ రీడింగ్ మీలో గ్రహణ శక్తిని పెంచుతుంది. మీ మెదడును ఎప్పుడూ చురుగ్గా ఉంచే ఈ వ్యాపకం అల్జీమర్స్, డిమెన్షియా వంటి వ్యాధులను సమీపించకుండా చేస్తుంది. వృద్ధాప్యాన్ని ఆలస్యం చేస్తుంది. చాలామంది మానసికంగా ఇబ్బందిపడుతున్నప్పుడు ఒంటరితనాన్ని ఫీలవుతుంటారు. ఆ సమయంలో పుస్తకాలు వారికి మంచి నేస్తాలు. పుస్తక పఠనం వారి డిప్రెషన్ను ఇట్టే దూరం చేస్తుంది. వారి ఒంటరితనాన్ని దరిచేరనీయదు.

సెల్ఫ్ హెల్ప్ బుక్స్ అయితే మీ సమస్యను ఎదుర్కోవడానికి టిప్స్ కూడా అందిస్తాయి. అనేక కొత్త స్కిల్స్ నేర్చుకోవడం ద్వారా మీలో ఆత్మవిశ్వాసాన్ని పెంచుతాయి. ఎన్నో రకాలుగా ఉపయోగపడే పుస్తక పఠనాన్ని, ఇప్పటికే అలవాటు ఉన్నవారు మరింత ఉత్సాహంగా కొనసాగిస్తారని, కొత్తవారు ఈ రోజు నుంచి పుస్తకాలు చదవడం మొదలు పెడతారని ఆశిద్దాం.

కౌశిక్

లేఖలు

క్యాన్సర్ ఆసుపత్రిలో సౌకర్యాలు కరువు

హైదరాబాద్‌లోని ఎంఎన్‌జె క్యాన్సర్ హాస్పిటల్‌లో కొత్తగా నిర్మించిన నూతన బ్లాక్ (చిన్న పిల్లల వార్డు)లో కనీస తాగునీటి సౌకర్యం, మౌలిక సదుపాయాలు లేకపోవడంతో రోగులు, వైద్యులు ఇబ్బంది పడుతున్నారు. ముఖ్యంగా నూతనంగా నిర్మించిన బ్లాక్‌లో 200 మంది క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న చిన్నపిల్లలు ఉన్నారు. అందులో నీటి సౌకర్యంతో పాటు, తాగునీరు, కనీస మౌలిక సదుపాయాలు లేకపోవడంతో చిన్నపిల్లలు ఇక్కట్లు పడుతున్నారు. తక్షణం ఆరోగ్య శాఖ స్పందించి సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి.

పారుపల్లి అమర్ చంద్, ఖమ్మం

గాంజా నియంత్రణకు చర్యలు ఏవి?

విద్యార్థులు దారి తప్పుతున్నారు. దేశ భవిష్యత్‌కు బాటలు వేయాల్సిన రేపటి పౌరులు..మత్తుకు బానిసలవుతున్నారు. ఒకప్పుడు ఉన్నత వర్గాలకే పరిమితమైన దురలవాట్లు..నేడు పేద, మధ్య తరగతి వర్గాలకు విస్తరించడం ఆందోళన కల్గిస్తోంది. తెలంగాణ వ్యాప్తంగా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో సైతం విస్తరించడం ఆవేదన కలిగిస్తుంది. కొద్ది కాలం క్రితం జగిత్యాలలో వెలుగుచూసిన బాలిక ఉదంతం.. అందరినీ కలచి వేసింది. పిల్లలు చివరకు పంక్చర్ వేసే సొల్యూషన్ లిక్విడ్ వాసన పీల్చి మత్తులో తూగేందుకు అలవాటు పడ్డారంటే, పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవాలి. ప్రధానంగా ప్రభుత్వ విద్యా సంస్థల్లోని పేద విద్యార్థులు మత్తుకు బానిసలు కావడం తల్లిదండ్రుల్లో ఆందోళనకు దారి తీస్తోంది. దీని నివారణ సవాల్‌గా మారింది. హైదరాబాద్‌లో సైతం యథేచ్ఛగా గాంజా రవాణా, వినియోగం విచ్చలవిడిగా సాగుతున్నట్లు పోలీసుల విచారణలో వెల్లడవుతుంది. సాఫ్ట్‌వేర్, ఇతర ప్రయివేటు కంపెనీల్లో ఉద్యోగులు, స్టూడెంట్స్, నిరుద్యోగులు విచ్చలవిడిగా వినియోగిస్తున్నట్లు స్పష్టమైంది.

గాంజా వినియోగం వల్ల మానసికంగా, సామాజికంగా, ఆర్థికంగా నష్టపోతున్నారు. ఇది మెదడుపై తీవ్ర ప్రభావం చూపడం వల్ల మానసిక సంఘర్షణతో అనర్థాలు, నేరాలు చేసేలా చేస్తుందని నిపుణులు చెబుతున్నారు. ఇది వినియోగించిన వారిలో చిరాకు, విసుగు, కడుపునొప్పి, ఇతర సమస్యలు తలెత్తుతున్నట్లు స్పష్టమౌతుంది. 15–25 ఏళ్లలోపు యువతే ఎక్కువగా గంజాయికి అలవాటు పడుతున్నట్లు పరిశోధనలో వెల్లడైంది.

తెలంగాణ పోలీసు శాఖ అనేక నియంత్రణ చర్యలు తీసుకుంటున్నప్పటికీ, శక్తి సరిపోవడం లేదు. శాంతి భద్రతలు, నేరాల ఛేదన, బందోబస్తు..ఇలా వివిధ విభాగాల్లో బిజీగా ఉంటున్న పోలీసులు, గాంజా నియంత్రణపై పూర్తిస్థాయిలో దృష్టి సారించలేకపోతున్నారు. గాంజా వినియోగాన్ని అరికట్టేందుకు ఇప్పటికే పోలీసు శాఖ ఎబోన్ యూరిన్ కప్ యంత్రంతో పరీక్షలు నిర్వహించేందుకు శ్రీకారం చుట్టింది. పోలీసులకు తెలంగాణ యాంటీ నార్కొటిక్ బ్యూరో కిట్లను సమకూర్చింది.

ఆంధ్రా, ఒరిస్సా బార్డర్ (ఎఒబి)లో గంజాయి సాగు యథేచ్ఛగా సాగవుతున్నట్లు స్పష్టమౌతుంది. తెలంగాణలో పట్టుబడిన గంజాయి ఇక్కడి నుండే ట్రాన్స్‌పోర్ట్ అయినట్లు నిర్ధారించారు పోలీసులు. అయితే..క్షేత్ర స్థాయిలో విచారణ జరిపించి చర్యలు తీసుకునే అవకాశాలు తెలంగాణ ప్రభుత్వానికి లేకుండా పోయింది. కేంద్రప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించి, ప్రణాళికా బద్ధంగా ఐటిడిఎ, గవర్నర్ల ద్వారా అక్కడి గిరిజనులకు ప్రత్యామ్నాయ మార్గాలు చూపాల్సిన బాధ్యత ఉంది.

చిలగాని జనార్ధన్

కామ్రేడ్ రమేష్‌బాబు ఆశయ సాధనకు పునరంకితం కావాలి

సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పోటు ప్రసాద్

ప్రజాపక్షం / గరిడేపల్లి: సిపిఐ సీనియర్ నాయకులు, నిస్వార్థపరుడు, నీతికి, నిజాయితీకి మారు పేరు అమరజీవి కామ్రేడ్ పోటు రమేష్ బాబు ఆశయ సాధనకు మనందరం పునరంకితం కావాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పోటు ప్రసాద్ సిపిఐ కార్యకర్తలను కోరారు. సోమవారం మండలంలోని రంగాపురం గ్రామంలో కామ్రేడ్ పోటు రమేష్‌బాబు 12వ వర్ధంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాట యోధుల కుటుంబంలో జన్మించి వారి వారసుడిగా సమాజ మార్పు కోసం, సమసమాజ సాధనే ధ్యేయంగా విద్యార్థి దశ నుండే కళాశాలలో ఎఐఎస్ఎఫ్ నాయకుడిగా కామ్రేడ్ రమేష్‌బాబు విద్యార్థి ఉద్యమాలను నిర్వహించాడని, మండల సిపిఐ నాయకుడిగా ప్రజలు ఎదుర్కొంటున్న అంతకముందు రమేష్‌బాబు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా నాయకులు పోటు పూర్ణచంద్రరావు, పోటు పద్మ, పోటు కృష్ణ, పోటు సింధు, సిపిఐ గ్రామ కార్యదర్శి తిరగమల్ల కిరణ్,సిపిఐ మండల నాయకులు కట్టా అశోక్, వృకాస నాయకులు పగడాల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ తర్వాత సమాజసేవలో భాగంకావాలి

ప్రజాపక్షం/పెన్‌పహాడ్: ప్రభుత్వ ఉద్యోగులు ఉద్యోగ విరమణ అనంతరం సమాజసేవలో పాలుపంచుకోవాలని జిల్లా పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ ఎ శ్రీనయ్య అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జూనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న కరీముద్దీన్ ఉద్యోగ విరమణ సందర్భంగా ఆయనను పాఠశాల ప్రధానోపాధ్యాయులు రవితో పాటు ఉపాధ్యాయులు, బంధుమిత్రులు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరీముద్దీన్ సమాజ సేవలో పాలుపంచుకొని శేష జీవితాన్ని ఆనందంగా గడపాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అనంతారం క్లాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, ఉపాధ్యాయులు జమాల్ షరీఫ్, తదితరులు పాల్గొన్నారు.

అకాలవర్షాలతో అపారనష్టం

ప్రజాపక్షం/అడ్డగూడూరు: మండలంలో ఆదివారం రాత్రి ఈదురు గాలులు, ఉరుములు మెరుపులు, వడగండ్ల వానతో రైతులకు తీవ్రనష్టం వాటిల్లిందని రైతులు తెలిపారు. కంచనపెల్లి గ్రామంలో రైతు చేడే చంద్రయ్య ఏడు ఎకరాల్లో మామిడి తోటలో మామిడి కాయలు రాలి సుమారు రెండు లక్షలు నష్టం వాటిల్లిందని తెలిపారు. అలాగే బాషబోయిన లింగయ్య గేదే మృతి చెందినట్లు తెలిపారు. పలుగ్రామాల్లో ఐకేపీ, పిఏసిఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాలలో ధాన్యం తడిసిపోయింది. సంబంధించిన అధికారులు నష్టం పరిశీలించి రైతులకు ఆదుకోవాలని రైతులు వి జ్ఞప్తి చేస్తున్నారు.

వేసవి సెలవుల్లో తరగతులు నిర్వహించొద్దు

ప్రజాపక్షం/చిట్యాల: ఈ నెల 24 నుండి వేసవి సెలవులు ఉన్నందున మండలంలోని అన్ని ప్రైవేట్ పాఠశాలలు ఎలాంటి తరగతులు నిర్వహించ కూడదని మండల విద్యాశాఖాధికారి కూకుంట్ల నర్సింహ్మా ఒక ప్రకటనలో తెలియజేశారు. మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు ఈ నిబంధన వర్తిస్తుందని, ప్రత్యేక తరగతుల పేరుతో ఎలాంటి కార్యకలాపాలు చేపట్టకూడదని, నిభందనలు అతిక్రమిస్తే అట్టి పాఠశాలపై కఠినమైన చర్యలు తీసుకోవల్సి ఉంటుందని నర్సింహ్మా తెలిపారు.

తనిఖీల్లో రూ.15 లక్షలు స్వాధీనం

ప్రజాపక్షం / జమ్మికుంట: ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఒక వ్యక్తి దగ్గర రూ.50 వేల కంటే ఎక్కువగా ఉండకూడదని హుజురాబాద్ ఏసిపి శ్రీనివాస్ జి అన్నారు. ఈ సంధర్భంగా వారు మాట్లాడుతూ జమ్మికుంట పట్టణ సిఐ తన సిబ్బందితో గ్రేన్ మార్కెట్ రోడ్డులో వాహనాలు తనిఖీ నిర్వహిస్తుండగా మోతుకుంట గూడెం గ్రామానికి చెందిన పొనగంటి సురేష్ అనే వ్యక్తి వద్ద రూ.15 లక్షల రూపాయలు పట్టుకున్నట్లు తెలిపారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి అనుసరించి రూ.50 వేల రూపాయల కంటే ఎక్కువ కలిగి ఉండడంతో అట్టి నగదును సంబంధింత అధికారులకు అప్పగించడం జరిగిందన్నారు.

నారిమల్ల ప్రకాశం మృతి బాధాకరం

సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహారెడ్డి

ప్రజాపక్షం/డిండి: మండల పరిధిలోని కందుకూరు సిపిఐ గ్రామశాఖ సీనియర్ సభ్యులు నారిమల్ల ప్రకాశం మృతి బాధాకరమని ఆయన మృతి పార్టీకి కుటుంబానికి తీరనిలోటని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహారెడ్డి అన్నారు. సోమవారం కందుకూరు గ్రామంలో ప్రకాశం పార్థివదేహంపై సిపిఐ జండాను కప్పి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాడ సానుభూతి సంతాపం వ్యక్తం చేశారు. నివాళులర్పించినవారిలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బొడ్డుపల్లి వెంకటరమణ, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎండి.మైనోద్దీన్, రైతు సంఘం దేవరకొండ మండల కార్యదర్శి పల్లా రంగారెడ్డి, సిపిఐ మండల సహాయ కార్యదర్శి బొల్లె శైలేష్, నాయకులు కూన దానయ్య, ఇడమోని శ్రీను, కుంభం రాములు, అయోధ్య, లాలయ్య, గురువయ్య, బాబా తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో దంపతులు మృతి

ప్రజాపక్షం / వైరా: వైరా మండలం సోమవరం గ్రామానికి చెందిన సామినేని రాంబాబు కొడుకు కోడలు సామినేని నవీన్‌రాజా(29), సామినేని భార్గవి(24) రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. బంధువులు తెలిపిన వివరాల ప్రకారం హైదరాబాద్ నుండి కారులో విజయవాడ వెళుతున్న నవీన్‌రాజా, భార్గవి దంపతులు సూర్యాపేట జిల్లా మునగాల మండలం ముకుందపురం వద్ద ఆగివున్న కంటైనర్ క్రిందకు కారు దూసుకుపోవడంతో ఇద్దరు మృతి చెందారు. నవీన్‌రాజా, భార్గవి దంపతులకు పెళ్లి అయి రెండు సంవత్సరాలు అవుతుంది. నవీన్‌రాజా విజయవాడ శ్రీచైతన్య కాలేజీలో లెక్చరర్‌గా పనిచేస్తున్నాడు. హైదరాబాద్ నుండి విజయవాడుకు కాలేజీకి పోతుండగా ఈ ప్రమాదం జరిగింది. వారి కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

తడిసిన ధాన్యం కొనాలంటూ రైతులు రాస్తారోకో

ప్రజాపక్షం/నార్కట్ పల్లి : మండలం పరిధిలోని అమ్మనబోలు గ్రామంలో ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి ఐకెపి సెంటర్‌లో పోసిన ధాన్యం తడిసి ముద్దవడంతో ప్రభుత్వం కొనుగోలు చేయాలంటూ రైతులు రోడ్డు ఎక్కి రాస్తారోకో చేశారు. సోమవారం అమ్మానాబోలు మోత్కూర్ రోడ్డుపై తడిసిన ధాన్యంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తూ రోడ్డుపై బైటయించారు. నిన్న రాత్రి కురిసిన అకాల వర్షానికి కళ్ళంలో పోసిన వరి ధాన్యం తడిసి ముద్దాయిందని, వరద నీటికి వరి ధాన్యం కొట్టుకుపోవడంతో చేతికి వచ్చిన పంట ను నష్ట పోవడంతో రోడ్డు పై బైరాయించి ఆవేదన వ్యక్తం చేశారు.
స్పందించిన అధికారులు... క్షేత్ర స్థాయిలో ధాన్యమును పరిశీలించారు. అనంతరం ప్రభుత్వం కొనుగోలు చేసేలా చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళను విరమించారు.

లోక్‌సభకు ఎన్నికలు

సమర్థవంతంగా నిర్వహించాలి

సూర్యాపేట జిల్లా కలెక్టర్ ఎస్.వెంకట్రావ్

ప్రజాపక్షం / కోదాడ / సూర్యాపేట కలెక్టరేట్: జరగబోయే పార్లమెంట్ ఎన్నికలను పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఎస్.వెంకట్రావ్ అధికారులను ఆదేశించారు. సోమవారం పట్టణంలోని ఆర్‌డిఒ కార్యాలయంలో కోదాడ సెగ్మెంట్ సెక్టార్ అధికారులతో సమీక్షా సమావేశంలో మాట్లాడారు. సెక్టార్ అధికారులు తమకు కేటాయించబడిన పోలింగ్ బూత్‌లను పర్యవేక్షించాలన్నారు. పోలింగ్ బూత్‌లలో అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేయాలన్నారు. పోలింగ్ సిబ్బందికి ఓటర్లకు ఇబ్బం ది లేకుండా పోలింగ్ బూత్‌ల వద్ద ఏర్పాట్లను చేయాలన్నారు. ఎన్నికలు పూర్తయ్యే వరకు సిబ్బంది విధుల్లో ఉం డాలన్నారు. ఎన్నికల నిర్వహణపై కిందిస్థాయి అధికారులతో సమీక్షలు నిర్వహించాలన్నారు. బిఎల్‌ఒలను అప్రమత్తం చేస్తూ ఎన్నికలు సజావుగా జరిగే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. సమీక్షా సమావేశంలో ఆర్డీఒ సిహెచ్. సూర్యనారాయణ, జిల్లా ఎస్‌పి రాహుల్‌హెగ్డే, డిఎస్‌పి శ్రీధర్‌రెడ్డి, ఎస్‌ఎల్‌ఎమ్‌టి విప్పర్ల రమేష్ పాల్గొన్నారు.

సిఎంఆర్ బియ్యం బకాయిలున్న మిల్లులపై చట్టపరమైన చర్యలు

సిఎంఆర్ బియ్యం బకాయిలు ఉన్న మిల్లులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ ఎస్.వెంకట్రావ్ హెచ్చరించారు. సోమవారం మండలంలోని తమ్మరలోని శ్రీ ధనలక్ష్మీ పార్‌బాయిల్డ్ రైస్ మిల్లును కలెక్టర్ ఆ కస్మీకంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం నుండి పొందిన ధాన్యం మిల్లు చెల్లించి న సిఎంఆర్ బియ్యం దర్యాప్తు చేశారు. రైస్ మిల్లర్లు పెం డింగ్ లేకుండా సిఎంఆర్ బియ్యంను చెల్లించాలని ఆదేశించారు. అధికారులు ఎప్పటికప్పుడు మిల్లుల బియ్యం చెల్లింపులపై నిఘా ఉంచాలన్నారు. ఆర్డీవో సిహెచ్ సూర్యనారాయణ, రైస్‌మిల్లర్లు, రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు, రవాణా సక్రమంగా జరిగేలా చూడాలి

ధాన్యం కొనుగోలు, రవాణా, దిగుమతి సక్రమంగా జరిగేలా అధికారులు సమన్వయంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ ఎస్ వెంకట్రావ్ అన్నారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో మండల ప్రత్యేక అధికారులు, తహసీల్దార్, ఎంపిడిఒ, పౌరసరఫరా శాఖ అధికారులు, అనదనపు కలెక్టర్లు సిహెచ్ ప్రియాంక, బిఎస్ లత లతో వెబ్ ఎక్స్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల ప్రత్యేక అధికారులు సమన్వయంతో పని చేయాలని ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద ఫోటోలకు మాత్రమే ప్రాధాన్యత ఇవ్వొద్దని, కొనుగోలు కేంద్రాలకు దగ్గరలో ఉండి కొనుగోలు, రవాణా, దిగుమతి వేగవంకతంగా జరిగేలా చూడాలని సూచించారు. సివిల్ సప్లై అధికారులు మిల్లుల వద్ద వచ్చిన ధాన్యాన్ని లారీల నుండి వేగంగా దిగుమతి అయ్యేలా చ ర్యలు తీసుకోవాలన్నారు. కోదాడ, హుజూర్‌నగర్ మి ల్లుల వద్ద ధాన్యం లారీల నుండి దిగుమతి అయ్యేలా ఆర్‌డిఒలు ప్రత్యేక కమిటీ పెట్టి పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో ఈనెల 30తేదీ వరకు పూ ర్తిగా ధాన్యం రవాణ అయ్యేలా చూడాలన్నారు. నాగా రం, తుంగతుర్తి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సరిగ్గా పర్యవేక్షణ చేయడం లేదని తన దృష్టికి వచ్చిందని, త్వర గా ధాన్యం కొనుగోలు జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతులకు ఏలాంటి ఇబ్బందులు లేకుండా కొనుగోలు కేంద్రాల్లో ఏర్పాటు చేయాలన్నారు.

నాలుగో రోజు 10 మంది నామినేషన్లు దాఖలు

ప్రజాపక్షం / నల్లగొండ: నల్లగొండ పార్లమెంటు ఎన్నికలకు నామినేషన్ల పర్వం కొనసాగుతుంది. ప్రారంభం రోజు నుంచి నాల్గవ రోజు వరకు ప్రధాన పార్టీలైన బిజెపి మినహా ఎవరు కూడా నామినేషన్లను దాఖలు చేయలేదు. ప్రారంభం రోజే బిజెపి అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి నామినేషన్ దాఖలు చేయగా రెండవ సెట్ సోమవారం ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ దాసరి హరిచందనకు నామినేషన్ పత్రాలను అందజేశారు. అదే విధంగా ఎంసిపిఐ(యు) పార్టీ నుంచి వస్కుల మట్టయ్య , తెలంగాణ సకల జనుల పార్టీ నుంచి నందిపాటి జానయ్య, రిపబ్లికన్ సేన పార్టీ నుంచి వంగపల్లి కిరణ్, ధర్మసమాజ్ పార్టీ నుంచి తలారి రాంబాబు, స్వతంత్ర అభ్యర్థులు మర్రి నెహెమియా, పానుగోతు లాల్ సింగ్, వెంకట సాంబశివ రావు, డెమోక్రసీ డిపార్మోటిక్ పార్టీ నుంచి ఏడనాగ్ పుల్లారావులు తమ నామినేషన్ పత్రాలను ఎన్నికల అధికారికి అందజేశారు.

ధాన్యం కొనుగోళ్ళు సజావుగా చేయాలి

రెవెన్యూ అదనపు కలెక్టర్ పి.బెన్ షాలోమ్

ప్రజాపక్షం / యాదాద్రి కలెక్టరేట్: ధాన్యం కొనుగోళ్లలో నిర్లక్ష్యం పనికిరాదని, వెను వెంటనే కొనుగోలు చేయాలని జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టరు పి.బెన్ షాలోమ్ అధికారులను, మిల్లర్లను ఆదేశించారు. సోమవారం ఆయన కలెక్టరేట్‌లోని తన ఛాంబర్లో అధికారులు, మిల్లర్లతో ధాన్యం కొనుగోళ్లపై సమీక్షా సమావేశం నిర్వహించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ధాన్యం కొనుగోళ్లు వేగంగా చేపట్టాలని, హమాలీలను పెంచుకోవాలని సూచించారు. రవాణా సమస్యలు రాకుండా చూడాలని ఆదేశించారు. వర్షాల వలన ధాన్యం తడిసిపోకుండా చర్యలు తీసుకోవాలని, అవసరమైన మేరకు టార్పాలిన్స్ సరఫరా చేయాలని అన్నారు. ట్యాబ్ ఎంట్రీలు త్వరగా చేసి రైతులకు సకాలంలో వారి ఖాతాలలో డబ్బులు జమ అయ్యేలా చూడాలని తెలిపారు. మిల్లులలో హమాలీలను ఎక్కువ సంఖ్యలో నియమించుకొని ధాన్యాన్ని వెంట వెంటనే అన్‌లోడ్ చేయించాలని, ట్రక్ షీట్లను ఎప్పటికప్పుడు అప్లోడ్ చేయాలని మిల్లర్లను ఆదేశించారు. ఇప్పటి వరకు 3801 మంది రైతుల నుండి 49,543 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయడం జరిగిందని తెలిపారు. ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఏవైనా ఇబ్బందులు తలెత్తినట్లయితే జిల్లా పౌర సరఫరాలశాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నెంబర్ 7995120554 కు ఫిర్యాదులు చేయాలని రైతులకు సూచించారు. సమావేశంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి ఎం.ఎ.కృష్ణన్, సివిల్ సప్లయ్ జిల్లా మేనేజరు గోపీకృష్ణ, జిల్లా పౌర సరఫరాల అధికారి శ్రీనివాసరెడ్డి, జిల్లా మార్కెటింగ్ అధికారి సబిత, వ్యవసాయ సహకార శాఖల అధికారులు, జిల్లా మిల్లర్ల అసోసియేషన్ అధ్యక్షులు మార్త వెంకటేశం, ప్రధాన కార్యదర్శి కోట మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వర్షానికి కెనాల్‌లో కొట్టుకుపోయిన ధాన్యం

ఆందోళన చెందుతున్న రైతులు

ప్రజాపక్షం / కొత్తపల్లి (కరీంనగర్): అధికారుల నిర్లక్ష్యం.. రైతుల పాలిట శాపంగా మారింది. ప్రభుత్వ కొనుగోలు కేంద్రమైన డిసిఎంఎస్ సెంటర్‌లో ధాన్యం కొనుగోలులో జాప్యం చేస్తుండడంతో.. అధికారులు పట్టించుకోకపోవడంతో రైతులు రోజుల తరబడి నిరీక్షిస్తూ ఇబ్బందులు పడుతున్నారు. తాజాగా అకాల వర్షానికి ధాన్యం కెనాల్‌లో కొట్టుకుపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. చేతికి వచ్చిన సుమారు నాలుగు క్వింటాళ్ల వరి ధాన్యం వర్షం దాటికి కెనాల్‌లో కొట్టుకుపోవడంతో సంబంధిత రైతులు లబోదిబోమంటున్నారు. కరీంనగర్ జిల్లా కొత్తపల్లి మండలం చింతకుంట గ్రామంలో డిసిఎంఎస్ కొనుగోలు కేంద్రాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. అదే గ్రామానికి చెందిన దండ్ల కొమురయ్య గత 5 రోజుల క్రితం తాను పండించిన 4 ఎకరాల నుంచి కోసిన వరిధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చారు. అప్పటి నుంచి కంటికి రెప్పలా కాపాడుకుంటూ వస్తున్నాడు. నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా తేమ శాతం 13 శాతం రావడంతో ఆదివారం కొనుగోలుకు సిద్ధమైనప్పటికీ ఒకటే లారీ రావడంతో కాంటా చేయలేదు. దీంతో కొమురయ్య వడ్లు అలాగే కొనుగోలు కేంద్రంలో ఉండిపోయాయి. మరో రైతు పైడిపాల సింగారయ్య సైతం తన ధాన్యం తెచ్చి 5 రోజులు కావస్తున్నా కాంటాలు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశాడు. అధికారుల కన్నెత్తి చూడకపోవడంతో తమకు ఇబ్బందులు తప్పడం లేదని రైతులు వాపోతున్నారు. ఎస్ఆర్ఎస్‌పి కెనాల్ పక్కనే డిసిఎంఎస్ కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయడంతో రైతులకు ఇబ్బందులు రెట్టింపు అవతున్నాయి. అటు ప్రజలకు.. ఇటు రైతులకు కొనుగోలు కేంద్రం ద్వారా తిప్పలు తప్పడం లేదు. ధాన్యం తూకంలో ఆలస్యంతో పాటు లారీల రాక సైతం జాప్యం చేస్తుండడంతో రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు. మరో వైపు అకాల వర్షాలు రైతులను ఆగం చేస్తున్నాయి. మండలంలో చేతికొచ్చిన పంట పొలాల్లో నేలకొరుగుతున్నాయి. వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ, పౌరసరఫరాల సంస్థ అధికారులు ఇకనైనా స్పందించి కష్టాలు తీర్చాలని రైతులు కోరుతున్నారు.

ఇష్టానుసారంగా కాంటాలు

తేమ పేరుతో రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్న వైనం

ప్రజాపక్షం / చివ్వెంల: పిఎసిఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాలకు రైతులు ధాన్యాన్ని తీసుకవచ్చి రోజులు గడుస్తున్న కేంద్రాన్ని నిర్వహిస్తున్న అధికారులు మాత్రం తమ ధాన్యాన్ని కాంటాలు వేయడం లేదని పాండ్యనాయక్ తండా రైతులు సోమవారం ఆవేదన వ్యక్తం చేశారు. కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యాన్ని మొదటగా కాంటాలు వేయకుండా వారికి ఇష్టం వచ్చిన వారికి కాంటాలు వేస్తున్నారని, ధాన్యం కొనుగోలు కేంద్రానికి తీసుకురాకున్నా ప్రైవేట్ స్థలాలలో ఉన్న ధాన్యాన్ని మొదట ప్రాధాన్యత ఇస్తూ కొనుగోలు కేంద్రానికి ధాన్యం తీసుకవచ్చిన ధాన్యాన్ని మాత్రం కాంటాలు వేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. గత కొద్ది రోజులుగా చివ్వెంల మండలంలో ఏర్పాటు చేసిన పిఏసిఎస్ కొనుగోలు కేంద్రాలైన చివ్వెంల, చందుపట్ల, తిరుమలగిరి, వల్లభాపురం, ఎల్‌ఎన్‌రావు తండాల్లో ఏర్పాటు చేసిన కేంద్రాల్లో జిల్లా అధికారులు, జెడ్‌పి సీఈఓ, జిల్లా సహకార అధికారులు తనిఖీ చేసి రైతులు ఇబ్బందులకు గురికాకుండా ధాన్యం కాంటాలు వేయాలని ఆదేశించినప్పటికి నిర్వహకులు కాంటాలు వేయకుండా వారి ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. చివ్వెంల మండల కంద్రంలోని పిఏసిఎస్‌లో నిర్వహిస్తున్న అధికారులు రైతులపై తమదైన జులుంను ప్రదర్శిస్తూ కాంటాలు వేయకుండా తీవ్ర ఇబ్బందులకు పెడుతున్నారని చెప్పారు. జిల్లా అధికారులు ఎన్ని సార్లు తనిఖీలు చేసిన అధికారులు ఉన్నంత సేపు మాత్రమే 41కేజీల కాంట వేస్తారని, అధికారులు అక్కడి నుండి వెళ్లిన అనంతరం 41 కేజీలు కా కుండా మరో 500 గ్రాములు అదనంగా తూకం వేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. కాంటాల రూపంలోనే కాకుండా హమాలీల రూపంలో రూ. 45 అక్రమంగా వసూళ్లు చేస్తున్నారని పేర్కొన్నారు. సోమవారం చివ్వెంల పిఏసిఎస్ కేంద్రానికి వచ్చిన ఎఒ ఆశ కుమారి, ఎఇఒ ప్రియాంకలను రైతులు నిలదీసిన వీడియో సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొట్టింది. మండల పరిధిలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలు నిర్వహిస్తున్న వారు కూడా ఇలానే చేస్తున్నారని, మేము ఒక్కరమే అలా చేయడం లేదు కదా అంటూ నిర్వహకులు ఓ ఉద్యోగి తన స్నేహితులతో ఈ విషయాన్ని చర్చించడం విడ్డూరం. ఇప్పటికైన జిల్లా ఉన్నతాధికారులు చివ్వెంల మండలంలో అవినీతి అక్రమాలకు పాల్పడుతున్న పిఏసిఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహకులపై చర్యలు తీసుకోని రైతులను ఆదుకోవాలని మండల ప్రజలు వేడుకుంటున్నారు.

ఎక్కువ మందికి ఉపాధిహామీ పనులు

గ్రామీణాభివృద్ధి అధికారి క్రిష్టన్ ఆదేశం

ప్రజాపక్షం / భువనగిరి: గ్రామాలలో ఎక్కువ మంది ఉపాధి హామీ పనికి వచ్చే విధంగా చూసి కూలీలకు సగటు వేతనం రూ.300 వచ్చేలా చర్యలు తీసుకోవాలని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి ఎం.ఎ క్రిష్టన్ అన్నారు. భువనగిరి మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం ఆయన ఉపాధిహామీ పథకం, వేసవిలో కూలీలకు పనుల కల్పన పై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సంధర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధి కూలీలకు 100 పని దినాలు కల్పించి రూ.30 వేలు సంపాదించేలా చూడాలని సూచించారు. ప్రతి నెల 4వ శనివారం ఉపాధి కూలీలతో రోజ్‌గార్ దివస్ సమావేశమం నిర్వహించి పని చేస్తున్న సమయంలో వారికి అందుతున్న సౌకర్యాలపై చర్చించాలని చెప్పారు. వేసవి దృష్టా పని ప్రదేశాలలో మౌలిక వసతులు ఏర్పాటు అంశాలను చూడాలని ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో అడిషనల్ డిఆర్‌డిఒ సురేష్, డిఎల్‌పిఒ శ్రీకాంత్, భువనగిరి, ఆత్మకూరు మండలాల ఎంపిడిఒలు, ఎంపిఓలు, ఎపిఒలు, ఇంజనీరింగ్ కన్సల్టెంట్‌లు, సాంకేతిక సహాయకులు కంప్యూటర్ ఆపరేటర్లు పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

ప్రకృతి పరిరక్షణతోనే మానవాళికి మనుగడ

ప్రజాపక్షం / రామన్నపేట: ప్రకృతి పరిరక్షణతోనే మానవాళికి మనుగడ ఉంటుందని జలసాధన సమితి జాతీయ అధ్యక్షుడు దుశ్చర్ల సత్యనారాయణ, సమాచార హక్కు పరిరక్షణ సమితి, ఎలక్షన్ వాచ్ కమిటీ జాతీయ ఛైర్మన్ డాక్టర్ బొమ్మరబోయిన కేశవులు తెలిపారు. సోమవారం మండలంలోని కక్కిరేణి గ్రామంలో నిర్వహించిన ధరిత్రి దినోత్సవంలో వారు పాల్గొని మాట్లాడారు. ప్రపంచ వ్యాప్తంగా పెరుగుతున్న కాలుష్యం, విచ్చలవిడిగా వినియోగమవుతున్న ప్లాస్టిక్ వ్యర్థాలు, రసాయనాలు వి నియోగంతో భూమి దెబ్బతింటుంది. సహజ వనరుల వినియో గం అదుపు తప్పిందన్నారు. వనాల కొత్త, తీరా వ్యవస్థల విధ్వంసంతో పర్యావరణం దెబ్బతింటుంది. మానవ తప్పిదాల వల్ల గాలి, నీరు, నేల కాలుష్యమవుతున్నాయన్నారు. ఫలితంగా మానవాళికి మనుగడ ప్రశ్నార్థకం గా మారుతుంది. దీన్ని దృష్టిలో పెట్టుకొని భూమిని కాపాడుకోవాలని ధరిత్రి దినోత్సవాన్ని నిర్వహిస్తున్నా రు. ప్రతి ఒక్కరు సహజ వనరులను కాపాడుకోవడంతోపాటు భూతాపం కట్టడికి చర్యలు తీసుకోవాలన్నారు. విరివిగా మొక్కలను నాటి పచ్చదనం పెంచాలన్నారు. అనంతరం ధరిత్రి ప్రతిజ్ఞతోపాటు ఓటరు చైతన్య ప్రతిజ్ఞ నిర్వహించారు. కార్యక్రమంలో అక్షర అనాథ ఆశ్రమ నిర్వాహకుడు మేదరి కిరణ్‌కుమార్, సామాజిక కార్యకర్త వేముల సైదులు, సీఐడీసీ ఇన్స్‌పెక్టర్ మెట్టు మధు, తదితరులు పాల్గొన్నారు.

పూర్తయిన మరమ్మతు పనులు... కాలనీకి నీటి సరఫరా

ప్రజాపక్షం / నందికొండ: నందికొండ మున్సిపాలిటీలోని స్థానిక హిల్‌కాలనీలో గృహాలకు సరఫరా చేసే మెయిన్ పైప్ లైన్ చెడిపోయి వారం రోజులుగా కాలనీలో నీటి సరఫరా లేక కాలనీ వాసులు ఇబ్బంది పడిన తీరు వర్ణనాతీతం. మరమ్మతు పనులు ప్రారంభించిన అధికారులు ఆ పనులు ఎప్పుడో పూర్తి కావలసి ఉండగా నీటిపారుదల శాఖ అధికారులు వారి సిబ్బంది అనుభవరాహిత్యం కారణంగా పనులు అనేకసార్లు విఫలం చెందుతూ తీవ్ర అంతరాయం ఏర్పడుతూ వచ్చింది . అయితే స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు రామకృష్ణారెడ్డి చొరవ తీసుకొని హైదరాబాదు నుండి ప్రత్యేక సాంకేతిక నిపుణులను పిలిపించి మరో కొత్త పరికరంతో వారి చేత సోమవారం ఉదయం 2 గంటలవ రకు మరమ్మతు పనులు విజయంతంగా పూర్తి చేయించడంతో అధికారులు వెంటనే నీటిని కుళాయిల ద్వారా కాలనీలోకి సరఫరా చేసారు. దీనితో కాలనీవాసులు ఊపిరి పీల్చుకున్నారు.అయితే విద్యుత్తు, నీటి సరఫరాకు ఏవైనా అవాంతరాలు ఏర్పడితే వాటిని మరమ్మతులు చేయడానికి ఆయా డిపార్మెంట్లలో సాంకేతిక పరిజ్ఞానం ఉన్న అనుభవజ్ఞులైన శాశ్వత సిబ్బంది లేరని ఎవరు పడితే వారితో పనులు చేయిస్తారని అందువలన మరమ్మతు పనులు చేయడంలో తీవ్రజాప్యం ఏర్పడుతుందని స్థానిక ప్రజలు వాపోతున్నారు. కొన్ని దశాబ్దాలుగా కొనసాగుతున్న ఈ సమస్యలను ప్రజా ప్రతినిధులు అధికారులు స్పందించి ఇలాంటి ముఖ్యమైన శాఖలలో అనుభవజ్ఞులైన సాంకేతిక పరిజ్ఞానం కలిగిన శాశ్వత సిబ్బందిని నియమించాలని, అదేవిధంగా యంత్రాలు, వాటి విడి పరికరాలు చెడిపోతే వాటిని తీసి రిపేరు చేయించుకొని వచ్చి మళ్ళీ అదే పరికరాన్ని అమరుస్తుంటే అటు సమయం వృథాతో పాటు కాలనీవాసులు కూడా ఇబ్బందులు పడాల్సి వస్తుందని అలాకాకుండా యంత్రం చెడిపోయిన వెంటనే మార్చడానికి అదనంగా ఇంకో సెట్టు అందుబాటులో ఉండే విధంగా చూడాలని కాలనీవాసులు కోరుకుంటున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రామకృష్ణారెడ్డి, ఖాసిం, భాస్కర్, యాదగిరి, ఎఈ బిక్షమయ్య, వర్క్ ఇన్స్పెక్టర్ రాజా, మల్లేష్, నర్సింహా, అక్తర్, షఫీద్దీన్ పాల్గొన్నారు.

అధికారులంతా సమన్వయంతో పనిచేయాలి

మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో డిజిపి పర్యటన

ప్రజాపక్షం/బూర్గంపాడు/ భద్రాచలం: రాబోయే పార్లమెంట్ ఎన్నికలు సజావుగా జరిగేలా అధికారులంతా సమన్వయంతో పని చేయాలని డిజిపి రవిగుప్తా అన్నారు. సోమవారం హెలికాప్టర్ ద్వారా సారపాక ఐటిసి గెస్ట్ హౌస్‌కు చేరుకొని అక్కడ భద్రాద్రి కొత్తగూడెం, ములుగు, భూపాలపల్లి జిల్లాల పోలీస్ అధికారులతో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ముందుగా మూడు జిల్లాల ఎస్‌పిలతో ప్రస్తుత స్థితిగతులకు అడిగి తెలుసుకున్నారు. అనంతరం డిజిపి మాట్లాడుతూ రాబోయే పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పొరుగు రాష్ట్రాల సరిహద్దు అధికారులతో సమన్వయం పాటిస్తూ పటిష్టమైన చర్యలు చేపట్టాలని సూచించారు. చెక్ పోస్ట్ వద్ద అధికారులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటూ అక్రమంగా నగదు, మద్యం రవాణాను అడ్డుకోవాలని సూచించారు. గత ఎన్నికల్లో మాదిరిగానే ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా మావోయిస్టు ప్రభావిత పోలింగ్ కేంద్రాల్లో పట్టిష్టమైన బందోబస్తును ఏర్పాటు చేసుకొని అధికారులు సమన్వయంతో పని చేయాలని తెలిపారు. అనంతరం డిపిజితో పాటు అధికారులందరూ భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామిని దర్శించుకున్నారు. ఈసమావేశంలో జిల్లా ఎస్‌పి రోహిత్ రాజు, ములుగు ఎస్పీ డాక్టర్ శబరీష్, భూపాలపల్లి ఎస్‌పి కిరణ్ ప్రభాకర్ ఖరే, ఎస్ఐబి ఎస్పీ రాజేష్, ఓఎస్డీ కొత్తగూడెం సాయి మనోహర్, భద్రాచలం ఏఎస్‌పి పరితోష్ పంకజ్, ఏటూరునాగారం ఏఎస్‌పి మహేష్ జితే, ట్రైనీ ఐపిఎస్ విక్రాంత్ సింగ్, సిఆర్‌పిఎఫ్ అధికారులు ఆర్‌కె పాండా, ఎంకె మీనా, మోహన్, రితేష్ కుమార్, డిఎస్‌పిలు, సిఐలు, ఎస్‌ఐలు తదితరులు పాల్గొన్నారు.

భద్రాచలం : మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో డిజిపి రవిగుప్తా సోమవారం పర్యటించారు. ఈ సందర్భంగా చర్ల మండల పరిధిలోని చెన్నాపురం, పూసుగుప్ప, ఉంజుపల్లి పోలీస్ క్యాంపులను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ప్రత్యేక హెలీకాప్టర్‌లో చేరుకున్నారు. ఇందులో భాగంగా ఆయన బేస్ క్యాంపుల వద్ద మాట్లాడుతూ మావోయిస్టుల కదలికలపై ఎప్పటికప్పుడు సమాచారాన్ని సేకరిస్తూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అభివృద్ధి నిరోధకులుగా మారిన మావోయిస్టుల వల్ల రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ పర్యటనలో ఆయన వెంట ఇంటిలిజెన్సీ అడిషనల్ డీజిపి శశిధర్‌రెడ్డి, గ్రేహౌండ్స్ అడిషనల్ డిజి విజయ్ కుమార్, సిఆర్‌పిఎఫ్ సౌత్‌జోన్ అడిషనల్ డిజిపి రవిదీప్ సింగ్ సాహూ, సిఆర్‌పిఎఫ్ సౌత్ సెక్టార్ హైదరాబాద్ జోన్ ఐజిపి చారునిన్హా, ఎస్ఐబి ఐజిపి సుమతి తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణికి 36 దరఖాస్తులు

జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా

ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి : ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి వచ్చిన సమస్యలకు అధిక ప్రాధాన్యత ఇచ్చి సత్వర పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. సోమవారం జయశంకర్ భూపాలపల్లి కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజల సమస్యలకు సంబంధించిన 36 దరఖాస్తులను జిల్లా కలెక్టర్ స్వీకరించారు. ప్రజల నుండి అందిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించుటకు సంబంధిత శాఖలకు కలెక్టర్ తెలిపారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను ప్రాధాన్యతతో వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. శాఖల వారిగా పెండింగ్ లో ఉన్న సమస్యలకు అధిక ప్రాధాన్యత ఇచ్చి పరిష్కరించాలని సంబంధిత అధికారులకు కలెక్టర్ సూచించారు. కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు కృతజ్ఞతలు

ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి : చిన్నారి అక్షయ తల్లిదండ్రులు జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రాకు కృతజ్ఞతలు తెలిపారు. భూపాలపల్లి పట్టణంలోని ఎల్బీనగర్ కు చెందిన కాజీపేట నరేష్, సుమలత దంపతుల కుమార్తె అక్షయ (7) గత సంవత్సరం దీపావళి వేడుకలులో ప్రమాద వశాత్తూ గాయపడడంతో మంచానికే పరిమితమైంది. అక్షయ గురించి జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా తెలుసుకొని చిన్నారి వైద్య చికిత్స అందిస్తామని ఆదివారం ప్రకటించిన నేపథ్యంలో సోమవారం సమీకృత జిల్లా కలెక్టర్ కార్యాలయంలో అక్షయ తండ్రి నరేష్ జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రాను కలిశారు. కలెక్టర్ భవేశ్ మిశ్రా మాట్లాడుతూ చిన్నారి అక్షయకు వైద్యసేవలు అందించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. తల్లిదండ్రులు ధైర్యంగా ఉండాలని అన్నారు. తక్షణమే అక్షయ ను వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించాలని జిల్లా వైద్యాధికారిని ఆదేశించారు. అక్షయ వైద్య సేవలపై ఎప్పటికప్పుడు తనకు తెలుసుకోవాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ మధుసూదన్‌కు సూచించారు.

'సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత'

ప్రజాపక్షం/ములుగు జిల్లా ప్రతినిధిః ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి వచ్చిన సమస్యలకు అధిక ప్రాధాన్యత ఇచ్చి సత్వర పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజల సమస్యలకు సంబంధించిన 18 దరఖాస్తులను జిల్లా కలెక్టర్ స్వీకరించారు. ప్రజల నుండి అందిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించుటకు సంబంధిత శాఖ అధికారులకు కలెక్టర్ తెలిపారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను ప్రాధాన్యతతో వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. శాఖల వారిగా పెండింగ్‌లో ఉన్న సమస్యలకు అధిక ప్రాధాన్యత ఇచ్చి పరిష్కరించాలని సంబంధిత అధికారులకు కలెక్టర్ సూచించారు. డిఆర్‌డిఓ శ్రీనివాస్‌కుమార్, డిఎంహెచ్‌ఓ అప్పయ్య, డిఎం సివిల్ సప్లయి రాంపతి, ఎల్‌డిఎం రాజ్‌కుమార్, ఎస్‌సి కార్పొరేషన్ ఈడి తుల రవి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి విజయచందర్, డిఈఓ పాణిని, ఇతర అధికారులు పాల్గొన్నారు.

వడదెబ్బకు మహిళ మృతి

ప్రజాపక్షం/మహాదేవపూర్: పలిమెల మండలకేంద్రానికి చెందిన కుమ్మరి అనిత 45 వడదెబ్బ తీవ్రతకు తాళలేక సోమవారం మృతి చెందింది.న పలిమెల ఎస్సై తమాషా రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం అనిత గత వారం రోజులుగా కూలీ పనులకు వెళ్తుంది ఎండ తీవ్రత తాళలేక ఉదయవ అస్వస్థతకు గురై మృతి చెందినట్లు వివరించారు.మృతురాలి అత్త కుమ్మరి చిన్నక్క ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలి

ప్రజాపక్షం/తరిగొప్పుల: రైతులు కొనుగోలు కేంద్రాల వద్దనే ధాన్యం విక్రయించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ తెలిపారు. సోమవారం స్థానిక తహశిల్దార్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఆకస్మిక తనిఖీ నిర్వహించారు.రికార్డు రూంను పరిశీలించారు. రికార్డులను తనిఖీ చేసి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ధరణి పెండింగ్ దరఖాస్తుల ప్రక్రియ వేగవంతం చేయాలని ఆదేశించారు. అనంతరం మండలంలోని అబ్దుల్ నాగారంలోని ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ పర్యవేక్షించారు. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని, కొనుగోలు కేంద్రాల వద్దధాన్యంఅమ్ముకొని ఏ గ్రేడ్‌కు రూ.2,203, కామన్ గ్రేడ్‌కు రూ.2,183 మద్దతు ధర పొందాలన్నారు. అనంతరం నర్మెట మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పీహెచ్‌సీలో ఓపీ సేవలను మరింతంగా పెంచాలని సూచించారు. మండల తహశిల్దార్ కిష్టయ్య, ఎంపీడీవో దేవేందర్ రెడ్డి, పీహెచ్‌సీ మెడికల్‌అధికారి డా.స్టెల్లా, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం తగదు : డిఎంహెచ్ఓ



ప్రజాపక్షం/గజ్వేల్: విధుల పట్ల నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదని జిల్లా వైద్యాధికారి డాక్టర్ శ్రీనివాస్ పేర్కొన్నారు. సోమవారం గజ్వేల్ మున్సిపల్ పరిధిలో బస్తీ ధావకానాను తనిఖీ చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ముఖ్యంగా రోగులకు స్థానికంగా ఉండి సేవలందించాలని, స్థానికంగా ఉండి మెరుగైన వైద్య సేవలు అందిస్తేనే తగిన గుర్తింపు వస్తుందని స్పష్టం చేశారు. అనంతరం ఆసుపత్రి రికార్డులు పరిశీలించడం తోపాటు రోగులకు అందించాల్సిన మందులు తనిఖీ చేశారు. అలాగే అందుతున్న సేవలను రోగులను అడిగి తెలుసుకున్నారు. బస్తీ దవఖాన వైద్యురాలు డాక్టర్ గౌతమిని అభినందించగా, వైద్య సిబ్బంది పనితీరు అడిగి తెలుసుకున్నారు.

'ఎకరానికి రూ.20వేలు నష్టపరిహారం ఇవ్వండి'

ప్రజాపక్షం/ గార్ల : రైతులను అకాల వర్షం నిండా ముంచింది. నిన్నటి దాకా సాగు నీటి కోసం తండ్లాడిన రైతులు, అతి కష్టం మీద పంటలు పండించారు. తీరా పంట చేతికొచ్చే సమయానికి అకాల వర్షం గాలి దుమ్ములతో రైతులకు అపార నష్టం కలుగుతుంది. ఆదివారం సాయంత్రం గార్ల మండల పరిదిలో కురిసిన అకాల వర్షంతో పంట నష్ట పోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సిపిఐ రైతుసంఘం నాయకులు రాగం రమేష్ , సిపిఐ రాష్ట కమిటి సభ్యుడు వైస్ ఎంపిపి కట్టెబోయిన శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మద్దివంచలో నేల రాలిన మామిడ తోటలను, కల్లాలో , రోడ్లపై ఆరబోసిన వరి, జొన్న, మొక్కజోన్న, మోద నష్ట పరిహారం ఇచ్చి ఆదుకోవడంతో పాటు తడిసిన,వరి, జొన్న, మొక్క జొన్న, ధాన్యాన్ని మద్దతు ధరకు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. సిపిఐ రైతు సంఘం నాయకులు దూపాటి జనార్దన్, పురుషోత్తం ,బిక్షం, రైతులు రాగం రాము, పుల్లయ్య ,బీమ్లు ,పొన్నం ఉపెందర్ పాల్గోన్నారు.

ఐపిఎల్ టికెట్లు కౌంటర్లలోనే అమ్మాలి

హెచ్‌సిఎ బోర్డు కమిటీని రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేయాలి
ఎఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి వేముల శ్రీకాంత్

ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి : ఐపీఎల్ టికెట్లను సాధారణ ధరలకు కౌంటర్ల ద్వారా ఇవ్వాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి వేముల శ్రీకాంత్ డిమాండ్ చేశారు. భూపాలపల్లి పట్టణంలోని స్థానిక రావి నారాయణ భవన్ లో అఖిల భారత యువజన సమాఖ్య ఏఐవైఎఫ్ జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేసుకోవడం జరిగింది. ఈ సమావేశంలో ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి వేముల శ్రీకాంత్ మాట్లాడుతూ ఉప్పల్ లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో ఈ నెల 25 తేదిన సన్ రైజర్స్ హైదరాబాద్ బెంగుళూరు రాయల్ ఛాలెంజర్స్ జట్ల మధ్య ఐపీఎల్ మ్యాచ్ జరగాల్సి ఉందని, ఈ మ్యాచ్ కు సంబంధించిన టికెట్లను గత శుక్రవారం విక్రయానికి పెట్టారని, అయితే టికెట్లను పేటిఎంలో అమ్మకానికి పెట్టిన క్షణాల్లోనే టికెట్లను అమ్ముడు పోయాయంటూ బోర్డ్ ప్రకటించారని, దాదాపు 36 వేలకు పైగా టికెట్లను అమ్మకానికి పెట్టిన అరగంట గంటలోపే ఏవిధంగా అమ్ముడుపోతాయో హెచ్ సీఏ, సన్ రైజర్స్ యాజమాన్యాలు రాష్ట్ర ప్రజలకు స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సిఎ), సన్‌రైజర్స్ హైదరాబాద్ (ఎస్ఆర్‌హెచ్ఓ) నిర్వాహకులు మాత్రం టికెట్లను బ్లాక్ చేసి బ్లాక్ మార్కెట్ ద్వారా అక్రమంగా విక్రయించారని ఆరోపించారు. హెచ్‌సీఏ, ఎస్ఆర్‌హెచ్ లేదా పేటీఎం ఈ సమస్యను పరిష్కరించకపోవడంతో క్రికెట్ అభిమానులు నిరాశకు గురయ్యారని వారు అన్నారు. గతంలో హెచ్ సి ఏ ఐపీఎల్ నిర్వాహకులు టిక్కెట్ల విక్రయాల వివరాలను బహిర్గతం చేసేవారు, కానీ నేడు ఆచరణను నిలిపివేశారని ధ్వజమెత్తారు. బల్క్ టిక్కెట్లను కార్పొరేట్ సంస్థలకు విక్రయించడం టిక్కెట్ల కొరతకు దారి తీస్తోందని, కాబట్టి ప్రభుత్వం టిక్కెట్ల విక్రయాన్ని ఆధార్ కార్డులకు అనుసంధానం చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ వ్యాపారంపై పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని వారు హెచ్చరించారు. ఏఐవైఎఫ్ నాయకులు అరబోయిన వెంకటేష్,తిరుపతి,రమేష్ చారి,కౌశిక్,బౌత్ కమలాకర్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

లెనిన్ ఆశయ సాధనకు కృషి

సిపిఐ వరంగల్ జిల్లా కార్యదర్శి మేకల రవి

ప్రజాపక్షం/వరంగల్ ప్రతినిధి : లెనిన్ ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని సిపిఐ వరంగల్ జిల్లా కార్యదర్శి మేకల రవి అన్నారు. వరంగల్ జిల్లా కేంద్రంలోని శివనగర్ తమ్మర భవన్‌లో ప్రథమ సోషలిస్టు విప్లవ సారధి 154వ జయంతి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. అనంతరం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి యువత లెనిన్‌ను ఆదర్శంగా తీసుకోని ఉద్యమాల వైపు నడవాలన్నారు. ఆకలి, పేదరికం, మతం, జాతి, వర్ణ అసమానతలు లేని దోపిడి రహిత సోషలిస్టు విప్లవాన్ని రష్యాలో సాధించారన్నారు. సామ్రాజ్యవాదం చుట్టు ముట్టి ఉన్న ప్రపంచంలో ఒక్క దేశంలో విప్లవం సాధ్యమే అని నిరూపించిన వాడన్నారు. మార్క్సిజాన్ని రష్యా దేశ పరిస్థితులకు అన్వయించి విజయం సాధించిన్నారు. 1871 పారిస్ విప్లవ గుణపాఠాల నుండి మర్క్సిజాన్ని అభివృద్ధి చేశారన్నారు. పెట్టుబడి దాని విధాన అత్యున్నత దశ సామ్రాజ్యవాదం అని సిద్దాంతీకరించిన వారన్నారు. ప్రపంచ వ్యాపితంగా విప్లవాలకు, జాతీయ విప్లవాలకు, ఆయ దేశ రాజకీయ వ్యవస్థల మార్పుకు కారణమైందన్నారు.ఏఐటియూసి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గన్నారపు రమేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి ల్యాదల్ల శరత్, ప్రధాన కార్యదర్శి మస్కా సుధీర్, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఎండి యాకుబ్, సీనియర్ కళాకారుడు వెంకటాద్రి తదితరులు పాల్గొన్నారు.

'మల్లన్నసాగర్ నిర్వాసితులకు క్షమాపణ చెప్పండి'

ప్రజాపక్షం/ సిద్దిపేట ప్రతినిధి : ఈ నెల 25న సిద్దిపేటలో బిజె పి ఆధ్వర్యంలో నిర్వహించే ఎన్నికల ప్రచాల సభలో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా హాజరవుతారని మెదక్ పార్లమెంట్ బిజెపి అభ్యర్థి రఘునందన్‌రావు వెల్లడించారు. సోమవారం సిద్దిపేటలో బిజెపి జిల్లా కార్యాలయంలో జరిగిన విలేఖరుల సమావేశంలో మాట్లాడారు. 25న గురువారం సిద్ది పేట డిగ్రీ కళాశాల మైదానంలో జరిగే ఎన్నికల ప్రచారంలో హోంశాఖ మంత్రి అమిత్ షాతో పాటు ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ హాజరుకానున్నట్లు తెలిపారు. ఇందుకోసం బహిరంగ సభకు భారీ ఏర్పాట్లుల చేస్తున్నట్లు తెలిపారు. సిద్దిపేట జిల్లా లోని 26 మండలాలు, మున్సిపల్ పట్టణాల నుండి30 వేల మంది బిజెపి నాయకులు, కార్యకర్తలను తరలించేలా సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపారు. హెలికాప్టర్ ద్వార డిగ్రీ కళాశాల మైదానానికి వచ్చి ఉదయం 11 గంటలకు జరిగే ఎన్నికల బహిరంగ సభలో పాల్గొంటారన్నారు. జిల్లాలోని ప్రతి మండలం నుండి వేయ్యి మంది హాజరయ్యేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం బిజెపి అభ్యర్థి రఘునందన్‌రావు బిజెపి నాయకులు, కార్యకర్తలతో కలసి బహిరంగ సభ నిర్వహించే డిగ్రీ కళాశాల మైదానాన్ని పరిశీలించారు. అలాగె హెలిప్యాడ్ స్థలాన్ని పరిశీలించారు.

భూ నిర్వాసితులకు కనీస పరామర్శలేదు

మల్లన్నసాగర్ రిజర్వాయర్ భూ సేకరణలో భాగంగా భూమిని కోల్పోవటంతో ఏటిగడ్డ కిష్టాపూర్‌కు చెందిన భూ నిర్వాసితుడు మల్లారెడ్డి తన సొంత ఇంటిలో చితిపేర్చుకొని సజీవ దహనం అయ్యారనే విషయాన్ని గుర్తు చేశారు. అప్పుడు కలెక్టర్‌గా ఉన్న వెంకట్రామ్‌రెడ్డి నిర్వాసితులకు న్యాయం చేయలేదన్నారు. ఎంఎల్‌సిగా ఎన్నికై మూడేండ్లు గడిచిన మల్లన్నసాగర్ నిర్వాసితుల కుటుంబాలను పరామర్శించలేదని, వారిని ఆదుకోలేదన్నారు. భూ నిర్వాసితులను ఇప్పుడు ఆదుకునేందుకు కొంత మందితో కలసి డబ్బులు పంచుతున్నట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. బిజెపి జిల్లా అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, బాలేశ్, నరేష్, వేణుగోపాల్, అంబడిపల్లి శ్రీనివాస్, ఉపేందర్, నరేష్, ఉమ. జ్యోతిరెడ్డి పాల్గొన్నారు.

వరంగల్‌గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగురవేయాలి

వర్దన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు

ప్రజాపక్షం/హసన్‌పర్తి : గ్రేటర్ వరంగల్ 56వ డివిజన్‌కు చెందిన బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు 56వ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు కొంక హరి బాబు ఆధ్వర్యంలో హన్మకొండలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పార్లమెంటు ఎన్నికల సమీపిస్తున్న తరుణంలో కాంగ్రెస్ పథకాలకు ఆకర్శితులై బీఆర్ఎస్ మహిళా అధ్యక్షురాలు పల్లకొండ సరోజన, బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ గొర్రె సతీష్, యూత్ నాయకులు, మహిళలకు ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎన్నికల సందర్భంగా ఇచ్చన హామీలను బీఆర్ఎస్ ప్రభుత్వం అమలుచేయకపోవడం, బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి మొన్నటి ఎన్నికల వరకు ప్రజలను మోసపూరిత మాటలతో మభ్యపెడుతూ కాలం వెళ్లదీశారన్నారు. పార్టీలో చేరిన కార్యకర్తలందరినీ కంటికి రెప్పలా కాపాడుకుంటానన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కాంగ్రెస్ నాయకులు ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొన్నారన్నారు. కడియం కావ్యను భారీ మెజార్టీతో గెలిపించి వరంగల్ గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగురవేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు పల్లకొండ సతీష్, 56వ డివిజన్ కార్పొరేటర్ సిరంగి సునీల్‌కుమార్, డివిజన్ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కందుకూరి పూర్ణచందర్, చింత రమేశ్‌గౌడ్, కసాగోని జనార్దన్‌గౌడ్, రుద్రోజు మణింద్రనాథ్, జనుప సారంగపాణి, భూక్య శంకర్‌నాయక్, భూక్య విజయ్‌కుమార్, బీరం రవీందర్‌రెడ్డి, పులిచేరు రవీందర్, పల్లకొండ విజయ్ సూర్య, మహిళా నాయకులు అన్నా విజయ, శనిగిరపు అనిత, గొడిశాల సంధ్యా, గుగులోతు స్వరూప, స్రవంతి, స్వప్న, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపాలన విస్మరించిన కాంగ్రెస్ ప్రభుత్వం

మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి

ప్రజాపక్షం/సంగెం: ప్రజా పాలనను కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించిందని, రూ. రెండు లక్షల రుణమాఫీ చేయని సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్‌కు రైతులే బుద్ధి చెప్పాలని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. సోమవారం సంగెం మండలంలోని నల్లబెల్లి, బాలునాయక్‌తండా, నార్లవాయి, ముమ్మిడివరం, మొండ్రాయి, గొల్లపల్లి, పల్లారుగూడ, వీఆర్ఎన్ తండా, పోచమ్మతండా గ్రామాల్లో బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. చల్లా ధర్మారెడ్డి మాట్లాడుతూ.. పార్టీ చేరికల మీద ఉన్న శ్రద్ధ ప్రజల సమస్యల మీద కాంగ్రెస్‌కు లేదన్నారు. డిసెంబరు 9 పోయి నాలుగు నెలలు అయింది. ఇచ్చిన హామీలు ఏమైనయి సీఎం. రైతులను నట్టేట ముంచి కష్టాల పాలు చేసిన చరిత్ర కాంగ్రెస్ ప్రభుత్వానిది. రెండు లక్షల రుణమాఫీ ఎటు పోయింది. మహిళలకు ఇస్తానన్న రూ. 2500 ఎటు పోయాయి. తులం బంగారం ఎటుపోయింది. కాంగ్రెస్ మోసాలను ప్రజలకు వివరించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పాలనకు.. బీఆర్ఎస్ పాలనకు తేడా ఏంటో ప్రతీ కార్యకర్త బాధ్యతగా ప్రజలకు వివరించాలి. గత ఎన్నికల్లో జరిగిన తప్పిదాలను కార్యకర్తలు గ్రహించి ఈ ఎన్నికల్లో ముందుకెళ్లాలి. వరంగల్ పార్లమెంటు ఎన్నికల్లో కార్యకర్తల కృషితో బీఆర్ఎస్ అభ్యర్థి డాక్టర్ మారెపల్లి సుధీర్‌కుమార్ గెలుపు ఖాయమని, పరకాల నుంచి భారీ మెజార్టీ ఇవ్వడం ఖాయమన్నారు. రెడ్‌క్రాస్ ఛైర్మన్, జిల్లా నాయకుడు నిమ్మగడ్డ వెంకటేశ్వర్‌రావు, మండలాధ్యక్షుడు పసునూరి సారంగపాణి, జడ్పీటీసీ గూడ సుదర్శన్‌రెడ్డి, వైస్ ఎంపీపీ బుక్క మల్లయ్య, మండల కోఆప్షన్ మన్సూర్ అలీ, నాయకులు పులుగు సాగర్‌రెడ్డి, జక్కమల్లయ్య,పూజారి గోవర్ధన్, సుతారి బాలకృష్ణ, ఉండీలా రాజు, కక్కెర్ల సదానందం, కుమారస్వామి, వీరేశం, ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు, యూత్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

'కాంగ్రెస్‌లో చేరినవారిని కాపాడుకుంటాం'

ప్రజాపక్షం/పర్వతగిరి : మండల పరిధిలోని నారాయణపురం గ్రామ మాజీ సర్పంచ్, బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి ఎర్రబెల్లి వెంకటేశ్వర్‌రావు, గ్రామాధ్యక్షుడు బొమ్మెర యకాంతం, జమాల్‌పురం గ్రామానికి చెందిన ఐనవోలు గుడి మాజీ డైరెక్టర్ బండి సాయిలు సుమారు 50 మంది నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పథకాలకు ఆకర్శితులై వర్దన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాంగ్రెస్‌లో చేరిన వారిని కంటికి రెప్పలా కాపాడుకుంటామన్నారు. మీరు కష్టపడి పనిచేసి రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో వరంగల్ ఎంపీ కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్యను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా ఉపాధ్యక్షుడు పిన్నింటి అనిల్‌రావు, మండలాధ్యక్షుడు జాటోతు శ్రీనివాస్‌నాయక్, ఎస్టీ సెల్ మండలాధ్యక్షుడు బానోతు భాస్కర్‌నాయక్, మండల, గ్రామ నాయకులు, కార్యకర్తలు,అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

'మేడే స్ఫూర్తితో సమరశీల పోరాటాలు'

ప్రజాపక్షం/భీమదేవరపల్లి: కార్మికుల హక్కుల కోసం సమరశీల పోరాటాలు చేయాల్సిన అవసరముందని ఏఐటియుసి నాయకులు అన్నారు. సోమవారం హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ములుకనూరు గ్రామ పంచాయితీ వద్ద ఏఐటియుసి మేడే పిలుపు పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ 75 ఏండ్ల స్వాతంత్ర్య భారత దేశంలో కార్మికులు పోరాడి సాధించుకున్న 44చట్టాలలో 29చట్టాలు రద్దుచేసి పెట్టుబడిదారులకు అనుకూలంగా మార్చరన్నారు.కేంద్ర ప్రభుత్వం కార్మికుల హక్కులకు భంగం కలిగించే నాలుగు కోడ్లు తెచ్చిందని విమర్శించారు. పారిశ్రామిక వేత్తలకు నిర్ణయాలు వదిలేసి కార్మికుల శ్రమదోపిడి చేస్తూ పనికి తగిన వేతనం ఇవ్వకుండా పెత్తందారివర్గాలు సొమ్ముచేసుకుంటున్నాయని అందోళన వ్యక్తంచేసారు. కార్మికులకు పిఎఫ్, ఇఎస్ఐ వర్తింపజేయాలని,పింఛన్ అందించాలన్నారు.సంఘటిత, అసంఘటిత కార్మికులు ఒక్క తాటిపై వచ్చి ఎర్రజెండా నిడన హక్కుల సాధనకు ఐక్య పోరాటాలకు సిద్ధంకావాలన్నారు. హనుమకొండ జిల్లా ఏఐటియుసి ప్రధాన కార్యదర్శి జక్కు రాజుగౌడ్, జిల్లా ఉపాధ్యక్షుడు ఆదరి రమేష్, జిల్లా సమితి సభ్యులు శనిగరపు రాజ్‌కుమార్, ఉపాధ్యక్షులు నకీర్త ఓదేలు, భీమదేవరపల్లి మండల అధ్యక్షుడు చిట్కూరి రాజయ్య, సభ్యులు సారయ్య, మాదుగుల బాబు, గుడికందుల వెంకట్, బాబు, రాజేష్, వేముగంటి రాజేష్, మాదుగుల రాధ, మాట్ల రుద్రయ్య, బోయిని సంపత్, మూల రంజీత్, మాదుగుల రాజేందర్, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

'హామీలు మరచి మోసం చేస్తున్నారు'

ప్రజాపక్షం/నర్సంపేట: ఎన్నికలు రాగానే ప్రజలు హామీలు గుప్పించి... అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు కావస్తున్న ఇచ్చిన హామీలను మరిచి ఎన్నికల్లో పబ్బం గడిపేందుకు ప్రయత్నిస్తుందని మహబూబాబాద్ పార్లమెంట్ బిఆర్ఎస్ అభ్యర్థి మాలోతు కవిత, మాజీ ఎంఎల్ఏ పెద్ది సుదర్శన్‌రెడ్డి విమర్శించారు. నర్సంపేట పట్టణంలోని ఎంఏఆర్ ఫంక్షన్ హాల్‌లో పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా వారు మాట్లాడుతూ ప్రజలు ఏం ఆశించారో తెలియదు కానీ,మనల్ని ఎందుకు వదులుకున్నారో తెలియదు కాని, మనకు అర్థం కాకపోయిన పర్వాలేదు కాని, గెలిచిన వాళ్లకు, గెలిచిన ఎంఎల్ఏలకు కూడా అర్థం కావడంలేదన్నారు. ఇప్పటికి కాంగ్రెస్ పార్టీ గెలిచి నాలుగు నెలలు దాటింది, ఈ నాలుగు నెలల కాలంలో నియోజకవర్గానికి ఏం చేశారో ప్రజలకు వివరించాలన్నారు. ఎన్నికల ముందు కేసీఆర్ మీద, కేసీఆర్ కుటుంబం మీద ఎంత దుష్ప్రచారం చేశాఉ, ప్రజలకు మాయమాటలు చెప్పారో ఇవాల తెలిపోయిందన్నారు. ఎన్నికల ముందు మీనోటి నుండి వచ్చిన ప్రతి మాట సమీక్షిచుకుదామన్నారు. ఇవాళ గెలిచిన ఎంఎల్ఏ నాలుగు నెలలు దాటింది కదా, ఒక్కసారైనా ఈ నియోజకవర్గ అధికారులతో, డిపార్ట్‌మెంట్ అధికారులతో సమీక్షా సమావేశం జరిగిందా అని ప్రశ్నించారు. పల్లెల్లో పంటలు ఎండిపోతున్నాయి కదా, ఒకసారైనా ఇరిగేషన్ అధికారులతో సమీక్ష జరిపిందా మరీ, రైతులు అంటే ఎందుకు ఇంత నిర్లక్ష్యమ అన్నారు. మున్సిపాలిటిలో జరుగుతున్న రూ. 40కోట్ల అభివృద్ధి పనులకు... నిధులు తీసుకొని వచ్చి వాటిని మంజూరు చేయిస్తే అభివృద్ధి చేయలేదని విమర్శించారు. రేపు జరగబోయే ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ ఎంపి అభ్యర్థిని అత్యధిక మెజార్టీతో గెలిపించి పార్లమెంట్‌కు పంపించాలన్నారు. మున్సిపాల్ చైర్ పర్సన్ గుంటి రజనీకిషన్, వైస్ చైర్మన్ మునిగా వెంకట్‌రెడ్డి, ఆర్ఎస్ఎస్ రాష్టట డైరెక్టర్లు, ఎంపిపిలు, జడ్పీటీసీలు, పీఏసీఎస్ చైర్మన్లు, ఎంపీటీసీలు, కౌన్సిలర్లు, మాజీ సర్పంచ్‌లు, తదితరులు పాల్గొన్నారు.

కడియం కావ్యకు భారీ మెజారిటీ ఖాయం

వర్ధన్నపేట ఎమ్మెల్యే కెఆర్ నాగరాజు



ప్రజాపక్షం/హన్మకొండటౌన్: హన్మకొండ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విశ్రాంత ఐపీఎస్, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు సమక్షంలో పర్వతగిరి మండలంలోని తూర్పుతండా, ఇస్లావత్ తండా గ్రామాల నుంచి మాజీ సర్పంచ్, వైస్ ఎంపీపీ బానోతు రవి, మాజీ సర్పంచ్ బానోతు విజయ, ఇస్లావత్ రమేశ్ సుమారు 150 మంది నాయకులు, కార్యకర్తలు, యువకులతో నియోజకవర్గ కోఆర్డినేటర్, జడ్పీటీసీ బానోతు సింగ్‌లాల్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో పాత కొత్త అనే విబేధాలు లేకుండా ప్రతీ ఒక్కరూ కష్టపడి మన వరంగల్ ఎంపీ అభ్యర్థి కడియం కావ్యను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ రైతాంగం సంక్షేమానికి పని చేస్తుందన్నారు. పార్టీలో చేరిన కార్యకర్తలందరినీ కంటికి రెప్పలా కాపాడుకుంటానన్నారు. ఈ కార్యక్రమంలో పర్వతగిరి మండల, గ్రామస్థాయి నాయకులు, కార్యకర్తలు, వివిధ అనుబంధ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సబ్ రిజిస్ట్రార్ ఇంట్లో ఏసిబి సోదాలు

ప్రజాపక్షం/హన్మకొండ ప్రతినిధి : మహబూబాబాద్ సబ్ రిజిస్ట్రార్ తస్లీమా మహ్మద్ ఇంట్లో సోమవారం ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించారు. హన్మకొండలోని తస్లీమా నివాసం ఉంటున్న ఇంటితో పాటు సూర్యాపేటలోని ఆమె భర్త ఉంటున్న ఇంటిలో అధికారులు సోదాలు నిర్వహించినట్లు తెలిసింది. కాగా సబ్ రిజిస్ట్రార్ తస్లీమా మహ్మద్ గత నెల 22న మహబూబాబాద్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుని కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో విచారణ సమయంలో తస్లీమా ఆస్తులకు సంబంధించిన మరిన్ని విషయాలు వెలుగులోకి రావడంతో సోమవారం ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించినట్లు చెబుతున్నారు.

జగదేవ్‌పూర్‌లో దారుణహత్య

పనిమనుషులే హంతకులని నిర్ధారణ

ప్రజాపక్షం/జగదేవ్‌పూర్: సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్ మండల కేంద్రంలో ఆదివారం రాత్రి దారుణం చోటు చేసుకుంది. దుకాణంలో పని మనుషులే ఇంత దారుణానికి ఒడిగట్టడం జిల్లాలో సంచలనంగా మారింది. బాధిత కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం తూప్రాన్ మండల పరిధిలోని వెంకటాపూర్ (పిటి)గ్రామానికిచెందిన మహిపాల్‌రెడ్డి(40)సంవత్సరం క్రితం జగదేవ్‌పూర్‌లోని వినాయక బజారులో రాంరెడ్డి చికెన్ సెంటర్ నిర్వహిస్తున్నారు. అతని వద్ద బీహార్‌కు చెందిన ఇద్దరు వ్యక్తులు గత నేల రోజులుగా చికెన్ సెంటర్‌లో పని మనుషులుగా చేరారు. వారిందరు పని మనుషులు చికెన్ సెంటర్‌లో ఉంటుండగా, మహిపాల్ రెడ్డి మాత్రం పక్క భవనంలో అద్దెకు ఉంటున్నారు. ఆయితే ఆదివారం సాయంత్రం 4.30 గంటలకు మహిపాల్ భార్య మానస ఫోన్ చేసి తమ బందువుల ఇంట్లో ఫంక్షన్ ఉందని త్వరాగ ఇంటికి రమ్మని తెలుపగా, సోమవారం ఓ ఫంక్షన్‌కు చికెన్ ఆర్డర్ ఉందని పంపిన తర్వాత గ్రామానికి వస్తానని తన భార్యకు చెప్పినట్లు వారు తెలిపారు. మళ్లీ 6 గంటల సమయంలో ఆతని ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ వచ్చినట్లు పేర్కొన్నారు. కాగా చికెన్ సెంటర్‌లో పని చేసే కురాబాల్, రూబల్‌కు ఫోన్ చేయగా వారిది కూడ స్విచ్ ఆఫ్ వచ్చింది. సోమవారం ఉదయం చికెన్ సెంటర్‌కు ఎదురుగా ఉన్న పశువుల ధాణ దుకాణం యాజమాని కొండల్‌కు ఫోన్ చేసి మహిపాల్ గురించి తెలుసుకోగా దుకాణం సెట్టర్ వేసి ఉందని అతడు తెలుపడంతో ఆందోళనకు గురైన అతని సోదరుడు బుచ్చిరెడ్డి, బావలు కరుణాకర్, రవీందర్‌రెడ్డిలు జగదేవ్‌పూర్‌కు చేరుకోని సెట్టర్ తెరిచినట్లు తెలిపారు. దుకాణంలోని మూడవ గదిలో ఓ మూలన దుప్పట్లు అన్ని ఒకే దగ్గర ఉండటంతో అనుమానంతో వాటిని పక్కకు తీసి చూడగా మృతుడు మహిపాల్ మెడకు టవల్‌తో గట్టిగా గుంజి ఊపిరి ఆడకుండా చేసి హత్య చేయగా, కాళ్లు, చెతులను వైర్లతో కట్టివేసి మృత దేహన్ని దుప్పట్లో చుట్టి ఉంచారు. దుకాణాంలో వస్తువులు చిద్దరబద్దరగా పడి ఉండగా, ఖాలి మద్యం బాటిల్లు పడిఉన్నాయి. అంతే గాకుండా దుకాణాంలో ఏర్పాటు చేసిన సిసి కెమోరాల ధ్వంసం చేయగా, డ్రాలో ఉన్న రూ. 18 వేలు నగదును కూడ తీసుకున్నట్లు వారు పేర్కొన్నారు. కాగా హత్య జరిగిన అనంతరం దుండగులు దుకాణం వెనుక బాగం నుండి పారారైనట్లు పోలీసులు అనుమానం వ్యక్తం చేశారు. సంఘటన స్థలాన్ని గజ్వేల్ సిఐ మహేందర్‌రెడ్డి, స్థానిక ఎస్ఐ చంద్రమోహన్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. అనంతరం క్లూషు టీంకు సమాచారం అందించగా, వారు హత్య జరిగిన ప్రదేశంలో పలు ఆధారాలను సేకరించారు. అయితే హంతకులు పని మనుషులేననే భావనకు పోలీసులు రాగ, బాధితుల పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకోని విచారణ జరుపుతున్నట్లు తెలిపారు.

ఆరు గ్యారంటీల అమలుకు కాంగ్రెస్ కట్టుబడి ఉంది

మతం పేరుతో బిజెపి రాజకీయం
ఎంఎల్ఎలు ప్రేంసాగర్‌రావు, వివేక్

ప్రజాపక్షం/దండేపల్లి : ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలుకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని మంచిర్యాల ఎంఎల్ఎ కొక్కిరాల ప్రేంసాగర్ రావు, చెన్నూర్ ఎంఎల్ఎ వివేక్ వెంకటస్వామి అన్నారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా దండేపల్లి మండలం మ్యాదరిపేట గ్రామంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పెద్దపల్లి పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గడ్డం వంశీతో కలిసి వారు పాల్గొన్నారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన పలువురు మాజీ సర్పంచులు, వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరగా వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ ప్రభుత్వం మాటల ప్రభుత్వం కాదని చేతల ప్రభుత్వమని ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలలో ఇప్పటికే కొన్నింటిని అమలు చేశామని, మరికొన్ని ఎన్నికలు ముగిశాక చేస్తామని స్పష్టం చేశారు. ఐదు ఎకరాల వరకు రైతుబంధు ఇచ్చామని, మిగితా వారికి కూడా ఇస్తామని, ఆగష్టు 15 వరకు రైతులకు రెండు లక్షల రూపాయల రుణమాఫీ ఏకకాలంలో మాఫీ చేస్తామని తెలిపారు. మంచిర్యాల నియోజకవర్గంలో రైతుల పంట లు ఎండిపోకుండా మంత్రి, ముఖ్యమంత్రితో మాట్లాడి సాగు నీరు అందించామన్నారు. రైతులు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందన్నారు. గత పది సంవత్సరాల పాటు తెలంగాణను పాలించిన బిఆర్ఎస్ పార్టీ రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టిందని, ఎక్కడ పాలుపోక కాంగ్రెస్ ప్రభుత్వంపై లేనిపోని నిందలు మోపుతుందని విమర్శించారు. మతం పేరుతో బిజెపి రాజకీయం చేస్తుందని, రాముడు మనకు దేవుడు కాదా అని ఆయన ప్రశ్నించారు. కల్లబొల్లి మాటలు చెప్పి యువకులను మతం పేరుతో బిజెపి రెచ్చగొట్టుతుందని, బిజెపి ఉచ్చులో యువత చిక్కవద్దని హితవు పలికారు. కార్యక్రమంలో ఎంపిపి గడ్డం శ్రీనివాస్, జడ్‌పిటిసి గడ్డం నాగరాణి త్రిమూర్తి, ఎంపిటిసిలు ముత్యాల శ్రీనివాస్, బొడ్డు కమాలకర్, మన్నే మణెమ్మ, కొంగల నవీన్, కంది హేమలత సతీష్, వనపర్తి మాలిక రవితో పాటు పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఛత్రపతి శివాజీ విగ్రహ ఆవిష్కరణ

దండేపల్లి : దండేపల్లి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహాన్ని మంచిర్యాల, చెన్నూర్ ఎంఎల్ఎలు కొక్కిరాల ప్రేంసాగర్ రావు, గడ్డం వివేక్ వెంకటస్వామి, కాంగ్రెస్ పార్టీ పెద్దపల్లి పార్లమెంట్ అభ్యర్థి గడ్డం వంశీలు సోమవారం ఆవిష్కరించారు. ఛత్రపతి శివాజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శివాజీ పోరాట పటిమ, వీరత్వం గురించి కొనియాడారు. కార్యక్రమంలో ఎంపిపి గడ్డం శ్రీనివాస్, జడ్‌పిటిసి సభ్యురాలు గడ్డం నాగరాణి త్రిమూర్తి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అక్కల వెంకటేశ్వర్లు, స్థానిక ఎంపిటిసి ముత్యాల శ్రీనివాస్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

యుద్ధప్రాతిపదికపై వర్ష నష్టనివారణ చర్యలు : అధికారులను కోరిన కూనంనేని

ప్రజాపక్షం/లక్ష్మీ దేవిపల్లి : జిల్లావ్యాప్తంగా సోమవారం కురిసిన వడగండ్ల వాన, భారీ ఈదురుగాలులతో తీవ్రంగా నష్టం వాటిల్లిందని, తక్షణ మే అధికార యంత్రాంగాన్ని అప్రమత్తంగా చేసి యుద్ధప్రాతిపదికన నష్ట నివారణ చర్యలు చేపట్టాలని కొత్తగూడెం ఎంఎల్ఎ కూనంనేని సాంబశివరావు కోరారు. ఈ మేరకు మంగళవారం జిల్లా కలెక్టర్ కు, విద్యుత్‌శాఖ జిల్లా అధికారులకు ఫోన్ చేశారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ వడగండ్ల వాన, ఈదురుగాలులతో పేదల ఇళ్ళు, గుడిసెలు నేలమట్టం అయ్యాయని, విద్యుత్ స్థంభాలు నేలకొరిగి అనేక గ్రామాలు, పట్టణాల్లోని బస్తీలు అంధకారంలోకి నెట్టివేయబడ్డాయని, తక్షణమే విద్యుత్ పునఃరుద్ధరణ పనులు చేపట్టాలని, ఇళ్ళు కోల్పోయిన పేదలకు తక్షణమే పరిహారం అందజేసే విధంగా చర్యలు తీసుకోవాలని, పూర్తిగా ఇళ్ళు కోల్పోయిన వారికి ప్రభుత్వ గృహ పథకం మంజూరు చేయించాలని, మామిడి, మిర్చి ఇతర పంటలు పూర్తిగా దెబ్బతిని రైతులు తీవ్రంగా నష్టపోయారని సంబంధిత వ్యవసాయశాఖ అధికారులతో సర్వే ఏపట్టి నష్టాన్ని అంచనా వేసి ప్రభుత్వం నుంచి పరిహారం అందేలా చర్య తీసుకోవాలని జిల్లా ఉన్నతాధికారులను కూనంనేని కోరారు.

విద్యార్థుల సమస్యల పరిష్కారానికి పోరాటాలు : ఎఐఎస్ఎఫ్

ప్రజాపక్షం/ముత్తారం : విద్యార్థుల సమస్యల పరిష్కారానికి పోరాటాలే శరణ్యమని ఎఐఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు రేణుకుంట్ల ప్రీతం అన్నారు. ఎఐఎస్ఎఫ్ చేస్తున్న ఉద్యమాలకు, పోరాటాలకు ఆకర్షితులై పలువురు ఎస్ఎఫ్ఐ నాయకులు ఎఐఎస్ఎఫ్ చేరారు. ఈ సందర్భంగా ప్రీతం మాట్లాడుతూ విద్యార్థిలోకం విద్య ప్రైవేటీకరణ కాషాయీకరణకు వ్యతిరేకంగా పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం మంథని, ముత్తారం మండల కమిటీలను ఎన్నుకున్నారు. ఎడవేనా కౌశిక్, మేదరి కుమార్, మామిడాల సిద్ధార్థ, మడిగే సాయికుమార్, నరేండ్ల విగ్నేష్, సొల్లు సృజన్, అభిరామ్, సాయి మణిదీప్ ,సుజల్ ,అజయ్, వినోద్, రవి వర్మ, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుడికి ఎఐటియుసి సన్మానం

ప్రజాపక్షం/కమాన్‌పూర్ : తెలంగాణ వ్యాప్తంగా మేడ్చల్ జిల్లా లో ఏప్రిల్ 10న జరిగిన వెటర్నస్ క్యారం బోర్డు స్టేట్ టోర్నమెంట్ లో లద్నాపూర్ గ్రామానికి చెందిన అద్దూరి. రాజయ్య మొదటి బహుమతి సాధించిన సందర్భంగా ఆర్జీ3 ఎఐటియుసి ఆఫీసులో డిప్యూటీ జనరల్ సెక్రెటరీ వైవి. రావు, సెంట్రల్ సెక్రెటరీ జూపక. రామచందర్‌రావు, బ్రాంచ్ సెక్రెటరీ, ఎంఆర్‌సి రెడ్డి నాయకులు రాజయ్యకు శాలువతో సన్మానం చేశారు. వైవి రావు మాట్లాడుతూ రాజయ్య సింగరేణిలో పనిచేస్తున్న సమయంలో సింగరేణిలో అనేక క్రీడలలో పాల్గొన్నారని, సింగరేణి కార్మికులు రాజయ్యను ఆదర్శంగా తీసుకొని ఆటలలో రాణించాలని సూచించారు.

స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ సెంటర్లు పరిశీలించిన సిపి

ప్రజాపక్షం/మంచిర్యాల క్రైం : లోక్ సభ ఎన్నికల నేపథ్యంలో పెద్దపల్లి పార్లమెంట్ పరిధి మంచిర్యాల జిల్లా కేంద్రంలోని స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ సెంటర్ లను సోమవారం రామగుండం పోలీస్ కమిషనర్ ఎం. శ్రీనివాస్ సందర్శించారు. ఎన్నికల నామినేషన్ దాఖలు ప్రక్రియ మొదలు కావడంతో జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్‌తో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ జిల్లాలో ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

సకాలంలో ధాన్యం కొనుగోళ్లు

అదనపు కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌లాల్

ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి : జిల్లాలో రైతులు పండించిన ధాన్యాన్ని మద్దతు ధరపై సకాలంలో కొనుగోలు చేయాలని అదనపు కలెక్టర్ జివి శ్యామ్ ప్రసాద్ లాల్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం అదనపు కలెక్టర్ పెద్దపల్లి, సుల్తానాబాద్ మార్కెట్ యార్డులలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యాసంగి సీజన్‌కు సంబంధించి నాణ్యమైన ధాన్యాన్ని చివరి గింజ వరకు మద్దతు ధరపై కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. నాణ్యత ప్రమాణాల ప్రకారం తేమ శాతం వచ్చిన తర్వాత ధాన్యాన్ని త్వరితగతిన కొనుగోలు చేయాలని అదనపు కలెక్టర్ సూచించారు. వర్షభావ పరిస్థితుల దృష్ట్యా ధాన్యం కొనుగోలు కేంద్రాలలో రైతులకు అవసరమైన టార్పాలిన్ కవర్లు అందుబాటులో పెట్టాలని, కొనుగోలు చేసిన ధాన్యం వివరాలను ఎప్పటికప్పుడు ట్యాబ్ లలో నమోదు చేసి రైతులకు సకాలంలో చెల్లింపులు జరిగేలా చూడాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో సివిల్ సప్లై జిల్లా మేనేజర్ శ్రీకాంత్ రెడ్డి, సంబంధిత శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు సత్వర న్యాయం

ఎస్‌పి అఖిల్ మహాజన్

ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల ప్రతినిధి : బాధితులకు సత్వర న్యాయం చేయడానికి ప్రతి సోమవారం గ్రీవెన్స్ డే కార్యక్రమం నిర్వహిస్తున్నామని జిల్లా ఎస్ పి అఖిల్ మహాజన్ తెలిపారు. సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమనికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి 14 ఫిర్యాదులు స్వీకరించినట్టు తెలిపారు. ఫిర్యాదులపై ఆయా పోలీస్ స్టేషన్ల అధికారులకు ఫోన్ చేసి బాధితుల సమస్యలను చట్టపరంగా పరిష్కరించాలని ఆదేశించారు. భూతగాదాలు, ఆస్థి తగాదాల విషయంలో చట్ట ప్రకారం, నిబంధనలకు అనుగుణంగా నడుచుకుంటూ బాధితులకు సత్వర న్యాయం అందించే విధంగా చూడాలని సూచించారు. గ్రీవెన్స్ డే ఫిర్యాదులు ఏ మేరకు పరిష్కారం అయ్యాయో ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ ప్రజలకు మరింత సమర్థవంతంగా సేవలం దిస్తున్నామన్నారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ నిర్వహిస్తూనే అసాంఘిక శక్తులు, నేరస్థుల పట్ల కఠిన వైఖరి అవలంభిస్తూ శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా చూస్తామన్నారు. గ్రీవెన్స్ డే ద్వారా ప్రజలు నేరుగా తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావడం ద్వారా సాధ్యమైనంత త్వరగా వాటిని పరిష్కరించేలా చూస్తామని ఎస్‌పి తెలిపారు.

పెద్దపల్లి ఎంపి స్థానానికి 14 నామినేషన్లు

ప్రజా పక్షం/పెద్దపల్లి ప్రతినిధి : పెద్దపల్లి పార్లమెంటు స్థానానికి సోమవారం 14 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసినట్లు పెద్దపల్లి పార్లమెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఒక ప్రకటనలో తెలిపారు. స్వతంత్ర అభ్యర్థులుగా దుర్గం సమ్మయ్య, అక్కపాక తిరుపతి (రెండవసెట్), ఆర్నకొండ రాజు, గడ్డం మారుతి, రాముల కార్తీక్, జుమ్మిడి గోపాల్, అంబాల మహేందర్, జనగామ నరేష్, ముల్కల్ల రాజేంద్ర ప్రసాద్, జాడి ప్రేమ్ సాగర్ (రెండవ సెట్), దాగం సుధారాణి, ధర్మ సమాజ్ పార్టీ అభ్యర్థిగా మంద రమేష్ తలా ఒక సెట్ దాఖలు చేసారని, స్వతంత్ర అభ్యర్థులు గద్దల వినయ్ కుమార్, బొట్ల చంద్రయ్య లు తలా రెండు సెట్ల నామినేషన్ పత్రాలను దాఖలు చేశారని, ఇప్పటి వరకు నాలుగు రోజులు కలుపుకొని ఇరవై ఐదు మంది అభ్యర్థులు మొత్తంగా 31 సెట్ల నామినేషన్ లు దాఖలు చేసినట్లు పెద్దపల్లి పార్లమెంటు ఎన్నికల రిటర్నింగ్ అధికారి ముజమ్మిల్ ఖాన్ తెలిపారు.

సమస్యలే ఎజెండాగా ప్రజలపక్షాన కొట్లాడుదాం

బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్

ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల ప్రతినిధి : ప్రజల సమస్యలే ఎజెండాగా, కాంగ్రెస్, బీజేపీ మోసాలను ఎండగడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో కొట్లాడుదామని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ అన్నారు. సిరిసిల్ల తెలంగాణ భవన్‌లో సోమవారం సిరిసిల్ల పట్టణ క్లస్టర్ స్థాయి సమావేశంలో పాల్గొని పార్లమెంటు ఎన్నికలపై పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు. గత అసెంబ్లీ ఎన్నికల ఫలితాలలో చాలా స్థానాల్లో స్వల్ప మెజారిటీ తేడాలో కాంగ్రెస్ విజయం సాధించిందన్నారు. అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌పై వంద రోజుల్లోనే ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చిందన్నారు. పార్లమెంటు ఎన్నికలలో బిఆర్ఎస్ పార్టీకే విజయావకాశాలు మెండుగా ఉన్నాయన్నారు. కాంగ్రెస్‌కు ఓటు వేయకపోతే ఫ్రీ బస్సు తీసేస్తాం అంటున్నారని ప్రజలు ఆలోచన చేస్తున్నారన్నారు. కాంగ్రెస్ మోసపు హామీలను ప్రజల్లోకి తీసుకెళ్ళాలన్నారు. ఐదేళ్ల ఎంపీగా ఉన్న బండి సంజయ్ కరీంనగర్‌కు చేసిందేమీ లేదని, ఐదేళ్లలో ఒక్క పాఠశాల, ఒక్క కళాశాల తీసుకొచ్చాడా? ఒక్క గుడి కట్టాడా? ఒక్క పరిశ్రమనైనా తీసుకొచ్చాడా అని ప్రశ్నించారు. మోడీ పదేండ్ల పాలనలో నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని తాకాయని, తెలంగాణకు ఏమి చేయని బిజెపికి, కరీంనగర్‌కు నయాపైసా పనిచేయని బండి సంజయ్‌కు ఓటు ఎందుకు వేయాలో ప్రజల్లో చర్చ పెట్టాలన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి వినోద్ కుమార్ గెలుపు వలన కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గాన్ని మరింతగా అభివృద్ధి చేసుకోవచ్చన్నారు. పార్లమెంటు ఎన్నికల ప్రచారంలో భాగంగా మే పది న కేసీఆర్ రోడ్ షో సిరిసిల్లలో ఉంటుందని, ప్రతి కార్యకర్త తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు. కొందరు స్వార్థ ప్రయోజనాల కోసం లబ్ధి పొందిన నాయకులు పార్టీని వీడి వెళ్తున్నారన్నారు. కష్ట కాలంలో నా వెంట నిలిచిన మీకు నేను అండగా ఉంటానన్నారు. భవిష్యత్తులో స్థానిక సంస్థల ఎన్నికల్లో మీ గెలుపు కోసం కష్టపడ్తానన్నారు. కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్ నాయకులపై పార్టీలో చేరాలని ఒత్తిడి చేస్తున్నారని, కాంగ్రెస్‌లో చేరని వారిపై అక్రమ కేసులు పెడుతూ వేధింపులకు గురి చేస్తున్నారని, ఎవరు అధైర్యపడొద్దని, అందరికీ అండగా ఉంటానని కెటిఆర్ భరోసా ఇచ్చారు.

గడువులోపే ఆదర్శ పాఠశాల పనుల పూర్తి

నిర్మల్ జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఆదేశం

ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ : అమ్మ ఆదర్శ పాఠశాల కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలో పనులను ప్రారంభించి నిరేశించిన గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సంబంధిత శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అమ్మ ఆదర్శ పాఠశాల కార్యక్రమంలో భాగంగా పట్టణ,గ్రామీణ ప్రాంతాలలో వెంటనే పనులను ప్రారంభించాలని సూచించారు. జిల్లాలోని 672 ప్రభుత్వ పాఠశాలల్లో త్రాగు నీరు,విద్యుత్ సౌకర్యాలు, సౌర ఫలకల ఏర్పాటు, మరుగుదొడ్ల నిర్మాణం, నిర్వహణ, స్లాబ్ల మరమ్మత్తులు, గ్రిల్స్ ఏర్పాటు ఇతర మౌలిక సదుపాయాల కల్పన, మరమ్మత్తులు చేపట్టాలని ఆదేశించారు. ఇజిఎస్ కింద మరుగుదొడ్ల నిర్మాణాలను చేపట్టాలని సూచించారు. పనులలో నాణ్యత ప్రమాణాలు పాటించాలన్నారు. వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభం అయ్యే నాటికి విద్యార్థులకు అన్ని సౌకర్యాలు సిద్ధంగా ఉండాలని సూచించారు. సమావేశంలో డీఈవో రవీందర్‌రెడ్డి, డిఆర్‌డిఓ విజయలక్ష్మి , ఇంజనీరింగ్ అధికారులు అశోక్ కుమార్, శంకరయ్య, నిర్మల్, బైంసా, ఖానాపూర్ మున్సిపల్ కమిషనర్లు రాజు, వెంకటేశ్వర్ రావ్, మనోహర్, ఇతర అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

సిఎంఆర్ సరఫరాను వేగవంతంగా పూర్తిచేయాలి

నిర్మల్ టౌన్: ఎంఆర్ సరఫరాను వేగవంతంగా పూర్తిచేయాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రెవెన్యూ, పౌర సరఫరాల శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కస్టమ్ మిల్లింగ్ రైస్ సరఫరాను నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలనీ సూచించారు. నిర్లక్ష్యం వహించిన మిల్లర్లపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని, మిల్లుల వారీగా మిల్లింగ్, ధాన్యం నిల్వలపై రిపోర్టులను అందజేయాలని ఆదేశించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. వరి కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. కొనుగోలు కేంద్రాలపై ఫిర్యాదులు వస్తే చర్యలు తప్పవని, మద్దతు ధరతో రైతుల నుంచి ధాన్యాన్ని కొనుగోలు చేయాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ కిషోర్‌కుమార్, ఆర్డిఓలు రత్నాకల్యాణి, కోమల్ రెడ్డి, డిఆర్‌డిఓ విజయలక్ష్మి, డీఎస్ఓ నందిత, డిఎం సివిల్ సప్లైయి శ్రీకళ, డిసిఓ నర్సయ్య, డిఏఓ అంజిప్రసాద్, అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

ఆదిలాబాద్ ఎంపి స్థానానికి కాంగ్రెస్ అభ్యర్థి ఆత్రం సుగుణ నామినేషన్

ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ : ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గానికి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా ఆత్రం సుగుణ,జిల్లా ఇన్చార్జి మంత్రి సీతక్కతో కలిసి ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి రాజర్షిషాకు నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప, నిర్మల్ డీసీసీ అధ్యక్షులు శ్రీహరి రావులు నామినేషన్ కార్యక్రమానికి హాజరయ్యారు. అనంతరం మంత్రి సీతక్క మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో రాష్ట్రంలో ఐదు గ్యారెంటీలు అమలు చేశామని త్వరలోనే రెండు లక్షల రుణమాఫీ అమలు చేస్తామన్నారు. ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గానికి ఆత్రం సుగుణను ఎంపిగా గెలిపించుకుంటామన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించి రాహుల్ గాంధీని ప్రధానమంత్రిని చేద్దామని పిలుపునిచ్చారు. దేశంలో మోడీ ప్రభుత్వం పేద ప్రజలకు చేసింది ఏమీ లేదని విమర్శించారు. వచ్చేది ఇండియా కూటమి ప్రభుత్వమన్నారు.

రోగులకు మెరుగైన వైద్యసేవలు

కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

ప్రజాపక్షం/ఆసిఫాబాద్ : ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ వెంకటేశ్‌ధోత్రే అన్నారు. సోమవారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిని సూపరిండెంట్ చెన్నకేశవులతో కలిసి పరిశీలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులను పరామర్శించారు. వైద్యులు, సిబ్బందితో వైద్యసేవలపై, పలు అంశాలపై తగిన సూచనలు చేశారు. సమయపాలన పాటిస్తూ రోగులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా చూడాలని ఆదేశించారు.కార్యక్రమంలో డిఎంహెచ్ఓ తుకారం భట్, మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ నాగార్జున చారి, ఆసుపత్రి సూపరిండెంట్ చెన్నకేశవులు, ఇంజనీర్లు, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

పౌరులకు ఓటుహక్కు వజ్రాయుధం

జిల్లా ఎన్నికల అధికారి బదావత్ సంతోష్

ప్రజాపక్షం/మంచిర్యాల ప్రతినిధి : లోక్ సభ ఎన్నికలలో భాగంగా మే 13 పోలింగ్ రోజున అర్హత గల ప్రతిఒక్కరు తమ ఓటుహక్కు వినియోగించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. సోమవారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయం ఆవరణ లో ఓటరు సెల్ఫీ బోర్డులను అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కిషన్, సహాయ కార్మికశాఖ కమిషనర్ వినీతలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాజ్యాంగం భారత పౌరులకు కల్పించిన ఓటుహక్కు వజ్రాయుధమన్నారు. వాట్సాప్, సోషల్ మీడియా వేదికగా అర్హత గల వారందరు ఓటుహక్కు వినియోగించుకునేలా ప్రోత్సహించాలని తెలిపారు. జిల్లా సంక్షేమశాఖ అధికారి కె.చిన్నయ్య, స్వీప్ సమన్వయకర్త రాంచందర్ పాల్గొన్నారు.

మావోల ఏరివేతకు మరో అస్త్రం ఆపరేషన్ 'కగర్'

ఐదు రాష్ట్రాలను అప్రమత్తం చేసిన కేంద్ర ఇంటిలిజెన్స్
మావోయిస్టు ప్రభావిత ప్రాంత అధికారులతో డిజిపి రవిగుప్త అత్యవసర సమావేశం

ప్రజాపక్షం/భద్రాచలం :మావోయిస్టుల ఏరివేత లక్ష్యంగా కొనసాగుతున్న యుద్ధంలో భద్రతా బలగాలు వరుస విజయాలను తమ ఖాతాలో వేసుకుంటున్నాయి. వేసవిలో ఆకురాలే కాలం కావడంతో దట్టమైన అడవులు మొత్తం పలుచబడి కూంబింగ్‌కు పరిస్థితులు అనుకూలించడంతో ఈమధ్య కాలంలో జరిగిన ఎదురుకాల్పుల్లో సమారు 80 మంది మావోయిస్టులను హతం చేయగలిగారు. మావోయిస్టులకు పెట్టని కోటగా ఉన్న అబూజ్‌మండ్ దట్టమైన అడవులు ఎత్తైన కొండల్లో మావోయిస్టు పార్టీ శాశ్వత స్థావరాలను ఏర్పాటు చేసుకుని సమాంతర పాలన సాగిస్తోంది. బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మావోయిస్టుల ఏరివేతే లక్ష్యంగా ఆపరేషన్ ప్రహార్, ఆపరేషన్ సమాధాన్ చేపట్టి ముందుకు సాగుతోంది. ఆ లక్ష్యాన్ని మరింత బలపరుచుకుని దండకారణ్యంలో మావోయిస్టు కదిలకలు లేకుండా చేసేందుకు మరోఅస్త్రం ఆపరేషన్ కంగర్‌కు శ్రీకారం చుట్టుంది. ప్రతీ రెండు కిలోమీటర్లకు ఒక సైనిక శిబిరం ఏర్పాటు చేయడంతో పాటు అబూజ్‌మడ్‌ను ఛేదించే లక్ష్యంగా వేలాది మంది కేంద్ర పారామిలటరీ బలగాలను అడవుల్లోకి పంపుతోంది. అత్యాధునిక అయుధాలను అందించి దండకారణ్యంలో సాగుతున్న సమాంతర పాలనను అంతమొందించేందుకు ఆపరేషన్ కంగర్ పేరుతో కేంద్ర హోం శాఖ మరో అడుగు ముందుకేసింది.

అప్రమత్తం... ఛత్తీస్‌గఢ్‌తో పాటు పొరుగున ఉన్న నాలుగు రాష్ట్రాలైన ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, ఒడిస్సా, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాల పోలీసులు, పారామిలటరీ బలగాలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని కేంద్ర ఇంటిలిజెన్సీ హెచ్చరించింది. దీంతో ఐదు రాష్ట్రాల పోలీస్ బాస్ అలెర్ట్ అయ్యారు. ఛత్తీస్‌గడ్ రాష్ట్రంలోని ఈ మధ్య వరుసగా చోటు చేసుకుంటున్న ఎదురు కాల్పుల్లో మావోయిస్టులు భారీనష్టాన్ని చవిచూశారు. కాంకేర్ జిల్లాలో చోటు చేసుకున్న ఎన్ కౌంటర్‌లో ఏకంగా 29 మంది మావోయిస్టులు ఒకేసారి హతమయ్యారు. ఇది మావోయిస్టు చరిత్రలో అతినష్టంగా చెబుతున్నారు. దీనిని మావోయిస్టు పార్టీకేంద్ర కమిటీ సీరియస్‌గా తీసుకుందని, ప్రతీకారాన్ని తీర్చుకునేందుకు ఆ పార్టీ ఖచ్చితంగా ప్రణాళికలు చేస్తుందని, ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటూ నిఘా పెంచాలని హెచ్చరించిన దరిమిలా అప్రమత్తమయ్యారు. అబూజ్‌మఢ్‌లోని మావోయిస్టుల స్థావరాలను ఇప్పటికే కనిపెట్టిన భద్రతా బలగాలు ముందు కు సాగి విజయం సాధించాయి. అక్కడి దట్టమైన అడవులు, కొండ చెరయల్లో శత్రువులను ఛేదించడం అంత సులువైన విషయం కాకపోయినప్పటికీ పెద్దసంఖ్యలో బలగాలు ఆప్రాంతాలను చుట్టుముట్టి జల్లెడ పడుతున్నాయి.

డిజిపి దిశా నిర్దేశం... కేంద్ర ఇంటిలిజెన్సి వర్గాలు హెచ్చరించిన నేపథ్యంలో డిజిపి రవిగుప్తా సోమవారం మావోయిస్టు ప్రభావిత ప్రాంతమమైన భద్రాద్రి కొత్తగూడె ం జిల్లాలో పర్యటించి మూడు జిల్లాల ఎస్‌పిలకు దిశానిర్దేశాన్ని చేశారు. భద్రాద్రి కొత్తగూడెం, ములుగు, భూపాలపల్లి జిల్లాల్లో పోలీస్ అధికారులతో బూర్గంపాడు మండల పరిధిలోని సారపాకలో గల ఐటిసి పిఎస్‌పిడిలో అత్యవసర సమావేశాన్ని ఏర్పాటు చేశారు. మూడు జిల్లాల ఎస్‌పిలకు పలు చూచనలు చేసినట్లు తెలుస్తోంది. ఛత్తీసగఢ్‌లో ఎదురుదెబ్బతిన్న మావోయిస్టులకు ప్రస్తుతం అనువైన రహస్య స్థావరాలు లేకపోవడంతో తెలంగాణలోని అడవుల్లోకి తలదాచుకునేందుకు వచ్చే అవకాశం ఉందని, దీనిపై నిఘా పెంచాలని చెప్పినట్లు తెలుస్తోంది. నదీ తీర ప్రాంతాలోల నిఘా పెంచాలని, పడవకాచువారితో గోదావరి తీర ప్రాంత గ్రామాల ప్రజలతో సమావేశాలు ఏర్పాటు చేసి కొత్తవ్యక్తులు తారసపడితే పోలీసులకు చెప్పాలని కోరాలని తెలిపినట్లు తెలుస్తోంది. అనంతరం ఆయన చర్ల మండల పరిధిలోని పూసుగుప్ప, చెన్నాపురం, ఒద్దిపేట బేస్ క్యాంపులను పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడ పలు సూచనలు చేసినట్లు తెలుస్తోంది.

గట్టి నిఘా... మావోయిస్టుల ఏరివేతే లక్ష్యంగా సాగుతున్న ఆపరేషన్ కంగర్ ముందుకు సాగనుంది. ఈ క్రమంలో నదీతీరాల వెంట మావోయిస్టుల కోసం భద్రతా బలగాలు గట్టి నిఘా పెంచాయి. గోదావరి, ప్రాణహిత, ఇంద్రావతి నదులతో పాటు నర్మదా నదీ తీరాల వెంట మావోయిస్టు కదలికలపై డ్రోన్లతో నిఘా పెంచుతున్నారు. పోలీసులు ఫెర్రీ పాయింట్లతో పాటు నదీతీరం వెంట ఉన్న గ్రామాల్లో సమావేశాలు ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలను రచిస్తున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఉక్కిరిబిక్కిరి అవుతున్న మావోయిస్టు పార్టీ ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర అడవుల్లో నుండి తెలంగాణలోనికి ప్రవేశించి తలదాచుకునే అవకాశం ఉన్నందున ఆ దారులన్నింటినీ స్వాదీనంలోనికి తీసుకుంటున్నారు. వాహన తనిఖీలతో పాటు అనుమానితులను ప్రశ్నిస్తున్నారు. మావోయిస్టుల ఏరివేతే లక్ష్యంగా సాగుతున్న యుద్ధంలో ఏ క్షణం ఏం జరుగుతుందో అంతుపట్టక ఆదు రాష్ట్రాల్లోని అటవీ గ్రామాల ప్రజలు భీతిల్లుతున్నారు.

మోదీని పోటీకి అనర్హుడిగా ప్రకటించాలి

టిపిసిసి ఉపాధ్యక్షులు జి.నిరంజన్

ప్రజాపక్షం / హైదరాబాద్ : దేశ చరిత్రలో మోదీలా దిగజారి మాట్లాడిన ప్రధానిని ఇప్పటి వరకు చూడలేదని టిపిసిసి ఉపాధ్యక్షులు జి.నిరం జన్ అన్నారు. కాంగ్రెస్ మానిఫెస్టోలో మోడీ ఆరో పించినట్లు దేశ సంపదను, మహిళల వద్ద ఉన్న బంగారాన్ని ఇతరులకు పెంచుతామని ఎక్కడైనా ఉందా? అని ప్రశ్నిం చారు. గాంధీభవన్‌లో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రాజస్తాన్‌లో తన ప్రసంగం ద్వారా మోదీ ప్రధానిగా ఉండే నైతిక అర్హత కోల్పోయారని అన్నారు. ప్రధాని బహిరంగ క్షమాపణలు చెప్పకపోతే, ఎన్నికల్లో పోటీకి ఆయనను ఎన్నికల సంఘం అనర్హుడిగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. దీనిపై ఇసికి లేఖ రాసినట్లు నిరంజన్ తెలిపారు.

మ్యానిఫెస్టోలలో బిసిలకు 50 శాతం రిజర్వేషన్

తాటిపాముల వెంకట్రాములు డిమాండ్

ప్రజాపక్షం/హైదరాబాద్: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో చట్టసభలలో బిసిలకు 50 శాతం రిజర్వేషన్లను అమలు చేస్తామని రాజకీయ పార్టీలు తమ ఎన్నికల ప్రణాళికలలో పొందపర్చాలని బిసి హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు తాటిపాముల వెంకట్రాములు డిమాండ్ చేశారు. 77 సంవత్సరాల స్వాతంత్ర్యనంతరం కూడా దేశంలో బిసి,ఎస్‌సి,ఎస్‌టి, పీడిత, తాడిత వర్గాలు అణచివేతకు గురవుతున్నారని ఆయన సోమవారం ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. బిసిలు సామాజిక, ఆర్థిక, రాజకీయంగా, విద్య, వ్యాపార, వాణిజ్య మొదలైన అన్ని రంగాల్లో వెనుకబడి ఉండటానికి రాజ్యాధికారంలో సరైన వాటా లేకపోవడమే ప్రధానమైన కారణమని తెలిపారు. దేశ జనాభాలో 56 శాతానికి పైగా ఉన్న బిసిలు చట్టసభలలో సరైనప్రాతినిధ్యానికినోచుకోలేదన్నారు. దేశవ్యాప్తంగా బిసి కులగణన జరగాలని ,చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్లు కేటాయించాలని అనేకఉద్యమాలు జరుగుతున్నప్పటికీ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు గా వ్యవహరించడంశోచనీయమన్నారు.

జనగామ మార్కెట్‌లో రైతుల ఆందోళన

ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి : గత నాలుగు రోజులుగా మార్కెట్‌లో ధాన్యం నిల్వలు పేరుకుపోయిన నేపథ్యంలో సేవలు ప్రకటించగా సోమవారం పెద్దమొత్తంలో రైతులు ధాన్యం తీసుకువచ్చారు. మార్కెట్‌లోని ధాన్యంతో పాటు రైతులు టాక్టర్లలో తెచ్చిన ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రైతు సంఘం నాయకులతో పాటు రైతులు మార్కెట్ కార్యాలయం ముందు బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. సిపిఐ జిల్లా కార్యదర్శి మాజీ ఎంఎల్‌ఎ సిహెచ్ రాజారెడ్డి, సిపిఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి, రైతు సంఘం జనగామ జిల్లా కార్యదర్శి ఆది సాయన్నతో పాటు పలువురితో అధికారులు చర్చలు జరిపారు. వారి చర్చలు సానుకూలంగా లేకపోవడంతో ఆందోళన ఉద్రిక్తంగా మారింది. దీనితో పోలీసులు పలువురిని అరెస్ట్ చేశారు. అనంతరం ధాన్యం కొనుగోలు చేయకుండా అరెస్ట్ చేయడం ఏంటని మండిపడుతూ అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి సిహెచ్ రాజారెడ్డి, సిపిఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి మాట్లాడుతూ జనగామ మార్కెట్‌లో అధికారులు, వ్యాపారులు రైతుల చెలగాటం అడుతున్నారన్నారు. తేమ పేరుతో రైతుల్ని వ్యాపారులు దోపిడి చేస్తున్నారన్నారు. మార్కెట్‌లో జరిగే దోపిడిని అరికట్టడంతో పాటు ఎప్పటికి అప్పులు మార్కెట్‌కు వచ్చే ధాన్యాన్ని కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు చొప్పరి సోమయ్య హమాలి యూనియన్ నాయకులు రాజు, రైతు సంఘాల నాయకులు మీట్యానాయక్, చందునాయక్, ఉపేందర్ పాల్గొన్నారు.

ప్రపంచ కమ్యూనిస్టునేత లెనిన్

ప్రజాపక్షం/హనుమకొండ టౌన్: పేదరికం, మతం, జాతి, వర్గ అసమానతలు లేని దోపిడి రహిత సమాజం కోసం పరితపించిన కమ్యూనిస్టు ప్రపంచ మహానేత లెనిన్ అని సిపిఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి అన్నారు. సోమవారం హనుమకొండ బాలసముద్రంలోని సిపిఐ జిల్లా కార్యాలయంలో రష్యా విప్లవనేత లెనిన్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల మల్లేష్, ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర నాయకులు రహమాన్, సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు బాషబోయిన సంతోష్, వేల్పుల చరణ్, శ్రీపతి వినయ్, శివ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి, యువతను విస్మరించిన

బిజెపిని ఓడిద్దాం

ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి

ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి : దేశంలో గత 10 సంవత్సరాలుగా అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం విద్యార్థి, నిరుద్యోగులను పూర్తిగా విస్మరించిందని ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి దుయ్యబట్టారు. పేద విద్యార్థులకు విద్యను దూరం చేసే విధంగా నూతన జాతీయ విద్యావిధానాన్ని తీసుకువచ్చిందన్నారు. విద్య కాషాయీకరణ, ప్రైవేటీకరణ, కార్పోరేటీకరణ చేసిన మోదీ ప్రభుత్వాన్ని పార్లమెంటు ఎన్నికల్లో ఓడించడానికి విద్యార్థి లోకాన్ని ఏకం చేస్తామని పేర్కొన్నారు. కరీంనగర్ ఎంపిగా బండి సంజయ్ విద్యార్థులు, యువకుల కోసం చేసిందేమీ లేదన్నారు. ఈ మేరకు సోమవారం కరీంనగర్‌లోని బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ ఆధ్వర్యంలో విద్యార్థి, నిరుద్యోగులను విస్మరించిన బిజెపిని ఓడించాలని పిలుపునిస్తూ ప్రచురించిన పోస్టర్‌ను వారు విడుదల చేశారు. ఈ సందర్భంగా మణికంఠరెడ్డి మాట్లాడుతూ కరీంనగర్‌లో ట్రిపుల్ ఐటీ ఏర్పాటు, యువతకు రెండు కోట్ల ఉద్యోగాల భర్తీపై ఏనాడూ బండి సంజయ్ పార్లమెంటులో గొంతెత్తలేదన్నారు. పార్లమెంటు ఎన్నికల్లో విద్యార్థులు, యువకులు బిజెపిని ఓడించాలని పిలుపునిచ్చారు. బిజెపి ప్రభుత్వం గత పదేళ్ల పాలనలో విద్య, ఉపాధి కల్పించడంలో పూర్తిగా వైఫల్యం చెందారన్నారు. 2014 ఎన్నికల హామీలో యేడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని పదేళ్ల అధికారంలో ఉండి భర్తీ చేయలేదన్నారు. విద్యకు ప్రతి బడ్జెట్‌లో కనీసం పది శాతం నిధులు కేటాయించకుండా విద్యారంగం పట్ల వివక్ష చూపారన్నారు. తెలంగాణ విభజన హామీల ప్రకారం, తెలంగాణ విభజన హామీల ప్రకారం తెలంగాణకి విద్యాసంస్థలు కేటాయించకుండా తెలంగాణ విద్యార్థి లోకం పట్ల మోదీ కక్ష్య పూరితంగా వ్యవహరించారన్నారు. జిల్లాలో నవోదయ పాఠశాల, కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు చేయాలని విభజన చట్టం చెబుతున్నా పదేళ్లలో ఎందుకు ఏర్పా టు చేయలేదని ప్రశ్నించారు. బిజెపి హటావో దేశ్‌కి బచావో బిజెపిని ఓడిద్దామని, బారత దేశ విద్యా రంగాన్ని కాపాడుకుందామనే నినాదంతో ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా విస్తృత ప్రచారం చేస్తామని తెలిపారు. మే 13న జరగబోయే పార్లమెంటు ఎన్నికల్లో తెలంగాణ వ్యాప్తంగా ఉన్న విద్యార్థి లోకం బిజెపిని ఓడించడానికి సిద్ధం కావాలని మణికంఠరెడ్డి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి రమేష్, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి హేమంత్, నగర నాయకులు రాజేష్, వినయ్ రెడ్డి, సాయి, సచిన్, శ్రావణ్, అనిరుద్ పాల్గొన్నారు.

భరత్ మృతి దురదృష్టకరం

నివాళులు అర్పించిన కూనంనేని

ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : పగడాల భరత్ మృతి అత్యంత దురదృష్టకరమని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు తెలిపారు. ఉద్యమ నేపథ్యం కలిగిన కుటుంబంలో జన్మించి ఎంతో భవిష్యత్తు ఉన్న భరత్ మరణించడం అత్యంత బాధాకరమన్నారు. సోమవారం ఖమ్మం కార్పోరేషన్ పరిధిలోని 14వ డివిజన్ కొత్తగూడెంలో పగడాల భరత్ సంస్మరణ సభ జరిగింది. ఈ సందర్భంగా భరత్ చిత్ర పటానికి కూనంనేని సాంబశివరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సభలో కూనంనేని మాట్లాడుతూ యువతరం ఈ దేశానికి అవసరమున్న దశలో భరత్ లేకపోవడం దురదృష్టకరమన్నారు. భరత్ మృతి మల్లేష్ కుటుంబానికి తీవ్ర విషాదాన్ని మిగిల్చిందని ఆయన తెలిపారు. నివాళులర్పించిన వారిలో సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, జిల్లా కార్యవర్గ సభ్యులు జమ్ముల జితేందర్ రెడ్డి, ఎస్‌కె జానిమియా, పోటు కళావతి, తాటి వెంకటేశ్వరరావు, సిహెచ్ సీతామహాలక్ష్మి, రావి శివరామకృష్ణ, జిల్లా నాయకులు తాటి నిర్మల, గాదె లక్ష్మి నారాయణ, ఏఐటియుసి నాయకులు మోహన్‌రావు, కార్పొరేటర్ చామకూరి వెంకన్న, దోరేపల్లి శ్వేత, కాంగ్రెస్ నాయకులు బొమ్మిశెట్టి సత్యం, వి. మల్లయ్య, సంక్రాంతి నాగేశ్వరరావు, మందడపు బ్రహ్మారెడ్డి, బైరు హరినాథ్‌బాబు, సీతల రామసంగం, నాగేశ్వరరావు, గోవిందరావు, బంధువులు నివాళులర్పించారు.

జిల్లా వ్యాప్తంగా మే డే వేడుకలు

ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు దేవేందర్ రెడ్డి పిలుపు

ప్రజాపక్షం /నల్లగొండ : ప్రపంచ కార్మికుల దినోత్సవం మే 1న 138వ మే డే వేడుకలను జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించాలని ఏఐటీయూసి జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి , జిల్లా అధ్యక్షులు నూనె రామస్వామిలు కార్మిక లోకానికి పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక ఎఐటియుసి జిల్లా కార్యాలయంలో జరిగిన కౌన్సిల్ సమావేశంలో వారు మాట్లాడుతూ ఎన్నో త్యాగాలు,పోరాటాలు చేసి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను యధావిధిగా కొనసాగించకుండా కేంద్రంలో మోదీ ప్రభుత్వం కార్మికులకు వ్యతిరేకంగా తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్ లను వెంటనే రద్దు చేసి కార్మిక చట్టాలు పునరుద్ధరణకై పార్లమెంటు ఎన్నికలలో బిజెపి ప్రభుత్వాన్ని ఓడించాలని కోరారు. వివిధ రంగాలలో పని చేస్తున్న కార్మికులకు రావలసిన పెండింగ్ జీతాలను చెల్లించాలని, అన్ని రకాల కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఎఐటియుసి జిల్లా ఉపాధ్యక్షులు ఎండి సయీద్ , ఎడమ సుమతమ్మ, దోటి వెంకన్న, కోశాధికారి డి వెంకన్న, జిల్లా నాయకులు ఎండి జానీ, శంకర్ ,గుండె రవి,వెంకట్ రాములు,కోట్ల శోభ ,వి లెనిన్,మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్ జూనియర్ కళాశాలలు, పాఠశాలల..

ఫీజుల దోపిడీపై ప్రభుత్వ కఠిన చర్యలు

రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య డిమాండ్

ప్రజాపక్షం/హైదరాబాద్ : కార్పొరేట్ జూనియర్ కాలేజీలు, పాఠశాలల ప్రైవేట్ ఫీజుల దోపిడీపై ప్రభుత్వ కఠిన చర్యలు చేపట్టాలని రాజ్యసభ సభ్యులు, జాతీయ బి.సి సంక్షేమ సంఘం అధ్యక్షులు ఆర్. కృష్ణయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశంతో సోమవారం ఆర్. కృష్ణయ్య భేటీ అయ్యారు. కార్పొరేట్ కళాశాలల్లో, పాఠశాలలు, ప్రధానంగా శ్రీ చైతన్య, నారాయణ తదితర యాజమాన్యాలు విచ్చలవిడిగా హద్దు పద్దు లేకుండా ప్రతి సంవత్సరం ఫీజులు పెంచుతున్నారని వెంకటేశంకు తెలిపారు. ప్రస్తుతం ఇంటర్ మొదటి సంవత్సరానికి రూ.3 లక్షలు, ఏసి ఉన్న కళాశాలలకు రూ. 3 లక్షల, 50 వేలు ఫీజులు తీసుకుంటున్నారని అన్నారు. పాఠశాల స్థాయిలో కూడా 34 లక్షలు వసూలు చేస్తున్నారని బుర్రా వెంకటేశం దృష్టికి తీసుకపోయారు. ఇంటర్‌తో పాటు నీట్ జేఈఈ లాంగ్ టర్మ్, పార్ట్ టర్ములకు ఇంకా అదనపు ఫీజులు వసూలు చేస్తున్నారని, ఒక కాలేజీకి, పాఠశాలకు పర్మిషన్ తీసుకొని హైదరాబాద్, రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలలో వందల సంఖ్యలో కళాశాల బ్రాంచ్‌లు పెంచి అక్రమంగా నడుపుతున్నారని చెప్పారు. ఇంతకు ముందు అనుమతులు ఉన్న నడవలేని, సంఖ్యలేని కాలేజీలను, పాఠశాలలను తీసుకొని, వాటి పేరుపై పర్మిషన్, తీసుకొని ఈ పేరు మీద వేరే బోర్డు పెట్టి కాలేజీలు, పాఠశాలలు నిర్వహిస్తున్నారు. కాలేజీ అడ్మిషన్‌లకు ప్రభుత్వం నోటిఫికేషన్ షెడ్యూలు జారీ చేయలేదన్నారు. కానీ ఈ కార్పొరేట్ కాలేజీలు మధ్యలో బ్రోకర్లను పెట్టి 10వ తరగతిలో ఉన్న విద్యార్థుల అడ్రస్ తీసుకొని ఇంటికి వెళ్లి మాయమాటలు చెప్పి అడ్మిషన్లు తీసుకుంటున్నారని వివరించారు. ఇంటర్ బోర్డు విద్యాశాఖ నియంత్రణలో ఈ కాలేజీలు, పాఠశాలలున్నాయా ? లేవా? అనే అనుమానం కలుగుతుందన్నారు. అనుమతులిచ్చే వరకే ఇంటర్ బోర్డు పరిమితం అవుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పటిష్టమైన ఫీజుల నియంత్రణ చట్టాన్ని తీసుకొచ్చి, ఈ కాలేజీల, పాఠశాలల దోపిడిని అడ్డుకోవాలని ఆర్.కృష్ణయ్య వెంకటేశంను కోరారు. ఈ భేటీలో జాతీయ బి.సి. సంక్షేమ సంఘం ప్రతినిధి బృందం గుజ్జ కృష్ణ, నీల వెంకటేష్, పెరికె సురేష్, రాజేందర్, వేముల రామకృష్ణ, నందగోపాల్, మోదీ రాందేవ్, చంద్రశేఖర్, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర వ్యవసాయ విధానం రూపొందించాలి

సిపిఐ జిల్లా కార్యదర్శి బాలకిషన్

ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి : కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సమగ్ర వ్యవసాయ విధానం ప్రకటించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి బి.బాలకిషన్ డిమాండు చేశారు. సోమవారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని సిపిఐ కార్యాలయంలోని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం బికెఎంయు మహబూబ్‌నగర్ జిల్లా మహాసభలు అంజనేయులు అధ్యక్షతన జరిగాయి. మహాసభలకు ముఖ్య అతిథిగా హజరైన బాలకిషన్ మాట్లాడుతూ దేశంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వ్యవసాయ రంగం దివాలా తీసిందని ఆరోపించారు. నయా ఉదార వాద ఆర్థిక విధానాలే వ్యవసాయ రంగం పూర్తిగా సంక్షోభంలోకి నెట్టబడిందని విమర్శించారు. సిపిఐ వామపక్ష పార్టీల పోరాటాల ఫలితంగా తెచ్చిన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంపై మోడీ ప్రభుత్వం కుట్రపూరితంగా వ్యవహరిస్తుందని ఆరోపించారు. ఉపాధి పని ప్రదేశాల్లో కనీస వసతులు కల్పించడం లేదని కూలీలకు సక్రమంగా జీతాలు చెల్లించకుండా అనేక అక్రమాలకు పాల్పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. పెరిగిపోతున్న ధరలలో వ్యవసాయ కూలీల జీవనం అస్తవ్యస్తంగా మారిందని వాపోయారు. వ్యవసాయంపై తొంభై శాతం ఎస్సీ, ఎస్టీ బిసి అట్టడుగు వర్గాల కార్మికులే ఆధారపడి జీవిస్తున్నారని ఇలాంటి కార్మికులు సంక్షేమం పట్ల ప్రభుత్వాలకు చిన్న చూపు తగదని విమర్శించారు. కార్మికుల హక్కుల సాధనకు వ్యవసాయ కూలీలు పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

వ్యవసాయ కార్మిక సంఘం నూతన జిల్లా కమిటీ ఎన్నిక : తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం సిపిఐ అనుబంధం మహబూబ్‌నగర్ జిల్లా నూతన జిల్లా సమితిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా సత్యనారాయణరెడ్డి ప్రధాన కార్యదర్శి గా యం.గోవర్దన్ , ఉపాధ్యాక్షులుగా జంగయ్య, సహ కార్యదర్శిగా ఏటవాలు మాసన్న, కమిటీ సభ్యులుగా బాలనరసయ్య, రామ చంద్రయ్య, జంగయ్య, బాలయ్య , సాయిలు, నాగన్న, వెంకటయ్య, శేఖర్, కవిత తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పి.సురేష్, డి.రాము, ఏఐటీయూసీ జిల్లా నాయకులు ఆంజనేయులు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు వివిధ మండలాల కార్మికులు జంగమ్మ, మల్లేశ్, నర్సింలు, బాలరాజు, మోహన్ శ్రీను, లక్ష్మన్న, శేఖర్, అరుణ్, చిన్న జంగయ్య, శివనాయక్, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షులు లక్ష్మ ణ్, గీత, రాధా లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మోడల్ టెస్టులతో మానసిక ధైర్యం

ఎఐఎస్‌ఎఫ్ మాజీ జాతీయ నేతలు బాగం, పోటు

ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : పోటీ ప్రపంచంలో విద్యార్థులు ఒత్తిడిని తట్టుకుని విజయాలు సాధించాలని, మోడల్ టెస్టుల ద్వారానే మానసిక ధైర్యం పెంపొందుతుందని ఏఐఎస్‌ఎఫ్ మాజీ జాతీయ నేతలు బాగం హేమంతరావు, పోటు ప్రసాద్ లు తెలిపారు. ఎఐఎస్‌ఎఫ్ ఖమ్మం జిల్లా సమితి ఆధ్వర్యంలో సోమవారం జిల్లా వ్యాప్తంగా మోడల్ ఎంసెట్, నిట్ పరీక్షలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఖమ్మం నగరంలోని డాక్టర్స్ అకాడమీలో మోడల్ నిట్, ఇంజనీరింగ్ ప్రశ్నా పత్రాలను బాగం హేమంతరావు, పోటు ప్రసాద్ లు ఆవిష్కరించారు. ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షులు మడుపల్లి లక్ష్మ ణ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో బాగం హేమంతరావు, పోటు ప్రసాద్ లు మాట్లాడుతూ విద్యార్థులు అన్ని రంగాలలో రాణించాలన్నారు. మోడల్ పరీక్షలు రాయడం వల్ల విద్యార్థులకు పరీక్షల పట్ల అవగాహన కలుగుతుందని అదేవిధంగా మానసిక స్థైర్యం పెంపొందుతుందన్నారు. ప్రభుత్వం నిర్వహించే ఎంసెట్, నిట్ పరీక్షల్లో విద్యార్థులు ఎటువంటి భయాందోళనకు గురి కాకుండా ఉండడానికి 25 ఏళ్లుగా ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో మోడల్ ఎంసెట్ నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. నిట్ విద్యార్థులకు మోడల్ నిట్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. ప్రభుత్వం నిర్వహించే ప్రవేశ పరీక్షల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలతో పాటు విద్యార్థులు సమయం వృధా కాకుండా పరీక్ష ఎలా రాయాలో అనేది తెలుసుకునేందుకు వీలుంటుందన్నారు. ఏఐఎస్‌ఎఫ్ మాజీ జాతీయ ఉపాధ్యక్షులు రావి శివరామకృష్ణ, డాక్టర్స్ అకాడమీ డైరెక్టర్ సతీష్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు విజయమే లక్ష్యంగా ప్రణాళికాబద్దంగా ఒత్తిడిని తట్టుకుని విజయాలు సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇటికాల రామకృష్ణ, నాయకులు శివ, వంశీ, బాలాజీ, ప్రతాప్, రాకేష్, రోహిత్, రాహుల్, స్వరూప, రేణుక పాల్గొన్నారు.

కాంగ్రెస్‌పై ప్రధాని అసత్య ప్రచారం

(మొదటి పేజీ తరువాయి)

ఆరోపించారు. సార్వత్రిక ఎన్నికల కోడ్ ముగియగానే రూ.2 లక్షల రైతు రుణమాఫీ ప్రక్రియ ప్రారంభమవుతుందని, ఆగస్టు 15లోపు రైతులకు రుణమాఫీ పూర్తిగా చేసి తీరుతామని సిఎం పునరుద్ఘాటించారు.

తుమ్మిడిహెట్టి ప్రాజెక్టును కట్టి తీరుతాం

గత పదేండ్ల బిజెపి, బిఆర్‌ఎస్ ప్రభుత్వ హా యంలో ఆదిలాబాద్ జిల్లాకు తీరని అన్యాయం జరిగిందని, ప్రధాని మోదీ ఆదిలా బాద్ జిల్లాకు ఏమీ చేశారో సమాధానం చెప్పాలని సిఎం రేవంత్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో జరిగిన జన జాతర సభలో సిఎం రేవంత్ రెడ్డి ప్రసంగిస్తూ మహారాష్ట్ర ప్రభుత్వంతో చర్చలు జరుపుతున్నామని, తుమ్మిడిహెట్టి ప్రాజెక్టును కట్టి తీరుతామని, దీనికి అంబేద్కర్ పేరు పెడుతామని ముఖ్యమంత్రి ప్రకటించారు. బోథ్ నియోజక వర్గంలోని కుప్టి ప్రాజెక్టును కాంగ్రెస్ హాయంలోనే పూర్తి చేసి, అన్నదాతలకు సాగు నీరందిస్తామని సిఎం స్పష్టం చేశారు. ఆదిలాబాద్‌లో యూనివర్శిటీ ఏర్పాటుకు కృషి చేస్తున్నామని చెప్పారు. అక్కడ మోదీ, ఇక్కడ కేడీ కలిసి సిమెంట్ ఫ్యాక్టరీని మూలన పడేశారని సిఎం ఆరోపించారు. సిసిఐ సిమెంట్ పరిశ్రమను తెరిపించడానికి అన్ని రకాల చర్యలు తీసుకుంటామ న్నారు. ఆదివాసీలకు అనేక విషయాల్లో ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. అనంతరం రాష్ట్ర మంత్రులు ధనసరి అనసూయ (సీతక్క), దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మాట్లాడుతూ కాంగ్రెస్‌ను విమర్శించడమే బిజెపి నేతలు పనిగా పెట్టుకున్నారన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బిజెపి, బిఆర్‌ఎస్ పార్టీలకు తగిన రీతిలో బుద్ధి చెప్పాలన్నారు.

చక్కెర పరిశ్రమలను పునరుద్ధరిస్తాం

రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే చక్కెర పరిశ్రమలు పునరుద్ధరణ గురించి ఆలోచించామని, ఇందుకోసం మంత్రి వర్గ ఉపసంఘం ఏర్పాటు చేశామని, లోక్‌సబ ఎన్నికల కోడ్ ముగిసిన మూడు నెలలలోపే వీలైతే సెప్టెంబర్ 17 లోపు నిజాం షుగర్స్ పరిశ్రమ తెరిపించే బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకుంటుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. నిజామాబాద్ ప్రాంత రైతులను ఆదుకునే బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనన్నారు. నిజామాబాద్ లోక్‌సభ నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థి టి.జీవన్ రెడ్డికి మద్దతుగా ప్రచారం నిర్వహించారు. నిజామాబాద్ నియోజకవర్గం నుంచి జీవన్‌రెడ్డిని గెలిపిస్తే కేంద్రంలో ఇండియా కూటమి అధికారంలోకి రాగానే కాంగ్రెస్ జాతీయ నేతలు సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, ఖర్గేలను ఒప్పింపి కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రిగా నియమించే బాధ్యతను తాను తీసుకుంటానని రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. గతంలో బిజెపి ఎంపి పసుపు బోర్డు ఏర్పాటు చేయిస్తానని బాండ్ పేపర్ రాసిచ్చి మోసం చేశారని సిఎం విమర్శించారు. ఈ బోర్డు ఏర్పాటుపై మోదీ ఇచ్చిన ప్రకటనలో ఎక్కడా నిజామాబాద్ అని లేదని, ఎన్నికలు పూర్తయిన అనంతరం బోర్డును ఎక్కడ ఏర్పాటు చేస్తా రో కూడా తెలియదన్నారు. కల్వకుంట్ల కవి త ఎంపిగా ఉన్నప్పుడు ఇక్కడి రైతులను పట్టించుకోలేదని సిఎం విమర్శించారు. పంజాబ్, హర్యానా రైతుల తర్వాత అంత చైతన్యం ఉన్నది ఇందూరు రైతులకేనని సిఎం రేవంత్‌రెడ్డి అన్నారు.

కెసిఆర్‌తో కొట్లాడే శక్తిని ఇచ్చింది మల్కాజ్‌గిరి ప్రజలే

తాను రాజకీయంగా ఇబ్బందుల్లో ఉన్నప్పుడు మల్కాజ్‌గిరి ప్రజలు ఎంపిగా గెలిపించారని, కెసిఆర్‌తో కొట్లాడే శక్తిని ఇచ్చింది మల్కాజ్‌గిరి ప్రజలేనని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. శామీర్‌పేట మండలంలోని అంతాయిపల్లిలో జరిగిన ఎన్నికల ప్రచారంలో భాగంగా నిర్వహించిన జన జాతర సభలో ఆయన మాట్లాడుతూ ఈటల రాజేందర్ ఎప్పుడైనా కెటిఆర్ అవినీతి, ఫోన్ ట్యాపింగ్‌పై మాట్లాడారా? ప్రశ్నించారు. తీహార్ జైలులో ఉన్న కుమార్తె కాపాడుకొనేందుకు కోసం బిఆర్‌ఎస్ పార్టీని బిజెపి పార్టీకి తాకట్టు పెట్టి కాంగ్రెస్ అభ్యర్థులను పరాజితులను చేసే లక్ష్యం గా పలు పార్లమెంటు స్థానాల్లో డమ్మీ అభ్యర్థులను రంగంలోకి కెసిఆర్ దించి చీకటి ఒప్పందం చేసుకున్నారన్నారు. రాష్ట్రంలో బిఆర్‌ఎస్ కెసిఆర్, మోదీలు ఎన్ని కుంతంత్రాలు చేసినా ప్రజానీకం నమ్మరన్నారు. హుజురాబాద్ ప్రజలకు ఎలాంటి అభివృద్ధి పనులు చేయనందుకే ఈటల రాజేందర్‌ను ఓడించారన్నారు. బిజెపి అధిష్టానవర్గం నిర్ణయాల మేరకే ఈటల ఫోన్ ట్యాపింగ్, గత ప్రభుత్వ అవినీతి పనుల గురించి మాట్లాడడంలేదన్నారు. మల్కాజ్‌గిరి స్థానం కాంగ్రెస్ అడ్డా అని, కాంగ్రెస్ అభ్యర్థిగా సునీతారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు. ఈ బహిరంగ సభకు సిపిఐ జాతీయ కార్యవర్గసభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి హాజరై కాంగ్రెస్ అభ్యర్థికి మద్దతు ప్రకటించారు.

బిఆర్‌ఎస్ వాళ్లు కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలి

'బిఆర్‌ఎస్‌లో ఉన్న వారికి ఒక్కటే చెబుతున్నానని... మీరు మాత్రం కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలి. బిఆర్‌ఎస్‌కు ఓటు వేస్తే వృథా అవుతుంది. బిఆర్‌ఎస్ అభ్యర్థులకు వేసే ప్రతి ఓటు మూసీలో వేసినట్లే'నని రేవంత్ రెడ్డి అన్నారు.

కాంగ్రెస్‌కు కామ్రేడ్‌లకు కుదిరిన దోస్తీ

సిఎం రేవంత్ రెడ్డి ట్వీట్

భువనగిరిలో జరిగిన సభ విజయవంతమైన నేపథ్యంలో టిపిసిసి అధ్యక్షులు, సిఎం రేవంత్ రెడ్డి సోమవారం ట్వీట్ చేశారు. ఈ సందర్భంగా కమ్యూనిస్టు పార్టీతో దోస్తీ కుదరినట్లు పేర్కొన్నారు. సిఎం చేసిన ట్వీట్ యథాతథంగా.. 'భువనగిరి పాదాల వద్దగగన మంత ఎత్తున ఎగసి అభిమాన కెరటాలు.. త్యాగాల స్థూపాల సాక్షిగాసాగిన జైత్రయాత్ర ఇది కాంగ్రెస్‌కు కామ్రేడ్లకు కుదిరిన దోస్తీ.. కంచుకోటపై ఎగురుతుంది గెలుపు జెండా' అని సిఎం ట్వీట్ చేశారు.

అమెరికా సిటిజన్‌షిప్

(మొదటి పేజీ తరువాయి)

మారారు. తర్వాత భారత్ (65,960), ఫిలిప్పీన్స్ (53,413), క్యూబా (46,913), డొమినికన్ రిపబ్లిక్ (34,525), వియత్నాం (33,246), చైనా (27,038) ఉన్నాయి. అయితే, భారత్‌లో పుట్టి, అమెరికాలో ఉంటున్నవారిలో దాదాపు 42 శాతం మందికి అగ్రరాజ్య పౌరసత్వం పొందే అర్హత లేదని సిఆర్‌ఎస్ నివేదిక వెల్లడించింది. 2023 నాటికి గ్రీన్ కార్డు లేదా లీగల్ పర్మినెంట్ రెసిడెన్సీ (ఎల్‌పిఆర్) ఉన్న 2,90,000 మంది భారతీయులు సహజీకృత పౌరసత్వం పొందే అవకాశం ఉందని పేర్కొంది. సహజీకృత పౌరసత్వం కోసం వచ్చే అప్లికేషన్ల సంఖ్య 2023 ముగిసే నాటికి 4,08,000గా ఉన్నట్లు సిఆర్ఎస్ నివేదిక పేర్కొంది. 2023లో కొత్తగా 8,23,702 మంది ఎల్‌పిఆర్ ఉన్నవారు నేచురలైషేషన్ కింద పౌరసత్వం కోసం దరఖాస్తు చేసుకున్నారు. దాదాపు 90 లక్షల మంది వరకు దానికి అర్హత ఉన్నప్పటికీ, చాలా తక్కువ సంఖ్యలో అప్లికేషన్లు వచ్చాయని నివేదిక వెల్లడించింది. అగ్రరాజ్య సహజీకృత పౌరసత్వం ఇచ్చేందుకు అనేక అంశాలను పరిగణనలోకి తీసుకుంటారు. జన్మించిన దేశంతో పాటు కనీసం ఐదేళ్ల పాటు ఎల్‌పిఆర్‌లు అయ్యి ఉండాలి. హోండురస్, గ్వాటిమాలా, వెనిజువెలా, మెక్సికో, ఎల్ సాల్వెడార్, బ్రెజిల్ వారికి తక్కువ ప్రాధాన్యం ఇస్తారు. వియత్నాం, ఫిలిప్పీన్స్, రష్యా, జమైకా, పాకిస్థాన్ వారికి అధిక ప్రాధాన్యం ఉంటుంది.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Plot No 302, Venkata Sai Towers, Nehrunagar, KHAMMAM - 507 002 Telangana State. RNI TELTEL /2018/76759, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com

మూడు రోజులు తేలికపాటి వర్షాలు

ప్రజాపక్షం/హైదరాబాద్ : తీవ్ర ఎండలతో ఉక్కిరి బిక్కిరవుతున్న రాష్ట్ర ప్రజలకు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు చల్లటి కబురు తెలిపారు. రానున్న మూడు రోజులపాటు రాష్ట్రంలో పలు చోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశమున్నట్లు చెప్పారు. ఆదిలాబాద్, కొమురంభీమ్, నిజామాబాద్, జగిత్యాల, వికారాబాద్, సంగారెడ్డి, కామారెడ్డి, మంచిర్యాల, నిర్మల్ జిల్లాల్లో వాతావరణ శాఖ ఎల్లో అలెర్ట్‌ను జారీ చేసింది. గంటకు 30 కిలోమీటర్ల నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశముందని అధికారులు తెలిపారు.

నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరి

ప్రజాపక్షం/వనస్థలిపురం: బిఎన్‌రెడ్డి నగర్ డివిజన్‌లోని గాయత్రి నగర్ ఫేస్2 కాలనీలో చేపడుతున్న భూగర్భ డ్రైనేజీ పనులను డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి సోమవారం కాలనీలో పర్యాటించి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ లచ్చిరెడ్డి మాట్లాడుతూ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని, సబంధిత అధికారులు పరివేక్షణ ఉండాలని తెలిపారు. అభివృద్ధి పనులకు కాలనీ సంక్షేమ వాసులు దగ్గర నుంచి పనులు చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు రమేష్, పార్టీ డివిజన్ ఉపాధ్యక్షులు విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

కార్మిక చట్టాల రక్షణ కోసం మేడే స్ఫూర్తితో పోరాటాలు

ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు పానుగంటి పర్వతాలు

ప్రజాపక్షం/శేరిలింగంపల్లి : ప్రపంచ కార్మిక దినోత్సవం మే డే స్ఫూర్తితో కార్మిక చట్టాల రక్షణ కోసం కార్మికులు పెద్ద ఎత్తున పోరాటాల్లోకి రావాలని ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు పానుగంటి పర్వతాలు తెలిపారు. సోమవారం శేరిలింగంపల్లి మండల పరిధిలోని జిహెచ్‌యంసి కార్యలయం అవరణలో మేడే గోడ పత్రికను విడుదల కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు పానుగంటి పర్వతాలు, సిపిఐ శేరిలింగంపల్లి కార్యదర్శి రామకృష్ణ, ఎఐటియుసి జిల్లా కార్యదర్శి చందుయాదవ్, జిల్లా సమితి సభ్యుడు వెంకటస్వామిలు విచ్చేసి గోడ పత్రికను అవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నాడు సాధించుకున్న కార్మిక చట్టాలను నరేంద్రమోడీ ప్రభుత్వం నిర్వీర్యం చేసి 44 కార్మిక చట్టాలను నాలుగు కోడ్‌లోకి మార్చి సంఘం పెట్టుకునే హక్కును, సమ్మె చేసే హక్కును, పోరాటం చేసే హక్కులను తొలగించి కార్పొరేట్ శక్తుల పాదాల దగ్గర కార్మిక బ్రతుకులను ఉంచారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి నాయకులు రాములు, పరమేష్, కొండల్ గీత, సిపిఐ నాయకులు పాల్గొన్నారు.

మేడే జయప్రదం కోసం వాల్ పోస్టర్ అవిష్కరణ

ప్రజాపక్షం/రాజేంద్రనగర్ : ప్రపంచ కార్మికుల మేడే దినోత్సవాన్ని రంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా కార్మిక లోకం జయప్రదం చేయాలని విజ్ఞప్తి ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి ఓరుగంటి యాదయ్య కార్మిక లోకానికి పిలుపు నిచ్చారు. సోమవారం రాజేంద్ర నగర్ బుద్వేల్ ఎఐటియుసి రంగారెడ్డి జిల్లా కార్యాలయంలో జరిగిన వాల్ పోస్టర్ అవిష్కరణ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ఓరుగంటి యాదయ్య ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు పానుగంటి పర్వతాలు,మాజీ జిల్లా అధ్యక్షులు పుస్తకాల నర్సింగ్‌రావుతో కలిసి అవిష్కరించారు. ఈకార్యక్రమంలో ఏఐటియుసి జిల్లా ఉపాధ్యక్షులు టంగుటూరి నరసింహారెడ్డి జిల్లాకార్యదర్శి ఎస్. మల్లేష్, కార్మిక నాయకులు రియాజ్,స్వామి,శేఖర్ రెడ్డి,సత్తయ్య,గువ్వల రాజు పాల్గొన్నారు.

మత విద్వేషాలు రెచ్చగొడుతున్న మోదీ

ప్రజాపక్షం/షాద్‌నగర్: దేశ ప్రధాన మంత్రి నరేంద్రమోదీ మత విద్వేషాలను రెచ్చగొట్టేందుకు యత్నిస్తున్నారని, ఓటమి భయంతోనే అర్థం..పర్థం లేకుండా మాట్లాడుతున్నారని టిపిసిసి సభ్యుడు బాబర్‌ఖాన్ మండిపడ్డారు. సోమవారం షాద్‌నగర్‌లో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బాబర్‌ఖాన్ మాట్లాడుతూ హిందూ మహిళలు అత్యంత పవిత్రంగా భావించే మంగళ సుత్రాలను ఓట్ల కోసం రాజకీయం చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. మొదటి దశ ఎన్నికల పోలింగ్ సరళిని చూపి నోటికి వచ్చినట్లు, అర్థం..పర్థం లేకుండా మాట్లాడటం సరైన పద్ధతి కాదని అన్నారు. హిందూముస్లింల మధ్య మత విద్వేశాలతో రెచ్చగొట్టేందుకు యత్నిస్తున్నారని మండిపడ్డారు. ప్రధాని నరేంద్రమోదీ చేసిన వ్యాఖ్యలకు పార్లమెంట్ ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నేతలు సయ్యద్ సాధిక్, ఖాధర్‌ఘోరీలతోపాటు కార్యకర్తలు ఉన్నారు.

విధులు సక్రమంగా నిర్వహించాలి

ప్రజాపక్షం/హయత్ నగర్: కాలనీ వాసులకు ఫిర్యాదు మేరకు డివిజన్‌లోని కమల నగర్ లో పారిశుద్ధ కార్మికుల విధి నిర్వహణను సోమవారం హయత్ నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు పారిశుధ్య కార్మికులు సరిగా విధులు నిర్వహించడం లేదని కాలనీలో చెత్తను ఊడ్చి తీయకుండా అలాగే వదిలేయడంతో మరలా అది గాలికి ఊడ్చిన ఉడనట్టే అవుతుందని కాలనీ వాసులు వివరించడంతో కార్పొరేటర్ స్పందించారు. సంబంధిత శానిటేషన్ సూపర్వైజర్ రాజ్ కుమార్ పిలిపించి పారిశుధ్య కార్మికులు విధులు సక్రమంగా నిర్వహించాలని, అదేవిధంగా ఊడ్చిన చెత్తను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని,మరల కాలనీ వాసుల నుండి ఎలాంటి ఫిర్యాదులు రావొద్దన్నారు. బిజెపి డివిజన్ అధ్యక్షులు ఉగాది ఎల్లప్ప, ప్రధాన కార్యదర్శి గోవింద చారి, కాలనీ అధ్యక్షులు టి వి రావు, ఉపాధ్యక్షులు మల్లికార్జున్ ,ప్రధాన కార్యదర్శి సుబ్బా రావు పాల్గొన్నారు.

సంపులో పడి యువకుడు మృతి

ప్రజాపక్షం/శేరిలింగంపల్లి : సంపులో పడి యువకుడు మృతి చెందిన సంఘటన రాయదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం షేక్ అక్మల్ సుపియన్ తండ్రి ఖాలీల్ పాషా (25), సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేసుకుంటూ గచ్చిబౌలిలోని అంజయ్య నగర్‌లో గల షణ్ముక్ మెన్స్ పిజి హాస్టల్ నివసిస్తున్నాడు. 21న ఉదయం 10.30 గంటలకు హాస్టల్ నుండి బయటకు వెళ్ళి తిరిగి షణ్ముక్ హాస్టల్ రావడంతో సంపు పై కప్పు ఏమీ లేకపోవడంతో సంపులో పడిపోయాడు. సంపుపై ఎటువంటి కప్పు ఉంచకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించి న షణ్ముక్ పిజి హాస్టల్ నిర్వహకుడు మధుసూధన్ రెడ్డి పై కేసు నమోదు చే శామని, షేక్ అక్మల్ సంపులో నీటిలో ఉక్కిరి,బిక్కిరి అయి చనిపోయాడని శవాన్ని ఉస్మానియా అసుపత్రికి తరలించి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

కెటిఆర్‌పై కొండా సురేఖ తప్పుడు ప్రచారం

ఇసి చర్యలు తీసుకోవాలని దాసోజు పిటిషన్

హైదరాబాద్ : ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించి బీఆర్‌ఎస్ పార్టీ కార్యనిర్వహక అధ్యక్షుడు కేటీ రామారావుపై మంత్రి కొండా సురేఖ అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు ఆమెపై చర్యలు తీసుకునేలా కేంద్ర ఎన్నికల కమిషన్‌కు ఉత్తర్వులు జారీ చేయాలంటూ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. బీఆర్‌ఎస్ నేత దాసోజు శ్రవణ్ పిటిషన్ దాఖలు చేశారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో కేటీఆర్‌ను కనీసం అనుమానితుడుగా కూడా పోలీసులు పిలవలేదని, కేటీఆర్‌కు ఆ కేసుతో సంబంధం ఉందని, జైలుకు పంపుతామని మంత్రి మీడియాకు చెప్పారన్నారు. కేటీఆర్‌ను జైలుకు పంపిస్తామని మంత్రి తీవ్ర వ్యాఖ్యలు చేయడం గత 16 నుంచి అమల్లోకి వచ్చిన ఎన్నికల ప్రవర్తనా నియమావళి మార్గదర్శకాలకు వ్యతిరేకమన్నారు. మంత్రిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఈ నెల 8న ఈసీకి ఈ–మెయిల్ ద్వారా ఫిర్యాదు చేస్తే దానిని జీహెచ్‌ఎంసీ కమిషనర్‌కు ఈసీ పంపి చేతులు దులుపుకుందన్నారు. మంత్రిపై చర్యలు తీసుకునేలా, ఇకపై మంత్రి నోటికి వచ్చినట్లు మాట్లాడకుండా ఉత్తర్వులు ఇవ్వాలని కోరిన పిటిషన్‌ను హైకోర్టు చేయనుంది.

గ్రంథాలయాలు చైతన్య వేదికలు

ప్రొఫెసర్ కోదండరామ్

ప్రజాపక్షం / కొడంగల్ : గ్రంథాలయాలు రజాకార్ల పాలనను దొరల పెత్తాందారి వ్యవస్థను కూల్చడంలో చైతన్య వేదికలుగా పనిచేశాయని ప్రొఫెసర్ కొదండరామ్ అన్నారు. కొడంగల్ మండల పరిధిలోని సంగాయిపల్లి గ్రామంలో విశ్రాంత ఉపాధ్యాయులు ఎం హన్మయ్య తన తల్లీ శివమ్మఅచ్చప్ప గారల జ్ఞాపకార్థంగా నిర్మించిన గ్రంథాలయాన్ని కొండదరామ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పుస్తక పఠనం విద్యావంతులకు ఎంతో విజ్ఞానాన్ని అందజేయడంతో అన్ని అంశాలపై చైతన్య వంతులను చేస్తుందని అన్నారు. గ్రంథాలయాలతో యువతలో ఆలోచన విధానం మారుతుందన్నారు. గ్రామాల్లోని సమస్యల పరిష్కారంతో పాటు జిల్లా ప్రాంతం ప్రభుత్వ పాలన గత చరిత్ర వంటి అన్ని అంశాలపై ప్రశ్నించే జ్ఞానం పెరుగుతుందన్నారు. పరిష్కారం కొసం ప్రయత్నించే శక్తిని నింపుతుందన్నారు. కృష్ణ జలాలు ఇక్కడి ప్రాంతానికి తాగు నీరు, సాగునీరును అందించి నీటి సమస్య లేని ప్రాంతంగా మారుతుందని విశ్లేషకుల సుచనలు చెబుతున్నాయన్నారు. నారాయణపేట కొడంగల్ ఎత్తిపోతల పథకాన్ని జూరాల వద్ద నుంచి తీసుకురావాలని శాస్త్రవేత్తల ప్రణాళికలు ఉన్నాయని ఇలాంటి వాటిపై సంపూర్ణ అవగాహన కలిగేందుకు గ్రంథాలయాలు ఎంతో దోహదపడుతాయన్నారు. సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వాలను ప్రశ్నించే శక్తిని గ్రంథాలయాలు కల్గజేస్తాయన్నారు. నిరుపయోగమైన చర్చలు కాలక్షేపం కోసం ఉపయోగించే సెల్‌ఫోన్‌లు టివి సిరియల్ వంటి వాటికి దూరమై గ్రంథాలయ పఠనాన్ని అలవార్చుకోవాలన్నారు. కొడంగల్ ప్రాంతం తెలంగాణ కార్ణటక సరిహద్దులో ఉన్నప్పటికి ఇక్కడి ప్రజలు ఎంతో చైతన్య వంతమైన వారని కొదండరామ్ అభినందించారు. తెలంగాణ మలిదళ ఉద్యమంలో కొడంగల్ ప్రజలు తమ వంతు గట్టి పోరాటాన్ని అందించారని అన్నారు. గ్రంథాలయ ఏర్పాటు కర్త హన్మయ్యను కొదండరామ్ అభినందించి సన్మానించారు. గ్రంథాలయంలో పుస్తకాలను చదివి సంతృప్తి చెందారు. ఆంధ్రజ్యోతి దినపత్రిక సంపాదకులు కె.శ్రీనివాస్ మాట్లాడుతూ హన్మయ్య స్వగ్రామమైన సంగాయిపల్లిలో ఏర్పాటు చేసిన గ్రంథాలయం గ్రామీణ యువతకు ఎంతో దోహదపడుతుందని దానిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్యావంతులు అయిన యువత గ్రంథాలయాన్ని ఉపయోగించుకోవడంతో పోటీ పరీక్షల వంటి జ్ఞానాన్ని పొంది ఉద్యోగ జీవితాన్ని సాధించవచ్చాని అన్నారు. తాను కొడంగల్ విద్యార్థినేనని హన్మయ్యతో ఉన్న విద్యా సంబందాలను పంచుకున్నారు. గ్రంథాలయాన్నికి తన వంతుగా పుస్తకాలను ఉచితంగా అందజేశారు. అథితులను హన్మయ్య, గ్రామ యువత సన్మానించి పుష్ప గుచ్చాలను అందజేశారు. ఇందులో ఆంధ్ర జ్యోతి దినపత్రిక సంపాదకులు కె.శ్రీనివాస్, పిఆర్‌టియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కమలాకర్ రావు, శతావధాని అంజయ్య, ఎంఈవో వెంకట్రామ్‌రెడ్డి, తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర కార్యదర్శి రవీందర్‌గౌడ్, నాయకులు ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్, పిఎసిఎస్ చైర్మెన్ కట్కం శివ కుమార్‌గుప్త, మాజీ జెడ్‌పిటిసి ఎనుగుల భాస్కర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నందారం ప్రశాంత్, యూత్ కాంగ్రెస్ తాలుక అధ్యక్షుడు రెడ్డి శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎన్నికల శిక్షణ తరగతులకు గైర్హాజరైతే క్రిమినల్ కేసులు

వారిని సస్పెన్షన్ చేయాలని వివిధ శాఖలకు లేఖలు

ప్రజాపక్షం/హైదరాబాద్ : ఎన్నికల నిర్వహణ కోసం ఏర్పాటు చేసిన శిక్షణ తరగతులకు గైర్హాజరైన అధికారులు, సిబ్బందిపై క్రిమినల్ చర్యలు చేపట్టినట్లు హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి, జిహెచ్‌ఎంసి కమిషనర్ రోనాల్డ్ రోస్ వెల్లడించారు. లోక్‌సభ ఎన్నికల కోసం నియమించిన 30 అధికారులపై ఆర్‌పి యాక్ట్ 1951 ప్రకారం క్రిమినల్ కేసులు నమోదు చేశామని సోమవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. గైర్హాజరైన అధికారులపై క్రిమినల్ కేసులు నమోదు చేసిన జాబితాను ఆయన విడుదల చేశారు. వివిధ శాఖలకు చెందిన గైర్హాజరైన అధికారులను సస్పెన్షన్ చేయాలని సిఫార్సు చేస్తూ సంబంధిత శాఖలకు ఆయన లేఖలు రాశారు.

సిఎం ప్రచార పర్యటన షెడ్యూల్

ప్రజాపక్షం/హైదరాబాద్: టిపిసిసి అధ్యక్షుడు, ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి మంగళవారంఉదయం కొడంగల్, సాయంత్రం నాగర్ కర్నూల్ నియోజకవర్గాల్లో పర్యటించనున్నారు. ఈ నెల 24న ఉదయం సికింద్రాబాద్‌లో జరిగే నామినేషన్ దాఖలు చేసే ర్యాలీలో పాల్గొంటారు. అనంతరం మధ్యాహ్నం 3 గంటలకు వరం గల్‌లో జరిగే ఎన్నికల ప్రచార ర్యాలీలో హాజరవుతారు. ఆ మరుసటి రోజు 25న సాయంత్రం చేవెళ్ల నియోజకవర్గంలోని ప్రచార సభలో, 26న సాయంత్రం 5 గంటలకు జహీరాబాద్ నియోజకవర్గంలో జరిగే ఎన్నికల ప్రచార ర్యాలీలో సిఎం రేవంత్ రెడ్డి హాజరుకానున్నారు.

సివిల్స్-2023లో ఆల్ ఇండియా 196వ ర్యాంక్‌ను సాధించిన జి. అక్షయ్‌దీపక్ ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డిని హైదరాబాద్‌లో సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అక్షయ్‌ని సిఎం రేవంత్ అభినందించారు.

మోదీ సర్కార్‌కు ఓటుతోనే బుద్ధి చెబుదాం

సిపిఐ రంగారెడ్డి జిల్లా సిపిఐ కార్యదర్శి జంగయ్య

ప్రజాపక్షం/వనస్థలిపురం: దేశంలో మతాల పేరుతో ప్రజలను రెచ్చగొడుతున్న మోదీ సర్కార్‌కు ఓటుతోనే బుద్ధి చెప్పే సమయం వచ్చిందని, ప్రజల చేతుల్లో దేశ భవిషత్ ఉందని దానికి ఓటుతోనే బుద్ధి చెప్పాలని భారత కమ్యూనిస్టు పార్టీ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి పాలమాకుల జంగయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్రా చారిలు అన్నారు. సోమవారం సరూర్ నగర్ మండలం సిపిఐ మండల మహాసభను నవచేతన విజ్ఞాన సమితి భవనంలో కామ్రేడ్ బోయపల్లి రాములు గౌడ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో మోదీ ప్రభుత్వం వచ్చిన తరువాత పేద బడుగుబలహీన వర్గాలపై దాడులు అత్యధికంగా జరుగుతున్నాయని, పేదలకు అందాల్సిన పథకాలు అందకుండా కార్పొరేషన్ సంస్థలకు చేరుతున్నాయని, దీనిపై ప్రజలు తిరుగుబాటు చేసే సమయం వచ్చిదని, వచ్చే ఎన్నికల్లో మోదీని బహిస్కరణ చేయాలని ప్రజలకు పిలుపు నిచ్చారు. పేద ప్రజలపై నిత్యవసర సరుకుల ధరలు పెచ్చి పేదల నడ్డివిరుస్తున్నారని ఆరోపించారు. పిట్రోల్, డీజిల్, సిలిండర్ ధరలు పెంచ్చి ప్రజలకు జీవనాలపై భారం మోపుతున్న బిజేపిని అధికారంలో రాకుండా చేయాలని పార్టీ నాయకులను ప్రజలకు వివరించే విధంగా ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని కోరారు. ప్రజల సమస్యలపై అనునిత్యం పోరాటం చేస్తున్న ఏకైక పార్టీ కమ్యూనిస్టు పార్టీ(సిపిఐ) అని వారు గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో హయత్ నగర్ మండల కార్యదర్శి సామిడి శేఖర్‌రెడ్డి, నాయకులు మారగొని ప్రవీణ్ కుమార్ గౌడ్, జిల్లెల కృష్ణ, కమలమ్మ, క్రాంతి కుమార్, పూజారి అనిత, లింగస్వామి, మీసాల స్వామి, కేశవులు, గోవిందం, యాదగిరి, స్వామి, పార్వతమ్మ, శోభ తదితరులు పాల్గొన్నారు.

సరూర్ నగర్ సిపిఐ నూతన కమిటీ ఎన్నిక

సరూర్ నగర్ మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నికున్నారు. మండల పార్టీ సిపిఐ కార్యదర్శిగా బాతరాజు నరసింహా, సహాయ కార్యదర్శిగా కందుల సుధాకర్, బోయపల్లి రాములు గౌడ్‌లను ఎన్నుకోవగా, 9 మందితో కార్యవర్గం, 29 మందిని కౌన్సిల్ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

ఒయు ఫండ్స్ స్వాహా కేసులో ఊరట

హైదరాబాద్ : ఉస్మానియా యూనివర్సిటీకి చెందిన రూ.1.18 కోట్లను దుర్వినియోగంపై 1993 నాటి కేసులో ఆరుగురు సిబ్బందికి హైకోర్టు తీర్పు ద్వారా ఊరట లభించింది. వాళ్లకు జైలు శిక్ష విధిస్తూ ఏసీబీ కోర్టు ఇచ్చిన తీర్పును రద్దు చేసింది. నిధుల దుర్వినియోగానికి సంబంధించి బ్యాంక్ సిబ్బందిని ఒక్కరిని కూడా విచారించలేదని, ప్రాసిక్యూషన్ ప్రవేశపెట్టిన సాక్ష్యం నిందితుడి నేరాన్ని నిరూపించేలా ఉండాలంది. వేరే ఉద్యోగులతో కలసి డైరెక్టర్ గోపాలన్ ప్రింటింగ్ మెటీరియల్ కొనుగోలు వ్యవహారంలో నిధుల దుర్వినియోగం జరిగిందని వర్సిటీ రిజిస్ట్రార్ 1993లో ఏసీబీకి ఫిర్యాదు చేశారు. రూ.1.18 కోట్ల విలువ చేసే ప్రింటింగ్ సామగ్రి, స్టేషనరీ కొనుగోలు అక్రమాల కేసులో ఏసీబీ 11 మందిపై చార్జిషీట్ దాఖలు చేసింది. ప్రింటింగ్ ప్రెస్ చీఫ్ ప్రాసెస్ ఆపరేటర్ బాలమల్లేశ్వర్‌రావు, కంపోసిటర్ జి.చంద్రశేఖర్, సీనియర్ అసిస్టెంట్ సయ్యద్ అన్వర్, జి.దామోదర్, మిషన్‌మ్యాన్ కెఎల్ రామారావు, అసిస్టెంట్ డైరెక్టర్ వి.సత్యనారాయణలకు ఏసీబీ కోర్టు 2007లో శిక్ష విధించింది. దీనిని వాళ్లంతా హైకోర్టులో సవాల్ చేయడంతో ఏసీబీ కోర్టు తీర్పును రద్దు చేస్తూ జస్టిస్ కె.సురేందర్ తీర్పు చెప్పారు.

క్యామ మల్లేశ్‌ను గెలిపించాలి

ప్రజాపక్షం/యాచారం : భువనగిరి పార్లమెంట్ అభ్యర్థి క్యామ మల్లేశ్‌కు అత్యధిక ఓట్లు వేసి గెలిపిచాలని బిఆర్‌ఎస్ యాచారం మండల అధ్యక్షకార్యదర్శులు కర్నాటి రమేశ్ గౌడ్, పాశ్చభాష అన్నారు. సోమవారం యాచారం మండల కేంద్రంలో వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ సామాజిక వర్గానికి చెందిన క్యామ మల్లేశ్ ప్రజా సమస్యలను పరిష్కరించడంలో ముందుండి పనిచేస్తారని అన్నారు. బిఆర్‌ఎస్ ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తుందని అన్నారు. మోస పూరిత వాగ్ధానాలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం గత ఎన్నికల్లో ఇచ్చిన హమిలను అమలు చేయడంలో పూర్తిగా విఫమైందని ఎద్దేవా చేశారు.

చేవెళ్లలో మరో 11 నామినేషన్లు

ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి: పార్లమెంటు ఎన్నికల నామినేషన్ల ప్రక్రియలో భాగంగా చేవెళ్ళ లోక్ సభ నియోజక వర్గ స్థానానికి సోమవారం పదకొండు (11) నామినేషన్లు దాఖలు అయ్యాయని రిటర్నింగ్ అధికారి,రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కె.శశాంక తెలిపారు.ఇప్పటికే నామినేషన్లు వేసిన బిఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్,ధర్మ సమాజ్ పార్టీ అభ్యర్థిగా తోట్ల రాఘవేందర్, రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ (సెక్యులర్) పార్టీ తరపున అభ్యర్థిగా మహమ్మద్ సలీం లు సోమవారం తమ తమ రెండవ సెట్ నామినేషన్ పత్రాలు అందజేశారని తెలిపారు. వీరితో పాటు భారతీయ జనతా పార్టీ అభ్యర్థిగా కొండా విశ్వేశ్వర్ రెడ్డి, ప్రజా ఎక్తా పార్టీ అభ్యర్థిగా సానెమ్ రాజ్ గౌడ్,ఆల్ ఇండియా మజ్లీస్ ఇ ఇంక్విలాబ్ ఇ మిలాత్ పార్టీ (ఎఐఎంఐ ఎం (ఐఎన్ క్యూ) అభ్యర్థిగా మహ్మద్ అబ్దుల్ ఖావీ అబ్బాసీ, స్వతంత్ర అభ్యర్థిగా జి.మల్లేషం గౌడ్, స్వతంత్ర అభ్యర్థిగా మహ్మద్ అఫ్సర్ ఖుద్దుస్, స్వతంత్ర అభ్యర్థిగా ఖద్గేకార్ శ్రీనివాస్, స్వతంత్ర అభ్యర్థిగా ఇస్లావత్ పాండు నాయక్,స్వతంత్ర అభ్యర్థిగా అమీర్ సాజిద్ ఒక్కొ సెట్ చొప్పున నామినేషన్లు దాఖలు చేశారని వివరించారు. చేవెళ్ళ పార్లమెంటు నియోజకవర్గ స్థానానికి ఇప్పటి వరకు మొత్తం 23 నామినేషన్లు దాఖలు అయ్యాయని రిటర్నింగ్ అధికారి శశాంక వివరించారు.

కాంగ్రెస్‌లో చేరిన బిజెఎంసి డిప్యూటీ మేయర్ పూలపల్లి

ప్రజాపక్షం/రాజేంద్రనగర్: బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్ రెడ్డితో సహా 11మంది సీనియర్ నాయకులు,కార్పొరేటర్లు సోమవారం కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు.కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్, తెలంగాణ పాడి పరిశ్రమ అభివృద్ధి సంస్థ చైర్మెన్ బొర్ర జ్ఞానేశ్వర్ ముదిరాజ్ సమక్షంలో వారంత కాంగ్రెస్‌లో చేరారు. గత బిఆర్‌ఎస్ ప్రభుత్వంలో బిఆర్‌ఎస్ అభ్యర్థులుగా పోటీ చేసి గెలుపొందిన మాజీ మేయర్ బుర్ర మహేందర్ గౌడ్,పలువురు కార్పొరేటర్లుతో కలిసి గత నెలలో కాంగ్రెస్‌లో చేరారు. ఇదిలా ఉండగా మాజీ మేయర్‌పై అవిశ్వాస తీర్మానం పెట్టి నెగ్గించుకున్న డిప్యూటీ మేయర్,మిగత కార్పొరేటర్లు కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్‌లో చేరిన వారిలో కార్పొరేటర్లు సంతోష్ కుమారి,నిఖిలా సంగారెడ్డి,అస్లాం బిన్ అబ్దుల్లా, అనిత,లతాప్రేమ్‌గౌడ్,అసియా ఖాజా,తలారిచంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.

నేడు కెటిఆర్‌తో కలిసి కాసాని నామినేషన్

ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి: నేడు బిఆర్‌ఎస్ చేవెళ్ల పార్లమెంట్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ నామినేషన్ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ పాల్గొన్న సందర్భంగా అన్ని స్థాయిలోని పార్టీ ప్రజా ప్రతినిధులు,నాయకులు, కార్యకర్తలు,శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాల్సిందిగా మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పట్లోళ్ల సబితా ఇంద్రారెడ్డి తెలిపారు. కదం కదం కలుపుదాం..కాసాని గెలుపుకు బాటలు వేద్దాం..చేవెళ్ల పార్లమెంట్ లో మరోసారి హ్యాట్రిక్ గా గులాబీ జెండా ఎగురవేద్దాం అని సబితా ఇంద్రారెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బిఆర్‌ఎస్ పార్టీ ఎంపి అభ్యర్థి,జిల్లా పార్టీ అధ్యక్షులు, పార్లమెంట్ పరిధిలోని ఎమ్మెల్సీలు,ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు,పార్టీ పరిశీలకులు,జిల్లా పార్టీ శ్రేణులు,ఇతర ముఖ్య నేతలు హాజరవుతరని మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి పేర్కొన్నారు.

ఇంద్రారెడ్డి 24వ వర్ధంతి

ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి: స్వర్గీయ పట్లోళ్ల ఇంద్రారెడ్డి 24 వ వర్ధంతి సందర్భంగా ఆయన స్వగ్రామం కౌకుంట్లలోని సమాధి తో పాటు చేవెళ్ల కేంద్రం,చిట్టంపల్లి చౌరస్తాలలోని విగ్రహాల వద్ద కుమారులు, కుటుంబ సభ్యులతో కలిసి మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి సోమవారం నివాళులు అర్పించారు. చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య, రంగారెడ్డి,వికారాబాద్ జిల్లాల నుండి పెద్ద ఎత్తున ఇంద్రారెడ్డి అభిమానులు నివాళులు అర్పించారు.

రాకెట్‌లా రంజిత్‌రెడ్డి దూకుడు

ప్రత్యర్థులకు ముచ్చెమటలు

అన్నివర్గాలతో మమేకం : సబ్బండ వర్గాల సంక్షేమానికి హామీ

ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి: చేవెళ్ళ పార్లమెంట్ స్థానానికి కాంగ్రెస్ తరపున పోటీ చేస్తున్న సిట్టింగ్ ఎంపి డాక్టర్ గడ్డం రంజిత్‌రెడ్డి ఎలక్షన్ క్యాంపెయిన్‌లో రాకెట్‌లా దూసుకెళుతున్నారు. గడచిన 15 రోజులుగా ఆయన ఎన్నికల ప్రచారం వాయువేగంతో సాగుతున్నది. ఒకవైపు బూత్ కార్యకర్తల సమావేశాలు,కార్నర్ మీటింగ్‌లు, వ్యవస్థాగతమైన అంశాలను పరిష్కరిస్తూ అడుగులు వేస్తున్నారు. రంజిత్ రెడ్డి స్పీడ్‌కు ఆయన పత్యర్థి పార్టీల అభ్యర్థులకు ముచ్చెమటలు పడుతున్నాయి. ప్రచారంలో రంజిత్‌రెడ్డి మాత్రమే కాకుండా తన సతీమణి గడ్డం సీతారెడ్డి, కూతురు పూజా ఆకాంక్ష రెడ్డి, కుమారుడు రాజ్ ఆర్యన్ రెడ్డి సైతం అన్ని వర్గాలతో మమేకం అవుతూ సబ్బండవర్గాల సంక్షేమానికి కృషి చేస్తామని హామీనిస్తూ ముందుకు కదులుతున్నారు.చేవెళ్ళ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ఆరు గ్యారంటీలకు అప్లయ్ చేసిన అర్హులకు న్యాయం చేస్తామని చెబుతూ ప్రజల్లోకి వెళుతున్నారు. రంజిత్‌రెడ్డి అండగా ఎలక్షన్ క్యాంపెయిన్న తన కుటుంబీకులు క్యాంపెయిన్ చేయడంతో వార్ వన్‌సైడ్‌గా సాగుతుందంటున్న విశ్లేషకులు వ్యాఖ్యానిస్తున్నారు.

రాష్ట్రంలో లోక్‌సభ ఎన్నికల ప్రచారం ఇప్పుడు మరింత ఊపందుకుంది. అభ్యర్థులు ఎవరికి వారుగా తమదైన శైలిలో క్యాంపెయిన్‌లో దూసుకుపోతున్నారు. గడప గడపకు ప్రచారం, వీధుల్లో క్యాంపెయిన్, రోడ్ షోలు,కార్నర్ మీటింగులు,బహిరంగ సభలతో తెలంగాణ హోరెత్తుతోంది. అభ్యర్థులందరూ ఈ రకమైన ప్రచారపర్వానికి తెరతీసినప్పటికీ... వారిలో కొందరే జనాన్ని ఆకట్టుకోగలుగుతున్నారు.వారి మనసులను గెలుచుకోగలుగుతున్నారు.అలాంటి వారిలో అగ్రభాగాన ఉన్నారు చేవెళ్ల కాంగ్రెస్ ఎంపి అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డి. రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు ముగియగానే లోక్‌సభ ఎలక్షన్ల వేడి రాజుకుంది.ఈ క్రమంలో డిసెంబరు నుంచి అంటే దాదాపు ఐదు నెలల ముందే రంజిత్ రెడ్డి ఎన్నికల వ్యూహాన్ని రచించుకున్నారు. తనదైన శైలిలో ప్రతికలు, ఛానళ్లు,మీడియా, సోషల్ మీడియా ద్వారా ఒక డిఫరెంట్ పద్దతుల్లో ప్రచారాన్ని వేడెక్కించారు. తాను గత ఐదేండ్లలో చేసిన అభివృద్ధి, మరోసారి గెలిపిస్తే ఏం చేస్తాననే హామీలతో కూడిన ఒక బహిరంగ పత్రాన్ని ఆయన ఇప్పటికే విడుదల చేశారు. తద్వారా ప్రత్యర్థుల గుండెల్లో రైళ్లను పరిగెత్తించారు. మరోవైపు తాను బిఆర్ ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో ఎందుకు చేరాల్సి వచ్చిందో పేర్కొంటూ సహేతుకమైన కారణాలతో ప్రజలకు వివరించారు.దీంతో పాటు హస్తం పార్టీ అభ్యర్థినైన తనకెందుకు ఓటేయాలి? బిజెపి ని ఎందుకు ఓడించాలి? ఆ పార్టీ మూడోసారి గెలిస్తే దేశానికే వచ్చే ప్రమాదమేంటి? తెలంగాణకు ఆ పార్టీ ఏ రకంగా హానికరమనే అంశాలను ఓటర్లకు ఓపిగ్గా విడమరిచి చెబుతూ ప్రచారాన్నిహోరెత్తిస్తున్నారు. దీంతో ఆయనకు ప్రధాన ప్రత్యర్థి, పార్టీలకు చెందిన అభ్యర్థులకు ఏం చేయాలో పాలుపోవటం లేదు.ఈ క్రమంలో రంజిత్ ప్రచారం...చేవెళ్లలో పోటీ రసవత్తరంగా మారిందంటూ రాజకీయ విశ్లేషకులు వ్యాఖ్యానిస్తున్నారు. ప్రచారంలో రంజిత్ రెడ్డి భార్య సీతారెడ్డితో పాటు కూతరు,కుమారుడు కూడా ప్రచారంలో పాల్గొనటం రంజిత్‌కు కలిసొచ్చే అదనపు అంశం,బలం కాగా దానికి తోడు అవుతుందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

ఫార్మశి కళాశాల ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలి : ఎఐఎస్‌ఎఫ్

ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధిఃపాలమూరు యూనివర్సిటీలో గల ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డా.సుజాత పై చర్యలు తీసుకోవాలని యూని వర్సిటీ రిజిస్టర్ మధుసూదన్‌రెడ్డి కి సోమవారం ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో సమర్పించారు. ఫార్మసి డిపార్ట్‌మెంట్లో పనిచేస్తున్న సిబ్బందిని వేధించడం, వారికి తెలియకుండానే వాళ్ల జీతాలలో కోత విధించడం, అధ్యాపకుల ఐటీకి సంబంధించిన డీటెయిల్స్ అడగడం, అధ్యాపకుల స్పెషలైజేషన్‌తో సంబంధం లేకుండా ఇష్టానుసారంగా తరగతులను కేటాయించడం లాంటి అక్రమాలకు పాల్పడుతుందని ఏఐఎస్ఎఫ్ నాయకులు ఆరోపించారు. విద్యార్థులకు ల్యాబ్‌కు సంబంధించిన పరికరాలు తెప్పించడం లేదని, కావున ప్రిన్సిపాల్‌పై విచారణ జరిపి చట్ట ప్రకారంగా చర్యలు తీసుకోవాలని అఖిలభారత విద్యార్థి సమాఖ్య డిమాండు చేసింది. డి.రాము, పవన్, లక్ష్మ ణ్, నాగరాజు, రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

ఆరు నామినేషన్లు దాఖలు

ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి : నాగర్‌కర్నూల్ లోక్‌సభ 12 ఎస్సి పార్లమెంట్ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియలో భాగంగా నాగర్‌కర్నూల్ లోక్‌సభ నియోజకవర్గస్థానానికి నాల్గోవరోజు సోమవారం ఆరు నామినేషన్లు దాఖలు అయ్యాయని రిటర్నింగ్ అధికారి జిల్లా కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్ తెలిపారు. 01) పిరమిడ్‌పార్టీ ఆఫ్ ఇండియా అభ్యర్థిగా ప్రసంగి ఒకసెట్ నామినేషన్ పత్రాలు, 2) అలయన్స్ ఆఫ్ డెమోక్రటిక్ రిఫార్మ్‌పార్టీ అభ్యర్థిగా అంబోజురవి ఒక సెట్ నామినేషన్ పత్రాలు, 3 ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మల్లురవి తరపున వారి సతీమణి రాజు బన్సీదేవిమల్లు రెండోసెట్ నామినేషన్ పత్రాలు , రాష్ట్రసమితి పార్టీ అభ్యర్థిగా రేపల్లె శివ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌రెండో సెట్ నామినేషన్ పత్రాలు, 5) బిజెపిపార్టీ అభ్యర్థిగా పోతుగంటి రాములు ఒక సెట్ నామినేషన్ పత్రాలు , రెండోసెట్ నామినేషన్‌పత్రాలు దాఖలు చేశారని వివరించారు. ఇప్పటివరకు 09 నామినేషన్లు దాఖలు అయ్యాయని రిటర్నింగ్ అధికారి కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్ తెలిపారు.

వరిధాన్యం కొనుగోలుపై సమీక్ష



ప్రజాపక్షం/నాగర్ కర్నూల్ ప్రతినిధి : వరి ధాన్యం కొనుగోలుపై సమీక్ష సమావేశాన్ని సోమవారం సివిల్‌సప్లై ప్రిన్సిపల్ సెక్రటరీ డిఎస్ చౌహాన్ రాష్ట్రంలోని అన్ని జిల్లాల అదనపు కలెక్టర్లతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించి రాష్ట్రంలో జరుగుతున్న వరికొనుగోలు కేంద్రాల పనితీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు. మార్కెటింగ్ వ్యవసాయ అధికారులు వరిధాన్యం కొనుగోలు కేంద్రాలకు అందుబాటులో ఉండాలని రైతులుతెచ్చే ధాన్యం వర్షాలకుతడవకుండా టార్పాలిన్ కవర్లను అందుబాటులో ఉంచాలని ధాన్యం తడవకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. తడిసిన ధాన్యాన్నికూడా కొంటామని రైతులకు భరోసా కల్పించాలని తెలిపారు. వీడియోకాన్ఫరెన్స్‌లో జిల్లా ఐడిఓసి కార్యాలయం ఎస్ఐసిహాల్‌నుండి జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ సీతారామారావు, జిల్లా మార్కెటింగ్ అధికారిబాలమణి, జిల్లా వ్యవసాయ అధికారి వెంకటేశ్వర్లు, పౌరసరఫరాలశాఖ అధికారులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు మాతృపాఠశాలలో రిపోర్టుచేయాలి : డిఇఒ



ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధిః నాగర్‌కర్నూల్ జిల్లాలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో పని సర్దుబాటుపై ఉపనియామకం ద్వారా జిల్లాలోని వివిధ పాఠశాలల్లో కొనసాగుతున్న ఉపాధ్యాయులు ఈవిద్యా సంవత్సరం మంగళవారం పాఠశాలలచివరి పనిదినంరోజున తమతమ మాతృ పాఠశాలల్లో రిపోర్టుచేయాలని డిఇఓ గోవిందరాజులు సోమవారం సాయంత్రం ఆదేశించారు. ఈవిద్యా సంవత్సరం వివిధ పాఠశాలల్లో ఉపాధ్యాయ ఖాళీల ఆధారంగా పని సర్దుబాటుపై ఉపాధ్యాయులను డిప్యూటేషన్‌పై కొనసాగుతున్న ఉపాధ్యాయులు మంగళవారం పాఠశాలల చివరి పనిదినంరోజున తమ మాతృపాఠశాలలో రిపోర్టు చేయాలని , రిపోర్టుచేయని ఉపాధ్యాయుల జీతాలను నిలుపుదల చేస్తామని సోమవారం తెలిపారు.

అంబేద్కర్ సంఘం నూతన అధ్యక్షుడుగా లక్ష్మయ్య



ప్రజాపక్షం/బాలానగర్ః బాలానగర్ మండల అంబేద్కర్ సంఘం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందని అంబేద్కర్ సంఘం నాయకులు తెలిపారు. నూతన అధ్యక్షులుగా పెద్దపల్లి మాజీ ఎంపీటీసీ లక్ష్మ య్య, ఉపాధ్యక్షులుగా వస్పూలా శేఖర్, ప్రధాన కార్యదర్శిగా అరేళ్ల యాదయ్య, కోశాధికారిగా వంగూరి రాంచంద్రయ్య, ఉపాధ్యక్షులుగా కుర్వశ్రీను, జమీర్‌పాషా,కళ్లెం మల్లేశ్, ఆర్.కుమార్, నేరెళ్లపల్లి యాదయ్య, కార్యదర్శులుగా కే.విష్ణు వర్ధన్, కే.యాదయ్య, జగన్, వి.యాదయ్య ప్రచార కార్యదర్శులుగా ప్రేమ్‌కుమార్, నర్సింహులు, ఆర్.కృష్ణ, సలహాదారులుగా జి.యాదయ్య, గౌరవ అధ్యక్షులుగా చంద్రయ్య, ఏం.వెంకటయ్య, తదితర సభ్యులను ఎన్నుకోవడం జరిగిందని తెలిపారు. అలాగే మహిళా అధ్యక్షులుగా యాదమ్మను ఎన్నుకున్నట్లు వెల్లడించారు.

కాంగ్రెస్ పార్టీలోకి చేరికలు

ప్రజాపక్షం / పెబ్బేరు: పార్లమెంట్ ఎలక్షన్‌లో భాగంగా నాగర్‌కర్నూల్ పార్లమెంట్ స్థానానికి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా డాక్టర్ మల్లురవి నామినేషన్ వేయడం జరుగుతుంది. ఈ నామినేషన్ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర ముఖ్యమంత్రి , రాష్ట్ర పిసిసి అధ్యక్షులు ఎనుముల రేవంత్‌రెడ్డి హాజరవుతున్నారు. నామినేషన్ కార్యక్రమం అనంతరం బిజినపల్లి మండల కేంద్రంలో సాయంత్రం 3 గంటలకు భారీ బహిరంగ సభను ఏర్పాటు చేయడం జరిగింది. ఈ నామినేషన్ కార్యక్రమానికి భారీ బహిరంగ సభను విజయవంతం చేయడం కోసం పెబ్బేరు పట్టణ మండల కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పెబ్బేరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎద్దుల విజయ వర్ధన్‌రెడ్డి, టౌన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కారుపాకుల వెంకట్రాములు యాదవ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

వేతనజీవుల వెతలు తీర్చండి

తెలంగాణ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ (ఎఐటియుసి) రాష్ట్ర అధ్యక్షులు సత్యనారాయణరెడ్డి

ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధిః పబ్లిక్ హెల్త్ సెక్టార్ పనిచేస్తున్న సంఘటిత కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ వేతన జీవుల వెతలు తీర్చండని తెలంగాణ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు సత్యనారాయణ రెడ్డి కోరారు. 138వ మేడే వార్షికోత్సవాల విజయవంతం ఆకాంక్షిస్తూ సోమవారం మహబూబ్ నగర్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ప్రాంగణంలో మేడే వాల్‌పోస్టర్స్ కరపత్రాలు ఇతర ప్రచార సామాగ్రిని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా 138వ అంతర్జాతీయ కార్మిక దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించుకోవడం కోసం కార్మిక వర్గం సిద్ధం అవుతుందని ఆయన అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో లోక్‌సభ ఎన్నికల కోడ్ ఉన్న నేపథ్యంలో రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌కి ఏఐటీయూసీ రాష్ట్ర నాయకత్వం ఇప్పటికే విజ్ఞాపన పత్రాలు సమర్పించడం జరిగిందని తెలిపారు. మేడే ఉత్సవాల సందర్భంగా జెండా దిమ్మలను, అమరుల స్పూర్తి చిహ్నాలను రంగులతో అద్ది, తోరణాలు జెండాలతో అలంకరించాలని, ఇదే తరుణంలో కార్మికుల హక్కులు, చట్టాలు, సంక్షేమం లాంటి నిమిషాల పై రౌండ్ టేబుల్ సమావేశాలు చర్చ గోష్ఠులు సదస్సులు ర్యాలీలు సభలు సమావేశాలు నిర్వహించేందుకు సన్నాహాలు చేయాలని శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు ఏం.మధుసూదన్ రెడ్డి, కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు పి.సురేష్, ఏఐటీయూసీ జిల్లా నాయకులు ఆంజనేయులు, ఏఐటీయూసీ మెడికల్ కాంట్రాక్టు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంఘం నేతలు కోటేశ్వర్ రెడ్డి, రాఘవేందర్, బ్రాంచ్ నాయకులు కార్మికులు, అంజి, భీమయ్య, యాదయ్య, మన్యం, గొండెలి యాదయ్య, సరోజ, సునిత, చెంచు లక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఉమామహేశ్వర క్షేత్రంలో విరాళాలు గోల్‌మాల్

ప్రజాపక్షం/అచ్చంపేట : అచ్చంపేట నియోజకవర్గం రంగాపూర్ గ్రామ సమీపంలో శ్రీశైలానికి ఉత్తరద్వారంగా పిలవబడే ఉమామహేశ్వర క్షేత్రం దేవాయలంలో భక్తులు ఇచ్చిన చందాలు అవినీతి అక్రమాలకుతావై పక్కదారి పట్టిన సంఘటన వెలుగులోకి వచ్చింది. అచ్చంపేట నియోజకవర్గం రంగాపూర్ గ్రామ సమీపంలో ఉమామహేశ్వరం క్షేత్రం కలదు. ఈదేవాలయంలో శ్రీశైలానికి ఉత్తరద్వారమని పేరుండటంతో భక్తులు అధికంగా వస్తారు. ఇటీవలికాలంలో గత మూడు సంవత్సరాలనుండి ఇక్కడ అన్నదానం ప్రారంభించారు. ప్రస్తుత దేవస్థాన చైర్మన్ కందూరి సుధాకర్‌ఆధ్వర్యంలో దేవాలయం నిర్వహించబడుతుంది. 2021నుండి అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఉచిత అన్నదాన కార్యక్రమానికి భక్తులు దాతల సహకారంతో కొనసాగిస్తున్నారు. దేవస్థానం ఇఓ శ్రీనివాస్ రావు, కాంట్రాక్టు ఉద్యోగి శంకర్ ఇటీవల దాతలు ఇచ్చిన డబ్బులను 6లక్షల16వేలు పక్కదారి పట్టించారు. ఈడబ్బులు అకౌంట్‌లో జమ చేయడం లేదని తెలిసింది. చైర్మన్ సుధాకర్ నిధుల విషయం పరిశీలించగా డబ్బులపై సమాధానం చెప్పకపోవడంతో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తానని హెచ్చరించడంతో ఇట్టిడబ్బులు తామూ తీసుకున్నట్లు ఇద్దరు ఉద్యోగులు ఒప్పుకున్నారు. ఈవిషయంపై చైర్మన్ మాట్లాడుతూ నిధులు రాబట్టేందుకు ఉద్యోగులపై చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. మిగతా అకౌంట్లపైకూడా తాను క్షుణ్ణంగా పరిశీలించి వివరాలు తెలియజేస్తానని తెలిపారు.

అవకతవకలు వాస్తవమే

ఉమామహేశ్వరం ఆలయంలో నిధులు గోల్‌మాల్ అయిన విషయంపై ఫోన్ ద్వారా వివరణ కోరగా నిధులు పక్కదారి పట్టిన వాస్తవమేనని అందుకు కాంట్రాక్టు ఉద్యోగి శంకర్‌ను సస్పెండ్ చేశామని నిధులు రికవరి చేపడుతున్నామని ఇఓ శ్రీనివాస్‌రావు తెలిపారు. గతంలో ఆలయంలో చైర్మన్‌ద్వారా అన్ని విషయాలు చర్చించామని ఇటీవల పక్కదారి పట్టిన నిధులను పూర్తి వివరాలు మంగళవారం వెల్లడించనున్నట్లు తెలిపారు.

అభివృద్ధి కోసం గెలిపించండి :వంశీచంద్‌రెడ్డి



ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధిః స్థానిక ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి నేతృత్వంలో చిన్నపొర్ల గ్రామంలో మాజీ సర్పంచు రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో బిజెపి పార్టీకి చెందిన నాయకులు, కార్యకర్తలు ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచంద్ రెడ్డి సమక్షంలో కండువా కప్పుకుని కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు బాలకృష్ణారెడ్డి, సిద్ధార్థ్ రెడ్డి, విఘ్నేశ్వర్ లతో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చల్లా వంశీచంద్‌రెడ్డి మాట్లాడుతూ 10 ఏండ్ల బిజెపి, బిఆర్ఎస్ పార్టీల నిర్లక్ష్యం నీడలో పాలమూరు ప్రాంతం మగ్గిపోయిందని ఆయన పేర్కొన్నారు. ఏనాడు బిజెపి, బిఆర్ఎస్ పార్టీల నాయకులు గెలిచి ప్రజల అభివృద్ధి కోసం పనిచేయలేదని కేవలం భూకబ్జాలు, దోపిడి, అవినీతి, అక్రమాలే చేశారని ఆయన ఆరోపించారు. ఇప్పుడు కూడా బిజెపి, బిఆర్ఎస్ పార్టీల ద్వంద వైఖరి ఒక్కటేనని ఆయన విమర్శించారు. బిజెపి, బిఆర్ఎస్ పార్టీలు పాలమూరు ప్రాంతాన్ని 10 ఏండ్లు అణచివేతతో రౌడీయిజం చేస్తూ లిక్కర్, కల్తీకల్లు ఏరులై పారించి పాలమూరు ప్రగతిని బొందపెట్టిన ఘన చరిత్ర బిజెపి, బిఆర్ఎస్ పార్టీలకే దక్కిందని ఆయన పేర్కొన్నారు. పాలమూరు జిల్లా అభివృద్ధిని చేసే చిత్తశుద్ధి, విశ్వాసం కాంగ్రెస్ పార్టీకే ఉన్నదని ఆయన తెలిపారు. బిజెపి, బిఆర్ఎస్ పార్టీలతో అగమైనా అభివృద్ధికి స్వప్తిపలికి పునర్జీవంతో నవ అభివృద్ధివైపు అడుగులు వేసేందుకు తనను ఆశీర్వదించి ఎంపీ అభ్యర్థిగా గెలిపించండి. అభివృద్ధిలో పాలమూరు ప్రాంతాన్ని అభివృద్ధిలో అగ్రగామిగా తీర్చిదిద్దుతానని ఆయన హామి ఇచ్చారు.

కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి

మంత్రి జూపల్లి కృష్ణారావు



ప్రజాపక్షం / వీపనగండ్ల : రైతులు ఆరు కాలం కష్టపడి పండించిన పంటను దళారులకు అమ్మి మోసపోకూడదని ఉద్దేశంతో ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందని, రైతులు తమ పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లోని విక్రయించి మద్దతు ధర పొందాలని రాష్ట్ర ఎక్సైజ్ , సాంస్కృతిక పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. సోమవారం మండల పరిధిలోని కల్వరాల గ్రామ శివారులో నూతనంగా నిర్మించిన భాగ్యలక్ష్మి రైస్ మిల్లును మంత్రి జూపల్లి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వనపర్తి జిల్లా ఎంపీటీసీల ఫోరం అధ్యక్షులు ఇంద్రకంటి వెంకటే,వ , మండల రైతు సమన్వయసమితి మాజీ అధ్యక్షులు నారాయణరెడ్డి, వల్లభాపురం కాల్వరాల మాజీ సర్పంచ్‌లు రవీందర్‌రెడ్డి, హుస్సేన్, నాయకులు నర్సింహ, పెద్ద వెంకటేష్ , చక్ర వెంకటేష్ , వెంకట్రాజయ్య, పూరి శేఖర్ , పెంటయ్య, గోపి, మహేష్ నాయుడు తదితరులు ఉన్నారు.

'సిఎం రేవంత్ పర్యటన విజయవంతం చేయండి'

ప్రజాపక్షం / శ్రీరంగాపురం: పార్లమెంట్ ఎలక్షన్‌లో భాగంగా నాగర్‌కర్నూల్ పార్లమెంట్ స్థానికి కాంగ్రెస్ పార్టీ అ భ్యర్థిగా డా. మల్లురవి మంగళవా రం నామినేషన్ వేయడం జరుగుతుంది. నామినేషన్ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి పాల్గొంటున్నారు. శ్రీరంగాపురం కాంగ్రెస్ ముఖ్య నాయకులు బీరం రాజశేఖర్‌రెడ్డి ప్రకటనలో తెలిపారు. నామినేషన్ కార్యక్రమం అనంతరం బిజినపల్లి మండల కేంద్రంలో మధ్యాహ్నం 3 గంటలకు భారీ బహిరంగ సభను ఏర్పాటు చేశారు. బహిరంగ సభను విజయవంతం చేయడం కోసం శ్రీరంగాపూర్ మండల కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని శ్రీరంగాపూర్ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు బిరం రాజశేఖర్‌రెడ్డి కోరారు.

కాంగ్రెస్ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డికి మద్దతుగా నామినేషన్ దాఖలు

ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధిః జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ కి గొల్ల కాపరుల సహకార సంఘం చైర్మన్ శాంతయ్య యాదవ్ ఆధ్వర్యంలో మహబూబ్‌నగర్ కాంగ్రెస్ పార్టీ ఎంపి అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి తరపున నామినేషన్ దాఖలు చేసిన పట్టణ అధ్యక్షులు లక్ష్మ ణ్ యాదవ్, మక్తల్ నుండి రవికుమార్ యాదవ్, దేవరకద్ర నుండి తిరుపతయ్య యాదవ్, జడ్చర్ల నుంచి అశోక్ యాదవ్, మహబూబ్‌నగర్ నుండి మాజీ జడ్పిటిసి నర్సింహులు యాదవ్, వెంకటాద్రి, కురువ నరేష్, కురువ భీమయ్య, తదితరులు పాల్గొన్నారు. శాంతయ్య మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి మద్దతుగా వంశీచంద్‌రెడ్డి ని భారీ మెజారిటీతో గెలిపించే ఉద్దేశంతో నామినేషన్ దాఖలు చేయడం జరిగింది. కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ కూ డా కురుమ యాదవులకు తోడుగా ఉందన్నారు. గతంలో కాంగ్రెస్ హయాం లో కర్ణాటక రాష్ట్రంలో కురుమకు ముఖ్యమంత్రి పదవి ఇచ్చిందని గుర్తు చేశారు. తెలంగాణలో అతి చిన్న వయసులో యాదవ సోదరులకు రాజ్యసభ సీటును కేటాయించిందన్నారు. గొర్ల కాపరులకు గత ప్రభుత్వం డీడీలు తీసుకుని మోసం చేసిందన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో ఆ డీడీలు అన్ని కూడా తిరిగి మంజూరు చేస్తుందన్నారు. సమైక్యాంధ్ర ఉన్నప్పుడు కాంగ్రెస్ హయాంలో గొల్ల కురుమలకు అత్యధికంగా 70 కోట్లు కేటాయించినట్లు సూచించారు. యాదవులకు పాడి పెంపకంలో 80 శాతం సబ్సిడీ వచ్చేటట్లు ముఖ్యమంత్రి దగ్గర స్పష్టమైన హామీ తీసుకున్నట్లు తెలియజేశారు. మహబూబ్‌నగర్ ప్రజలు ఏవిధంగా అయితే అసెంబ్లీ ఎన్నికల్లో మంచి విజయాన్ని ఇచ్చారో పార్లమెంటు ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ ప్రజాపాలనకు బ్రహ్మరథం పడతారని, చల్లా వంశీ చంద్‌రెడ్డి విజయం తథ్యమని తెలిపారు.

సలేశ్వరం జాతరలో నిబంధనలు పాటించండి : డిఎఫ్ఓ రోహిత్

ప్రజాపక్షం/అచ్చంపేట : సలేశ్వరం జాతరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని భక్తులు నిబంధనలు పాటించాలని అటవీశాఖ డిఎఫ్ఓ రోహిత్‌గోపిడి తెలిపారు. ఈప్రాంత ఆరాధ్యదైవం సలేశ్వరం కావడంతో లక్షలాది ప్రజలు వస్తున్నారని ఆయన తెలిపారు. బస్సులు , భారీ వాహనాలలో వెయ్యిరూపాయలు , ఇతర వాహనాలకు రూ.500లు చెల్లించి టోల్‌ఫీజు వసూలు చేస్తున్నామని తెలిపారు. ఆర్‌టిసి బస్సులకు ఉచితమని తెలిపారు. ఈజాతరకు మూడురోజులు అనుమతి ఉందని తెలిపారు. అటవీలో ప్లాస్టిక్, మద్యం, ధూమపానం నిషేధించామని తెలిపారు. అడవిలో ప్లాస్టిక్ వ్యర్థాలను ఆలయ కమిటి ఆధ్వర్యంలో సేకరించి అటవీశాఖ వాహనాలద్వారా మన్ననూర్ రిసైక్లింగ్ సెంటర్‌కు తరలించనున్నట్లు తెలిపారు.

జోరందుకున్న బిజెపి ప్రచారం

ప్రజాపక్షం / కొత్తకోట: కొత్తకోట పట్టణంలో 232వ బూత్ అధ్యక్షుడు పాపయ్య రాఘవేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో 13,14వ వార్డులో 232, 231 బూత్ లలో ప్రతీ ఇంటికి వెళ్లి మహబూబ్‌నగర్ బీజేపీ ఎంపీ అభ్యర్థి డి.కె. అరుణకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. నాయకులు అమరేందర్ రెడ్డి, రాఘవేందర్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి, బుచ్చిరెడ్డి, రాఘవేంద ర్‌రెడ్డి, కిరణ్‌రెడ్డి, గద్వాల శంకర్ , శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మంత్రి జూపల్లి సమక్షంలో చేరికలు



ప్రజాపక్షం / వీపనగండ్ల : మండల పరిధిలోని వల్లభాపురం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు పలువురు సోమవారం రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. మండల రైతుబంధు సమితి మాజీ అధ్యక్షుడు నారాయణరెడ్డి, వల్లభాపూర్ మాజీ సర్పంచ్ రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు, మాజీ ఉప సర్పంచ్ భర్త సంజీవ, బాలరాజు, మధు, రాముడుతో పాటు పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరడంతో రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు వారికి పార్టీ ఒదువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి డా. మల్లురవి గెలుపుకు కృషి చేయాలని సూచించారు.

తప్పిన ప్రమాదం

ప్రజాపక్షం / వీపనగండ్ల: గుర్తు తెలియని కొందరు అకతాయిలు చెత్తకు నిప్పు పెట్టడంతో విద్యుత్ వైర్లు తెగి మంటలు వ్యాపించడంతో గ్రామస్తులు అప్రమత్తమై మంటలు మరింత వ్యాపించకుం డా ఆర్పి వేశారు. మండల పరిధిలోని గోపాల్ దిన్నె గ్రామ సమీపంలో ఉన్న చెత్తకుప్పకు కొందరు అకతాయిలు నిప్పు పెట్టారు. దీంతో ఒక్కసారిగా మంటలు దట్టంగా వ్యాపించడంతో సమీపంలో ఉన్న విద్యుత్ తీగలు కూడా అంటుకొని తెగిపడిపోయాయి. ఎగిసిపడుతున్న మంటలను చూసిన గ్రామస్తులు విద్యుత్ తీగలను తొలగించి మంటలను ఆర్పి వేశారు.

'రైల్వేలో అన్నింటా భద్రతా చర్యలు అమలు చేయండి'

ప్రజాపక్షం/హైదరాబాద్ : రైల్వే అన్ని విభాగాలలో భద్రత చర్యలు కట్టుదిట్టంగా అమలు చేయాలని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ అధికారులను ఆదేశించారు. రైలు కార్యకలాపాల భద్రత కోసం తీసుకోవాల్సిన చర్యలపై సికింద్రాబాద్ రైల్ నిలయంలో సోమవారం ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆరు డివిజన్‌లకు చెందిన డివిజనల్ రైల్వే మేనేజర్లు (డిఆర్ఎంలు) వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశంలో పాల్గొన్నారు. వేసవికాలాన్ని దృష్టిలో ఉంచుకుని జోన్‌లోని అన్ని స్టేషన్‌లలో తాగునీటి వసతి కల్పించాలని సూచించారు. రైళ్లలో నీరు నింపే వ్యవస్థను పర్యవేక్షించాలని అధికారులకు సూచించారు. రైల్వే స్టేషన్‌లలో తాగునీటి లభ్యతపై ప్రయాణికుల నుంచి వచ్చిన స్పందనను ఆయన సమీక్షించారు. వేసవికాలంలో నడుస్తున్న ప్రత్యేక రైళ్ల ఆక్యుపెన్సీ, వాటి రన్నింగ్‌ను కూడా ఆయన సమీక్షించారు. అదనపు వేసవి ప్రత్యేక రైళ్ల ఆవశ్యకత, వాటి విస్తరణ గురించి ఎప్పటికప్పుడు సమీక్షించాలన్నారు. అవాంఛనీయ సంఘటనలను నిరోధించేందుకు పని ప్రదేశాలలో భద్రతకు సంబంధించిన సరైన జాగ్రత్తలు పాటించాలని అరుణ్ కుమార్ జైన్ ఆదేశించారు. రైల్వే ఆస్తుల నిర్వహణలో వైఫల్యాల స్థితిని, రైలు కార్యకలాపాల నిర్వహణలో వచ్చే ఆటంకాలపై సమలోచనలు జరిపారు. రైలు కార్యకలాపాల నిర్వహణలో సంబంధించి ఏవైనా సమస్యలుంటే వాటిని వెనువెంటనే సరిదిద్దేందుకు అన్ని శాఖల ద్వారా చర్యలు తీసుకోవాలన్నారు.

ముమ్మరంగా ఓటు హక్కుపై.. అవగాహన కార్యక్రమాలు



ప్రజాపక్షం/హైదరాబాద్ : హైదరాబాద్ జిల్లాలో ఓటింగ్ శాతం పెరగడానికి పలు విద్యా సంస్థల్లో, పలు విధుల్లో అవగాహన ర్యాలీలు నిర్వహిస్తున్నారు. జిల్లా ఎన్నికల అధికారి, జిహెచ్‌ఎంసి కమిషనర్ రోనాల్డ్ రోస్ ఆదేశాల మేరకు ర్యాలీలు, అవగాహన సమావేశాలు ముమ్మరంగా చేపడుతున్నారు. రెసిడెన్షియల్ అసోసియేషన్, స్వయం సహాయక సంఘాల మహిళలు, స్లమ్, టౌన్ ఫెడరేషన్ సమావేశాలు ఏర్పాటు చేసి, వారికి ఓటు హక్కు వినియోగం, ఓటు హక్కు ఓటర్ల బాధ్యతను తెలియచేయడమే కాకుండా ఓటు తప్పని సరిగా వేసి ప్రజాస్వామ్యానికి దోహదపడిన వారవుతారని, ఎలాంటి ప్రలోభాలకు తావివ్వకుండా స్వేచ్ఛ యుతంగా ఓటు వేసేందుకు జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఈ అవగాహన కార్యక్రమంలో వివరిస్తున్నారని అధికారులు చెప్పారు. పట్టణ పేదరిక నిర్మూలన విభాగం ద్వారా చిరు వ్యాపారులకు, వివిధ కమ్యూనిటీ పెద్దలకు, యువతకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పిస్తూ ఓటర్లకు చైతన్య కార్యక్రమాల ద్వారా పార్లమెంట్ ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెంచే దిశగా జిహెచ్ఎంసి ప్రధాన కార్యక్రమంగా తీసుకున్నామన్నారు. ఈ క్రమంలో ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో పేరుందో లేదో మరోసారి, మీ పోలింగ్ బూత్‌ను కూడా పరిశీలన చేసుకోవాలని ఓటరు చైతన్య కార్యక్రమంలో వివరిస్తున్నామని తెలిపారు.

ఆర్థిక స్వావలంబనతో భవిష్యత్తుకు భరోసా

బంధన్ లైఫ్ ఎం.డి,సిఈఓ సతీశ్వర్



ప్రజాపక్షం/హైదరాబాద్ : ఆర్థిక స్వావలంబనతో భవిష్యత్తుకు భరోసా కల్పించేందుకు కట్టుబడి ఉన్నామని బంధన్ లైఫ్ ఎం.డి, సిఈఓ సతీశ్వర్ బి తెలిపారు. బంధన్ లైఫ్‌ను గతంలో ఏగాన్ లైఫ్ ఇన్సూరెన్స్‌గా పిలిచేవారని సోమవారం నగరంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన చెప్పారు. 'భారత్కి ఉడాన్, బంధన్ సే' అనే కొత్త ట్యాగ్ లైన్, పెరుగుతున్న 'మొగ్గ' కొత్త లోగోతో ముందుకు వెళ్తున్నామన్నారు. వేగవంతమైన వృద్ధికి స్థానం కల్పించిన సంస్థలు, వ్యక్తులు, కుటుంబాల ఆర్థిక ఆకాంక్షలు నెరవేర్చుకోవడానికి సహకరించనున్నట్లు చెప్పారు. జీవితంలోని ప్రతి అంశంలోనూ ఆత్మవిశ్వాసంతో అభివృద్ధి చెందాలన్నారు. వృద్ధిలో భాగంగా వెయ్యి మంది కొత్త సభ్యులను చేర్చుకుంటున్నట్లు వెల్లడించారు. ఉనికిని పటిష్టం చేయడం, దేశవ్యాప్తంగా విస్తరిస్తున్న కస్టమర్ బేస్‌కు అనుగుణంగా ఉత్పత్తులు, సేవలను అందించడం లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. పరిశ్రమలో విప్లవాత్మక మార్పులు తీసుకురానున్నామని చెప్పారు. బంధన్ లైఫ్‌తో వాటాదారుల విలువను పెంచడానికి కృషి చేస్తున్నామన్నారు. రాబోయే ఐదేళ్లలో తమ సేవలను మరింత మెరుగుపరుస్తామన్నారు. '2047 నాటికి అందరికీ బీమా' కోసం ఐఆర్‌డిఏఐ విజన్ కింద బీమా రంగం వృద్ధికి సిద్ధంగా ఉందన్నారు. బంధన్ లైఫ్ తన పరిధిని విస్తరించడానికి, దేశవ్యాప్తంగా వ్యక్తులను శక్తివంతం చేయడానికి ఈ వేగాన్ని ఉపయోగించుకోవడానికి కట్టుబడి ఉన్నామన్నారు. భారతదేశం కలలు, ఆకాంక్షలను పెంపొందించడంలో, సాధికారత కల్పించడంలో తమ అంకితభావానికి తిరుగులేదన్నారు. బంధం బలం ఒకరిని మరింత ఎత్తుకు నడిపించగలదని విశ్వసిస్తున్నామన్నారు. బంధన్ లైఫ్ వాటాదారులు ఉన్నత స్థాయికి వెళ్లడానికి వీలు కల్పిస్తుందన్నారు. అత్యుత్తమ డిజిటల్ ఆవిష్కరణలను మిళితం చేసే సమగ్ర బీమా సంస్థగా మారడానికి వ్యూహాత్మక మార్పును సూచిస్తుందన్నారు. బంధన్ లైఫ్ ఐటిమ్ ప్రైమ్ ఉత్పత్తి పేర్లు కొత్త దిశను ప్రతిబింబిస్తున్నాయన్నారు. www.bandhanlife.comలో మరిన్ని ఆఫర్‌ల కోసం సందర్శించాల్సిందిగా కోరారు.

శాంతిభద్రతల పరిరక్షణకే ఫ్లాగ్‌మార్చ్

ప్రజాపక్షం/చర్లపల్లి : శాంతి భద్రతల పరిరక్షణకే ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్నట్లు ఎసిపి మహేష్ అన్నారు. పార్లమెంటు ఎన్నికల సందర్భంగా సోమవారం రాచకొండ సిపి ఆదేశాల మేరకు కుషాయిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలోని హౌసింగ్ బోర్డు కాలనీలో కేంద్ర బలగాలు, లోకల్ పోలీసులతో కలసి ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకోవాలని, ప్రజల రక్షణపై భరోసా కల్పించేందుకు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించామన్నారు. కార్యక్రమంలో సిఐ వీరాస్వామి, డిఐ రాజు, సిఐఎస్ఎఫ్ బలగాలు పాల్గొన్నారు.

సెల్‌టవర్ పనులు నిలిపివేయాలని కమిషనర్‌కు వినతి

ప్రజాపక్షం/నాగారం : సెల్ ఫోన్ నెట్‌వర్క్ టవర్ నిర్మాణ పనులు నిలిపివేయాలని నాగారం మున్సిపల్ కమిషనర్‌కు కౌన్సిలర్ మాదిరెడ్డి వెంకట్‌రెడ్డి, కాలనీవాసులు వినతిపత్రం అందజేశారు. నాగారం మున్సిపాలిటీ పరిధిలోని 15వ వార్డు ఈస్ట్ గాంధీ నగర్ రోడ్ నంబర్ 2లో సిద్ధి రెసిడెన్సీ ఎదురుగా ఉన్న భవనంపై సెల్‌ఫోన్ టవర్ నిర్మాణం జరుగుతుందని వాటి వల్ల విద్యుత్ అయస్కాంత తరంగాలు, రేడియే ఫ్రీక్వెన్సీ తరంగాలతో ప్రజలకు అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కోఆప్షన్ సభ్యులు అదం షఫీక్, మాజీ వార్డుసభ్యులు సత్యం సాగర్, ఎన్.కృష్ణారెడ్డి, శ్రమణ్, వెంకటరమణ, ఖాజా తదితరులు పాల్గొన్నారు.

మల్కాజిగిరిలో 11 నామినేషన్లు

ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి : మల్కాజిగిరి పార్లమెంటు అభ్యర్థులుగా పోటీ చేసేందుకు సోమవారం మరో 11 నామినేషన్లు దాఖలయ్యాయి. కాంగ్రెస్ పార్టీ పక్షాన పట్నం సునీతరెడ్డి రెండు సెట్లు, రాష్ట్ర సామాన్య ప్రజా పార్టీ అభ్యర్థిగా అప్పారావు, స్వతంత్ర అభ్యర్థులుగా ఆంతోని డేవిడ్, పాలది పవన్ కుమార్, పెండ్యాల శేషసాయి వరప్రసాద్, కంటె సాయన్న బేగారి లోకేష్, భారత సుదర్శన్, మహ్మద్ అక్బర్‌లు నామినేషన్లు వేశారు.

యాసంగి ధాన్యం సేకరణకు సిద్ధం

వికారాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి : వికారాబాద్ జిల్లాలో 2023–24 యాసంగి సీజన్ లో రైతుల నుండి ధాన్యాన్ని సేకరించేందు సిద్ధంగా ఉన్నట్లు అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ తెలిపారు. సోమవారం సివిల్ సప్లయ్ కమిషనర్ ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన పాల్గొన్నారు. వ్యవసాయశాఖ , సివిల్ సప్లయ్ అధికారులతో మాట్లాడుతూ జిల్లాలో 129 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏప్రిల్ మొదటి వరంలోనే ప్రారంభించడం జరిగిందన్నారు. జిల్లా మొత్తం 1,19,350 అంచనా ప్రకారం మెట్రిక్ ధాన్యం వస్తుందని తెలిపారు. ఈ ధాన్యాన్ని కొనుగోలు చేయుటకు కొనుగోలు కేంద్రాలు ప్రారంభింస్తున్నట్లు తెలిపారు. రైతులు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేసేందుకు ముందస్తుగానే ఏర్పాట్లు చేశామన్నారు. వరి పంటకు కనీస మద్దతు ధర క్వింటాలుకు గ్రేడ్‌ఏ రకానికి రూ.2203, సాధారణ రకానికి రూ.2183 చెల్లించి ధాన్యాన్ని రైతుల నుంచి కొనుగోలు చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. రైతులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని కోరారు. వేసవిని దృష్టిలో పెట్టుకొని కొనుగోలు కేంద్రాలలో రైతులకు అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను అదేశించారు. కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల అధికారి రాజేశ్వర్, వ్యవసాయ అధికారి గోపాల్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

పెంచిన ఇంటిపన్నులు తగ్గించాలి

బాచుపల్లిలో కార్పొరేటర్లు, కాలనీల ప్రజల నిరసన

ప్రజాపక్షం/నిజాంపేట్ : బాచుపల్లిలో విధిస్తున్న ఇంటి పన్నుల మోతను తక్షణమే తగ్గించాలని నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ ఆగం పాండు ముదిరాజ్ డిమాండ్ చేశారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని బాచుపల్లి వార్డు కార్యాలయం, మండల తహసీల్దార్ కార్యాలయం ముందు ప్లకార్డులను ప్రదర్శించి నినాదాలు చేస్తూ ధర్నా చేశారు. పార్టీలకు అతీతంగా ఇంటి పన్నుల మోతను తగ్గించాలని డిమాండ్ చేస్తూ బైఠాయించారు. ఈ సందర్భంగా ఫ్లోర్ లీడర్ ఆగం పాండు ముదిరాజ్ మాట్లాడుతూ కార్పొరేషన్ పరిధిలోని ప్రగతినగర్‌లో 70 వేలు విధిస్తే, నిజాంపేట్‌లో లక్ష విధిస్తున్నారని, బాచుపల్లిలో మాత్రం ఏకంగా నాలుగు లక్షల వరకు ఇంటి పన్నులను విధించారన్నారు. కార్పొరేషన్ పరిధిలో ఒకే ఇంటి పన్ను విధానం ఉండాలి కాని ఓ చోట ఒక రకంగా మరో చోట మరొక విధంగా ఇంటి పన్నులను విధిస్తూ ప్రజల నడ్డి విరుస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. కలెక్టర్, ప్రభుత్వం స్పందించి వెంటనే స్పందించి లక్షల కొద్ది ఇంటి పన్నుల నుండి బాచుపల్లి ప్రజలకు ఉపశమనం కల్పించాలని లేని పక్షంలో ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్‌లు కాసాని సుధాకర్ ముదిరాజ్, ఆగం రాజు ముదిరాజ్, బాలాజీ నాయక్ పాల్గొన్నారు.

జెఇఇ మెయిన్స్‌లో ఎక్సిలెన్షియా కళాశాల విద్యార్థుల ప్రతిభ

ప్రజాపక్షం/శామీర్‌పేట : కార్పొరేట్‌లో వాడే పాత పద్దతుల కంటే ప్రత్యేకమైన, భిన్నమైన విధానాలతో ఎక్సిలెన్షియా ఆధిపత్యం కొనసాగిస్తుందని ఆ సంస్థల డైరెక్టర్ వెంకట మురికి అన్నారు. సోమవారం తూంకుంట మున్సిపాలిటిలోని ఉప్పర్‌పల్లిలోని ఎక్స్‌లెన్షియా కళాశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సోమవారం ఎన్టీఏ విడుదల చేసిన కీ ప్రకారం ఎక్సిలెన్షియా విద్యార్థి 300 మార్కులకు గానూ 270 మార్కులు సాధించినట్లు ప్రకటించారు. కెమిస్ట్రీలో 100 మార్కులు సాధించి అత్యుత్తమ ప్రదర్శన కనబరిచారన్నారు. సమావేశంలో స్కూల్స్ అండ్ హాస్టల్స్ ఆపరేషన్స్ హెడ్ ఈశ్వరన్, జంషెడ్, సుదీర్, జాన్, రమేష్, వేంకటేశ్వర్లు, ఎక్ నాథ్, రహీమ్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభంజనంలో... బిఆర్ఎస్, బిజెపి కొట్టుకుపోతాయ్

ప్రజాపక్షం/జవహర్‌నగర్: కాంగ్రెస్ ప్రభంజనంలో... బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు కొట్టుకుపోతాయని, కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకువచ్చిన పథకాలు గ్యారంటీగా అందుతున్నాయని జవహర్‌నగర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లెపూల శ్రీకాంత్‌యాదవ్ అన్నారు. మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థి సునీతా మహేందర్‌రెడ్డి గెలుపు కొరకు అంతాయిపల్లిలో నిర్వహించే జన జాతర సభకు శ్రీకాంత్‌యాదవ్ సమక్షంలో భారీ ఎత్తున నాయకులు తరలి వెళ్ళారు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌యాదవ్ మాట్లాడుతూ మల్కాజిగిరిలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సునీతామహేందర్‌రెడ్డి గెలుపు సునాయాసమేనని, ప్రతి పక్ష పార్టీలకు డిపాజిట్ కూడా దక్కదన్నారు. అనంతరం జనజాతర కార్యక్రమానికి కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివెళ్ళారు. కార్యక్రమంలో మేయర్ శాంతి, డిప్యూటీ మేయర్ శ్రీనివాస్, కార్పొరేటర్లు, మాజీ సర్పంచ్ శంకర్‌గౌడ్, యాదగిరియాదవ్, రాజుయాదవ్, సదానంద్, దయాకర్ చారి, రమేష్‌చారి, వెంకటేష్, మహిళలు పాల్గొన్నారు.

ఓటు వజ్రాయుధం..తప్పనిసరిగా వేయాలి

ఓటు వినియోగంపై అవగాహన కార్యక్రమాలు : కలెక్టర్ నారాయణరెడ్డి

ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి : ప్రజాస్వామ దేశంలో ఓటు వజ్రాయుధం అని, అలాంటి ఓటును తప్పనిసారిగా నమోదు చేసుకుని వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి కోరారు. జిల్లాలో అర్హులైన ప్రతిఒక్కరూ ఓటరుగా నమోదై, ఎన్నికల్లో వినియోగిం చుకునేలా అవగాహన కొరకు చైతన్య పత్రాలు, పోస్టర్లతో విస్తృత ప్రచారం చేస్తున్నామన్నారు. ఓటర్లకు ఎన్నికల ప్రక్రియలో వివరాలను తెలియజేసేలా కేంద్ర ఎన్నికల సంఘం ఈసారి ఓటర్ గైడ్ పుస్తకాన్ని ముద్రించింద న్నారు. ఇందులో ఓటరు నమోదు, పోలింగ్ ప్రక్రియ, ఓటు వేసే విధానం, అందుబాటులో ఉన్న యాప్‌లు, కల్పించనున్న కనీస సౌకర్యాలు, ఓటర్ల ప్రతిజ్ఞ అంశాలను ఇందులో పొందుపర్చారన్నారు. వీటిని బూత్ స్థాయి అధికారులు ఇంటింటికీ వెళ్లి ఓటరుకు అందజేస్తారన్నారు. వికారాబాద్ జిల్లాలోని పార్లమెంట్ పరిధిలోని ఓటర్ల వివరాలు తెలిపారు. వికారాబాద్ నియోజకవర్గంలోని గ2,66,273 ఓటర్లు ఉండగా, ఇందులో పురుషులు 1,33,625, మహిళలు 1,32,,639 ఇతరులు 9మంది ఉన్నారన్నారు. పరిగిలో మొత్తం ఓటర్లు 2,31,679, పురుషులు 1,15,019, మహిళలు 1,16,647, ఇతరులు 13మంది ఉన్నారు. తాండూర్ మొత్తం ఓటర్లు 2,18,228, ఇందులో పురుషులు 1,18,228, మహిళలు 1,25,614, ఇతరులు 7మంది ఉన్నారు. ఓటు వేసి విధానం, పోలింగ్ కేంద్రంలో గుర్తింపునకు ఉపయోగపడే పత్రాలు తెలిసేలా పోస్టర్లు ముద్రించి వీటిని ప్రతి పోలింగ్ కేంద్రం అవరణలో ఏర్పాటు చేయనున్నామన్నారు. ఓటు వేసేందుకు అవసరమయ్యే పత్రాల వివరాలను బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు ప్రభుత్వ కార్యాలయాల్లో ముఖ్యకూడలల్లో ప్రదర్శిస్తారన్నారు. దివ్యాంగులు, దృష్టి లోపం కలిగన వారితో సిబ్బంది ఎలా వ్యవహరించాలనే అంశాలపై పోస్టర్లు ముద్రించామన్నారు. లోక్‌సభ ఎన్నికలు మే 13న జరుగుతాయి. ఎక్కడ కూడ తప్పులు జరగకుండా, పకడ్బందీగా నిర్వహించేందుకు అధికారులు యంత్రాంగం ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఇందులో ఓటరు కీలకం కావడంతో నమోదు మొదలు, ఓటు వేసే విధానం అవసరమైన పత్రాలు, పోలింగ్ ప్రక్రియ, చేయాల్సినవి, చేయకూడనివి తదితర అంశాలపై అవగాహన కల్పించేలా అధికారులు కృషి చేస్తున్నామన్నారు.

ఎన్నికల నియమావళి అమలుకు నిఘా

పార్లమెంటు ఎన్నికలను పకడ్బందీగా, పారదర్శకంగా నిర్వహించడమే లక్ష్యంగా అధికార యంత్రాంగం అవసరమైన చర్యలు చేపట్టింది. ఎన్నికల నియమావళిని కచ్చితంగా పాటించేలా నిఘా ఏర్పాటు చేసింది. ప్రచార సమయం కోడ్ ఉల్లంఘన నియమావళి అమలుపై సి. విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చు, పిర్యాదు చేసిన 100 నిమిషాల్లో పు సమస్యను పరిష్కరించే బాధ్యతను ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు తీసుకుంటాయి. కేంద్ర ఎన్నికల సంఘం నేషనల్ గ్రీవెన్స్ మేనేజ్‌మెంటు సిస్టమ్‌కు రాజకీయ పార్టీల నుండి అందిన ఫిర్యాదులను సైతం పరిష్కరిస్తారు. సందేహాలు నివృత్తికి కోసం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన 1950 టోల్‌ఫ్రీ సంఖ్యకు ఫోన్ చేయాలి. ఓటర్ల జాబితాలో పేర్లు పోలింగ్ కేంద్రాల వివరాలతో పాటు ఎన్నికలకు సంబందించిన అన్ని అంశాలపై ఫిర్యాదు చేయవచ్చు, కోడ్ ఉల్లంఘన, నియమావళి అమలుపై సివిజిల్ యాప్ ద్వారా ఫిర్యాదు చేసిన 100 నిమిషాల్లో పు సమస్యను పరిష్కరించే బాధ్యతను ఫ్లయింగ్ స్క్వాడ్ తీసుకుంటాయి. ఎన్నికల సందర్భంగా మద్యం ఓటర్లకు పంపిణీ చేసినా శిక్షార్హులవుతారు. ఎక్సైజ్ చట్టం 1968 ప్రకారం ఆరు మాసాల నుంచి ఏడాది జైలు 5వేల నుంచి 20వేల వరకు జరమానా చెల్లించాల్సి ఉంటుంది. జిల్లా అధికార యంత్రాంగం ఎన్నికల సంబంధించిన అన్ని చర్యలు తీసుకుంటుంది.

మతతత్వ పార్టీలకు బుద్ధి చెప్పే సమయం వచ్చింది

ఎంఎల్ఎ మనోహర్‌రెడ్డి

ప్రజాపక్షం/తాండూర్ : పార్లమెంటు ఎన్నికల ప్రచారంలో భాగంగా ఎంపీ రంజిత్‌రెడ్డితో కలిసి పెద్దముల్ మండలంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి . ఈ సందర్భంగా జరిగిన సభలలో ఆయన మాట్లాడుతూ గడిచిన ఎన్నికల్లో ప్రజల ఆశీస్సులతో రాష్టంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్నారు. ఇచ్చిన మాట ప్రకారం రెండు గ్యారెంటీలను అమలు చేసిన ఘనత కాంగ్రెస్‌కు దక్కుతుందన్నారు. త్వరలో రైతు రుణమాపీ చేస్తామన్నారు. గుడి పేరుతో ,మతం పేరుతో ఓట్లు అడిగే వారికి బుద్ధి చెప్పే సమయం వచ్చిందన్నారు. రాజ్యంగాన్ని మార్చే పనిలో బిజెపి బిజీగా ఉంది ,ప్రజలు కేంద్ర ప్రభుత్వాన్ని మర్చడానికి సిద్ధంగా ఉందన్నారు. గొట్లపల్లి, తట్టేపల్లి గ్రామాలలో ఎన్నికల ప్రచారం నిర్వహించిన అనంతరం రంజిత్‌రెడ్డి మాట్లాడుతూ రాజకీయలోకి సేవ చేయాలనే ఉద్దేశంతో ఐదేళ్ల క్రితం ప్రత్యేక్ష రాజకీయలోకి రావడం జరగింవన్నారు. బిజెపి అభ్యర్థి ఏ ఒక్క రోజు కూడా చేవెళ్ల ప్రజలకు అందుబాటులో లేడని విమర్శించారు. ఎన్నికల సమయంలో మాత్రమే ప్రజల్లోకి వచ్చే కొండా అని తెలిపారు. మరోమారు ఎంపీగా అవకాశం ఇవ్వండి మీ కష్టసుఖాల్లో అండగా ఉంటానని మాటా ఇస్తున్నానన్నారు.

కళ్లబొల్లి మాటలతో అధికారంలోకి

మాజీమంత్రి చామకూర మల్లారెడ్డి

ప్రజాపక్షం/శామీర్‌పేట :బిఆర్ఎస్ ఎంపి అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డిని గెలిపించాలని మాజీ మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. సోమవారం శామీర్‌పేట మండలం అలియాబాద్ ప్రధాన చౌరస్తాలో బిఆర్ఎస్ కార్యకర్తల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం కళ్లబొల్లి మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిందన్నారు. ప్రజలు కాంగ్రెస్‌ను నమ్మే పరిస్థితిలో లేన్నారు. రాగిడి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకిచ్చిన హామీలను అమలుచేయడం లేదన్నారు. కాంగ్రెస్ మోసపూరిత వాగ్దానాలను ప్రజలు నమ్మడం లేదన్నారు. కార్యక్రమంలో ఎంఎల్‌సి శంబీపూర్ రాజు, భాస్కర్‌యాదవ్, మహేందర్‌రెడ్డి, డిసిఎంఎస్ వైస్ చైర్మన్ మధుకర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ కారంగుల రాజేశ్వర్‌రావు, ఎంపిపి ఎల్లుబాయి బాబు, జడ్‌పిటిసి అనితలాలి, వైస్ ఎంపిపి ఎల్లు సుజాత తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి ఆకర్షితులై కాంగ్రెస్‌లో చేరికలు

ప్రజాపక్షం/జగద్గిరిగుట్ట : తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేస్తున్న అభివృద్ధికి ఆకర్షితులై కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధి రంగారెడ్డి నగర్ డివిజన్ రంగారెడ్డి నగర్ లోని పంచశీల కాలనీకి చెందిన బిఆర్ఎస్ సీనియర్ నాయకులు సుబ్బారెడ్డి, డివిజన్ మాజీ వార్డు సభ్యులు విజయ్ భాస్కర్ రెడ్డి వారి మిత్రబృందం 1500 మంది ఐడిపిఎల్ చౌరస్తా నుండి భారీ ఎత్తున ర్యాలీగా తరలి వెళ్లి కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి ఆధ్వర్యంలో మల్కాజ్గిరి ఎంపి అభ్యర్థి సునీత మహేందర్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీ లో చేరారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భూపతి రెడ్డి, మాజీ మునిసిపల్ వైస్ చైర్మన్ జైరాం, యువజన నాయకులు కెపి.విశాల్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మేకల ఎల్లయ్య, మొయిజ్ ఎన్ఎస్‌యూఐ నాయకులు, సేవాదళ్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బిఆర్ఎస్‌తోనే అభివృద్ధి

ఎమ్మెల్యే వివేకానంద

ప్రజాపక్షం/జగద్గిరిగుట్ట : బిఆర్ఎస్‌కు ఓటుతోనే అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే కేపీ వివేకానంద అన్నారు. సోమవారం జగద్గిరిగుట్ట డివిజన్ సీసాల బస్తిలో పార్లమెంట్ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి గెలుపును ఆకాంక్షిస్తూ నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే కేపీ వివేకానంద పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేపీ వివేకానంద మాట్లాడుతూ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యేగా నేను ఉన్నానని, మన ఎంపీ అభ్యర్థి అయిన రాగిడి లక్ష్మారెడ్డిని గెలిపిస్తే అత్యధిక నిధులు వెచ్చించి నియోజకవర్గాన్ని రెట్టింపు వేగంతో అభివృద్ధి చేసుకోవచ్చన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకిచ్చిన హామీలను అమలు చేయడం లేదన్నారు. కాంగ్రెస్ మోసపూరిత వాగ్దానాలను ప్రజలు నమ్మడం లేదన్నారు. కార్యక్రమంలో శ్రీ వెంకటేశ్వర దేవస్థానం చైర్మన్ వేణు యాదవ్, రుద్ర అశోక్, జైహింద్ మారయ్య, అజ్రత్ అలీ, బసవేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

భూగర్భ జలాల పెంపుదలలో.. ఇంకుడు గుంతల నిర్మాణం ప్రాధానం

జలమండలి ఎండి సుదర్శన్‌రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్ : భూగర్భ జలాల పెంపుదలలో ఇంకుడు గుంతల నిర్మాణం ప్రధానమైనదని జలమండలి ఎం.డి. సుదర్శన్ రెడ్డి అన్నారు. హైదరాబాద్ నగరంలో భూగర్భ జలాల్ని పెంచేందుకు జలమండలి, ఈపిటిఆర్ఐ, జిహెచ్ఎంసి సంయుక్తంగా చర్యలు చేపట్టాయి. ఇందులో భాగంగా ఇంకుడు గుంతల నిర్మాణంపై ప్లంబర్స్, మేస్త్రీలకు నేటి నుంచి 3 రోజుల పాటు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఖైరతాబాద్‌లోని ప్రధాన కార్యాలయంలో సోమవారం ఎం.డి. సుదర్శన్ రెడ్డి మొదటి రోజు శిక్షణ కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాన నీటి సంరక్షణ కోసం ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టాలని నగర వాసులను కోరారు. నిర్మాణంపై ప్లంబర్స్, మేస్త్రీలకు 3 రోజుల పాటు శిక్షణ ఇస్తున్నామన్నారు. వీరంతా ఫ్రంట్ లైన్ వారియర్స్‌గా ఉంటారని తెలిపారు. జూబ్లీ హిల్స్‌లో జలమండలి నిర్మించిన రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ థీమ్ పార్కును ఈ సందర్భంగా గుర్తు చేశారు. అందులో వాన నీటిని ఒడిసి పట్టే వివిధ పద్ధతులను వివరించారు. శిక్షణ తీసుకుంటున్న వారు ఒకసారి ఆ పార్క్‌ను సందర్శించాలని సూచించారు. మిగిలిన 24, 25 తేదీల్లో శిక్షణ కార్యక్రమంలో పాల్గొనాలనుకునే వారు 8639619366 ఫోన్ నెంబరు ద్వారా లేదా eptrienviro@gmail.com కి మెయిల్ చేసి రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీధర్ బాబు, రెవెన్యూ డైరెక్టర్ ప్రవీణ్ కుమార్, జిఎం రాజేందర్, ఇంకుడు గుంతల నిర్మాణ ప్రత్యేకాధికారి జాల సత్య నారాయణ, రిసోర్స్ పర్సన్ కల్పన, ప్లంబర్స్, మేస్త్రీలు తదితరులు పాల్గొన్నారు.

దృఢమైన ఆర్థిక వ్యవస్థ నిర్మాణంలో సిఎంఎ పాత్ర ఎనలేనిది

ఐసిఎంఎఐ అధ్యక్షుడు అశ్విన్‌కుమార్

ప్రజాపక్షం/హైదరాబాద్: దృఢమైన ఆర్థిక వ్యవస్థను నిర్మించడంలో కాస్ట్, మేనేజ్‌మెంట్ అకౌంటెంట్స్ (సిఎంఎ) పాత్ర ఎనలేనిదని ఐసిఎంఎఐ అధ్యక్షుడు సిఎంఎ అశ్విన్‌కుమార్ దళవాడి తెలిపారు. ప్రభుత్వం, విధాన నిర్ణేతలు, పరిశ్రమలు, కార్పొరేట్ ప్రపంచానికి సిఎంఎలు బలమైన శక్తిగా ఉన్నారన్నారు. హైదరాబాద్ ఏర్పాటు చేసిన మీడియా సమావేశం ఆయన మాట్లాడుతూ కాస్ట్, మేనేజ్‌మెంట్ అకౌంటెంట్స్ పాత్ర పూర్తిగా రూపాంతరం చెందిందని, వ్యాపార కార్యకలాపాలలో నిర్ణయాత్మక పాత్రను పోషిస్తున్నారని చెప్పారు. సమర్థవంతమైన నిర్ణయాలు తీసుకోవడానికి, కార్పొరేట్ అనుకూల విధానాలు, పథకాలను సూచించడానికి వీలు కల్పిస్తుందన్నారు. సిఎంఎలు తమ కార్యకలాపాలు, అంతర్గత నియంత్రణలు, పాలనా ప్రక్రియలు, రిస్క్ మేనేజ్‌మెంట్, నియంత్రణ వ్యవస్థల సమర్థత, ప్రభావాన్ని మూల్యాంకనం చేయడం ద్వారా సంస్థలకు సహాయం చేస్తున్నాయన్నారు. సమావేశంలో ఐసిఎంఎఐ సెంట్రల్ కౌన్సిల్ సభ్యుడు సిఎంఎ డాక్టర్ కెసిహెచ్ఎవిఎస్ఎన్ మూర్తి, ఐసిఎంఎఐ చైర్ పర్సన్ హైదరాబాద్ చాప్టర్ సిఎంఎ ఎస్.హిమవిద్యా పాల్గొన్నారు.

వర్షపునీటిని సంరక్షించుకుందాం.. నీటిఎద్దడి నివారణకు కృషి చేద్దాం

జిహెచ్ఎంసి కమిషనర్ రోనాల్డ్ రోస్

ప్రజాపక్షం/హైదరాబాద్ : ప్రాణకోటికి మూలాధారమైన నీటిని జాగ్రత్తగా కాపాడుకోవడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిహెచ్ఎంసి కమిషనర్ రోనాల్డ్ రోస్ కోరారు. జిహెచ్ఎంసి కమిషనర్ రోనాల్డ్ రోస్ ఆధ్వర్యంలో జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయం పన్వర్ హాల్‌లో సోమవారం ప్లంబింగ్ వర్కర్లు, మేస్త్రీలకు నగరంలో నీటి సమస్యలు రాకుండా చూడటం, తగిన పరిష్కారం, వర్షపు నీటి సంరక్షించుకోవడం, భూగర్భ జలాలు పెరిగేలా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై శిక్షణను ఇచ్చారు. ఈ సందర్భంగా రోనాల్డ్ రోస్ మాట్లాడుతూ ప్రస్తుత అవసరాలతో పాటు భవిష్యత్ తరాల అవసరాలకు ఉపయోగపడేలా ప్రతి వర్షపు నీటి బొట్టును ఒడిసిపట్టి, భూగర్భ జలాలను పెంపొందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి ఇంట్లో తప్పని సరిగా ఇంకుడు గంతలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. వర్షపు నీటిని సంరక్షించుకోవడం, వర్షపు నీటి ప్రాముఖ్యతపై ప్రజలకు అవగాహన కల్పించి, ఇంటి రూఫ్‌పైన పడే వర్షపు నీటిని వృధా చేయకుండా స్టోరేజ్ చేసి, భూగర్భ జలాలను పెంచే దిశగా జిహెచ్ఎంసి పరిధిలో చర్యలు చేపట్టామన్నారు. వర్షపు నీటిని నిల్వ చేయడానికి అందుబాటులోకి వచ్చిన వినూత్న అంశాలపై వివరించారు. ఈ సందర్భంగా ఈపిటిఆర్ఐ కన్సల్టెంట్ రిటైర్డ్ ఐఎఎస్ అధికారి విజయ్ కుమార్, రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ ప్రాజెక్ట్ సిఈఓ కల్పన రమేష్ నీటి సంగ్రహం, వినియోగం, వాడిన నీటిని శుద్ధి చేసి తిరిగి ఉపయోగించడం, కాలుష్యాన్ని నివారించడం, రీఛార్జ్ పిట్స్, నీటిని నేల పొరల్లో ఇంకించే విధానం, నీటిని శుద్ధి చేసే విధానాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఇంటి కప్పుపై వర్షపు నీటిని ఏ విధంగా సంరక్షించుకోవాలనే అంశంపై రూపొందించిన వీడియోల ద్వారా వివరించారు. ఓడికే యాప్ డౌన్‌లోడ్ చేసుకుని ఏమైనా సందేహాలు ఉంటే యాప్ ద్వారా అడగవచ్చు అని సూచించారు. అనంతరం జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఇంకుడు గుంత, ఇంజక్షన్ బోర్‌ను వారికి చూపించారు. ఈనెల 24, 25వ తేదీల్లో కూడా వర్షపు నీటి సంరక్షణపై ప్లంబింగ్ నిపుణుల శిక్షణ నిర్వహిస్తున్నామని, ఆసక్తి ఉన్నవారు గూగుల్ ఫారం https://forms.gle/rJnheoVKSEU4VDnJA లో తమ పేర్లు నమోదు చేసుకోవాలని, రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ వారు తమవద్ద పని చేస్తున్న, తెలిసిన ప్లంబర్‌లు, మేస్త్రీలకు తెలిపి, శిక్షణ పొందేలా ప్రోత్సహించాలని అదనపు కమిషనర్ చంద్రకాంత్ రెడ్డి సూచించారు. శిక్షణ అనంతరం ప్లంబర్ వర్కర్లు, మేస్త్రీలకు ధృవీకరణ పత్రాలు అందచేశారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కమిషనర్(యుసిడి) వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రీడ

జైస్వాల్ శతకం.. రాజస్థాన్ విజయం

9 వికెట్ల తేడాతో ముంబయిపై గెలుపు

జైపూర్: ఐపిఎల్ 2024లో రాజస్థాన్ జైత్రయాత్ర కొనసాగుతోంది. ముంబయితో సొంతమైదానంలో జరిగిన పోరులో ఆ జట్టు 9 వికెట్ల తేడాతో నెగ్గింది. తొలుత బ్యాటింగ్ చేసిన ముంబయి నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 179 పరుగులు చేసింది. తిలక్ వర్మ (65), వధేరా (49) చెలరేగారు. రాజస్థాన్ బౌలర్ సందీప్ శర్మ 5 వికెట్లతో అదరగొట్టాడు. అనంతరం బ్యాటింగ్ చేసిన రాజస్థాన్ 18.4 ఓవర్లలో ఒక వికెట్ కోల్పోయి ఛేదించింది. జైస్వాల్ (104*) శతకంతో వీరవిహారం చేశాడు. బట్లర్ (35), శాంసన్ (38*) రాణించారు.

మామయ్య కుటుంబాన్ని చంపేశారు: రైనా

న్యూఢిల్లీ : కొవిడ్ మహమ్మారి సమయంలో యుఎఇలో నిర్వహించిన ఐపిఎల్ 2020 నుంచి అప్పటి చెన్నై ఆటగాడు సురేశ్ రైనా నిష్క్రమించడం తీవ్ర చర్చనీయాంశమైన విషయం తెలిసిందే. వ్యక్తిగత కారణాలతో ఆయన టోర్నీ నుంచి వైదొలిగినప్పటికీ దీనిపై అప్పట్లో అనేక వదంతులు బయటికొచ్చాయి. ఫ్రాంచైజీ ప్రతినిధులతో విభేదాల కారణంగానే అతడు స్వదేశానికి తిరిగెళ్లినట్లు అప్పట్లో జోరుగా ప్రచారం జరిగింది. అయితే, ఇన్నేళ్ల తర్వాత ఈ వదంతులపై తొలిసారి స్పందించిన సురేశ్ రైనా.. నిష్క్రమణకు అసలు కారణాన్ని వెల్లడించాడు. బంధువుల మృతి కారణంగానే టోర్నీని వీడాల్సి వచ్చిందని పేర్కొన్నాడు. 'అప్పుడు మా కుటుంబంలో విషాదం నెలకొంది. బంధువులు మరణించారు. పఠాన్‌కోట్ (పంజాబ్)లో ఉన్న మా మామయ్య కుటుంబం మొత్తాన్ని గ్యాంగ్‌స్టర్లు చంపేశారు. ఈ ఘటనతో మా నాన్న తీవ్ర దిగ్భ్రాంతికి లోనయ్యారు. అప్పటికే కొవిడ్ భయాలతో ఉన్న మా కుటుంబాన్ని ఇది మరింత కుంగుబాటుకు గురిచేసింది. ఆ సమయంలో క్రికెట్ కన్నా ఫ్యామిలీతో ఉండటమే ముఖ్యమని భావించా. ఇదే విషయాన్ని ధోనీ, టీమ్ మేనేజ్‌మెంట్‌కు చెప్పి స్వదేశానికి తిరిగొచ్చా. అయితే బయోబబుల్ కారణంగా మళ్లీ జట్టుతో చేరలేకపోయా. ఆ మరుసటి ఏడాది 2021 సీజన్‌లో ఆడా. అప్పుడు మా జట్టు ట్రోఫీ కూడా గెలిచింది'' అని రైనా తెలిపాడు.

ఫీల్డ్ అంపైర్‌తో గొడవ

కోహ్లీకి గట్టి షాకిచ్చిన ఐపిఎల్ బాసులు!

ముంబయి : ఇండియన్ ప్రీమియర్ లీగ్ వరుస వివాదాలకు వేదిక అవుతోంది. ప్రస్తుతం ఇంపాక్ట్ ప్లేయర్ రూల్‌పై ముంబయి ఇండియన్స్ మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ, కొందరు మాజీ ఆటగాళ్లు, కోచ్‌లు అసహనం వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. ఇప్పుడు కోహ్లీ కాట్ అండ్ బౌల్డ్ చర్చలు మొదలయ్యాయి. కొందరు విరాట్‌కు మద్దతుగా మాట్లాడుతుండగా, మరి కొందరు అంపైర్ నిర్ణయాలను సమర్థిస్తున్నారు. ఏదేమైనా అంపైర్‌ల నిర్ణయంపై కోహ్లీ అసంతృప్తి వ్యక్తం చేసిన తీరును తప్పుబడుతూ చర్యలు తీసుకున్నారు ఐపిఎల్ నిర్వాహకులు. మ్యాచ్ ఫీజులో అతడికి 50 శాతం జరిమానా విధించారు. ఏప్రిల్ 21న ఆదివారం మధ్యాహ్నం కోల్‌కతా ఈడెన్ గార్డెన్స్‌లో కెకెఆర్ వర్సెస్ ఆర్‌సిబి మ్యాచ్ జరిగిన సంగతి తెలిసిందే. ఈ మ్యాచ్‌లో కోల్‌కతా మొదట బ్యాటింగ్ చేసి ఆరు వికెట్లు కోల్పోయి నిర్ణీత 20 ఓవర్లలో 222 పరుగులు సాధించింది. అనంతరం ఛేజింగ్‌కి దిగిన రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు దురదృష్టవశాత్తు ఒక్క పరుగు తేడాతో ఓడిపోయింది. టోర్నీలో ఆర్‌సిబి ఇప్పటి వరకు 8 మ్యాచ్‌లు ఆడగా కేవలం ఒక్కదాంట్లో గెలిచింది. 7 ఓటములతో పాయింట్ల పట్టికలో అట్టడుగున ఉంది. వీటన్నింటికి మించి మ్యాచ్‌లో కోహ్లీ కాట్ అండ్ బౌల్ కావడం ఇప్పుడు వివాదాస్పదమవుతోంది. వివాదం ఏంటి? : ఆర్‌సిబి ఓపెనర్ కోహ్లీ దూకుడుగా ఛేజింగ్ మొదలుపెట్టాడు. మూడో ఓవర్‌లో హర్షిత్ రాణా వేసిన స్లో ఫుల్ టాస్‌ను క్రీజు నుంచి ముందుకొచ్చి ఆడాడు. బాల్ నేరుగా వెళ్లి హర్షిత్ రాణా చేతిలో పడింది. అంపైర్‌లు కాట్ అండ్ బౌల్డ్ ప్రకటించడంతో అతడు నో బాల్ కదా అంటూ రివ్యూ కోరాడు. కానీ అప్పటికే థర్డ్ అంపైర్ కూడా అవుట్‌గానే ప్రకటించాడు. బంతి బ్యాటర్ నడుం కన్నా ఎత్తులో వెళ్తే దాన్ని నో బాల్‌గా ప్రకటిస్తారు. కానీ, ఆ బంతిని ఆడుతున్నప్పుడు బ్యాటర్ క్రీజు లోపల ఉండాలి. అయితే ఈ మ్యాచ్‌లో విరాట్ క్రీజు బయటకు వచ్చి ఆ బంతిని ఆడాడు. దీంతో బంతి విరాట్ నడుం కన్నా ఎత్తులో వచ్చినా ఔట్‌గా పెవిలియన్ చేరాల్సి వచ్చింది. అయితే విరాట్ నడుం ఎత్తు 1.04 మీటర్లు కాగా, అతడు ఆడుతున్నప్పుడు బంతి 0.92 మీటర్ల ఎత్తులో వచ్చిందని అంపైర్ టెక్నాలజీ సాయంతో నిర్ధారించారు. దీంతో తన ఔట్ విషయమై విరాట్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాడు. ఆన్ ఫీల్ అంపైర్‌లతో వాగ్వాదానికి దిగాడు. కాగా, ఈ మ్యాచ్‌లో కోహ్లీ ఏడు బంతుల్లో 18 పరుగులు చేసి వెనుదిరిగాడు. కోహ్లీకి జరిమానా : దీనికి సంబంధించి ఐపిఎల్ విడుదల చేసిన ప్రకటనలో ఐపిఎల్ ప్రవర్తనా నియమావళిలోని ఆర్టికల్ 2.8 ప్రకారం విరాట్ లెవల్ 1 నేరానికి పాల్పడినట్లు పేర్కొన్నారు. కోహ్లీ నేరాన్ని, మ్యాచ్ రిఫరీ చర్యలను అంగీకరించాడు. ప్రవర్తనా నియమావళి లెవల్ 1 ఉల్లంఘనలకు, మ్యాచ్ రిఫరీ నిర్ణయమే అంతిమం అని పేర్కొన్నారు. అయితే ఇదే మ్యాచ్‌లో ఓవర్ రేట్ అఫెన్స్ కారణంగా ఆర్సీబీ కెప్టెన్ ఫాఫ్ డు ప్లెసిస్ రూ.12 లక్షల జరిమానా విధించిన కొద్దిసేపటికే విరాట్ కోహ్లీపై కూడా చర్యలు తీసుకున్నారు.

'సత్యభామ' రిలీజ్ తేదీ ఫిక్స్

టాలీవుడ్ స్టార్ నటీమణుల్లో ఒకరైన కాజల్ అగర్వాల్ టైటిల్ రోల్లో నటిస్తున్న లేటెస్ట్ మూవీ సత్యభామ. కాజల్ కెరీర్ 60వ మూవీగా వస్తోన్న ఈ మూవీ నుంచి ఇప్పటికే టైటిల్ గ్లింప్స్ వీడియో అందరినీ ఆకట్టుకుని మంచి రెస్పాన్స్ సొంతం చేసుకుంది. ఈ క్రైం థ్రిల్లర్ జానర్ మూవీకి సుమన్ చిక్కాల దర్శకత్వం వహిస్తుండగా శ్రీనివాస రావు తక్కలపెల్లి, బాబీ టిక్కా నిర్మిస్తున్నారు. ఇక తాజాగా సత్యభామ రిలీజ్ డేట్ను ప్రకటించారు మేకర్స్. ఇక విడుదల తేదీని స్టైలిష్ అనౌన్స్‌మెంట్ గ్లింప్స్ ద్వారా మే 17 గా ప్రకటించారు. ఈ వీడియో నెట్టింట వైరల్ అవుతోంది. ఈ మూవీలో కాజల్ అగర్వాల్ పవర్ఫుల్ పోలీసాఫీసర్ సత్యభామగా కనిపించబోతున్నట్టు గ్లింప్స్, టీజర్తో ఇప్పటికే క్లారిటీ ఇచ్చేశారు డైరెక్టర్. శ్రీచరణ్ పాకాల సంగీతం అందిస్తున్న ఈ మూవీకి విష్ణు బేసి ఫోటోగ్రాఫర్ గా వ్యవహరిస్తున్నారు. మరి రిలీజ్ అనంతరం సత్యభామ ఏ స్థాయి సక్సెస్ సొంతం చేసుకుంటుందో చూడాలి.

రీల్

మెగాస్టార్ కెరీర్‌లోనే హైలెట్ సీక్వెన్స్

మెగాస్టార్ చిరంజీవి హీరోగా యంగ్ దర్శకుడు వశిష్ట 'విశ్వంభర' అనే చిత్రాన్ని తెరకెక్కిస్తున్న సంగతి తెలిసిందే. ఈ సినిమాలో హీరోయిన్‌గా త్రిష నటిస్తోంది. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ హైదరాబాద్‌లో జరుగుతోంది. ఐతే, లేటెస్ట్ బజ్ ప్రకారం, ఈ సినిమా ఇంటర్వెల్ సీక్వెన్స్ సినిమాకే కాకుండా, మెగాస్టార్ సినీ కెరీర్‌లోనే హైలెట్‌గా నిలిచిపోతుందని టాక్. మరి ఈ వార్త నిజమైతే, చిరంజీవి అభిమానులకు ఈ సినిమా ఎప్పటికీ స్పెషల్ గా నిలిచిపోతుంది. కాగా యువి క్రియేషన్స్ నిర్మిస్తున్న ఈ విశ్వంభర సినిమాకు కీరవాణి సంగీతాన్ని అందిస్తున్నారు. ఈ చిత్రం జనవరి 10, 2025 న విడుదల కాబోతుంది. అన్నట్టు 'జగదేకవీరుడు అతిలోకసుందరి' సినిమాలోని వినోదం, 'హిట్లర్' లోని సెంటిమెంట్ ఈ సోషియో ఫాంటసీ సినిమాలో కనిపిస్తాయని తెలుస్తోంది. అన్నట్టు సృష్టి, స్థితి, లయ ఈ మూడింటి నేపథ్యంలో ఈ కథ సాగుతుందట.



ఫన్ & ఎంటర్టైన్మెంట్ 'ఆ ఒక్కటీ అడక్కు' ట్రైలర్

అల్లరి నరేశ్ హీరోగా నటిస్తున్న లేటెస్ట్ కామెడీ యాక్షన్ ఎంటర్టైనర్ మూవీ ఆ ఒక్కటీ అడక్కు. మల్లి అంకం దర్శకత్వం వహిస్తున్న ఈ మూవీలో ఫరియా అబ్దుల్లా కథనాయికగా నటిస్తుంది. వెన్నెల కిశోర్, వైవా హర్ష తదితరులు కీలక పాత్రలు పోషించిన ఈ మూవీ నుండి ఇప్పటికే రిలీజ్ అయిన ఫస్ట్ లుక్ గ్లింప్స్, ఫస్ట్ సాంగ్ విడుదల చేయగా అవి మంచి రెస్పాన్స్ దక్కించుకున్నాయి. తాజాగా ఈ సినిమా థియేట్రికల్ ట్రైలర్‌ని హైదరాబాద్ లోని ఈవెంట్‌లో భాగంగా నాచురల్ స్టార్ నాని రిలీజ్ చేసారు. ఇక ట్రైలర్‌లో ఆద్యంతం ఆకట్టుకునే మంచి ఫన్, ఎంటర్టైన్మెంట్ అంశాలు బాగున్నాయి. ముఖ్యంగా నరేష్ యాక్టింగ్, కామెడీ డైలాగ్స్, ఫరియా అబ్దుల్లా అందం, అభినయం, విజువల్స్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ బాగున్నాయి. మొత్తంగా ఆ ఒక్కటీ అడక్కు ట్రైలర్ అందరినీ ఆకట్టుంటూ మూవీపై అంచనాలు మరింతగా పెంచింది. ఈ మూవీని వేసవి కానుకగా మే 3న ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు. చిలక ప్రొడక్షన్స్ బ్యానర్పై రాజీవ్ చిలక గ్రాండ్‌గా నిర్మిస్తున్న ఈ మూవీకి గోపీ సుందర్ సంగీతం అందిస్తున్నారు.

కేజ్రీవాల్‌కు ఇన్సులిన్ ఇవ్వాలా? వద్దా?

మెడికల్ బోర్డు ఏర్పాటు చేసి నిర్ణయించాలని ఎయిమ్స్‌కు కోర్టు ఆదేశం

న్యూఢిల్లీ : ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు ఇన్సులిన్ ఇవ్వాల్సిన అవసరం ఉందా? లేదా? అనే విషయం నిర్ణయించేందుకు ఒక మెడికల్ బోర్డు ఏర్పాట చేసి తగిన నిర్ణయం తీసుకోవాలని సిబిఐ–ఇడి ప్రత్యేక న్యాయస్థానం మార్గదర్శనం చేసింది. ఎండోక్రోనాలజిస్ట్–డయాబెటాలజిస్ట్‌తో ఒక బోర్డు ఏర్పాటు చేసి పరీక్షలు చేయాలని కోరింది. దీనిపై మెడికల్ బోర్డే తగిన నిర్ణయం తీసుకుంటుందని కోర్టు స్పష్టం చేసింది. ఇంటి నుండి తెచ్చుకుంటున్న ఆహారం ఆయన తింటున్నారనీ, వైద్యులు సూచించిన ప్రకార ఆయన డైట్ ప్లాన్ లేదనీఅందువల్ల ఆయనకు ఎలాంటి ఆహారం అవసరం, ఎలాంటి వ్యాయామం,వైద్యం అవసరం వంటి వాటి గురించి మెడికల్ బోర్డు నిర్ణయిస్తుందని తెలిపింది. ఆయన తింటున్న ఆహారం ఏమిటో వివరంగా తెలియజేయాలని కోరింది. మెడికల్ బోర్డు ఇచ్చిన ఆహార నియమాలను పాటించాల్సిందేనని, ఇక అందులో ఎలాంటి మార్పులూ ఉండవని కూడా న్యాయస్థానం స్పష్టం చేసింది. జైలులో తనకు ఇన్సులిన్ ఇవ్వడంలేదని, దానివల్ల ప్రమాదకరమైనస్థాయిలో రక్తంలో సుగర్ లెవెల్స్ పెరిగిపోతున్నాయనీ అరవింద్ కేజ్రీవాల్ ఆరోపించారు. దృశ్యమాధ్యమ పద్ధతిలో ఆయన ఫిర్యాదును న్యాయస్థానం విచారణ జరిపింది. ఆయన తన శరీరంలో మధుమేహం పెంచుకోవడంకోసం ఉద్దేశపూర్వకంగా మామిడిపండ్లు తింటున్నారని గడచిన శుక్రవారంనాడు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు ప్రత్యేక కోర్టుకు కేజ్రీవాల్ ఆరోగ్య విషయంపై ఒక ఫిర్యాదు చేశారు. శరీరంలో మధుమేహం ప్రమాణాలను గణనీయంగా పెంచుకుని జైలు నుండి బెయిలుపై విడుదలయ్యేందుకే ఆయన ఇలాంటి ప్రయత్నాలు చేస్తున్నారని ఇడి అధికారులు ప్రత్యేక కోర్టుకు ఫిర్యాదు చేశారు. దాంతో ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి కావేరీ బవేజా సోమవారంనాడు ఉత్తర్వులు జారీచేస్తూ కేజ్రీవాల్‌కు ఇన్సులిన్ ఇవ్వాల్సిన అవసరం ఉందా? లేదా? అనే విషయం నిర్ధారించాలనీ, అందుకోసం ఒక మెడికల్ బోర్డు ఏర్పాటు చేసి పరీక్షలు జరపాలని, తద్వారా నిర్ణయం తీసుకోవాలని పేర్కొంది. ఢిల్లీ ఎక్సైజు విధానాన్ని కొందరు మద్యం వ్యాపారులకు అనుకూలంగా తయారు చేశారన్న ఆరోపణలపై ఆయన కేసులు ఎదుర్కొంటున్నారు.

ఇంట్లోంచి మామిడిపళ్ళు, స్వీట్లు ఎందుకుపంపుతున్నారు?

అరవింద్ కేజ్రీవాల్ ఇంట్లో వండుతున్న ఆహారంలో ఏమేమి ఉంటున్నాయో చెప్పాలనీ, అవి వైద్యులు చెపిన సూచనలకు భిన్నంగా ఉన్నాయేమో కూడా చెప్పాలని ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి మెడికల్ బోర్డును ఆదేశించింది. ఐతే ఈ సందర్భంగా కేజ్రీవాల్ తరపు న్యాయవాది చేసిన బాధ్యతారాహిత్య వ్యాఖ్యలపై న్యాయమూర్తి కావేరీ బవేజా తీవ్రంగా స్పందించారు. ''ఆమ్ ఆద్మీపార్టీ నాయకుడు మామిడి పండు తినకుండా పుట్టగొడుగులు తింటాడా? అని వ్యాఖ్యానించారు. కేజ్రీవాల్ సొంత వైద్యుడే పుట్టగొడుగు లు తినమని సలహా ఇచ్చారనీ, ఆయనవైద్యుడు ఎక్కడా మామిడి పండ్లు తినమని సలహా ఇవ్వలేదని న్యాయమూర్తి విమర్శించారు. ఆయకు పెట్టే ఆహారంలో ఆయనకుటుంబ సభ్యులు ఎందుకని వైద్యపరంగా సూచించిన ఆహారం పంపకుండా మామిడిపంట్లు, సీట్లు, పూరీ వంటి వివిధ రకాల ఆహారం ఎందుకు పంపతున్నారని న్యాయమూర్తి ప్రశ్నించారు.

ఇబ్బందుల్లో తాళాల పరిశ్రమ

ఢిల్లీ : పదేళ్ళ మోదీ పరిపాలనలో వందేళ్ళ చరిత్ర కలిగిన అలీగఢ్ తాళాల తయారీ పరిశ్రమ ఎందుకు ఇబ్బందులు పడుతున్నదని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ ప్రశ్నించారు. దేశవ్యాప్తంగా చిన్న, మధ్య తరహా పరిశ్రమలను మోదీ ప్రభుత్వం నాశనం చేసిందన్నారు. అలీగఢ్ లో ప్రధాని ప్రచార సభ నేపథ్యంలో జైరామ్ రమేశ్ ఆయనకు పలు ప్రశ్నలను సామాజిక మాధ్యమం 'ఎక్స్' ద్వారా సంధించారు. 2014 ఎన్నికల ప్రచారంలో భాగంగా అలీగఢ్ సభలో ప్రధానంగా చిన్న పరిశ్రమల గురించి మోదీ ప్రస్తావించారని, పదేళ్ళ తరువాత కూడా తాళాల తయారీదారులకు అందుబాటు ధరలో ముడిసరుకు విక్రయించేందుకు అలీగఢ్‌లో ప్రభుత్వ డిపోను ఎందుకు ఏర్పాటు చేయలేదని నిలదీశారు.

పలువురికి పద్మ అవార్డులు ప్రదానం

పురస్కారాలు అందుకున్న వెంకయ్యనాయుడు, మిథున్ చక్రవర్తి, ఉషా ఉత్తప్

న్యూఢిల్లీ : మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు సహా పలువురికి రాష్ట్రపతి ద్రౌపదీ ముర్మూ సోమవారం పద్మ అవార్డులు ప్రదానం చేశారు. రాష్ట్రపతి భవన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో వెంకయ్యనాయుడు సహా ముగ్గురికి పద్మ విభూషణ్ పురస్కారాలు ఇచ్చి రాష్ట్రపతి సత్కరించారు. సులభ్ ఇంటర్నేషనల్ వ్యవస్థాపకుడు బిందేశ్వర్ పాథక్‌కు మరణానంతరం ప్రకటించిన పద్మ విభూషణ్ పురస్కారాన్ని ఆయన సతీమణి అమోలా అందుకున్నారు. భరతనాట్య కళాకారిణి పద్మా సుబ్రమణ్యంకు కూడా పద్మ విభూషణ్ అందుకున్నారు. ప్రముఖ హిందీచిత్ర కథానాయకుడు మిథున్ చక్రవర్తి, ప్రముఖ గాయని ఉషా ఉత్తప్, ఉత్తర ప్రదేశ్ విశ్రాంత గవర్నర్ రామ్ నాయక్, పారిశ్రామికవేత్త సీతారాం జిందాల్ సహా మొత్తం ఏడుగురికి రాష్ట్రపతి పద్మ భూషణ్ అవార్డులు అందజేశారు. ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌కర్, ప్రధానమంత్రి నరేంద్రమోడీ, కేంద్ర హోంశాఖామంత్రి అమిత్ షా, విదేశీ వ్యవహారాలమంత్రి ఎస్.జైశంకర్, తదితర ప్రముఖులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. అదేవిధంగా గుజరాత్‌కు చెందిన కార్డియాలజిస్ట్ తేజస్ ముధుసూదన్ పటేల్, ప్రముఖ మరాఠీ చిత్ర దర్శకుడు దత్తాత్రే అంబదాస్ మయలూ అలియాస్ రాజ్‌దత్, అత్యంత ప్రమాదకరమైన 'కాలా అజార్' చర్మవ్యాధిపై పరిశోధన చేసి ఒక విధానం రూపొందించిన ప్రపంచవ్యాప్తంగా ఖ్యాతి గడించిన ఫిజీషియన్ చంద్రేశ్వర్ ప్రసాద్ థాకూర్‌లకు కూడా ద్రౌపదీ ముర్మూ పద్మభూషణ్ పురస్కారాలు ఇచ్చి సత్కరించారు. ఉత్తర ప్రదేశ్‌కు చెందిన ప్రముఖ తివాచీ (కంబళీ) నేత కార్మికుడు ఖలీల్ అహ్మద్, మధ్యప్రదేశ్‌కు చెందిన జానపద గాయకుడు కలురరామ్ బమనియా, బంగ్లాదేశ్‌కు చెందిన గాయకుడు రెజ్వానా చౌధురి బాన్య్య, ఉత్తర ప్రదేశ్‌కు చెందిన చికంకారీ ఎంబ్రాయిడరీ ఆర్టిస్ట్ నసీమ్ బానోలకు పద్మశ్రీ అవార్డులను రాష్ట్రపతి అందజేశారు. పశ్చిమ బెంగాల్ కూచ్ బెహార్‌కు చెందిన రాజ్‌బోంఘ్సీ జానపద గాయకుడు బెహర్ గీతా రాయ్ బర్మన్, టెన్నిస్ క్రీడాకారుడు రోహన్ బోపన్న, త్రిపురకు చెందిన అధ్యాత్మిక ప్రముఖుడు చిత్తరంజన్ దేవ్ వర్మ, బ్యాంకర్ కల్పనా మొర్పారియా, ప్రముఖ దాత కిరణ్ నాడార్, హర్యానాకు చెందిన సామాజిక కార్యకర్త గుర్విందర్ సింగ్, ఉత్తర ప్రదేశ్‌కు చెందిన జానపద కళాకారిణి ఊర్మిళా శ్రీవాస్తవలకు కూడా పద్మశ్రీ పురస్కారాలు ఇచ్చి గౌరవించారు. కాగా అసోంకు చెందిన జానపద నృత్యకళాకారుడు ద్రోణ భూయాన్ ఈ అవార్డు తీసుకోవడానికి రెడ్ కార్పెట్‌పై ఓజపళి, దియోధాని నృత్యభంగిమలు ప్రదర్శిస్తూ వేదికపైకి వెళ్ళారు. ఆయన ఆ రూపేణా సభికుల ఎదుట తన కృతజ్ఞతలు ప్రదర్శించారు. ఆయన అవార్డు అందుకుని తిరిగి తన స్థానంలో కూర్చోడానికి వెళుతూ ఎదురుగా ఉన్న ప్రధానమంత్రి నరేంద్రమోడీ పాదాలకు నమస్కరించారు. భూయన్ ఓజపళి, దియోధాని నృత్యాలలో ప్రముఖుడు. ఈ నృత్యాలు అసోంలోని దర్రాంగ్ జిల్లాలో ఎంతో ప్రాచుర్యం పొందాయి. వెయ్యి సంవత్సరాలు చరిత్రగల ఈ నృత్య సంప్రదాయాలను ఆయన కాపాడుతూ వస్తున్నందుకుగాను ఈ అవార్డు ఆయనకు ఇచ్చారు.

ఇతరులను విమర్శించడమే మోదీ పనా?

గత ప్రధానులు నవభారత నిర్మాణం కోసం శ్రమించారు : పవార్

అమరావతి: గత ప్రధానమంత్రులు సరికొత్త భారత నిర్మాణం కోసం పని చేస్తే, ప్రస్తుతం ప్రధాని నరేంద్ర మోదీ మాత్రం ఇతరులను విమర్శించడమే పనిగా పెట్టుకున్నారని ఎన్‌సిపి (ఎస్‌పి) నేత శరద్ పవార్ మండిపడ్డారు. గత పదేళ్లలో బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఆర్ సర్కార్ ప్రజలకు ఏం చేసిందో చెప్పడం లేదని దుయ్యబట్టారు. మహావికాస్ అఘాడీ అభ్యర్థికి మద్దతు సోమవారం నిర్వహించిన ఎన్నికల ర్యాలీలో పవార్ పాల్గొని మాట్లాడారు. మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ దేశానికి అందించిన సేవలను ప్రశ్నించలేమన్నారు. కొంత బిజెపి నాయకులు రాజ్యాంగాన్ని మారుస్తామని బహిరంగంగా వ్యాఖ్యానిస్తున్నారని, భారత్‌లో నిరంకుశపాలనను అనుమతించవద్దని ప్రజలు పవార్ విజ్ఞప్తి చేశారు. మోదీ భయాన్ని సృష్టించేందుకు ప్రయత్నిస్తూ రష్యా అధ్యక్షుడు పుతిన్‌ను అనుకరిస్తున్నారని విమర్శించారు. 2019లో జరిగిన ఎన్నికల్లో నవనీత్ రాణాకు మద్దతు ఇవ్వాలని తాను చేసిన తప్పుకు క్షమాపణ చెప్పేందుకే ఇక్కడి వచ్చానన్నారు. ఆ నాడు రాణా ఎన్నికయ్యేందుకు ప్రజల మద్దతు కోరానన్నారు. అయితే తప్పును సరిదిద్దుకునే సమయం ఆసన్నమైందన్నారు. ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ తర్వాత, ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీ, నరసింహారావు నుండి మన్మోహన్ సింగ్ వరకు దాదాపు అందరు ప్రధానుల పనిని తాను చూశానని, వారి ప్రయత్నాలు నవ భారతాన్ని తయారు చేయడమేనని, కానీ ప్రస్తుత ప్రధాని పని మాత్రమే విమర్శించడమేనని పవార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ చేసిన కృషిని చరిత్రలో ఎవరూ మరచిపోలేరని, అయితే ప్రస్తుతం ప్రధాని (మోదీ) ఆయనను నిరంతరం విమర్శిస్తున్నారన్నారు. గత పదేళ్లలో కేంద్ర ప్రభుత్వం ఏం చేసిందో చెప్పడానికి బదులు ఆయన (మోదీ) ఇతరులను విమర్శిస్తూనే ఉన్నాన్నారు. భారత్‌లో కొత్త పుతిన్ తయారవుతున్నారని తాము భయపడుతున్నామని చెప్పారు. గతం మాదిరిగానే కాంగ్రెస్, ఎన్‌సిపి (ఎస్‌పి)తో కలిసి పని చేయడం ద్వారా జాతీయ ప్రయోజనాలను పరిరక్షించే బాధ్యతను భుజాన వేసుకున్నందుకు ఉద్ధవ్ థాక్రే నేతృత్వంలోని శివసేన (యుబిటి)ని ఆయన ప్రశంసించారు.

తూర్పు భారతంలో మరో ఐదు రోజులు వడగాలుల ఉధృతి

న్యూఢిల్లీ : తూర్పు భారతదేశంలో మరో ఐదు రోజులపాటు చాలా ఉద్ధృత స్థాయిలో వడగాలులు వీస్తాయి. భారత వాతావరణశాఖ (ఐఎండి) సోమవారం ఈ విషయం ప్రకటించింది. ఈనెలలో వరుసగా రెండో విడత కూడా పశ్చిమ బెంగాల్, ఒడిశా, జార్ఖండ్, బీహార్ రాష్ట్రాలలో ఈ విపరీతమైన వేడిగాలులు కొనసాగుతున్నాయి. ఏప్రిల్ 15 నుండి ఒడిశాలో వేడి గాలులు కొనసాగుతున్నాయి. పశ్చిమ బెంగాల్‌లో ఈనెల 17 నుండి వేడిగాలులు ప్రజలను భయపెడుతున్నాయి. పశ్చిమ బెంగాల్, కర్ణాటక, ఒడిశా, తమిళనాడు, ఉత్తర ప్రదేశ్, జార్ఖండ్ రాష్ట్రాల్లో మరో ఐదురోజులు విపరీతమైన వడగాలులు వీస్తాయని ఐఎండి పేర్కొంది. కోస్తా ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, పుదుచ్చేరి, కర్ణాటక, గోవా, కేరళ, పశ్చిమ బెంగాల్, బీహార్‌లలో ఉక్కపోత ప్రజలను తీవ్రంగా బాధిస్తుంది. దాంతో రాత్రిపూట కూడా విపరీతమైన ఉష్ణోగ్రతలు తూర్పు మధ్యప్రదేశ్‌లో సోమ, మంగళవారాలలో నమోదవుతాయి. రాత్రిపూట చల్లగాలి లేక ఒళ్ళు చల్లబడే అవకాశం ఉండదుగనుక ప్రజలకు చాలా సమస్యలు ఎదురవుతాయని ఐఎండి పేర్కొంది. మెట్రో ప్రాంతాలు మాత్రం ఆ చుట్టుపక్కల ప్రాంతాలకంటే చాలా ఎక్కువ ఉష్ణోగ్రతలను భరించాల్సి వస్తుందని కూడా ఐఎండి పేర్కొంది.

ఇసికి కేరళ సిపిఐ ఫిర్యాదు

బెగుసరాయ్ : బిజెపి సీనియర్ నేత, కేంద్రమంత్రి గిరిరాజ్ సింగ్ విద్వేషపూరిత ప్రసంగం చేశారనే ఆరోపణలకు సంబంధించి సిపిఐ బీహార్ శాఖ ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసింది. ఈనెల 19న బెగుసరాయ్‌లో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో కేంద్రమంత్రి పదే పదే తాను పాకిస్థాన్ అనుకూల దేశ వ్యతిరేకులను, జాతీయవాదంతో సమస్య ఉన్న వారిని ఓట్లు అడగనని పదే పదే పేర్కొన్నారు. గిరిరాజ్ సింగ్ చేసిన వ్యాఖ్యలు విద్వేషపూరిత వ్యాఖ్యలను, ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించడమేనని సిపిఐ సీనియర్ నేత, పార్టీ మాజీ లోక్‌సభ ఎంపి శతృఘ్న ప్రసాద్ సింగ్ ఎన్నికల కమిషన్‌కు ఆదివారం లేఖ రాశారు. వెంటనే ఆయనపై చర్యలు తీసుకోవాలని కోరారు. కేంద్ర మంత్రి ప్రసంగం రెచ్చగొట్టేలా ఉందని, ఒక వర్గానికి వ్యతిరేకంగా ఉందని, బిజెపి అభ్యర్థి చేసిన విద్వేషపూరిత ప్రసంగాన్ని కచ్చితంగా పరిశీలించాలని శతృఘ్న ఆ లేఖలో పేర్కొన్నారు. మోడల్ ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించినందుకు అతనిపై తగిన చర్య తీసుకోవాలి కోరారు. గిరిరాజ్ సింగ్ ద్వేషపూరిత ప్రసంగం మత సామరస్యంపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతుందని, అంతేకాకుండా, బెగుసరాయ్‌లో పాకిస్తాన్ మద్దతుదారుల ఉనికిని ఎందుకు దాచిపెట్టారో కేంద్ర మంత్రి నుండి వ్రాతపూర్వక వివరణ కూడా కోరాలని కూడా ఇసి అభ్యర్థించాలనుకుంటున్నారు.

సిఎఎలో కీలకాంశాలు భారత రాజ్యాంగాన్ని ఉల్లంఘించి ఉండొచ్చు : యుఎస్ కాంగ్రెస్

వాషింగ్టన్ : బిజెపి ప్రతిష్ఠాత్మకంగా భావించి తీసుకువచ్చిన పౌరసత్వ సవరణ చట్టం (సిఎఎ)లోని కీలక నిబంధనలు భారత రాజ్యాంగాన్ని ఉల్లంఘించి ఉండవచ్చునని అమెరికా కాంగ్రెస్‌లోని ఒక స్వతంత్ర పరిశోధనా విభాగం (సిఆర్ఎస్) తన నివేదికలో పేర్కొంది. 1955 నాటి భారత పౌరసత్వ చట్టానికి సవరణ చేయడం ద్వారా ఈ ఏడాది మార్చినెలలో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం సిఎఎ చట్టాన్ని అమలులోకి తీసుకువచ్చింది. ముస్లింలు మినహా మూడు దేశాలలో ఉన్న ఆరు మతాలకు చెందిన భారత్‌ను కోరివచ్చే వలస ఆశ్రితులకు భారత పౌరసత్వం ఇవ్వడానికి ఈ సవరణ చట్టం ద్వారా వీలు కలుగుతుంది. దీనిపైనే ప్రచురితమైన సంక్షిప్త పరిశోధనా నివేదికలో, భారత రాజ్యాంగాన్ని ఈ సిఎఎలో ఉన్న కీలక నిబంధనలు ఉల్లంఘించి ఉండవచ్చునని స్పష్టం చేసింది. ప్రధానంగా ఈ అంశాలపైనే సిఆర్ఎస్ దృష్టి కేంద్రీకరించింది. అమెరికా కాంగ్రెస్‌లో సభ్యులకు ఉన్న ఆసక్తికి అనుగుణంగా ఈ సిఆర్ఎస్ తన నివేదికను రూపొందించింది. ఐతే సిఆర్ఎస్ నివేదికను అమెరికా కాంగ్రెస్ మాత్రం ఒక అధికారిక నివేదికగా పరిగణించబోదు. ఐతే భారత ప్రభుత్వం, ఇతర అనుబంధ సంస్థలు మాత్రం సిఎఎ ను ఒక మానవతా దృక్పథంలో పొరుగుదేశాల్లో అణచివేతకు గురి అవుతున్న మైనారిటీల శ్రేయస్సుకోసం రూపొందించినట్లు పేర్కొన్నాయి.